
'అన్నం పెట్టే రైతన్నను రుణ విముక్తుణ్ని చేయడమే నా ముందున్న లక్ష్యం'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14+32 పేజీల ఆదివారం అనుబంధం | వెల: ₹ 7.00 | సంపుటి: 16 సంచిక: 328

SIMULTANEOUSLY PRINTED AT KARIMNAGAR | HYDERABAD | MUMBAI | BANGALORE | CHENNAI | DELHI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL

SUNDAY Special | ఆదివారం | 18-2-2024



యశస్వి జైస్వాల్ సెంచరీ

ఇంగ్లండ్‌తో జరుగుతున్న మూడో టెస్టులో మూడోరోజు ఆట ముగిసే సమయానికి భారత్ తమ రెండో ఇన్నింగ్స్‌లో 2 వికెట్ల నష్టానికి 196 పరుగులు చేసింది. భారత్ ఓవరాల్ ఆధిక్యం 322 పరుగులకు చేరింది.

- వివరాలు 12లో




రామభద్రాచార్య, గుల్జార్‌కు జ్ఞానపీఠ్

సంస్కృత పండితుడు జగద్గురు రామభద్రాచార్య, ప్రముఖ ఉర్దూ కవి గుల్జార్ జ్ఞానపీఠ్ పురస్కారానికి ఎంపికయ్యారు. 2023కుగాను వారికి అవార్డు ఇవ్వాలని ఎంపిక కమిటీ నిర్ణయించింది. - 6లో



బీజేపీకి సవాల్‌గా ఎదిగాం

బీజేపీకి కొరకరాని కొయ్యలా తయారయ్యాం కాబట్టే తమపై బీజేపీ దాడులు చేస్తోందని ఢిల్లీ సీఎం కేజ్రీవాల్ ఆరోపించారు.

- వివరాలు 6లో



బారామతిలో ప'వార్'!

శరద్‌పవార్ కుమార్తె సుప్రియా సూలేపై తన భార్య సునేత్రను పోటీకి దింపే యోచనలో అజిత్ పవార్ ఉన్నట్లు తెలిసింది.

- వివరాలు 6లో



'కమలం' చెంతకు కమల్‌నాథ్?

మధ్యప్రదేశ్ మాజీ సీఎం, కాంగ్రెస్ సీనియర్ నేత కమల్‌నాథ్ కాంగ్రెస్‌కు గుడ్‌బై చెప్పి బీజేపీలో చేరనున్నట్లు ప్రచారం సాగుతోంది.

- వివరాలు 6లో



ట్రంప్‌కు 3 వేల కోట్ల జరిమానా

తప్పుడు పత్రాలతో బ్యాంకులను మోసం చేసిన కేసులో న్యూయార్క్ కోర్టు ట్రంప్‌కు రూ. 3,020 కోట్ల జరిమానా విధించింది.

- వివరాలు 6లో



జీఎస్ఎల్‌వీ-ఎఫ్14 ప్రయోగం సక్సెస్

- మూడు దశలూ విజయవంతం
- రోదసిలోకి ఇన్‌శాట్-3డీఎస్
- మరో రెండు మూడు రోజుల్లో భూ స్థిరకక్ష్యలోకి ఉపగ్రహం
- శాటిలైట్‌తో దేశంలో సమాచార వ్యవస్థ బలోపేతం.. వాతావరణంపై అంచనాల్లో మరింత స్పష్టత

6 లో



100 రోజులు.. 370 స్థానాలు

- సార్వత్రిక ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా పార్టీ శ్రేణులకు బీజేపీ అగ్రనేతల దిశానిర్దేశం
- ప్రతి బూత్‌లో అదనంగా 370 ఓట్లు సాధించాలని ప్రధాని మోదీ పిలుపు
- తెలంగాణలో అధికారం కోసం ప్రణాళికలు సిద్ధం: జేపీ నడ్డా
- బీజేపీ జాతీయ కార్యవర్గ సమావేశాలు ప్రారంభం

6 లో

ఇంత అవినీతి ఎక్కడా లేదు



వందేళ్లు నిలవాల్సిన మేడిగడ్డ బ్యారేజీ మూడేళ్లకే కుంగింది

అసెంబ్లీలో సాగునీటి రంగంపై చర్చలో మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

- కాగ్, ఎన్డీఎస్‌ఏ, విజిలెన్స్ నివేదికల ఆధారంగా కఠిన చర్యలు తీసుకుంటాం
- మేడిగడ్డ బ్యారేజీని రూ.1,800 కోట్లతో ప్రారంభించి రూ.4,500 కోట్లకు అంచనాలు పెంచారు
- డిజైన్లు, నిర్వహణ, పర్యవేక్షణ లోపాలతోనే బ్యారేజీ కుంగిపోయింది
- అన్నారం బ్యారేజీకి బుంగ పడి భారీగా నీళ్లు లీక్ అవుతున్నాయి
- ఇలాంటి బ్యారేజీలు కట్టినవారు ప్రజలను క్షమాపణ కోరాలి
- సాగునీటి రంగంపై శాసనసభలో శ్వేతపత్రం సమర్పించిన మంత్రి

సాక్షి, హైదరాబాద్: గత బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అవినీతి స్వాతంత్ర్య భారత చరిత్రలో మరెక్కడా జరిగి ఉండదని నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి పేర్కొన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టులో జరిగిన అవినీతి దేశ సాగునీటి రంగంలో మరెక్కడా జరగకూడదని వ్యాఖ్యానించారు. మేడిగడ్డ బ్యారేజీని రూ.1,800 కోట్ల అంచనాతో ప్రారంభించి ఏటా రూ.వెయ్యి కోట్లు చొప్పున పెంచుతూ పోయి... చివరికి రూ.4,500 కోట్లకు చేర్చారని చెప్పారు. వందేళ్లు నిలవాల్సిన బ్యారేజీ.. అవినీతి, లోపభూయిష్టమైన డిజైన్లు, నిర్వహణ–పర్యవేక్షణ లోపాలతో మూడేళ్లకే కుంగిపోయిందని ఆరోపించారు. అధికారం అప్పజెప్తే మరమ్మతులు చేయిస్తామనే అర్హత బీఆర్ఎస్ నేతలకు లేదని మండిపడ్డారు. ఉత్తమ్ శనివారం రాష్ట్ర సాగునీటి రంగంపై శాసనసభలో శ్వేతపత్రాన్ని ప్రవేశపెట్టారు. మేడిగడ్డ బ్యారేజీ కుంగిన ఘటనపై నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ(ఎన్డీఎస్‌ఏ), విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ శాఖ ఇచ్చిన నివేదికలు, కాళేశ్వరం ప్రాజెక్టుపై కాగ్ సమర్పించిన ఆడిట్ నివేదికలోని ముఖ్యాంశాలను పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. పలువురు సభ్యులు వ్యక్తం చేసిన సందేహాలకు సమాధానాలు ఇచ్చారు. సభలో ఉత్తమ్ చెప్పిన అంశాలు ఆయన మాటల్లోనే..

''మేడిగడ్డ బ్యారేజీ గత ఏడాది అక్టోబర్ 21న కుంగిపోతే డిసెంబర్ 7 వరకు కూడా నాటి సీఎం కేసీఆర్ ఒక్కమాట మాట్లాడలేదు. బ్యారేజీ నిర్మాణానికి పెద్ద మనుషులు వాళ్లే..

మిగతా 2వ పేజీలో ▶

ప్రాజెక్టులన్నీ పూర్తయితే.. 1.27 కోట్ల ఎకరాలకు సాగునీరు

- అసెంబ్లీలో ప్రవేశపెట్టిన శ్వేతపత్రంలో వెల్లడించిన సర్కారు
- అన్ని ప్రాజెక్టుల పూర్తికి మరో రూ.97 వేల కోట్లు కావాలి
- ఇప్పటికే చేసిన రూ.1.81 లక్షల కోట్ల వ్యయంతో ఆర్థిక వ్యవస్థపై తీవ్ర భారం... గత సర్కారు నిర్లక్ష్యంతో కృష్ణాజలాల దోపిడీ నాలుగు రెట్లు పెరిగింది

2 లో



వైట్‌పేపర్ కాదు.. ఫాల్స్ పేపర్

ప్రాజెక్టులపై ఏ విచారణకైనా సిద్ధం: హరీశ్‌రావు

తప్పు చేస్తే చర్యలు తీసుకోండి

- కాళేశ్వరం ద్వారా ఇప్పటివరకు 20 లక్షల ఎకరాలకు మేలు
- కొత్త ఆయకట్టు 98,570 ఎకరాలతోపాటు స్థిరీకరణ, చెరువులు కలిపి 20 లక్షల ఎకరాలపైనే ఆయకట్టు
- కేసీఆర్ చేసిన మంచి పనులు కనిపించకుండా చేస్తున్నారు
- కృష్ణా జలాల్లో వాటాగా 600 టీఎంసీలు తెచ్చుకునే అవకాశముందని వెల్లడి
- 'సాగునీటి ప్రాజెక్టులపై శ్వేతపత్రం' చర్చలో ప్రసంగం

సాక్షి, హైదరాబాద్: 'మీరు అధికారంలో ఉన్నారు. మా హయాంలో నిర్మించిన ప్రాజెక్టులపై విచారణ జరపండి. తప్పు చేస్తే చర్యలు తీసుకోండి. మేము తప్పు చేయలేదు. భయపడేది లేదు' అని మాజీ మంత్రి, బీఆర్ఎస్ సభ్యుడు తన్నీరు హరీశ్ రావు వ్యాఖ్యానించారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై గత ప్రభుత్వాన్ని దోషిగా చూపించే ప్రయత్నమే తప్ప, రైతుల ప్రయోజనాలు కాపాడేందుకు ప్రయత్నం చేయడం లేదన్నారు. మేడిగడ్డ ప్రాజెక్టు వద్ద జరిగిన ఘటన ద్వారా రాజకీయంగా లబ్ధిపొందాలని చేస్తున్న యత్నాన్ని విరమించుకొని, రాష్ట్ర రైతాంగాన్ని ఆదుకోవాలని సూచించారు. కేసీఆర్ హయాంలో చేసిన మంచి పనులు కనిపించకుండా చేయడమే లక్ష్యంగా పని చేస్తే అంతిమంగా ప్రజలే నష్టపోతారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన శ్వేతపత్రం సత్యదూరమంటూ అది 'వైట్‌పేపర్ కాదు.. ఫాల్స్ పేపర్' అని ఎద్దేవా చేశారు. మిడ్‌మానేరు జలాశయం నిర్మాణం ఉమ్మడి రాష్ట్రంలో పూర్తైందని రుజువు చేస్తే రాజీనామా చేసి మళ్లీ సభలో అడుగుపెట్టనని సవాల్ చేశారు. శనివారం శాసనసభలో ప్రభుత్వం సాగునీటి ప్రాజెక్టులపై ప్రవేశపెట్టిన శ్వేతపత్రంపై జరిగిన చర్చలో ఆయన మాట్లాడారు. హరీశ్‌రావు ప్రసంగం ఆయన మాటల్లోనే...

సీడబ్ల్యూసీ సూచనల మేరకే...

'కాంగ్రెస్ హయాంలో ప్రాణహిత–చేవెళ్ల ప్రాజెక్టుకు ఏడేళ్లలో కనీస అనుమతులు తీసుకురాలేదు. అప్పటి ఉమ్మడి రాష్ట్రం, మహారాష్ట్ర, కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వాలు ఉన్నప్పటికీ ప్రాజెక్టుకు అనుమతి రాలేదు. దీనికోసం 2014 వరకు

మిగతా 2వ పేజీలో ▶

రాష్ట్రానికి చెదలు పట్టించింది మీరే!

కేసీఆర్, హరీశ్‌లపై సీఎం రేవంత్ ఫైర్

- తుమ్మిడిహెట్టి వద్దే 'ప్రాణహిత–చేవెళ్ల' కట్టాలని రిటైర్డ్ ఇంజనీర్ల కమిటీ చెప్పింది
- మేడిగడ్డ వద్ద ప్రాజెక్టు అవాంఛనీయమని తేల్చి చెప్పింది... ఆ కమిటీ నివేదికను తొక్కిపెట్టి మేడిగడ్డ వద్దే ప్రాజెక్టు చేపట్టారు

2 లో



వా'ఢీ'.. వే'ఢీ'!

- ముగిసిన అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు
- ఎనిమిది రోజులపాటు సాగిన సమావేశాలు..
- ఓటాన్ అకౌంట్‌తోపాటు పలు బిల్లులు, తీర్మానాలు
- సభను కుదిపేసిన కేఆర్ఎంబీకి ప్రాజెక్టుల అప్పగింత, నీటిపారుదల శాఖపై శ్వేతపత్రం
- గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు, ఓటాన్ అకౌంట్ సహా ప్రతీ అంశంపైనా వాగ్యుద్ధం

3 లో

అంగన్‌వాడీల వేతన వెతలు!

3 నెలలుగా 58,500 మంది టీచర్లు, హెల్పర్లకు అందని జీతాలు

- సమ్మె కాలం నాటి బకాయిలూ పెండింగ్‌లోనే..
- ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్న అంగన్‌వాడీలు
- బడ్జెట్ సమస్యతోనే వేతనాలు నిలిచిపోయాయంటున్న స్త్రీ, శిశు సంక్షేమశాఖ కమిషనరేట్ అధికారులు
- ప్రస్తుతం ఆర్థిక శాఖ వద్ద పెండింగ్‌లో ఫైలు.. దానికి ఆమోదం లభిస్తేనే వేతనాల విడుదలకు అవకాశం



సాక్షి, హైదరాబాద్: అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లు వేతనాల కోసం అల్లాడుతున్నారు. మూడు నెలలుగా వేతనాలు అందకపోగా... అంతకు ముందు సమ్మె కాలానికి సంబంధించిన వేతన బకాయిలు పెండింగ్‌లో ఉండటంతో ఆర్థికంగా సతమతమవుతున్నారు. అందాల్సిన వేతనాల కోసం రాష్ట్ర మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ కమిషనరేట్‌కు నిత్యం వినతులు వెల్లువెత్తుతున్నాయి. కానీ రాష్ట్ర కార్యాలయంలోని ఉన్నతాధికారుల నుంచి సరైన స్పందన రాకపోవడంతో ఆందోళన చెందుతున్నారు.

రాష్ట్రవ్యాప్తంగా 58,000మంది అంగన్‌వాడీ సిబ్బంది

రాష్ట్రవ్యాప్తంగా 35,700 అంగన్‌వాడీ కేంద్రాలున్నాయి. వీటి పరిధిలో దాదాపు 58,500 మంది అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లు పనిచేస్తున్నారు. మూడు నెలల కిందటి వరకు ప్రభుత్వ ఉద్యోగుల మాదిరిగా అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లకు ప్రతి నెలా పదో తేదీ లోపు వేతనాలు అందించేవారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో పనిచేస్తున్న టీచర్లకు గౌరవ వేతన రూపంలో రూ.13,650, హెల్పర్లకు 7,800 చొప్పున నెలవారీగా రాష్ట్ర ప్రభుత్వం

మిగతా 5వ పేజీలో ▶



ఉన్నత విద్యకు 'స్కిల్' జత

- డిగ్రీ, బీటెక్‌ల్లో నైపుణ్యాభివృద్ధి కోర్సులు
- పారిశ్రామిక భాగస్వామ్యంతో ముందుకెళ్లే యోచనలో రాష్ట్ర సర్కార్
- విద్యార్థుల్లో నైపుణ్య లోపంపై దృష్టి
- ఏఐ-ఎంఎల్, రోబోటిక్స్, ఐవోటీ వంటి 27 కొత్త కోర్సులకు అవకాశం

- వివరాలు 14లో

మేడారానికి 30 ప్రత్యేక రైళ్లు

ఈ నెల 21 నుంచి 24 వరకు నడపనున్నట్టు రైల్వే ప్రకటన

- తెలంగాణ కుంభమేళాగా పేరొందిన మేడారం సమ్మక్క, సారక్క జాతరకు వెళ్లే భక్తుల కోసం దక్షిణ మధ్య రైల్వే 30 జన్ సాధారణ్ ప్రత్యేక రైళ్ల సర్వీస్‌లను నడిపిస్తున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు. ఈ ప్రత్యేక రైళ్లు కాజీపేట, వరంగల్ మీదుగా సికింద్రాబాద్, ఆదిలాబాద్, నిజామాబాద్, ఖమ్మం, సిర్పూర్ కాగజ్‌నగర్ నుంచి ప్రారంభం కానున్నట్లు తెలిపారు.

14 లో



క్లుప్తంగా...

'చేవెళ్ల చెల్లెమ్మ' అంటే ఎంతో సంతోషం

- వైఎస్సార్‌ను గుర్తు చేసుకున్నా..: బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి
- 'పాలమూరు' ప్రాజెక్టు పూర్తికి చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి



సాక్షి, హైదరాబాద్: అసెంబ్లీ చర్చలో సీఎం రేవంత్‌రెడ్డి తనను చేవెళ్ల చెల్లెమ్మ అని సంబోధించడం ఎంతో సంతోషంగా ఉందని మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి అన్నారు. తనను ఆ మాట అన్నప్పుడు దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డిని గుర్తుచేసుకున్నానని చెప్పారు. శాసనసభలో రేవంత్ మాట్లాడిన అనంతరం ఆమె మాట్లాడారు. వికారాబాద్, పరిగి, చేవెళ్ల ప్రాంతాలకు నీరు అందించాలని తాను వైఎస్సార్‌ను కోరానని చెప్పారు. 600 మీటర్ల ఎత్తులోని ప్రాంతాలకు కూడా నీళ్లందించేలా 'ప్రాణహిత-చేవెళ్ల' ప్రాజెక్టుకు రూపకల్పన చేశారని వివరించారు. చేవెళ్ల సెంటిమెంట్‌తో అక్కడే పునాది వేశారని చెప్పారు. తాను ఎక్కడి నుంచి ప్రాతినిధ్యం వహించినా.. చేవెళ్ల నియోజకవర్గాన్ని తమ కుటుంబం మర్చిపోదన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు కట్టినట్టే పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టును కూడా పూర్తి చేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని సబిత కోరారు.

చిత్తశుద్ధి లేకనే సకల జనుల సర్వేను తొక్కిపెట్టారు

మంత్రి పొన్నం ప్రభాకర్



సాక్షి, హైదరాబాద్: గత బీఆర్‌ఎస్ ప్రభుత్వానికి బీసీల సంక్షేమంపై చిత్తశుద్ధి లేకనే సకల జనుల సర్వే నివేదికను బహిర్గతం చేయకుండా తొక్కి పెట్టిందని మంత్రి పొన్నం ప్రభాకర్ ఆరోపించారు. శనివారం అసెంబ్లీ మీడియా పాయింట్‌వద్ద ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, ఎమ్మెల్యే శ్రీహరి ముదిరాజ్‌లతో కలసి ఆయన విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అసెంబ్లీలో కులగణనకోసం తీర్మానం చేస్తే బీఆర్‌ఎస్ నేతలు దెయ్యాలు వేదాలు వల్లించినట్లు మాట్లాడుతున్నారని దుయ్యబట్టారు. పదేళ్ల పాలనలో సకల జనుల సర్వే నివేదికను ఎందుకు బయటపెట్టలేదని, ఆ నివేదికను బయటపెట్టాలని ఏనాడైనా ఆ పార్టీ సమావేశాల్లో అడగాలని అనిపించలేదా? అని గతంలో బీసీ మంత్రిగా పనిచేసిన గంగుల కమలాకర్‌ను ప్రశ్నించారు. అసెంబ్లీలో కులగణనపై చర్చ సందర్భంగా గంగుల అనేక సార్లు సభను తప్పుదోవ పట్టించేందుకు ఆరు గ్యారంటీలు, హామీలపై నోటికొచ్చినట్లు మాట్లాడటం విచారకరమన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం కులగణనపై అసెంబ్లీలో ఏకగ్రీవ తీర్మానం చేసి చిత్తశుద్ధి చాటుకుందని అన్నారు. బలహీన వర్గాలు ఆర్థిక, రాజకీయ, సామాజిక రంగాల్లో ఎదగాలనేదే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు.

అసెంబ్లీ సమావేశాలు అట్టర్ ఫ్లాప్

మాజీ మంత్రి మల్లారెడ్డి



సాక్షి, హైదరాబాద్: వారం రోజులుగా సాగిన అసెంబ్లీ సమావేశాలు అట్టర్‌ఫ్లాప్‌గా ముగిశాయని మాజీ మంత్రి చామకూర మల్లారెడ్డి వ్యాఖ్యానించారు. ఆయన శనివారం అసెంబ్లీ లాబీలో విలేకరులతో పిచ్చాపాటీగా మాట్లాడారు. కాంగ్రెస్‌కు మేడిగడ్డ తప్ప వేరే అంశాలేవీ దొరకడం లేదని ఎద్దేవా చేశారు. రోజూ ఇదే అంశంపై కాంగ్రెస్ మాట్లాడుతుండటంతో ప్రజలు బేజారవుతున్నారని చెప్పారు. మేడిగడ్డ ప్రాజెక్టు లీకయితే సరిచేసి సాగునీరు అందించాలని కోరారు. సమావేశాల్లో మాజీ మంత్రి హరీశ్‌రావు వన్‌మేన్ షోతో హీరోగా నిలిచారని ప్రశంసించారు. మేడిగడ్డలో లీకయితే పెద్ద కాంట్రాక్టరయిన మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డికి మరమ్మతుల బాధ్యత అప్పగిస్తే ఆయనే సరిచేస్తాడని వ్యాఖ్యానించారు. కాళేశ్వరం ప్రాజెక్టు కూలిపోవడమే బీఆర్‌ఎస్ పార్టీ ఓటమికి కారణం అనుకునేవాళ్లు అనుకోవచ్చని మల్లారెడ్డి వ్యాఖ్యానించారు.

'కాళేశ్వరం'పై బీఆర్‌ఎస్ ఫ్యాక్ట్‌షీట్

ప్రభుత్వ శ్వేతపత్రానికి కౌంటర్

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర శాసనసభ బడ్జెట్ సమావేశాలు ముగిసిన అనంతరం శనివారం భారత్ రాష్ట్ర సమితి 'కాళేశ్వరంపై కాంగ్రెస్ విషప్రచారం- బీఆర్‌ఎస్ వాస్తవాలు' పేరిట ఒక ఫ్యాక్ట్‌షీట్ విడుదల చేసింది. అసెంబ్లీలో రాష్ట్ర ప్రభుత్వం నీటిపారుదల రంగంపై శ్వేతపత్రం విడుదల చేయడమేకాక ఆ శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చారు. దీనికి కౌంటర్‌గా బీఆర్‌ఎస్ స్పందించింది. తుమ్మిడిహెట్టి వద్ద కాంగ్రెస్ ప్రభుత్వం ప్రారంభించిన ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టును కాదని మేడిగడ్డ వద్ద కాళేశ్వరం ప్రాజెక్టు ఎందుకు నిర్మించాల్సి వచ్చింది..? ఏ విధంగా ప్రాజెక్టు నిర్మాణం సాగింది..? తద్వారా ఏ మేరకు కొత్త ఆయకట్టు పెరిగింది, పాత ఆయకట్టు స్థిరీకరణ జరిగింది, తద్వారా వరి ధాన్యం దిగుబడులు ఏ విధంగా పెరిగాయన్న వివరాలతో కూడిన 56 స్లైడ్‌షోల ఫ్యాక్ట్‌షీట్‌ను బీఆర్‌ఎస్ కౌంటర్‌గా విడుదల చేసింది.

రాష్ట్రానికి చెదలు పట్టించింది మీరే!

అసెంబ్లీలో కేసీఆర్, హరీశ్‌లపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఫైర్

- తుమ్మిడిహెట్టి వద్దే 'ప్రాణహిత-చేవెళ్ల' కట్టాలని రిటైర్డ్ ఇంజనీర్ల కమిటీ చెప్పింది
- ముంపుపై మహారాష్ట్ర సీఎంను ఒప్పించాలని సూచించింది
- మేడిగడ్డ వద్ద ప్రాజెక్టు అవాంఛనీయమని తేల్చి చెప్పింది
- ప్రాజెక్టుల శ్వేతపత్రంపై చర్చలో తీవ్ర విమర్శలు చేసిన ముఖ్యమంత్రి

సాక్షి, హైదరాబాద్: కాళేశ్వరం ప్రాజెక్టు వరప్రదాయిని కాదని, అది తెలంగాణకు ఒక కళంకంగా మిగిలిపోయిందని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. తెలంగాణ సమాజం సిగ్గుతో తలవంచుకునే పరిస్థితి వచ్చిందన్నారు. కేసీఆర్, హరీశ్ కలసి తెలంగాణకు చెదలు పట్టించారని, వారు ఎంత ద్రోహం చేశారో ప్రజలు తెలుసుకోవాలని పేర్కొన్నారు. మేడిగడ్డ దగ్గర ప్రాజెక్టు నిర్మించాలని కేసీఆర్ పుర్రెలోనే పురుగులా పుట్టిందని, ఆయనే ఇంజనీర్లకు సలహా ఇచ్చారని విమర్శించారు. మేడిగడ్డ దగ్గర ప్రాజెక్టు అవాంఛనీయమని, తుమ్మిడిహెట్టి దగ్గర కట్టాలని ఐదుగురు సభ్యుల రిటైర్డ్ ఇంజనీర్ల కమిటీ చెప్పినా పెడచెవిన పెట్టారని మండిపడ్డారు. ఖజానాను కొల్లగొట్టడానికే దుర్మార్గానికి తెగబడ్డారని ఆరోపించారు. శనివారం ప్రభుత్వం సాగునీటి ప్రాజెక్టులపై శ్వేతపత్రాన్ని శాసనసభలో ప్రవేశపెట్టింది. దీనిపై జరిగిన చర్చలో హరీశ్‌రావు మాట్లాడుతున్న సమయంలో.. సీఎం రేవంత్ జోక్యం చేసుకుని మాట్లాడారు. వివరాలు రేవంత్ మాటల్లోనే..

''ఉమ్మడి రాష్ట్రంలో 2007లో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టును ప్రారంభించింది. నాడు ప్రాణహిత నది మీద తుమ్మిడిహెట్టి వద్ద 152 మీటర్ల ఎత్తుతో బ్యారేజీ కడితే 1,850 ఎకరాల పట్టా భూమి మునుగుతుందని, గ్రామాలేవీ ముంపునకు గురికావని తేల్చారు. అదే 150 మీటర్ల ఎత్తుతోనే కడితే 1,250 ఎకరాలు మాత్రమే ముంపునకు గురవుతాయని గుర్తించారు. ప్రాణహిత-చేవెళ్లకు అడ్డంకులను తొలగించేందుకు నాటి మహారాష్ట్ర సీఎంతో, ఉమ్మడి ఏపీ సీఎం చర్చించారు. 2012లో స్టాండింగ్, కో-ఆర్డినేషన్ కమిటీలు వేశారు.



మేడిగడ్డ నిరుపయోగమని చెప్పినా..

తెలంగాణ వచ్చాక అప్పటి సీఎం కేసీఆర్, సాగునీటిశాఖ మంత్రి హరీశ్‌రావు.. గోదావరి ప్రాజెక్టులపై రిటైర్డ్ ఇంజనీర్ బి.అనంతరామ్ నేతృత్వంలో ఐదుగురు ఇంజనీర్లతో కమిటీ వేశారు. ఆ కమిటీ 14 పేజీలతో నివేదిక ఇచ్చింది. అప్పటికే శంకుస్థాపన కూడా చేసిన ప్రాణహిత- చేవెళ్ల ప్రాజెక్టును 152 మీటర్ల ఎత్తుతో కాకపోతే 150 మీటర్ల ఎత్తుతోనైనా నిర్మించాలని.. మహారాష్ట్ర ముఖ్యమంత్రితో మాట్లాడి ఒప్పిస్తే సరిపోతుందని స్పష్టం చేసింది. మేడిగడ్డ వద్ద ప్రాజెక్టు అవాంఛనీయమని తేల్చి చెప్పింది. అయినా మేడిగడ్డ దగ్గరే ప్రాజెక్టు నిర్మించాలని కేసీఆర్ నిర్ణయించారు. మరోవైపు మేడిగడ్డ వద్ద ప్రాజెక్టు చేపట్టడం సరికాదంటూ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజనీర్స్ ఇచ్చిన నివేదిక ఆధారంగా 2015 సెప్టెంబర్‌లో 'సాక్షి' ఒక కథనాన్ని కూడా ప్రచురించింది.

సభలో క్షమాపణలు చెప్పాలి

కేసీఆర్, హరీశ్ కలసి ఇంజనీర్ల కమిటీ నివేదికను తొక్కిపెట్టి.. మేడిగడ్డ వద్ద ప్రాజెక్టు చేపట్టారు. రూ.38వేలకోట్ల నుంచి రూ. 1.47 లక్షల కోట్లకు అంచనాలను పెంచేశారు. తెలంగాణ ఖజానాను కొల్లగొట్టేందుకు ఇంత దుర్మార్గానికి తెగబడ్డారు. జరిగిన తప్పులకు క్షమాపణలు చెప్పి సహకరిస్తే హరీశ్‌రావుకు గౌరవం ఉండేది. కానీ చేసిన తప్పులను కప్పిపుచ్చుకునేందుకు వాళ్లు ప్రయత్నిస్తున్నారు. క్షమాపణలు చెప్పాల్సిందిపోయి.. నిస్సిగ్గుగా సభలో నిలబడి మమ్మల్ని ప్రశ్నిస్తారా? ప్రాజెక్టులు ఫక్కున పగిలిపోతుంటే క్షమాపణలు చెప్పకుండా ఇంకా వాదిస్తారా? హరీశ్‌రావును నేను నిలదీస్తున్నా.. ఈ పాపాలకు మామా అల్లుళ్లు కారణం కాదా? ఇలాంటి పరిస్థితుల్లో మొండి వాదనలు వద్దు. ప్రాణహిత-చేవెళ్లలో ప్రాజెక్టు ఆపితే ఆనాడు ధర్నా చేసిన మా అక్క సబితా ఇంద్రారెడ్డి ఇప్పుడు బీఆర్‌ఎస్‌లోనే ఉన్నారు. నాడు దీక్షలు, ధర్నాలు చేసిన సబితక్క ఇప్పుడు మౌనంగా హరీశ్‌రావు గారిని సమర్థిస్తున్నారా? జరిగిన తప్పులకు హరీశ్ క్షమాపణ చెప్పాలి. సిట్టింగ్ జడ్జి లేదా రిటైర్డ్ జడ్జి విచారణకు వచ్చినపుడు.. ఎవరి ఒత్తిడితో ఇలా చేశారో నాటి మంత్రులు కన్ఫెక్షన్ స్టేట్‌మెంట్ ఇచ్చి తప్పులు ఒప్పుకోవాలి..'' అని రేవంత్ పేర్కొన్నారు.

కేసీఆర్‌కు రేవంత్ జన్మదిన శుభాకాంక్షలు

తెలంగాణ పునర్నిర్మాణంతోపాటు సభను సజావుగా నడిపించడంలో ప్రతిపక్ష నాయకుడి పాత్రను మాజీ సీఎం కేసీఆర్ సమర్థవంతంగా పోషించాలని, భగవంతుడు ఆయనకు ఆయురారోగ్యాలు ప్రసాదించాలని సీఎం రేవంత్‌రెడ్డి కోరారు. రేవంత్ ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. సాగునీటి రంగంపై శాసనసభలో శ్వేతపత్రం ప్రవేశపెట్టి చర్చ నిర్వహిస్తున్న సందర్భంగా సీఎం ఈ మేర కు ప్రకటన చేశారు. కేంద్రమంత్రి, మంత్రి, సీఎంగా వివిధ హోదాల్లో 40 ఏళ్లు రాష్ట్ర, దేశ రాజకీయాల్లో తన పాత్ర పోషించారని తెలిపారు.

ఇంత అవినీతి ఎక్కడా లేదు

▶ మొదటి పేజీ తరువాయి

చీఫ్ ఇంజనీర్లు వాళ్లే.. చీఫ్ డిజైనర్లు వాళ్లే. ప్రస్తుత పరిస్థితిలో మేడిగడ్డ బ్యారేజీ నిరుపయోగమని (యూజ్‌లెస్) ఎన్డీఎస్‌ఏ స్పష్టం చేసింది. మేడిగడ్డ తరహా డిజైన్లతోనే అన్నారం, సుందిళ్ల బ్యారేజీలను కూడా నిర్మించారని.. వాటిలో కూడా నీళ్లు నింపవద్దని ఎన్డీఎస్‌ఏ సూచించింది. అన్నారం బ్యారేజీలో బుంగ ఏర్పడి శుక్రవారం నుంచి పెద్ద ఎత్తున నీళ్లు లీక్ అవుతున్నాయి. దీన్ని పరిశీలించేందుకు ఎన్డీఎస్‌ఏ నిపుణులను రమ్మని కబురు పంపాం. రెండు రోజుల్లో వస్తామన్నారు. సత్వరమే బ్యారేజీలోని నీటిని ఖాళీ చేయాలని సూచించారు. ఈ బ్యారేజీలను కట్టినవారు సిగ్గుతో తలవంచుకుని రాష్ట్ర ప్రజలకు క్షమాపణలు చెప్పాలి.

కాగ్ నివేదికలో దిగ్భ్రాంతికర విషయాలు

కాళేశ్వరంపై కాగ్ ఇచ్చిన నివేదికలో యావత్ దేశాన్ని దిగ్భ్రాంతికి గురిచేసే అంశాలున్నాయి. మా ప్రభుత్వం ఎన్డీఎస్‌ఏ, కాగ్, విజిలెన్స్ నివేదికల ఆధారంగా చర్యలు తీసుకుంటుంది. రూ.35,800 కోట్ల అంచనాతో 16.4 లక్షల ఎకరాల ఆయకట్టుకు సాగునీరిచ్చే ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టును పక్కన బెట్టి గత ప్రభుత్వం చేపట్టిన కాళేశ్వరం ప్రాజెక్టు అంచనా వ్యయం రూ.1.47 లక్షల కోట్లకు చేరిందని కాగ్ తప్పుబట్టింది. ఆ ప్రాజెక్టు డీపీఆర్‌కు సీడబ్ల్యూసీ అనుమతివ్వడానికి ముందే కాంట్రాక్టర్లకు తొందరపడి పనులు అప్పగించారని ఆక్షేపించింది. కాళేశ్వరం ప్రాజెక్టు గుదిబండగా మారుతుందని చెప్పింది. తెలంగాణ మొత్తం రాష్ట్ర రోజువారీ విద్యుత్ వినియోగం 196 మిలియన్ యూనిట్లుకాగా.. కాళేశ్వరం ప్రాజెక్టులోని అన్ని పంపులను నడిపితే రోజుకు 203 మిలియన్ యూనిట్ల విద్యుత్ కావాల్సి ఉంటుందని తేల్చింది. మల్లన్నసాగర్ బ్యారేజీ కింద భూగర్భంలో చీలిక ఉందని, చిన్న భూకంపం వచ్చినా బ్యారేజీ దిగువన ఉండే ప్రజలకు ప్రమాదకరమని హెచ్చరించింది. కాళేశ్వరం అప్పులు చెల్లించడానికి రూ.15వేల కోట్లు, కరెంట్ బిల్లులకు రూ. 10వేల కోట్లు కలిపి ఏటా రూ.25 వేల కోట్లను ఈ ప్రాజెక్టు కోసమే కేటాయించాల్సి ఉంటుంది. ఈ ప్రాజెక్టు రాష్ట్రానికి శాపంగా, గుదిబండగా మారింది.

బ్యారేజీలను పునరుద్ధరిస్తాం

మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలకు జరిగిన నష్టం చాలా తీవ్రమైనది. మా ప్రభుత్వం తాత్కాలిక చర్యలతో సరిపెట్టబోదు. వాటిలోని లోపాలను గుర్తించి, మరమ్మతుల కోసం తీసుకోవాల్సిన చర్యలను సూచించే బాధ్యతను ఎన్డీఎస్‌ఏకు అప్పగించాం. ఆ నివేదిక వచ్చాకే మరమ్మతులపై ముందుకు వెళ్తాం.

కాంగ్రెస్‌కు మంచిపేరు రావొద్దనే రీఇంజనీరింగ్

కాంగ్రెస్ పార్టీకి మంచిపేరు రావొద్దని, తమ సొంత ముద్ర ఉండాలనే ఉద్దేశంతోనే గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రాణహిత-చేవెళ్ల, పాలమూరు-రంగారెడ్డి, రాజీవ్‌సాగర్, ఇందిరాసాగర్ ప్రాజెక్టులను రీఇంజనీరింగ్ చేసింది. వాటి అంచనా వ్యయాన్ని పెంచింది. కాళేశ్వరం నిర్మించాలనేది తప్పుడు నిర్ణయం. పైగా ఆ డ్యామ్ కూలింది.. ఈ డ్యామ్ కూలిందంటూ మేడిగడ్డ కుంగిపోవడాన్ని బీఆర్‌ఎస్ నేతలు సమర్థించుకుంటున్నారు. శ్రీశైలం, నాగార్జునసాగర్ ప్రాజెక్టులను కృష్ణాబోర్డుకు అప్పగించే ప్రసక్తే లేదు. నీటిపారుదల ప్రాజెక్టులపై ఎలా ముందుకు సాగాలన్న అంశంపై అఖిలపక్షం ఏర్పాటు చేసి, చర్చించి ముందుకు సాగుతాం. ఫాస్ట్‌ట్రాక్ కింద కల్వకుర్తి, భీమా, నెట్టెంపాడు, కోయిల్‌సాగర్, కొడంగల్ - నారాయణపేట, చిన్న కాళేశ్వరం, ఎస్‌ఎల్‌బీసీ, డిండి, ఎల్లంపల్లి, ఇందిరమ్మ వరద కాల్వ, మిడ్‌మానేరు, కొమురంభీం, దేవాదుల ప్రాజెక్టులను పూర్తి చేసి ఏడాదిలోగా 7లక్షల ఎకరాలకు సాగునీరు అందిస్తాం.

రాయలసీమ లిఫ్టుకు కేసీఆర్ సహకారం

ఏపీ ప్రభుత్వం రాయలసీమ ఎత్తిపోతల పథకం నిర్మించుకోవడానికి నాటి సీఎం కేసీఆర్ సహకరించారు. తెలంగాణకు అన్యాయం చేశారు. కేసీఆర్, ఏపీ సీఎం జగన్ అనేక సందర్భాల్లో కలిసి నీటివాటాల గురించి చర్చించారు. రాయలసీమ ఎత్తిపోతల పథకం టెండర్లు జరుగుతున్న సమయంలో కేంద్రం అపెక్స్ కౌన్సిల్ సమావేశం తలపెడితే.. వాయిదా వేయాలని కేసీఆర్ కోరారు. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అరగంట జరిగే అపెక్స్ కౌన్సిల్ సమావేశంలో పాల్గొని కేంద్రానికి ఫిర్యాదు చేస్తే రాయలసీమ లిఫ్టు టెండర్లు ఆగిపోయేవి. కానీ ఆ టెండర్ల ప్రక్రియ పూర్తయ్యాకే కేసీఆర్ అపెక్స్ కౌన్సిల్ సమావేశానికి హాజరయ్యారు..''అని ఉత్తమ్ పేర్కొన్నారు.

ప్రాజెక్టులన్నీ పూర్తయితే.. మొత్తంగా 1.27 కోట్ల ఎకరాలకు సాగునీరు


అసెంబ్లీలో ప్రవేశపెట్టిన శ్వేతపత్రంలో వెల్లడించిన సర్కారు

- అన్ని ప్రాజెక్టుల పూర్తికి మరో రూ.97 వేల కోట్లు కావాలి.. ఈ ఖర్చు పెరగొచ్చు
- ఇప్పటికే చేసిన రూ.1.81 లక్షల కోట్ల వ్యయంతో ఆర్థిక వ్యవస్థపై తీవ్ర భారం
- ప్రాజెక్టులను కేఆర్‌ఎంబీకి అప్పగించేందుకు అంగీకరించింది
- మేడిగడ్డ మాదిరిగా అన్నారం, సుందిళ్ల బ్యారేజీలూ కుంగిపోయే అవకాశం
- లోటుపాట్లన్నీ విజిలెన్స్ నివేదికలో పేర్కొన్నట్టు వెల్లడి

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న సాగునీటి ప్రాజెక్టులన్నీ పూర్తయితే.. మొత్తంగా 1.27 కోట్ల ఎకరాలకు సాగునీరు అందుతుందని ప్రభుత్వం తెలిపింది. ప్రాజెక్టుల పూర్తికి మరో రూ.97 వేల కోట్లు అవసరమని, ఖర్చు మరింత పెరిగే అవకాశం కూడా ఉందని వెల్లడించింది. ఇప్పటివరకు సాగునీటి ప్రాజెక్టులపై చేసిన 1.81 లక్షల కోట్ల వ్యయం రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు పెను భారంగా మారిందని పేర్కొంది. ప్రభుత్వం శనివారం రాష్ట్రంలోని సాగునీటి ప్రాజెక్టులకు సంబంధించి అసెంబ్లీలో శ్వేతపత్రాన్ని ప్రవేశపెట్టింది. ఉమ్మడి రాష్ట్రంలోని ప్రాజెక్టులు, తెలంగాణ ఏర్పాటు తర్వాత నిర్మాణం కొనసాగిన, పూర్తయిన, కొత్తగా చేపట్టిన ప్రాజెక్టుల వివరాలు, వ్యయం, సాగులోకి వచ్చిన ఆయకట్టు వంటి అంశాలను అందులో వెల్లడించింది. గత సర్కారు అద్భుతంగా చెప్పుకున్న కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ కుంగి, పగుళ్లు వచ్చిందని.. మరో రెండు బ్యారేజీలు కూడా కుంగిపోయే ప్రమాదం ఉందని పేర్కొంది. 2014 వరకు రాష్ట్ర నిధులతోనే ప్రాజెక్టుల నిర్మాణం చేపడితే.. 2014 తర్వాత అధిక వడ్డీకి రుణాలు తీసుకొచ్చి ప్రాజెక్టులను నిర్మించడం వల్ల అప్పుల భారం పెరిగిపోయిందని తెలిపింది. వచ్చే పదేళ్లలో రూ.1.35 లక్షల కోట్లను తిరిగి చెల్లించాల్సి ఉందని వివరించింది.

ప్రాజెక్టులపై శ్వేతపత్రంలోని ముఖ్యాంశాలు..

- 2014కు ముందు ఆయకట్టు 57.79 లక్షల ఎకరాలు. ప్రాజెక్టులకు మొత్తం ఖర్చు రూ.54,234 కోట్లు.
- 2014-2023 మధ్య రూ.1.81 లక్షల కోట్ల వ్యయంతో.. 15.81 లక్షల ఎకరాల ఆయకట్టు సాగులోకి వచ్చింది.
- కాళేశ్వరం, పాలమూరు-రంగారెడ్డి, సీతారామ ఎత్తిపోతల కోసం రూ.1.29 లక్షల కోట్ల ఖర్చు జరిగింది.
- రాష్ట్రంలో మొత్తం ఆయకట్టు అంచనా 1.27 కోట్ల ఎకరాలు.. ఇప్పటికే ఉన్న ఆయకట్టు 73.6 లక్షల ఎకరాలు.
- ప్రస్తుత ప్రాజెక్టుల నిర్మాణాలు పూర్తిచేసి మిగతా 53.98 లక్షల ఎకరాలకు నీరివ్వాలంటే రూ.97,774 కోట్లు కావాలి.
- వచ్చే ఐదేళ్లలో అప్పులు, వడ్డీల కింద రూ.77,369 కోట్లు చెల్లించాలి.
- కాళేశ్వరానికి రూ.93,872 కోట్లు ఖర్చుచేసి 98,590 ఎకరాల ఆయకట్టుకు నీరిచ్చారు.
- పాలమూరు-రంగారెడ్డి, సీతారామ ప్రాజెక్టులకు రూ.36 వేలకోట్లు వ్యయం చేసినా ఒక్క ఎకరాకూ నీరివ్వలేదు.
- పదేళ్లలో కృష్ణాజలాల దోపిడీ 4 రెట్లు పెరిగింది.
- సాగునీటికోసం ఉద్యమించిన పార్టీ అధికారంలోకి వచ్చాక ఒంటెద్దు పోకడ పోయింది.
- కృష్ణాపై ఉన్న ప్రాజెక్టులను కేఆర్‌ఎంబీకి అప్పగించడానికి గత ప్రభుత్వం 2015లోనే అంగీకరించింది.
- శ్రీశైలం నుంచి రోజుకు 9.3 టీఎంసీల నీటిని తరలించుకుపోయేలా ఏపీ చేపట్టిన ప్రాజెక్టులకు గత ప్రభుత్వం సహకరించింది.



- పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకాన్ని రోజుకు రెండు టీఎంసీల నుంచి ఒక టీఎంసీ సామర్థ్యానికి కుదించింది.
- గత ప్రభుత్వ తీరువల్ల శ్రీశైలంపై ఆధారపడిన ఉమ్మడి మహబూబ్‌నగర్ ప్రాజెక్టుల భవితవ్యం ప్రమాదంలో పడింది.
- కృష్ణా నీటి వాటాల్లో మనకు అన్యాయం జరిగింది. న్యాయంగా రావాల్సిన నీటిని కోల్పోయాం.
- జలయజ్ఞంలో భాగంగా కాంగ్రెస్ సర్కారు తుమ్మిడిహెట్టి వద్ద రూ.38,500 కోట్లతో 152 మీటర్ల ఎత్తుతో ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టును చేపట్టింది. 160 టీఎంసీలు ఎత్తిపోసి, 16 లక్షల ఎకరాలకు సాగునీరిచ్చేలా రూపొందించింది.
- ఎల్లంపల్లికి ఒకదశలో నీటిని పంపు చేయాల్సిన చోట రీడిజైన్ చేసి అనవసరంగా వ్యయం పెంచారు. ప్రాణహిత-చేవెళ్లకు విద్యుత్ వ్యయం ఏటా రూ.1,010 కోట్లు అయి ఉండేది. కాళేశ్వరం ద్వారా రూ.10వేల కోట్లు అవుతోంది.
- కాళేశ్వరం ద్వారా ఇప్పటివరకు 162.36 టీఎంసీలు ఎత్తిపోసి.. అందులో 30 టీఎంసీలను తిరిగి సముద్రంలోకి వదిలిపెట్టారు.
- ఈ ప్రాజెక్టు ప్లానింగ్, డిజైన్, నాణ్యత, నిర్వహణ నియంత్రణ లోపాలు ఉన్నట్లు నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ వెల్లడించింది.
- మేడిగడ్డ బ్యారేజీ ర్యాఫ్ట్ దెబ్బతిని, పిల్లర్స్ కుంగి కదిలిపోయాయి. ఈ బ్యారేజీలోని లోపం మొత్తం ప్రాజెక్టు పనితీరుపైనే ప్రభావం చూపుతుంది. విజిలెన్స్ నివేదిక సైతం లోటుపాట్లను సవివరంగా వెల్లడించింది.
- కాంగ్రెస్ ప్రభుత్వం పెండింగ్ ప్రాజెక్టుల పూర్తికి కట్టుబడి ఉంది. పాలమూరు-రంగారెడ్డికి ఏఐబీపీ కింద నిధులు తెస్తాం. కృష్ణా జలాల్లో న్యాయంగా రావాల్సిన నీటివాటా కోసం చర్యలు తీసుకుంటాం.

అంచనాలు పెంచి అవినీతి

బీఆర్‌ఎస్‌పై భట్టి విమర్శలు



సాక్షి, హైదరాబాద్: సాగునీటి ప్రాజెక్టుల విషయంలో గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం అవకతవకలకు పాల్పడిందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క విమర్శించారు. శనివారం అసెంబ్లీలో సాగునీటి ప్రాజెక్టులపై శ్వేతపత్రం ప్రవేశపెట్టిన సందర్భంగా జరిగిన చర్చలో మాజీ మంత్రి హరీశ్‌రావు ప్రసంగానికి అడ్డు వచ్చిన భట్టి, కాళేశ్వరం ప్రాజెక్టుతో పాటు రాజీవ్‌సాగర్, ఇందిరాసాగర్‌ల అంచనాలు పెంచారని చెప్పారు. కాళేశ్వరంలో మేడిగడ్డ ప్రాజెక్టు నిట్టనిలువునా చీలిపోవడానికి గత పాలకులే కారణమని, అన్నారం, సుందిళ్ల కూడా అవే పరిస్థితుల్లో ఉన్నాయన్నారు. 15.5 లక్షల ఎకరాలకు నీరందించేందుకు ఉద్దేశించిన ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టును రూ.38 వేల కోట్లతో చేపట్టాలని అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం నిర్ణయిస్తే, బీఆర్‌ఎస్ ప్రభుత్వం రూ.1.47 లక్షల కోట్లకు పెంచిందని విమర్శించారు. రూ.38 వేల కోట్లలో రూ.10 వేల కోట్లు వివిధ పనుల కోసం ఖర్చు చేయగా, మరో రూ.28 వేల కోట్లతో పూర్తి కావలసిన ప్రాజెక్టు బీఆర్‌ఎస్ అవినీతితో వ్యయం పెరిగిందన్నారు. కాంగ్రెస్ హయాంలో ప్రారంభించిన రాజీవ్‌సాగర్, ఇందిరా సాగర్ ప్రాజెక్టులకు రూ.1,420 కోట్లు ఖర్చు చేస్తే పూర్తయ్యేవని, రీ డిజైనింగ్ పేరుతో రూ.23 వేల కోట్లకు పెంచి ఇప్పటివరకు ఎకరానికి కూడా నీరివ్వలేదన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు కరెంటు ఖర్చు, నిర్వహణ ఖర్చు కలిపి ఏటా రూ.20 వేల కోట్లు అవుతుందని, ఇంత పెద్ద మొత్తాన్ని ఎలా కట్టాలని భట్టి ప్రశ్నించారు.

మీలా ఆత్రుత పడం.. తప్పులు చేయం

- ప్రాజెక్టు కట్టేముందు కనీస పరీక్షలు లేకుండానే కాళేశ్వరం కట్టారు: మంత్రి పొంగులేటి
- అతుకులతో కట్టిన ప్రాజెక్టులెక్కడైనా ఉన్నాయా?
- దయాఫ్రమ్ వాల్ ఆర్‌సీసీతో కట్టి ఉంటే ఈ నష్టం జరిగేది కాదు



సాక్షి, హైదరాబాద్: 'కాళేశ్వరాన్ని తొందరగా కట్టేయాలనే ఆత్రుత తప్ప అసలు ఆ ప్రాజెక్టు మనుగడ గురించి ఆలోచించలేదు. కటాఫ్‌వాల్ డిజైన్ మార్చకుండా దయాఫ్రమ్ వాల్‌ను ఆర్‌సీసీతో కట్టి ఉంటే ఈ నష్టం జరిగేది కాదు. ఇసుకను సరైన విధంగా గట్టిపర్చలేకపోవడం వల్ల నష్టం జరిగింది. ఆర్‌సీసీతో వాల్ కట్టి ఉంటే ర్యాఫ్ట్ కుంగేది కాదు.. డ్యామ్ కుచించుకుపోయి పగుళ్లకు ఆస్కారం ఏర్పడేది కాదు' అని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శనివారం నీటిపారుదల ప్రాజెక్టులపై జరిగిన చర్చలో ఆయన మాట్లాడుతూ.. మేడిగడ్డలోని ఈ మూడు పిల్లర్లే కాదని, అన్నారంలో కూడా బుడగలు వస్తున్నాయని, సుందిళ్ల బ్యారేజీలో సీపేజీ మొదలైందని చెప్పారు. ఈ నష్టాన్ని ఎలా పూడ్చాలన్న దానిపై తమ ప్రభుత్వం చిత్తశుద్ధితో ముందుకెళ్తోందనీ, బీఆర్‌ఎస్ ప్రభుత్వం లాగా ఆత్రుత పడేది లేదని, తప్పులు చేసేది లేదని స్పష్టం చేశారు. కాళేశ్వరం శిల్పాన్ని చెక్కిందే తానని, తన మెదడులోనే ప్రాజెక్టు డిజైన్ ఉందని చెప్పే కేసీఆర్ అసెంబ్లీకి ఎందుకు రాలేదని పొంగులేటి ప్రశ్నించారు. కేసీఆర్ సభకు వచ్చి ఉంటే తనకున్న సమస్యకు పరిష్కారం చెప్పేవారు కదా అని ఎద్దేవా చేశారు. నాడు ప్రాజెక్టు ప్రారంభం సందర్భంగా రెండు రాష్ట్రాల ముఖ్యమంత్రులతో కలిసి ఉన్నప్పుడు కాళేశ్వరం ప్రాజెక్టు పవిత్ర దేవాలయం అని చెప్పిన కేసీఆర్‌కు అదే ప్రాజెక్టు బొందలగడ్డ ఎలా అయిందని ప్రశ్నించారు.

పరిశోధనలు లోతుగా నిర్వహించకుండానే..

కనీస పరిశోధనలు లేకుండానే కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మించి ప్రజాధనాన్ని దుర్వినియోగం చేశారని శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మట్టి పరీక్షలు, ఇతరాత్రా పరిశోధనలు లోతుగా నిర్వహించకుండానే ప్రాజెక్టులను కట్టడం వల్లే ఇప్పుడు ఈ పరిస్థితి తలెత్తిందన్నారు. మేడిగడ్డకు మరమ్మతులు చేసి వ్యవసాయానికి నీటిని అందించాలంటూ బీఆర్‌ఎస్ సభ్యులు చేస్తున్న వాదన అర్థరహితమన్నారు. నల్లగొండ సభలో కేసీఆర్ మాట్లాడిన మాటలపై ఆత్మవిమర్శ చేసుకోవాలని సూచించారు. మేడిగడ్డ నుంచి నీళ్లు ఎత్తిపోయలేరా అని కేసీఆర్ తమ ప్రభుత్వాన్ని విమర్శించారని, అక్టోబర్ 21, 2023 రోజునే పిల్లర్లు కుంగిపోయాయని, అప్పటి నుంచి దాదాపు 45 రోజుల పాటు కేసీఆరే ఆపద్ధర్మ సీఎంగా ఉన్నా రని గుర్తు చేశారు. ఆ సమయంలో ఎన్ని టీఎంసీల నీళ్లు ఎత్తిపోశారో కేసీఆర్ చెప్పాలని డిమాండ్ చేశారు.

వైట్‌పేపర్ కాదు.. ఫాల్స్ పేపర్

▶ మొదటి పేజీ తరువాయి

రూ.6,116 కోట్లు ఖర్చు చేసింది. అంతకుముందే మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఉమ్మడి ఏపీ సీఎంకు ఈ ప్రాజెక్టు సాధ్యం కాదు, చేసే ఖర్చు వృథా అవుతుందని లేఖ రాశారు. అయినా పట్టించుకోలేదు. ఆ పరిస్థితుల్లో అధికారంలోకి వచ్చిన కేసీఆర్ ప్రభుత్వం ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టు అనుమతుల కోసం యత్నించినా, మహారాష్ట్ర ఒప్పుకోలేదు. 152 మీటర్ల ఎత్తులో తుమ్మడిహెట్టి దగ్గర బ్యారేజీ నిర్మాణానికి ఒప్పుకోవాలని మహారాష్ట్ర ప్రభుత్వాన్ని కోరినా ఒప్పుకోలేదు. అలాంటి పరిస్థితుల్లో కేంద్ర జల సంఘం కూడా తుమ్మడిహెట్టి వద్ద నీటి లభ్యత లేదని, జలాశయాల సామర్థ్యం సరిపోదని తెలిపింది. ఈ నేపథ్యంలో సీడబ్ల్యూసీ సూచనల మేరకు కాళేశ్వరం ప్రాజెక్టును రీడిజైనింగ్ చేశాం. కేంద్ర ప్రభుత్వ సంస్థ వాప్కోస్ సూచనల మేరకు మేడిగడ్డ వద్ద కాళేశ్వరం ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టాం.

20 లక్షల ఎకరాలకు నీళ్లిచ్చాం

కాళేశ్వరం ప్రాజెక్టు కింద ఆయకట్టు తక్కువ వచ్చిందని కాంగ్రెస్ తప్పుడు ప్రచారం చేస్తోంది. మీరు ఇటీవల విడుదల చేసిన నివేదిక ప్రకారమే కాళేశ్వరం కింద కొత్త ఆయకట్టు 98,570 ఎకరాలు వచ్చింది. కాళేశ్వరం ద్వారా నిండిన చెరువులు, కుంటలు, స్టేజ్-1, స్టేజ్-2లలో జరిగిన స్థిరీకరణ కలిపి దాదాపు 20 లక్షల ఎకరాలకు కాళేశ్వరం ద్వారా నీళ్లిచ్చాం. ఏ ప్రాజెక్టుకైనా ప్రారంభించిన వెంటనే కొత్త ఆయకట్టు రాదు. ఎస్సారెస్పీ, నాగార్జున సాగర్ ఎడమకాలువ, దేవాదుల, కల్వకుర్తి మొదలైనప్పుడు అన్ని ప్రాజెక్టుల పరిస్థితి ఇదే. శ్వేతపత్రంలో అబద్ధాలనే పొందుపరిచారు. మిడ్ మానేర్‌కు రూ. 106 కోట్లు ఖర్చు చేస్తే, మేమొచ్చాక రూ.775 కోట్లు ఇచ్చాం. మేమే పూర్తి చేసి నీళ్లిచ్చాం. రాయలసీమ లిఫ్ట్ విషయంలో కేంద్రానికి ఫిర్యాదు చేయలేదన్నారు... అది తప్పు. కేఆర్‌ఎంబీకి అప్పగించాలని గెజిట్ ఇస్తే మేము సవాల్ చేయలేదని చెప్పడం కూడా తప్పే. మేము దీన్ని వ్యతిరేకిస్తూ అపెక్స్ కౌన్సిల్‌కు రిఫర్ చేయాలని చెప్పాం. కేఆర్‌ఎంబీకి అప్పగించింది మేం కాదు.

మేడిగడ్డను పునరుద్ధరించి నీళ్లివ్వండి

మేడిగడ్డ బ్యారేజ్‌ను పునరుద్ధరించకుండా సాగదీస్తున్నారు. మొత్తం కూలిపోతే రాజకీయ లబ్ధి పొందాలని భావిస్తున్నట్లు అనుమానం వస్తోంది. వర్షాకాలం వచ్చేలోపు పునరుద్ధరణ పనులు చేయాలి. పదేళ్లలో మేజర్, మీడియం, మైనర్ ఇరిగేషన్ కింద 17.24 లక్షల ఎకరాల కొత్త ఆయకట్టు తెచ్చాం. 31.50 లక్షల ఎకరాలు స్థిరీకరణ చేశాం. ప్రాజెక్టుల అంచనాలు పెరగడం కొత్త కాదు. కాళేశ్వరం ఒక్కటే పెరగలేదు. నాగార్జున సాగర్ అంచనా 9.7 రెట్లు పెరిగింది. కృష్ణా నుంచి 299 టీఎంసీలు కాదు, 600 టీఎంసీలకు పైగా నీళ్లు తెచ్చుకునే అవకాశం ఉంది. ఆ దిశగా ప్రయత్నం చేయాలి.

టీవీలో నా ముఖం చూపించడం లేదట..

శ్వేతపత్రంపై చర్చలో హరీశ్‌రావు మాట్లాడుతుండగా, సీఎం రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కతోపాటు మంత్రులు జూపల్లి కృష్ణారావు, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అడ్డుతగిలారు. దీంతో హరీశ్‌రావు పలుమార్లు అసహనం వ్యక్తం చేస్తూ 'నేను శ్వేతపత్రంపై వివరణ ఇవ్వాలో లేదా మంత్రులు మాట్లాడే మాటలకు వివరణ ఇవ్వాలో తెలియట్లేదు?' అని పేర్కొన్నారు. అదే సమయంలో ఆయన స్పీకర్‌నుద్దేశించి 'నేను అసెంబ్లీలో మాట్లాడుతుంటే టీవీలో నా మొహం చూపిస్తలేరంట. ఇప్పుడే మా ఆవిడ ఇంట్లో టీవీ చూసి కాల్ చేస్తే.. మా పీఏ కాగితం పంపించాడు. గొంతు వినిపిస్తోందట కానీ నా ముఖం బదులు స్పీకర్ లేదా సీఎంను చూపిస్తున్నారట. నా ముఖం కూడా చూపించండి' అని అన్నారు. దానికి స్పీకర్ ప్రసాద్ కుమార్ స్పందిస్తూ 'మీరు సీనియర్ సభ్యులు. అలా మాట్లాడకూడదు. ఎవరు మాట్లాడితే వారినే చూపిస్తారు' అని చెప్పారు.

శ్రీధర్‌బాబుతో హరీశ్ భేటీ

భోజన విరామ సమయంలో లాబీల్లోని శాసనసభా వ్యవహారాల మంత్రి డి.శ్రీధర్‌బాబు గదికి హరీశ్‌రావు వచ్చారు. అప్పుడు శ్రీధర్ గదిలో లేకపోవడంతో వెనక్కు తిరిగారు. అంతలోనే లాబీల్లో శ్రీధర్‌బాబు ఎదురుపడి హరీశ్‌ను తన వెంట తీసుకెళ్లారు. శ్వేతపత్రంపై చర్చ ఎంత సేపు జరగనుంది, సీఎం రేవంత్‌రెడ్డి కూడా దీనిపై మాట్లాడతారా అన్న విషయాల గురించి హరీశ్ అడిగినట్టు తెలిసింది. నీటిపారుదల ప్రాజెక్టులపై చాలా మంది సభ్యులు మాట్లాడతామని కోరుతున్నారని, వారందరికీ అవకాశం కల్పిస్తామని శ్రీధర్ చెప్పినట్టు సమాచారం.

ప్రభుత్వం వాస్తవాలు దాచింది

స్థిరీకరణ, ఆయకట్టు విషయంలో ప్రభుత్వం వాస్తవాలు దాచి పెట్టిందని, దీనిపై ప్రజలకు క్షమాపణ చెప్పాలని హరీశ్‌రావు డిమాండ్ చేశారు. అసెంబ్లీ నిరవధిక వాయిదా అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. మమల్ని ఇరికించబోయి ప్రభుత్వం సెల్ఫ్ గోల్ వేసుకుందని, నాలుగు ఎంపీ సీట్లలో గెలుపు కోసం దీన్ని భూతద్దంలో చూపే ప్రయత్నం చేసిందని ధ్వజమెత్తారు. కాగ్ పనికి రాదని తాము అనలేదని, మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ చెప్పిన అన్న విషయాన్ని గుర్తుచేశామని, ఇదే కాగ్ తమను ఎన్నోసార్లు మెచ్చుకుందని చెప్పారు.

క్లుప్తంగా...

ఏ ప్రాజెక్టు ఎవరు కట్టారో ఉత్తమ్‌కు తెలియదా?

మాజీమంత్రి నిరంజన్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్: తెలంగాణలో ఏ ప్రాజెక్టును ఎవరు కట్టారో కూడా రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి తెలియకపోవడం విచారకరమని మాజీమంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి ఎద్దేవా చేశారు. వనపర్తి జిల్లాలోని సరళాసాగర్ ప్రాజెక్టును వనపర్తి రాజులు నిర్మించారని, నిజాం రాజులు కాదని శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పూర్వం వనపర్తి సంస్థానాధీశుడైన రెండో రామేశ్వర్‌రావు కాలంలో సరళాదేవి పేరిట దీనిని చెరువులా నిర్మించారని తెలిపారు. అమెరికాలోని కాలిఫోర్నియాకు ఇంజనీర్లను పంపించి అధ్యయనం చేసిన తర్వాత శంకరమ్మపేటలో రూ.35 లక్షలతో నిర్మాణం చేపట్టారని వివరించారు. ఈ ప్రాజెక్ట్‌కు 1949 సెప్టెంబర్ 15న ఆనాటి హైదరాబాద్ మిలిటరీ గవర్నర్ జనరల్ జయంత్‌నాథ్ చౌదరి చేతుల మీదుగా ఊకచెట్టు వాగుపై పునాదులు వేశారని, దీని సామర్థ్యం 0.42 టీఎంసీ అని, 9 గ్రామాలకు సాగునీరు అందిస్తుందని నిరంజన్‌రెడ్డి వెల్లడించారు.

సీబీఐ బీజేపీ ఒక్కటే..!

బీజేపీ చెప్పుచేతల్లో సీబీఐ పనిచేస్తోంది: నారాయణ



సాక్షి, న్యూఢిల్లీ: సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ (సీబీఐ), బీజేపీలు ఒక్కటేనని,ఆ పార్టీచెప్పుచేతల్లోనే సీబీఐ పనిచేస్తోందని సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ ఆరోపించారు. ప్రజాధనాన్ని వృథాగా ఖర్చు చేసి, కమీషన్లు కాజేసిన మాజీ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావును బీజేపీ కాపాడే ప్రయత్నం చేస్తుందని విమర్శించారు. ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ...ఓ వైపు కాంగ్రెస్ కాళేశ్వరంపై జరిగిన అవినీతిని బయటకు తెచ్చేందుకు ప్రయత్నిస్తున్న సమయంలో మరోవైపు సీబీఐ విచారణ చేపట్టాలంటూ బీజేపీ డిమాండ్ చేయడం పెద్ద జోక్‌గా అభివర్ణించారు. బీజేపీ, కేసీఆర్‌లు ఇద్దరూ ఒక్కటేనని, అందుకే లిక్కర్ కేసులో కవిత ఇప్పటివరకు అరెస్టు కాలేదన్నారు. కాళేశ్వరంపై సీబీఐ విచారణ చేస్తే అవినీతి జరగలేదని, కేసీఆర్ మంచి వ్యక్తి అనే క్లీన్‌చీట్ ఇచ్చేందుకు బీజేపీ ప్రయత్నిస్తుందన్నారు. రైతులను మోదీ ప్రభుత్వం ఘోరంగా అవమానిస్తుందన్నారు. రాముడిని అడ్డం పెట్టుకుని వచ్చే ఎన్నికల్లో మోదీ రాజకీయాలు చేసేందుకు కుట్ర పన్నుతున్నారంటూ వ్యాఖ్యానించారు. మరోసారి బీజేపీ అధికారంలోకి వస్తే రాజ్యాంగాన్ని ధ్వంసం చేస్తుందని ఆరోపించారు.

బడి పిల్లల్లా మాట్లాడటం సరికాదు

కూనంనేని సాంబశివరావు



సాక్షి, హైదరాబాద్: ఎకరాకు రైతుకు రూ.30 వేల వరకు ఆదాయం సమకూరి, అదే ఒక ఎకరాకు సంబంధిత సాగునీటి ప్రాజెక్టు నిర్వహణ భారం రూ.లక్షగా ఉంటే దాన్ని ఏమనాలని సీపీఐ సభ్యుడు కూనంనేని సాంబశివరావు ప్రశ్నించారు. కాళేశ్వరం ప్రాజెక్టు లోపాల గురించి మాట్లాడితే, మూడు పియర్స్ మాత్రమే కదా కుంగాయి.. గతంలో వేరే ప్రాజెక్టుల్లో ఇలాంటి నష్టాలు జరిగాయి కదా.. అని బడి పిల్లల్లా మాట్లాడటం సబబుగా లేదని అభిప్రాయపడ్డారు. ఏదైనా తప్పిదంపై కాగ్ నివేదిక ఇస్తే.. దాని ప్రకారం చర్యలు తీసుకోవాలి తప్ప, ఆ నివేదికకు ప్రాధాన్యం లేకుండా చేయటం సరికాదని స్పష్టం చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టు ప్రస్తుత పరిస్థితి చూస్తే, గోదావరి నీటి వినియోగం చక్రబంధంలో ఉన్నట్టుగా మారిందని పేర్కొన్నారు. ఇప్పుడు దాన్ని ఏం చేయాలనే విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం జాగ్రత్తగా వ్యవహరించాల్సి ఉందని అభిప్రాయపడ్డారు. గోదావరి, కృష్ణా జలాల వినియోగం విషయంలో రాష్ట్ర ప్రభుత్వం కేంద్రంతో సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగాలని కూనంనేని సూచించారు.

రైతు ఉద్యమం పేరుతో రాజకీయం చేస్తున్నారు

మాజీ ఎంపీ బూర నర్సయ్య గౌడ్



సాక్షి, న్యూఢిల్లీ: రైతు ఉద్యమం పేరుతో పంజాబ్, హరియాణా రాష్ట్రాల రైతులు రాజకీయం చేస్తున్నారని మాజీ ఎంపీ బూర నర్సయ్య గౌడ్ ఆరోపించారు. ఎవరెన్ని రాజకీయాలు, కుతంత్రాలు చేసినా వచ్చే ఎన్నికల్లో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 400 సీట్లను గెలిచి మూడోసారి అధికారంలోకి రాబోతున్నారని జోస్యం చెప్పారు. ఆయన శనివారం ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో విలేకరులతో మాట్లాడారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీని ఎదుర్కొనలేక రైతుల పేరుతో కొన్ని పార్టీలు రాజకీయ పోరాటం చేస్తున్నాయని విమర్శించారు. తెలంగాణలో కచ్చితంగా తాము పది సీట్లు గెలుస్తామని ఆయన ధీమా వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ కుంగిపోతున్న నావ అని, దానిని బీజేపీ కాపాడుతుందనే నిందలు తమపై వేయొద్దని కోరారు. బీఆర్ఎస్ లేదా ఇతర పార్టీలతో పొత్తులుండవని ఇప్పటికే ఎంపీ బండి సంజయ్ ప్రకటించిన విషయాన్ని గమనించాలని నర్సయ్య గౌడ్ స్పష్టం చేశారు.

వా'ఢీ'.. వే'ఢీ'

ముగిసిన అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు



ఎనిమిది రోజులపాటు సాగిన సమావేశాలు

- ఓటాన్ అకౌంట్‌తోపాటు పలు బిల్లులు, తీర్మానాలు
- సభను కుదిపేసిన కేఆర్ఎంబీకి ప్రాజెక్టుల అప్పగింత, నీటిపారుదల శాఖపై శ్వేతపత్రం
- గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు, ఓటాన్ అకౌంట్ సహా ప్రతీ అంశంపైనా వాగ్యుద్ధం

సాక్షి, హైదరాబాద్: ఎనిమిది రోజులపాటు అధికార కాంగ్రెస్, ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్ నడుమ తీవ్ర వాగ్యుద్ధాల నడుమ సాగిన రాష్ట్ర అసెంబ్లీ ఓటాన్ అకౌంట్ బడ్జెట్ 2024–25 సమావేశాలు శనివారం ముగిశాయి. చివరి రోజు జరిగిన భేటీలో 'తెలంగాణ సాగునీటి రంగంపై శ్వేతపత్రం'పై జరిగిన స్వల్పకాలిక చర్చ అనంతరం అసెంబ్లీని నిరవధికంగా వాయిదా వేస్తున్నట్లు స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ప్రకటించారు. ఈ నెల 8న ప్రారంభమైన సమావేశాలు 8 రోజులపాటు సాగాయి. 8 రోజుల్లో 45 గంటల 32 నిమిషాలపాటు సభ జరగ్గా, 59 మంది సభ్యులు ప్రసంగించగా, జీరో అవర్‌లో 64 మందికి మాట్లాడే అవకాశం దక్కింది. రెండు ప్రభుత్వ తీర్మానాలు, మూడు బిల్లులను పెట్టగా, ఒక స్వల్పకాలిక చర్చ జరిగింది. తొలిసారిగా సభకు ఎన్నికైన సభ్యులకు మాట్లాడేందుకు అవకాశం కల్పించడంతోపాటు వారి నియోజకవర్గ సమస్యలను ప్రస్తావించేందుకు ఈ నెల 15, 16 తేదీల్లో సుదీర్ఘంగా జీరో అవర్ నిర్వహించారు.

మేడిగడ్డ సందర్శన.. చలో నల్లగొండ

ఈ నెల 8న ఉభయ సభలనుద్దేశించి గవర్నర్ తమిళిసై ప్రసంగించారు. 9న గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానాన్ని అసెంబ్లీ ఆమోదించింది. 10న రూ.2.75లక్షల ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌ను డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అసెంబ్లీలో, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి శ్రీధర్ బాబు మండలిలో ప్రవేశ పెట్టారు. 11న విరామం ప్రకటించి.. 12న తిరిగి సమావేశమైన అసెంబ్లీ ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌పై సాధారణ చర్చ జరగాల్సి ఉండగా, ఎజెండాను వాయిదా వేసి 'కృష్ణా నదీ యాజమాన్య బోర్డు'కు తాము విధించే షరతులను ఆమోదిస్తేనే నాగార్జున సాగర్, శ్రీశైలం ఉమ్మడి ప్రాజెక్టులు అప్పగిస్తామంటూ తీర్మానం చేసింది. ఈ సందర్భంగా కాంగ్రెస్, బీఆర్ఎస్ నడుమ తీవ్ర వాగ్వివాదం చోటుచేసుకుంది. నీటిపారుదల శాఖ శ్వేతపత్రంపై జరిగిన స్వల్పకాలిక చర్చ కూడా విమర్శలు, ప్రత్యారోపణలకు దారి తీసింది. 13న మేడిగడ్డ సందర్శనకు రావాలని నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్ని పక్షాలను ఆహ్వానించారు. 13న ఉదయం 10 గంటలకు ప్రారంభమైన అసెంబ్లీ ఎలాంటి ఎజెండాను చేపట్టకుండానే వాయిదా పడింది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సహా అధికార కాంగ్రెస్‌తో పాటు ఎంఐఎం, సీపీఐ సభ్యులు మేడిగడ్డ సందర్శనకు వెళ్లారు. కేఆర్ఎంబీకి ప్రాజెక్టుల అప్పగింతను నిరసిస్తూ అదే రోజు బీఆర్ఎస్ నిర్వహించిన 'చలో నల్లగొండ' సభకు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు వెళ్లారు.

14న బడ్జెట్ ఆమోదం

ఈ నెల 14న ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌పై అసెంబ్లీ చర్చించగా, 15న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సమాధానంతో ఆమోదం పొందింది. అదే రోజు ద్రవ్య వినిమయ బిల్లుపైనా చర్చించి ఆమోదించారు. 16న కులగణన బిల్లుపై చర్చించి సభ ఆమోదించింది. 17న సాగునీటి రంగం శ్వేతపత్రంపై స్వల్పకాలిక చర్చ జరిగింది. అసెంబ్లీ బీఏసీ సమావేశానికి మాజీ మంత్రి హరీశ్‌రావును అనుమతించకపోవడాన్ని బీఆర్ఎస్ తప్పు పట్టింది. ప్రతిపక్ష నేత కేసీఆర్‌కు ఇరుకైన గదిని కేటాయించడంపై బీఆర్ఎస్ స్పీకర్‌కు ఫిర్యాదు చేసింది. మరోవైపు పొగాకు ఉత్పత్తుల సవరణ బిల్లును సభ ఆమోదించింది. బీఆర్ఎస్, బీజేపీ ఇచ్చిన పలు వాయిదా తీర్మానాలను స్పీకర్ నిరాకరించారు. అసెంబ్లీ సమావేశాల్లో పైచేయి సాధించేందుకు ఉభయ పక్షాలు పోటాపోటీగా చేసిన ప్రసంగాలు హోరాహోరీగా సాగగా.. పలుమార్లు రగడకు దారితీశాయి. విపక్ష బీజేపీ, ఎంఐఎం కూడా కాంగ్రెస్, బీఆర్ఎస్‌పై సున్నిత విమర్శలు చేస్తూ ఉనికిని చాటుకున్నాయి. సీపీఐ ఏకైక సభ్యుడు కూనంనేని సాంబశివరావు అధికార కాంగ్రెస్‌ను సమర్థిస్తూనే ఉభయ పక్షాల వైఖరిని ఎత్తిచూపే ప్రయత్నం చేశారు. ప్రధాన ప్రతిపక్ష నేత హోదాలో మాజీ సీఎం కేసీఆర్ సభకు గైర్హాజరు కావడాన్ని కాంగ్రెస్ పదేపదే ప్రస్తావించింది.

'కాళేశ్వరం'పై సిట్టింగ్ జడ్జి కోసం మరోసారి లేఖ

కాగ్ నివేదికపైనా విచారణ జరిపిస్తాం: మంత్రి డి.శ్రీధర్‌బాబు

సాక్షి, హైదరాబాద్: కాళేశ్వరం ప్రాజెక్టు అవినీతిపై న్యాయవిచారణ నిర్వహించేందుకు సిట్టింగ్ జడ్జి సేవలను కేటాయించాల్సిందిగా రాష్ట్ర ఉన్నత న్యాయస్థానాన్ని మరోసారి కోరతామని పరిశ్రమలు, ఐటీ, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి డి.శ్రీధర్‌బాబు తెలిపారు. ఈ ప్రాజెక్టుపై విచారణ కోసం సిట్టింగ్ జడ్జిని కేటాయించాలని గతంలోనే హైకోర్టు చీఫ్ జస్టిస్‌ను కోరామని, అయితే జడ్జీల సంఖ్య తక్కువగా ఉన్నందున ఇవ్వలేమని, విశ్రాంత న్యాయమూర్తిని అందుకు కేటాయిస్తామని హైకోర్టు నుంచి జవాబు వచ్చిందన్నారు. ఈ నేపథ్యంలో విచారణకు సిట్టింగ్ జడ్జిని కేటాయించాల్సిందిగా మరోసారి లేఖ రాస్తామని వెల్లడించారు. శనివారం అసెంబ్లీ లాబీల్లో ఆయన మీడియాతో పిచ్చాపాటిగా మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో కాళేశ్వరం అవినీతిపై న్యాయవిచారణ జరిపిస్తామని స్పష్టంగా పేర్కొన్నామని గుర్తుచేశారు. దీనిపై కేంద్ర ప్రభుత్వం సీబీఐతో విచారణ జరిపిస్తామంటే అడ్డు చెప్పబోమని పేర్కొన్నారు. విచారణ జరిపించ దలుచుకుంటే కేంద్రానికి సీబీఐయే కాకుండా ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ), సెంట్రల్ విజిలెన్స్ కమిషన్‌తో కూడా జరిపించేందుకు అవకాశం ఉందన్నారు. అయితే ఈ విభాగాలతో కేంద్రం విచారణ జరిపిస్తే మాత్రం బీఆర్ఎస్–బీజేపీ ఒక్కటవుతాయనే అనుమానం కూడా తమకుందన్నారు.

రాష్ట్రంలో బీజేపీ ప్రభుత్వమున్నా కాళేశ్వరంపై ప్రాజెక్టుపై విచారణ జరిపించే ఉండేవారని, అందుకోసం విచారణకు సిట్టింగ్ జడ్జిని కూడా ఇచ్చి ఉండేవాళ్లని చెప్పారు. గతంలోనూ వివిధ అంశాలపై పలు సందర్భాల్లో సిట్టింగ్ జడ్జితో విచారణ జరిగిన ఉదంతాలున్నాయని, అందువల్ల సిట్టింగ్ జడ్జిని ఎప్పుడూ విచారణకు ఇవ్వలేదనే వాదనలు అవాస్తవమని ఒక ప్రశ్నకు ఆయన బదులిచ్చారు. ఇదిలా ఉంటే... బీఆర్ఎస్ ప్రభుత్వ నిర్వాకంపై కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ (కాగ్) విడుదల చేసిన నివేదికలోని అంశాలపైనా తమ ప్రభుత్వం విచారణ జరిపిస్తుందని శ్రీధర్‌బాబు చెప్పారు.

కేఆర్ఎంబీ చర్చంటే.. బీఆర్ఎస్ సభ్యులు పారిపోయారు

కృష్ణానది యాజమాన్య బోర్డు అంశంపై అసెంబ్లీలో జరిగిన చర్చలో పాల్గొనకుండా బీఆర్ఎస్ సభ్యులు పారిపోయారని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు విమర్శించారు. శనివారం అసెంబ్లీ ఆవరణలో ఆయన మీడియాతో మాట్లాడారు. ప్రతిపక్ష పార్టీ సభ్యులు సూచనలు చేస్తే తప్పకుండా స్వీకరిస్తామన్నారు. వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి డబుల్ డిజిట్ సీట్లు వస్తాయన్నారు. నల్లగొండ సభకు వెళ్లిన కేసీఆర్‌కు శాసనసభకు రావడానికి ఇబ్బంది ఏమిటో అర్థం కావడం లేదన్నారు.

సభలో ఏయే పార్టీలు ఎంతెంత సమయమంటే..

8 రోజుల పాటు 45 గంటల 32 నిమిషాలు సభ నిర్వహించామని, 59 మంది సభ్యులు సభలో మాట్లాడారని, 64 మంది సభ్యులు జీరో అవర్‌లో మాట్లాడారని, 2 తీర్మానాలను పాస్ చేశామని, 3 బిల్లులకు ఆమోదం తెలిపామని శ్రీధర్‌బాబు వివరించారు. సభ్యులందరూ సవివరంగా మాట్లాడే అవకాశం కల్పించామని, పార్టీల వారీగా కాంగ్రెస్‌కు 8 గంటల 43 నిమిషాలు, బీఆర్ఎస్‌కు 8 గంటల 41 నిమిషాలు, బీజేపీకి 3 గంటల 48 నిమిషాలు, ఎంఐఎంకు 5 గంటలు, సీపీఐకి 2 గంటల 55 నిమిషాలు అవకాశం ఇచ్చామని చెప్పారు. కాగా, కౌన్సిల్ 11 గంటల 5 నిమిషాల పాటు జరిగిందని శ్రీధర్‌బాబు చెప్పారు.



మీడియా పాయింట్‌లో మాట్లాడుతున్న శ్రీధర్‌బాబు

త్వరలో సున్నపురాయి బ్లాకుల వేలం

- పరిశ్రమల శాఖ ముఖ్య కార్యదర్శి మహేశ్‌దత్ వెల్లడి

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం త్వరలో సున్నపురాయి బ్లాక్‌లు, రేర్ ఎర్త్ మెటీరియల్ వెలికితీత లైసెన్సుల వేలం వేస్తుందని తెలంగాణ రాష్ట్ర జియోలాజికల్ ప్రోగ్రామింగ్ బోర్డు (టీఎస్‌జీపీబీ) చైర్మన్, పరిశ్రమల శాఖ ముఖ్య కార్యదర్శి బెన్హర్ మహేశ్ దత్ ఎక్కా వెల్లడించారు. శనివారం మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల కేంద్రంలో జరిగిన టీఎస్‌జీపీబీ ఏడో సమావేశానికి అధ్యక్షత వహించిన మహేశ్ దత్ మాట్లాడుతూ రాష్ట్రంలో అపార ఖనిజ సంపద ఉందని, ఖనిజాలు నిక్షిప్తమైన ప్రాంతాలను అన్వేషించేందుకు శాస్త్రీయ, పరిశోధన సంస్థలు, భూగర్భ, గనుల పరిశోధకులు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఇటీవలి కాలంలో క్రమపద్ధతిలో సురక్షితంగా సుస్థిర విధానంలో జరుగుతున్న ఖనిజాల వెలికితీత ద్వారా అదాయం పెరిగి ప్రభుత్వ ఖజానాకు లబ్ధి చేకూరుతోందన్నారు.

ఏటా టీఎస్‌జీపీబీ సదస్సులు

రాష్ట్రంలో భూగర్భ వనరుల రంగంలో పనిచేస్తున్న వివిధ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సంస్థలు, విశ్వ విద్యాలయాలతో ఏటా ఖనిజాల అన్వేషణ, ఇతర భూగర్భ సంబంధిత అంశాలపై టీఎస్‌జీపీబీ సదస్సులు నిర్వహిస్తోంది. టీఎస్‌జీపీబీ సభ్య కార్యదర్శి, రాష్ట్ర మైన్స్ జియోలాజికల్ విభాగం డైరెక్టర్ బి.ఆర్.వి.సుశీల్‌కుమార్ సమన్వయకర్తగా ఈ సదస్సులు జరుగుతున్నాయి. రాష్ట్రంలో ప్రస్తుతం సున్నపురాయి, బొగ్గు, మాంగనీసు, ఇనుము ముడి ఖనిజాలు, రేర్ ఎర్త్ మెటీరియల్స్, బాక్సైట్, రాగి తదితర ఖనిజాల అన్వేషణ కార్యకలాపాల్లో పాల్గొంటున్న జియో లాజికల్ సర్వే ఆఫ్ ఇండియా, రాష్ట్ర ఖనిజాభివృద్ధి సంస్థలు ఈ సదస్సులో పాల్గొన్నాయి.

నీటి లభ్యత మేరకే ప్రాజెక్టులు చేపట్టాలి

మజ్లిస్ సభాపక్ష నేత అక్బరుద్దీన్

సాక్షి, హైదరాబాద్: నీటి లభ్యతను అంచనా వేయకుండా ప్రాజెక్టులను చేపట్టి కోట్ల రూపాయలు నీళ్లలా ఖర్చు చేయటం ఏమాత్రం సమంజసం కాదని మజ్లిస్ సభాపక్ష నేత అక్బరుద్దీన్ ఒవైసీ అన్నారు. శనివారం నీటి పారుదల శాఖ మీద శాసనసభలో ప్రవేశపెట్టిన శ్వేతపత్రంపై చర్చలో ఆయన మాట్లాడారు. ప్రాజెక్టులను ఏటీఎంలుగా మార్చేశారని విమర్శించారు. నీటి లభ్యత, ప్రాజెక్టు వయబిలిటీ, వినియోగం.. ఈ మూడు అంశాలను సరిగ్గా బేరీజు వేసుకుని ప్రాజెక్టులు చేపట్టాలని తాను 20 ఏళ్లుగా సభలో పేర్కొంటూనే ఉన్నానని అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు లిఫ్టుకు కరెంటు ఖర్చు ఏడాదికి రూ.10 వేల కోట్లు ఉండటం ఆలోచించాల్సిన విషయమన్నారు. వ్యవసాయానికి ఉచిత కరెంటు కోసం ఏటా రూ.12 వేల కోట్లు, 200 యూనిట్ల ఉచితానికి రూ.4,800 కోట్లు, కాళేశ్వరానికి రూ.10,320 కోట్లు, ఇతర ఎత్తిపోతల ప్రాజెక్టులకు రూ.5 వేల కోట్లు ఏటా కరెంటు ఖర్చు వస్తుండటాన్ని తీవ్రంగా పరిగణించాలన్నారు. ప్రాజెక్టులకు చాలినంత నీరు, లిఫ్టులకు కావాల్సిన విద్యుత్తు, అందుకయ్యే వ్యయాన్ని భరించే నిధుల లభ్యత ఉంటేనే ప్రాజెక్టులు చేపట్టాలన్నారు. కాళేశ్వరం అక్రమాల నెపాన్ని అధికారులపై నెట్టి వారిని మాత్రమే బాధ్యులు చేయొద్దని సూచించారు. అలమట్టి ఎత్తు పెంపు నాటి చంద్రబాబు ప్రభుత్వ ఘోరవైఫల్యమని అక్బరుద్దీన్ విమర్శించారు. ఆయన ప్రభుత్వం కర్ణాటక దుందుడుకు చర్యను అడ్డుకోకుండా బొద్యం చూస్తూ ఉండిపోయిందని అన్నారు.

మీరొకటి అంటే మేం నాలుగంటాం

ఎమ్మెల్యే విజయరమణారావు

సాక్షి, హైదరాబాద్: అధికార దుర్వినియోగంతో నిండా మునిగిన ప్రాజెక్టును ప్రజలకు చూపించేందుకు సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలో మంత్రులు, ఎమ్మెల్యేలు వెళ్తే ఏం పీకడానికి వెళ్లారని మాజీ సీఎం కేసీఆర్ వ్యాఖ్యానించడం సరైంది కాదని పెద్దపల్లి కాంగ్రెస్ ఎమ్మెల్యే సి.హెచ్.విజయరమణారావు అన్నారు. బీఆర్ఎస్ వాళ్లు అధికారంలో ఉన్నప్పుడు కూడా మేడిగడ్డకు వెళ్లారని, అప్పుడు ఏం పీకేందుకు వెళ్లారో చెప్పాలని డిమాండ్ చేశారు. మాజీ సీఎం అయి ఉండి ఇలాంటి మాటలు మాట్లాడేందుకు కనీస విజ్ఞత ఉండా లని వ్యాఖ్యానించారు. ప్రాజెక్టులపై అసెంబ్లీలో ప్రభుత్వం ప్రవేశపెట్టిన తీర్మానంపై చర్చలో విజయరమణారావు మాట్లాడుతూ వాళ్లు ఏం మాట్లాడినా చూస్తూ ఊరుకోవడానికి తాము సిద్ధంగా లేమన్నారు. 'మీరు ఒకటి అంటే మేం నాలుగంటాం. మీరు వేలు పెడితే మేం కాలు పెడతాం. మీలాగా కావలి పెట్టే నైజం కాదు. కొట్లాడే శక్తి ఉన్నోళ్లం. హరీశ్‌రావు లాగా అబద్ధాలు చెప్పం' అని అన్నారు.

రామ్మోహన్‌రెడ్డి కాల్వ అని పేరు పెడితే చాలు..

పరిగి కాంగ్రెస్ ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డి తన మనసులోని కోరికను అసెంబ్లీ సాక్షిగా బయట పెట్టారు. పరిగి, వికారాబాద్, చేవెళ్ల ప్రాంతంలో కట్టే ఏ ప్రాజెక్టు పరిధిలోని కాల్వకైనా రామ్మోహన్‌రెడ్డి కాల్వ అని పేరు పెడితేచాలని, తనకు ఆ కోరిక ఉందని వెల్లడించారు. గత ప్రభుత్వ హయాంలో సాగునీటి ప్రాజెక్టులకు మొబిలైజేషన్ అడ్వాన్సులిచ్చినట్టు తాను రుజువు చేస్తానని, లేదంటే తన ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తానని సవాల్ చేశారు.

ఘనంగా కేసీఆర్ జన్మదిన వేడుకలు

- ఆటో డ్రైవర్లకు ప్రమాద బీమా పత్రాలు, దివ్యాంగులకు వీల్‌చైర్ల పంపిణీ
- 70 కిలోల భారీ కేక్‌తో సంబురాలు, కేసీఆర్ పై డాక్యుమెంటరీ ప్రదర్శన
- తెలంగాణ భవన్‌లో వేడుకలకు హాజరైన బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, ఇతర ముఖ్య నేతలు



తెలంగాణ భవన్‌లో కేసీఆర్ జన్మదిన వేడుకల సందర్భంగా కేక్ కట్ చేస్తున్న పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, కేశవరావు. చిత్రంలో తలసాని, మహమూద్ అలీ, దానం, శ్రీనివాస్ గౌడ్, మేయర్ విజయలక్ష్మి తదితరులు

సాక్షి, హైదరాబాద్: భారత రాష్ట్ర సమితి అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు 70వ జన్మదిన వేడుకలను శనివారం తెలంగాణ భవన్‌లో ఘనంగా నిర్వహించారు. మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్, సికింద్రాబాద్ పార్లమెంటు నియోజకవర్గ బీఆర్ఎస్ ఇన్‌చార్జి తలసాని సాయికిరణ్ యాదవ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకల్లో పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. పార్టీ ముఖ్య నేతలతో పాటు కేటీఆర్ ఉదయమే తెలంగాణ భవన్‌కు చేరుకుని తెలంగాణ తల్లి, ప్రొఫెసర్ జయశంకర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం వెయ్యి మంది ఆటో డ్రైవర్లకు లక్ష రూపాయల జీవిత బీమా కవరేజీతో కూడిన ఇన్సూరెన్స్ పత్రాలు, పది మంది దివ్యాంగులకు వీల్ చైర్లను కేటీఆర్ పంపిణీ చేశారు. కేసీఆర్ 70వ పుట్టినరోజును గుర్తు చేసేలా 70 కిలోల భారీ కేక్‌ను ఎంపీ కె.కేశవరావు, హైదరాబాద్ మేయర్ గద్వాల విజయలక్ష్మి, మాజీ మంత్రులు మహమూద్ అలీ, తలసాని శ్రీనివాస్ యాదవ్, శ్రీనివాస్‌గౌడ్‌లతో కలసి కేటీఆర్ కట్ చేశారు. తర్వాత కేసీఆర్ రాజకీయ జీవితం, తెలంగాణ ఉద్యమ నేపథ్యంతో రూపొందించిన 'అతనే ఒక చరిత్ర' డాక్యుమెంటరీని ప్రదర్శించారు. అలాగే కేసీఆర్ ఉద్యమ ప్రస్థానాన్ని ప్రతిబింబించేలా ఫొటో ప్రదర్శన ఏర్పాటు చేశారు.

కార్యకర్తల కుటుంబాలకు చెక్కులు

బీఆర్ఎస్ సభ్యత్వం కలిగి.. ప్రమాదవశాత్తూ ప్రాణాలు కోల్పోయిన కార్యకర్తల కుటుంబాలను ఆదుకునేందుకు 70 మందికి రూ.2 లక్షల చొప్పున ప్రమాద బీమా చెక్కులను అందజేశారు. అసెంబ్లీ మాజీ స్పీకర్ మధుసూదనాచారి, నాయకులు సోమా భరత్‌కుమార్, రావుల చంద్రశేఖర్ రెడ్డి తదితరులు చెక్కుల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఎంపీలు రంజిత్‌రెడ్డి, బీబీ పాటిల్, బడుగుల లింగయ్య, వద్దిరాజు రవిచంద్ర, మాజీ మంత్రులు కొప్పుల ఈశ్వర్, నిరంజన్‌రెడ్డి, నేతలు అనిల్ కుమార్ కూర్మాచలం, వాసుదేవ రెడ్డి, దూదిమెట్ల బాలరాజ్ యాదవ్, మేడే రాజీవ్ సాగర్, సతీశ్‌రెడ్డి తదితరులు ఈ వేడుకల్లో పాల్గొన్నారు.

బీఆర్ఎస్ఎల్పీ కార్యాలయంలో వేడుకలు

మాజీ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు జన్మదినం సందర్భంగా అసెంబ్లీ లాబీల్లోని పార్టీ శాసనసభాపక్ష కార్యాలయంలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కేక్ కట్ చేశారు. మాజీ మంత్రి హరీశ్‌రావు, పలువురు ఎమ్మెల్యేలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. కాగా, అసెంబ్లీ సమావేశాల్లో అధికార పక్షాన్ని సమర్థవంతగా ఎదుర్కొన్నారని హరీశ్‌రావును పార్టీ ఎమ్మెల్యేలు అభినందించారు.

మిషన్ భగీరథ విఫల పథకం

ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్: బీఆర్ఎస్ హయాంలో ఎంతో గొప్పగా ప్రచారం చేసుకున్న మిషన్ భగీరథ 'ఫెయిల్యూర్ స్కీమ్' అని కాంగ్రెస్ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి ఎద్దేవా చేశారు. క్షేత్రస్థాయిలో సర్వే చేయకుండా వేల కోట్లు ఖర్చుపెట్టి ఈ పథకాన్ని ప్రారంభించారని విమర్శించారు. శనివారం ఆయన అసెంబ్లీ లాబీల్లో మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ గ్రామాల్లో మిషన్ భగీరథ నీళ్లు సరిగా రావడం లేదని, వచ్చినా పలు ప్రాంతాల్లో అవి శుభ్రంగా లేకపోవడంతో ప్రజలు ఫిల్టర్, మినరల్ వాటర్ తాగుతున్నారన్నారు. మునుగోడు, దేవరకొండకు సాగునీరివ్వాలని కోరుతూ సీఎం రేవంత్‌రెడ్డికి తాను, ఎమ్మెల్యే బాలూనాయక్ కలసి వినతిపత్రం సమర్పిస్తామని చెప్పారు. కాగా, అంతకుముందు ఆయన అసెంబ్లీలో నీటిపారుదల శాఖపై విడుదల చేసిన శ్వేతపత్రంపై జరిగిన చర్చలోనూ ఆయన మాట్లాడారు.ఉమ్మడి రాష్ట్రంలో జరిగిన నష్టంకంటే, నల్లగొండ జిల్లాకు గత పదేళ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఎక్కువ నష్టం వాటిల్లిందని ధ్వజమెత్తారు. కాళేశ్వరం, యాదాద్రి పవర్ ప్రాజెక్టులు వద్దని గత ప్రభుత్వానికి తాను చెప్పినా వినిపించుకోలేదని, కేసీఆర్ ముందు బీఆర్ఎస్ ఎమ్మెల్యేల జీహుజూర్ తనంతో రాష్ట్రానికి తీవ్ర నష్టం జరిగిందన్నారు. తన రక్తంలో కాంగ్రెస్ ఉందని, తాను తిరిగి కాంగ్రెస్‌లోకి రావటం, ఆగమైన తెలంగాణ తిరిగి కాంగ్రెస్ చేతికి రావటం ఎంతో సంతోషంగా ఉందన్నారు. అక్రమాలకు పాల్పడ్డ బీఆర్ఎస్ ప్రభుత్వంలోని బాధ్యులను బ్రహ్మదేవుడు కూడా శిక్ష నుంచి కాపాడలేరని రాజగోపాల్‌రెడ్డి పేర్కొన్నారు.

వికారాబాద్ జెడ్పీ చైర్‌పర్సన్‌పై అవిశ్వాసం

- అడిషనల్ కలెక్టర్‌కు నోటీసు అందజేసిన 12మంది జెడ్పీటీసీలు
- సునీతారెడ్డి కాంగ్రెస్‌లో చేరిన మరుసటి రోజే బీఆర్ఎస్ నిర్ణయం



నోటీసులు ఇచ్చిన అనంతరం మీడియాతో మాట్లాడుతున్న విజయ్‌కుమార్, జెడ్పీటీసీలు

వికారాబాద్: జెడ్పీ చైర్‌పర్సన్ పట్నం సునీతారెడ్డిపై బీఆర్ఎస్ అనుకూల జెడ్పీటీసీలు అవిశ్వాసం నోటీసులు అందజేశారు. శనివారం కలెక్టరేట్‌లో అడిషనల్ కలెక్టర్ లింగ్యానాయక్‌ను కలిసిన 12మంది జెడ్పీటీసీలు నోటీసులిచ్చారు. సునీతారెడ్డి బీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్ కండువా కప్పుకున్న మరుసటి రోజే ఆమెపై అవిశ్వాసం నోటీసులు ఇవ్వడం చర్చనీయాంశంగా మారింది. జిల్లాలో చైర్‌పర్సన్, వైస్ చైర్మన్‌లతో కలిపి 18 మంది జెడ్పీటీసీలు ఉన్నారు. అవిశ్వాసం నెగ్గాలంటే మూడింట రెండొంతుల మెజారిటీ.. అంటే 12మంది జెడ్పీటీసీలు అవసరం అవుతారు. నోటీసులు ఇచ్చిన వారందరూ అలాగే కట్టుబడి ఉంటే అవిశ్వాసం నెగ్గుతుంది. నిబంధనల ప్రకారం నోటీసులు ఇచ్చిన 14 రోజుల్లో అవిశ్వాసంపై ఓటింగ్ కోసం కలెక్టర్ తేదీని ప్రకటించాల్సి ఉంటుంది. కాగా సునీతారెడ్డి వెంట పెద్దేముల్, బషీరాబాద్ జెడ్పీటీసీలు ఉన్నారు. కాగా, అవిశ్వాసం నోటీసులు ఇచ్చేందుకు వచ్చిన జెడ్పీటీసీలకు మద్దతుగా తాండూరు మాజీ ఎమ్మెల్యే రోహిత్ రెడ్డి, వికారాబాద్ మాజీ ఎమ్మెల్యే ఆనంద్ కలెక్టరేట్‌కు వచ్చారు. రోహిత్‌రెడ్డి ఈ విషయాన్ని చాలెంజ్‌గా తీసుకున్నట్లు తెలుస్తోంది. జెడ్పీటీసీలు చెదిరి పోకుండా క్యాంపు రాజకీయాలకు సన్నాహాలు చేస్తున్నట్లు సమాచారం. జెడ్పీటీసీలు ఇచ్చిన నోటీసులను కలెక్టర్‌కు అందజేస్తామని, తదుపరి నిర్ణయం ఆయనే తీసుకుంటారని అడిషనల్ కలెక్టర్ లింగ్యానాయక్ తెలిపారు.

'అన్నారం' గేట్లు ఎత్తివేత

మరమ్మతులకోసం నీటిని ఖాళీ చేస్తున్న అధికారులు



కాళేశ్వరం: కాళేశ్వరం ప్రాజెక్టులో భాగమైన అన్నారం బ్యారేజీకి మరమ్మతుల కోసం ఇంజనీరింగ్ అధికారులు శనివారం గేట్లు ఎత్తి నీటిని దిగువకు వదులుతున్నారు. ఈనెల 13న సీఎం రేవంత్‌రెడ్డి, ఇరిగేషన్‌శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిలతో పాటు మంత్రులు, ఎమ్మెల్యేల బృందం మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలపై మేడిగడ్డ వద్ద పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో అన్నారం బ్యారేజీ 5వ బ్లాక్‌లోని 28, 38, 43 పియర్ల వద్ద నెల రోజుల క్రితం ఏర్పడిన సీపేజీ బుంగలను ప్రత్యేక రసాయనంతో గ్రౌటింగ్ చేసి మూసివేశారు. అయితే బుంగలు మళ్లీ ఏర్పడే అవకాశం ఉండటంతో తదుపరి మరమ్మతుల కోసం ప్రభుత్వ ఆదేశాలతో బ్యారేజీలో నీటిని ఖాళీ చేస్తున్నారు. ప్రస్తుతం 2 టీఎంసీల నీరు ఉండగా మొత్తం 66 గేట్లలో పది గేట్లు ఎత్తి 2 వేల క్యూసెక్కుల నీరు దిగువకు వెళ్లేలా చర్యలు తీసుకున్నట్లు ఇంజనీరింగ్ అధికారులు చెపుతున్నారు. నీటిని పూర్తిగా తొలగించిన తర్వాత పార్సన్ అనే సంస్థతో గ్రౌండ్ పెనట్రేషన్‌టెస్ట్ చేయిస్తామన్నారు. ఈ టెస్ట్‌తో 30 మీటర్ల లోతు వరకు పియర్‌ల పునాది ఏవిధంగా ఉందనేది తెలుస్తుందని చెపుతున్నారు. ఈ టెస్టు తరువాత కావాల్సిన మరమ్మతులు చేపడతామని తెలిపారు.

కులగణనకు చట్టబద్ధత కల్పించండి

- కులగణన తీర్మానం కంటితుడుపు చర్య: ఎమ్మెల్సీ కవిత



సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో ఆమోదించిన కులగణన తీర్మానాన్ని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత కంటితుడుపు చర్యగా అభివర్ణించారు. తలాతోక లేని ఈ తీర్మానం పట్ల తాము నిరసన వ్యక్తంచేస్తున్నట్లు చెప్పారు. కులగణన లక్ష్యాలు, బడ్జెట్‌లో కేటాయించిన నిధులు, ఏ సంస్థ ద్వారా గణన జరుగుతుంది అనే అంశాలపై తీర్మానంలో స్పష్టత లేదన్నారు. శనివారం హైదరాబాద్‌లోని తన నివాసంలో ఎమ్మెల్సీ మధుసూదనాచారి, మాజీ మంత్రి పొన్నాల లక్ష్మయ్యతో కలిసి ఆమె మీడియాతో మాట్లాడారు. కులగణనతోపాటు బీసీ సబ్‌ప్లాన్‌కు చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేశారు. బీసీల సంక్షేమం, అభివృద్ధి కోసం ఏటా రూ.20 వేల కోట్లు కేటాయించాలని, అసెంబ్లీ ఆవరణలో మహాత్మా జ్యోతిరావు పూలే విగ్రహాన్ని ఏర్పాటు చేయాలన్నారు. సమగ్ర కుటుంబ సర్వే వివరాలు ఒకే కుటుంబం దగ్గర ఉన్నాయని సీఎం రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను తప్పుబట్టారు. 2011లో దేశవ్యాప్తంగా చేపట్టిన కులగణన వివరాలు గాంధీ కుటుంబం దాచిపెట్టుకుందా? అని ప్రశ్నించారు. ఎమ్మెల్సీ మధుసూదనాచారి మాట్లాడుతూ.. కులగణనపై అనేక అనుమానాలు ఉన్నాయని, వాటిని నివృత్తి చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. మాజీ మంత్రి పొన్నాల లక్ష్మయ్య మాట్లాడుతూ.. దేశంలో కులాలు, పరిపాలన, ఆత్మగౌరవం ప్రాథమిక హక్కుగా గుర్తించి ఆ దిశగా చర్యలు చేపట్టింది కేసీఆర్ మాత్రమేనని చెప్పారు. సమావేశంలో యునైటెడ్‌పూలే ఫ్రంట్ కన్వీనర్ గట్టు రామచందర్ రావు తదితరులు పాల్గొన్నారు.

ఐఎస్‌బీలో స్నాతకోత్సవ సందడి



హైదరాబాద్: గచ్చిబౌలిలోని ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ (ఐఎస్‌బీ)లో శనివారం రాత్రి స్నాతకోత్సవం అట్టహాసంగా నిర్వహించారు. వివిధ కోర్సులు పూర్తి చేసిన 611 మంది విద్యార్థులకు డిగ్రీ సర్టిఫికెట్లు, మెడల్స్‌ను అందజేశారు. ఈ సందర్భంగా తోటి విద్యార్థులు సందడి చేశారు. కార్యక్రమానికి విద్యార్థులతో పాటు తల్లిదండ్రులు హాజరయ్యారు. దీంతో ఐఎస్‌బీ ప్రాంగణమంతా సందడిగా మారింది. భారత్ బయోటెక్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ పద్మభూషణ్ డాక్టర్ కృష్ణా ఎల్లా ముఖ్యఅతిథిగా హాజరయ్యారు.



ఆయన ఆది యందు దేవునియొద్ద ఉండెను. సమస్తమును ఆయన మూలముగా కలిగెను, కలిగియున్నదేదియు ఆయన లేకుండ కలుగలేదు.
- క్రైస్తవ ధర్మం

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిర ఋతువు మాఘ మాసం, **తిథి:** శు.నవమి ప.12.24 వరకు, తదుపరి దశమి, **నక్షత్రం:** రోహిణి ప.1.24 వరకు, తదుపరి మృగశిర, **వర్జ్యం:** రా.7.04 నుండి 8.40 వరకు, **దుర్ముహూర్తం:** సా.4.30 నుండి 5.18 వరకు, **అమృతఘడియలు:** ఉ.10.14 నుండి 11.48 వరకు.

సూర్యోదయం : 6.29
సూర్యాస్తమయం : 5.56
రాహుకాలం : సా.4.30 నుంచి 6.00 వరకు
యమగండం : ప.12.00 నుంచి 1.30 వరకు

కమల్ నాథ్ (కాంగ్రెస్ దిగ్గజం)

రాయని డైరీ

మాధవ్ శింగరాజు

దిగ్విజయ్ సింగ్‌ని నేను 'డిగ్గీ' అంటాను. 'రాజా' అంటాను. 'డిగ్గీరాజా' అంటాను. 'విజయ్' అంటాను. కొన్నిసార్లు 'దిగ్విజయ్' అని కూడా అంటాను.

కానీ మొదటిసారిగా... ఫిబ్రవరి 14న నేనాయన్ని భోపాల్ లో పట్టుకుని 'హే... కృష్ణా' అనేశాను!

ఫిబ్రవరి 9న నేను ఢిల్లీ వెళ్లి సోనియాజీని కలిసి వచ్చాక కూడా... మధ్యప్రదేశ్ నుంచి రాజ్యసభకు ఖాళీ అయిన ఒకే ఒక కాంగ్రెస్ టిక్కెట్‌ను నాకు కాకుండా అశోక్ సింగ్‌కి అనౌన్స్ చేసిన రోజు అది!

అశోక్ సింగ్ 2019 లోక్ సభ ఎన్నికల్లో ఓడిపోయారు. 2014 లోక్ సభ ఎన్నికల్లో ఓడిపోయారు. 2009 లోక్ సభ ఎన్నికల్లో ఓడిపోయారు. 2004 లోక్ సభ ఎన్నికల్లో ఆయన నిలబడలేదు కనుక ఓటమి ఆయన్నుంచి తప్పించుకున్నా ... 2007 లోక్ సభ ఉప ఎన్నికల్లో నిలబడి మళ్లీ ఆయన ఓడిపోయారు. తిరిగి ఆయన ఈ 2024 లోక్ సభ ఎన్నికల్లో కూడా ఓడిపోకుండా ఉండటం కోసం ఆయనకిప్పుడు రాజ్యసభ టికెట్



ఇచ్చినట్లున్నారు!

అశోక్ సింగ్... దిగ్విజయ్ సింగ్ మనిషి

మీనాక్షీ నటరాజన్‌ని కూడా పక్కకు తప్పించి అశోక్ సింగ్‌కి రాజ్య సభ టిక్కెట్ ఇప్పించుకోగలిగారు దిగ్విజయ్! మీనాక్షి రాహుల్ ఫ్రెండ్. రాహుల్ ఫ్రెండ్‌కే దిగ్విజయ్ టిక్కెట్ రాకుండా చేయగలిగారంటే ఎవరికీ ఫ్రెండ్‌ని కాని నేనెంత అనుకోవాలా!

అందుకే ఆయన్ని 'హే... కృష్ణా..' అన్నాను.

దిగ్విజయ్ నవ్వారు.

"ఎవరా... 'హే.. కృష్ణ'.. కమల్నాథ్?" అన్నారు.

"శ్రీకృష్ణ పరమాత్ముడు" అన్నాను... అర్జునుడిలా చేతులు జోడించి.

జోడించిన నా చేతుల్ని ఆపేక్షగా విడదీశారు దిగ్విజయ్.

"తొమ్మిదిసార్లు ఒకే నియోజకవర్గం నుంచి లోక్ సభకు ఎన్నికైన నాయకుడికా, లేక... ఒకే నియోజకవర్గం నుండి ఒక్కసారి కూడా లోక్ సభకు ఎన్నికకాని నాయకుడికా... చెప్పు... ఎవరికిస్తావు రాజ్యసభ టిక్కెట్... నువ్వే కనుక కాంగ్రెస్‌లోని ఎవరైనా ఒక కారుణ్య మూర్తివి అయివుంటే?!" అన్నారు దిగ్విజయ్.

చింద్వారా నుంచి నేను ఒక్కసారి కూడా ఓడకపోవటాన్ని... 'నీకేం కమల్నాథ్' అన్నట్లుగానూ, గ్వాలియర్ నుంచి అశోక్ సింగ్ ఒక్కసారి కూడా గెలవక పోవటాన్ని... 'పాపం.. అశోక్' అన్నట్లుగానూ ఉంది దిగ్విజయ్ మాట్లాడటం!!

"చెప్పు కమల్నాథ్. నువ్వైతే ఏం చేస్తావు?!" అన్నారు దిగ్విజయ్ మళ్లీ.

"నేనే కనుక కాంగ్రెస్‌లోని ఎవరైనా ఒక కారుణ్యమూర్తిని అయివుంటే ఏం చేస్తానో చెప్పలేను గానీ కృష్ణా... దిగ్విజయ్ సింగ్‌ని అయితే మాత్రం రాజ్యసభ టిక్కెట్‌ను అశోక్ సింగ్ కే ఇప్పిస్తాను..." అన్నాను, నవ్వేందుకు ప్రయత్నిస్తూ.

నా ప్రయత్నాన్ని సరిగ్గానే అర్థం చేసుకున్నారు దిగ్విజయ్.

"అశోక్ సింగ్ డిప్రెషన్‌లో ఉన్నాడు కమల్. వరుస ఓటముల కన్నా కూడా ఒక్కరోజైనా పదవిలో లేకపోవటం అతడిని ఎక్కువగా కృంగదీస్తోంది..." అన్నారు.

"నేను కూడా ఇక్కడ డిప్రెసివ్ గానే ఉన్నాను విజయ్. మళ్లీ వెనక్కు వెళ్లిపోదాం అనుకుంటున్నా... జాతీయ రాజకీయాల్లోకి..." అన్నాను.

"జాతీయ రాజకీయాల్లోకి అంటే బీజేపీనే కదా..." అని నవ్వారు దిగ్విజయ్.

"చెప్పలేను. కానీ పార్టీ మారతానని మాత్రం అనిపిస్తోంది..." అన్నాను.

"డెబ్బై ఏడేళ్ల వయసులో పార్టీ మారడం ఉండదు కమల్. పార్టీని వదిలి పెట్టడమే ఉంటుంది" అన్నారు దిగ్విజయ్!

ఆ మాటకు నేను ఆయన వైపు అదేమిటో తెలియని విధానంలో చూశాను.

బహుశా ఆనాడు అర్జునుడు కూడా శ్రీ కృష్ణ పరమాత్ముడిని ఇలాగే చూసి ఉంటాడా!!

విశ్వవిజేతల కార్ఖానా!



జనతంత్రం

వర్ధెల్లి మురళి

తెలుగు ప్రసార మాధ్యమాలు పెద్దగా పట్టించుకోని ఈ వారపు ఘటనల్లో ఎన్నదగ్గవి రెండు: పాఠశాలల్లో ఐబీ సిలబస్‌ను ప్రారంభించేందుకు సన్నాహంగా ఒక బృందం పాఠశాలల పరిశీలనకు బయల్దేరింది. రెండవది - ఏపీ రాష్ట్ర ప్రభుత్వం ఆన్‌లైన్ లెర్నింగ్ సంస్థ ఎడెక్స్‌తో ఒక ఒప్పందం చేసుకున్నది. మొదటిది పాఠశాల విద్యకు సంబంధించినదైతే, రెండోది ఉన్నత విద్యకు సంబంధించిన అంశం. చంద్రబాబు యాచిస్తున్న పొత్తు కౌగిలిని బీజేపీ ప్రసాదిస్తుందా లేదా, జనసైనికులు ఆశిస్తున్న సీట్ల ప్యాకేజీని టీడీపీ అంగీకరిస్తుందా లేదా వగైరా పొలిటికల్ మిర్చి ముందు పై రెండు వార్తలను మీడియా చప్పిడి వార్తలు గానే పరిగణించి ఉండవచ్చు. యెల్లో మీడియా అయితే ఉద్దేశ పూర్వకంగానే విస్మరించింది.

ఎన్నికలు సమీపిస్తున్నకొద్దీ యెల్లో మీడియాలో ఉక్కపోత ఎక్కువైంది. కడుపు ఉబ్బరం పెరిగింది. ఒత్తిడి పెరిగింది. ఫలితంగా దాని వార్తా ప్రాథమ్యాలు మరింత అదుపు తప్పాయి. 'రాజధాని ఫైల్స్' పేరుతో ఓ సినిమాను విడుదల చేశారు. 'ఫైల్స్ కాదు పైల్స్' (మొలలు) అన్నారెవరో! పెత్తందారీ పైల్స్ అనే పేరు పెడితే బాగుండేదన్నారు. యెల్లో మీడియా ఉన్న పరిస్థితికి ఈ సినిమా బాగా కనెక్టయింది. అందుకే యెల్లో మీడియాలో ప్రముఖ వార్తగా మారింది. యెల్లో మీడియాకు తోడయిన ఇంకో కామ్రేడరీ వార్త 'విధ్వంసం' పేరుతో పుస్తకావిష్కరణ. 'కృష్ణశాస్త్రి బాధ ప్రపంచానికి బాధ' అంటారు గదా! అట్లాగే పెత్తందారీ బాధ యెల్లో మీడియా ద్వారా సకల జనులకు బాధ. ఈ రెంటికీ మధ్యనున్న కామ్రేడరీ అనుబంధమే ఆ పుస్తక సారాంశం. కనుక అది కూడా వారికి పెద్ద వార్తే.

స్కూళ్లలో ఐబీ సిలబస్ పెడితే మాత్రం ఏమిటి విశేషం? ఎడెక్స్ ద్వారా కళాశాలల్లో అంతర్జాతీయ సిలబస్‌ను ప్రవేశ పెడితే ఏం ప్రయోజనముంటుంది? ఇటువంటి సందేహాలు కలగడం సహజం. వాటిని గురించి చర్చించడానికి ముందు ప్రస్తుత ప్రపంచ పరిణామ దశ గురించిన ప్రాథమిక అవగాహన మనకు ఉండాలి. టెక్నాలజీ అభివృద్ధి కారణంగా ప్రపంచం ఏకైక గ్లోబల్ మార్కెట్‌గా అవతరిస్తున్నది. ఈ మార్కెట్‌ను ఒకే ఒక వ్యవహారిక భాష నియంత్రించనున్నది. గ్లోబల్ విలేజి గురించి తరచూ మాట్లాడుతుంటారు. మన పూర్వీకులు ఎప్పటి నుంచో 'వసుధైక కుటుంబం' అనే భావనను వ్యాప్తిలోకి తెచ్చారు. ఈ ఏక కుటుంబంలో ఏకైక సంధాన భాష అవసరం కూడా ఏర్పడింది.

ఎలిజర్ బెన్ యెహుదా అనే భాషా శాస్త్రవేత్త ఉండేవారు. ఆయన రష్యాలో పుట్టి పెరిగిన యూదు జాతీయుడు. ప్రపంచమంతా ఒకే భాష మాట్లాడే రోజు వస్తుందనే అభిప్రాయాన్ని వందేళ్లకు పూర్వమే ఆయన ప్రకటించారు. అయితే అది హిబ్రూ భాష కావాలనేది ఆయన కోరిక. అలాగే సంస్కృతానికి గ్లోబల్ భాషయ్యే లక్షణాలున్నాయనే భాషావేత్తలు కూడా చాలామందే ఉన్నారు. కానీ ఇప్పటికే ప్రపంచ భాషగా ఇంగ్లిషు చాలాదూరం వెళ్లిపోయింది. ప్రపంచీకరణ, సాంకేతిక పురోగతి, వలసల కారణంగా ఏర్పడుతున్న సాంస్కృతిక మార్పులన్నీ ఆంగ్లీకరణను వేగవంతం చేస్తున్నాయి.

ఉన్నతమైన జీవనాన్ని ఆకాంక్షించే ప్రతి బాలికా బాలుడు, ప్రతి యువతీ యువకుడు గ్లోబల్ మార్కెట్ లక్ష్యంగా దూసుకొనిపోవలసిన అవసరం ఉన్నది. అలా దూసుకుపోవాలంటే మొదటి అవసరం - ఇంగ్లిషు భాషలో ప్రావీణ్యం. రెండో అవసరం - వేగంగా మారుతున్న టెక్నాలజీల మీద పట్టు సాధించడం. మూడోది - గ్లోబల్ మార్కెట్ అవసరాలకు పనికివచ్చే సబ్జెక్టులను అభ్యసించడం. ఈ అవసరాలను మన పిల్లలు ఎలా సమకూర్చుకోగలరు? ఎవరో పెట్టిపుట్టినవారు, కలవారి పిల్లలు మాత్రమే నెరవేర్చుకోగలిగిన కలలుగా ఇవి కనిపిస్తున్నాయి.

భారతదేశమంతా కలిపి కేవలం 210 అత్యున్నతస్థాయి ప్రైవేట్ పాఠశాలల్లో మాత్రమే ఇప్పుడు ఐబీ సిలబస్‌ను అమలు చేస్తున్నారు. సంపన్నులు మాత్రమే ఆ స్కూళ్ల ఫీజులను భరించగలరు. మనకు అలవాటైన 'భట్టీయం' పద్ధతికి భిన్నంగా ఐబీ విద్యాబోధన ఉంటుంది. మన సంప్రదాయ పద్ధతిలో ఇరవై ఎక్కాలు గడగడ చదివేవారు కూడా సాధారణ లెక్కలు చేయలేకపోవడం మనకు తెలిసిందే. భట్టీయం పద్ధతిలో వివేచన, విశ్లేషణ, ఆలోచనలకు అవకాశం తక్కువ. విమర్శనాత్మకంగా ఆలోచించడం, భిన్నంగా ఆలోచించడం, సమస్యను పరిష్కరించడం వంటి నైపుణ్యాలను ఐబీ పాఠశాలల్లో అలవాటు చేస్తారు. వీటితోపాటు వివిధ రంగాల్లో రాణించేలా ప్రపంచమంతటా

ఉన్నతమైన జీవనాన్ని ఆకాంక్షించే ప్రతి బాలికా బాలుడు, ప్రతి యువతీ యువకుడు గ్లోబల్ మార్కెట్ లక్ష్యంగా దూసు కొనిపోవలసిన అవసరం ఉన్నది. అలా దూసుకుపోవాలంటే మొదటి అవసరం - ఇంగ్లిషు భాషలో ప్రావీణ్యం. రెండో అవసరం - వేగంగా మారుతున్న టెక్నాలజీల మీద పట్టు సాధించడం. మూడోది - గ్లోబల్ మార్కెట్ అవసరాలకు పనికివచ్చే సబ్జెక్టులను అభ్యసించడం. ఈ అవసరాలను మన పిల్లలు ఎలా సమకూర్చుకోగలరు? ఎవరో పెట్టిపుట్టినవారు, కలవారి పిల్లలు మాత్రమే నెరవేర్చుకోగలిగిన కలలుగా ఇవి కనిపిస్తున్నాయి.

భారతదేశమంతా కలిపి కేవలం 210 అత్యున్నత స్థాయి ప్రైవేట్ పాఠశాలల్లో మాత్రమే ఇప్పుడు ఐబీ సిలబస్‌ను అమలు చేస్తున్నారు. సంపన్నులు మాత్రమే ఆ స్కూళ్ల ఫీజులను భరించగలరు. మనకు అలవాటైన 'భట్టీయం' పద్ధతికి భిన్నంగా ఐబీ విద్యాబోధన ఉంటుంది. మన సంప్రదాయ పద్ధతిలో ఇరవై ఎక్కాలు గడగడ చదివేవారు కూడా సాధారణ లెక్కలు చేయలేకపోవడం మనకు తెలిసిందే. భట్టీయం పద్ధతిలో వివేచన, విశ్లేషణ, ఆలోచనలకు అవకాశం తక్కువ. విమర్శనాత్మకంగా ఆలోచించడం, భిన్నంగా ఆలోచించడం, సమస్యను పరిష్కరించడం వంటి నైపుణ్యాలను ఐబీ పాఠశాలల్లో అలవాటు చేస్తారు. వీటితోపాటు వివిధ రంగాల్లో రాణించేలా ప్రపంచమంతటా ఉపాధి, ఉన్నత విద్యావకాశాలు పొందే విధంగా తర్ఫీదు ఉంటుంది. దేశంలో కేవలం 210 బడుల్లో మాత్రమే ఉన్న ఇటువంటి ఖరీదైన ఐబీ విద్యాబోధనను రాష్ట్రంలోని 40 వేల పైచిలుకు ప్రభుత్వ పాఠశాలల్లో దశలవారీగా ప్రవేశపెట్టడానికి ప్రభుత్వం సన్నాహాలు ప్రారంభించింది.

ఉపాధి, ఉన్నత విద్యావకాశాలు పొందే విధంగా తర్ఫీదు ఉంటుంది.

దేశంలో కేవలం 210 బడుల్లో మాత్రమే ఉన్న ఇటువంటి ఖరీదైన ఐబీ విద్యాబోధనను రాష్ట్రంలోని 40 వేల పైచిలుకు ప్రభుత్వ పాఠశాలల్లో దశలవారీగా ప్రవేశపెట్టడానికి ప్రభుత్వం సన్నాహాలు ప్రారంభించింది. ఈ సంవత్సరం ఉపాధ్యాయులకు శిక్షణ ఇస్తారు. వచ్చే సంవత్సరం (2025-26) నుంచి ఒకటో క్లాసులో ఐబీ సిలబస్ ప్రవేశపెడతారు. ఏటా ఒక్కో క్లాసు పెంచుకుంటూ వెళ్తారు. 2037 నాటికి ప్లస్ టూ వరకు ఆంధ్రప్రదేశ్ పాఠశాల విద్యార్థులంతా ఐబీ సిలబస్‌లోనే ఉంటారు.

ప్రపంచ గమనానికి అనుగుణంగా మన ఉన్నత విద్యా కోర్సులు మారలేదన్నది ఒక వాస్తవం. ప్రభుత్వాధినేతలకు ఉండవలసిన దార్శనికత (విజన్) లేకపోవడం ఒక కారణం. అసలు సంకల్పమే లేకపోవడం మరో కారణం. చంద్రబాబు వంటి పెత్తందారీ నాయకులు అసలు విద్యారంగంలో ప్రభుత్వ జోక్యమే అనవసరమనీ, దాన్ని పూర్తిగా ప్రైవేట్ రంగానికే వదిలి వేయాలనీ బహిరంగంగానే ప్రబోధించారు. అందుకు తగ్గట్టుగానే ప్రభుత్వ విద్యారంగం కుప్పకూలిపోయేవిధంగా ఉద్దేశపూర్వకంగా వ్యవహరించారు. ఇప్పుడు జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ప్రారంభించిన సంస్కరణల ఫలితంగా నాణ్యమైన ప్రపంచశ్రేణి విద్య పేద విద్యార్థులందరికీ ప్రభుత్వ రంగంలోనే ఉచితంగా అందుబాటులోకి వచ్చింది. కార్పొరేట్, పెత్తందారీ శక్తులు అందువల్లనే జగన్‌మోహన్‌రెడ్డిని అధికారంలోంచి దింపేయడానికి భయంకరమైన కుట్రను రచించాయి.

ఇప్పుడు గ్రాడ్యుయేషన్ కోర్సులు చేస్తున్న మన విద్యార్థులు ప్రపంచ మార్కెట్‌లో పోటీపడటానికి అనువుగా వారి పాఠ్యాంశాలు, బోధనా ప్రక్రియలు లేవన్నది నిర్వివాదాంశం. వరల్డ్ క్లాస్ స్థాయికి మన కళాశాలలను తీర్చిదిద్దడానికి చాలా సమయం పట్టవచ్చు. అప్పటివరకు ఏటా బయటకొస్తున్న మన పట్టభద్రులంతా అన్యాయానికి గురికావలసిందేనా? అలా జరగకూడదన్న లక్ష్యమే ఎడెక్స్‌తో రాష్ట్ర ప్రభుత్వ ఒప్పందానికి కారణమైంది.

లండన్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్, హార్వర్డ్, కొలంబియా, కేంబ్రిడ్జి, ఎమ్ఐటీ వంటి ప్రతిష్ఠాత్మక గ్లోబల్ వర్సిటీలు అందించే కోర్సులను ఎడెక్స్ ద్వారా మన డిగ్రీ, పీజీ, ఇంజనీరింగ్ విద్యార్థులకు అందుబాటులోకి తేవడం ఈ ఒప్పందంలోని ప్రధానాంశం. విద్యార్థులకు ఈ కోర్సులు ఉచితంగా అందుబాటులోకి వస్తాయి. కరిక్యులమ్‌లో భాగమవుతాయి. ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్, మెషిన్ లెర్నింగ్, డేటా మైనింగ్, డేటా అనలిటిక్స్, వర్చ్యువల్ రియాలిటీ, ఆగ్మెంటెడ్ రియాలిటీ, క్లౌడ్ కంప్యూటింగ్, రిస్క్ మేనేజిమెంట్, రియల్ ఎస్టేట్, లాజిస్టిక్స్, స్టాక్ ఎక్స్ఛేంజ్, వెల్త్ మేనేజిమెంట్ వంటి ఆధునిక కోర్సుల్లో మన దగ్గర ప్రామాణికత లేదు. ఎడెక్స్ ద్వారా ఇందులో వరల్డ్ క్లాస్ కోర్సులను మన విద్యార్థులకు అందుబాటులోకి తెస్తున్నారు. ఈ వర్టికల్స్‌కు సంబంధించిన పరీక్షను ఎంపిక చేసుకున్న గ్లోబల్ యూనివర్సిటీ భాగస్వామ్యంతో నిర్వహిస్తారు. విద్యార్థికి ఆ కోర్సులకు సంబంధించిన క్రెడిట్స్ లభిస్తాయి. గ్లోబల్ మార్కెట్‌లో ఉపాధి పొందడానికి, ఉన్నతమైన విదేశీ విద్యను అభ్యసించడానికి ఈ క్రెడిట్స్ ఉపకరిస్తాయి.

ఈ ప్రయత్నాలు ఇంకో పది పదిహేనేళ్లు నిర్విఘ్నంగా కొనసాగితే మన విద్యార్థులు ప్రపంచ వేదికపై జైత్రయాత్ర చేస్తారు. అత్యున్నత స్థానాలకు ఎగబాకుతారు. వారితోపాటు వారి కుటుంబాలు, గ్రామాలు, రాష్ట్రం, దేశం అభివృద్ధి ఫలాలను అందుకుంటాయి. పేదవాడు అభివృద్ధి చెందడం పెత్తందారీ శక్తులకు నచ్చదు. వారి అభివృద్ధిని ఓర్వలేరు. ఇంతటి విప్లవా

ఈ ప్రయత్నాలు ఇంకో పది పదిహేనేళ్లు నిర్విఘ్నంగా కొనసాగితే మన విద్యార్థులు ప్రపంచ వేదికపై జైత్ర యాత్ర చేస్తారు. అత్యున్నత స్థానాలకు ఎగబాకు తారు. వారితోపాటు వారి కుటుంబాలు, గ్రామాలు, రాష్ట్రం, దేశం అభివృద్ధి ఫలాలను అందుకుంటాయి. పేదవాడు అభివృద్ధి చెందడం పెత్తందారీ శక్తులకు నచ్చదు. వారి అభివృద్ధిని ఓర్వలేరు. ఇంతటి విప్లవాత్మకమైన ప్రగతి శీలతకు విత్తనాలు చల్లుతున్న శుభఘడి యలకు వారి దృష్టిలో ప్రాధాన్యం లేదు. అందుకే అవి వార్తలు కావు. పైపెచ్చు మసిపూయాలి. బురద చల్లాలి. విధ్వంసం జరుగుతున్నదని ఓండ్రపెట్టాలి. అభివృద్ధి ఎక్కడున్నదని మొరగాలి. మూలశంక వ్యాధి వికారాన్ని సినిమాల్లో ప్రదర్శించాలి. ఇప్పుడదే జరుగుతున్నది.

పేదలకు విజ్ఞాన ఫలాలు అందకూడదు, నాణ్యమైన విద్య అందుబాటులో ఉండకూడదనే పెత్తందారుల కుట్ర కేవలం వారి స్వార్థం మాత్రమే కాదు. ఇదొక దేశ ద్రోహ నేరం. దేశాభివృద్ధికి గొడ్డలిపెట్టు. క్రీస్తుశకం రెండో శతాబ్దం నుంచి ఆరేడు శతాబ్దాల మధ్యకాలంలో భారతీయ మేధావులు చేసిన ఆవిష్కరణలు సామాన్యమైనవి కావు. శూన్యాంకాన్ని (జీరో) ప్రసాదించి ప్రపంచ గణిత శాస్త్రాన్ని మలుపుతిప్పిన ప్రతిభాశాలి, గ్రహగతులను, భూభ్రమణాన్ని నిర్ధారించిన మేధావి ఆర్యభట్ట, గణిత ఖగోళ శాస్త్రజ్ఞులైన భాస్కర - బ్రహ్మగుప్త - వరాహ మిహిర, వైద్యశాస్త్ర పితామహుడు చరకుడు, తత్వవేత్త - రసవాద శాస్త్రవేత్త ఆచార్య నాగార్జునుడు, వగైరాలంతా ఆ కాలం జీవించినవారే. కానీ ఆనాటి విజ్ఞానమంతా సంస్కృత భాషకే పరిమితం కావడం, ఆ భాషను నేర్చుకునే అర్హత పిడికెడు మందికే పరిమితం కావడం జాతికి జరిగిన తీరని ద్రోహం.

త్మకమైన ప్రగతిశీలతకు విత్తనాలు చల్లుతున్న శుభఘడియలకు వారి దృష్టిలో ప్రాధాన్యం లేదు. అందుకే అవి వార్తలు కావు. పైపెచ్చు మసిపూయాలి. బురద చల్లాలి. విధ్వంసం జరుగుతున్నదని ఓండ్రపెట్టాలి. అభివృద్ధి ఎక్కడున్నదని మొరగాలి. మూలశంక వ్యాధి వికారాన్ని సినిమాల్లో ప్రదర్శించాలి. ఇప్పుడదే జరుగుతున్నది.

పేదలకు విజ్ఞాన ఫలాలు అందకూడదు, నాణ్యమైన విద్య అందుబాటులో ఉండకూడదనే పెత్తందారుల కుట్ర కేవలం వారి స్వార్థం మాత్రమే కాదు. ఇదొక దేశద్రోహ నేరం. దేశాభివృద్ధికి గొడ్డలిపెట్టు. క్రీస్తుశకం రెండో శతాబ్దం నుంచి ఆరేడు శతాబ్దాల మధ్యకాలంలో భారతీయ మేధావులు చేసిన ఆవిష్కరణలు సామాన్యమైనవి కావు. శూన్యాంకాన్ని (జీరో) ప్రసాదించి ప్రపంచ గణితశాస్త్రాన్ని మలుపుతిప్పిన ప్రతిభాశాలి, గ్రహగతులను, భూభ్రమణాన్ని నిర్ధారించిన మేధావి ఆర్యభట్ట, గణిత ఖగోళ శాస్త్రజ్ఞులైన భాస్కర - బ్రహ్మగుప్త - వరాహమిహిర, వైద్యశాస్త్ర పితామహుడు చరకుడు, సర్జరీ పితామహుడు సుశ్రుతుడు, ఆటమిక్ థియరీని ప్రతిపాదించిన కణాదుడు, తత్వవేత్త - రసవాద శాస్త్రవేత్త ఆచార్య నాగార్జునుడు, ప్రామాణిక అర్థశాస్త్ర రచయిత చాణక్యుడు, యోగశాస్త్ర సృష్టికర్త పతంజలి వగైరాలంతా ఆ కాలంలో జీవించినవారే. కానీ ఆనాటి విజ్ఞాన మంతా సంస్కృత భాషకే పరిమితం కావడం, ఆ భాషను నేర్చుకునే అర్హత పిడికెడు మందికే పరిమితం కావడం జాతికి జరిగిన తీరని ద్రోహం.

విశాల ప్రజానీకానికి విద్య అందుబాటులో ఉండి ఉంటే, సంస్కృతం నిషిద్ధం కాకపోయి ఉంటే ఈ మేధావుల ఆవిష్కరణలు మరింత ఊర్ధ్వగతి పొందేవి. వందలాదిమంది శాస్త్రవేత్తలు ఉద్భవించేవారు. పారిశ్రామిక విప్లవం బ్రిటన్ కంటే రెండు మూడు శతాబ్దాల ముందే భారత్‌లో ప్రభవించేది. మన నెమలి సింహాసనం, మన కోహినూర్ వజ్రం మన దగ్గరే ఉండేవని చెప్పడం చాలా చిన్న విషయం. ఇంకా ఏమేమి జరిగి ఉండేవనేది ఒక అధ్యయనాంశం. ఇప్పుడు కూడా ప్రపంచ భాష ఇంగ్లిష్ నేర్చుకోవద్దనీ, నాణ్యమైన విద్యను అభ్యసించ కూడదనీ పేదవర్గాలను మన పెత్తందార్లు శాసిస్తున్నారు. ఇదే దేశద్రోహం. ఈ దేశద్రోహానికి వ్యతిరేకంగా ఆంధ్రప్రదేశ్ పేద వర్గాల ప్రజలు జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలో యుద్ధానికి సిద్ధమవుతున్నారు. పెత్తందారీ - కార్పొరేట్ శక్తులు జగన్‌మోహన్ రెడ్డికి వ్యతిరేకంగా సకల రాజకీయ పక్షాలను ఏకం చేసి మోహరించేందుకు ప్రయత్నిస్తున్నాయి. 'కుడి ఎడమల డాల్ కత్తులు మెరయగ...' అన్నట్టు అతివాద మితవాద పార్టీలన్నీ ఎవరి దారిలో వారు ఏకైక లక్ష్యంతో పనిచేస్తున్నారు. పెత్తందార్ల సేవలో తరిస్తున్నారు. చివరికి త్యాగాల చరిత గల పతాకాలనూ అపవిత్రం చేస్తున్నారు. పేదవర్గాలు ఈ పరిణామాలను గమనించాయి. సమరోత్సాహంతో నినదిస్తున్నాయి.

vardhelli1959@gmail.com

ప్రమాదపుటంచుల్లో ప్రపంచం

సందర్భం



బి.టి. గోవిందరెడ్డి

పక్కనున్న ఇల్లు తగలబడుతుంటే మనది కాదు కదా అని వదిలేస్తే ఆ మంటలు మన ఇంటినీ కాల్చివేస్తాయి. ఇప్పుడు హమాస్-ఇజ్రాయెల్‌ల మధ్య యుద్ధం ఈ వాస్తవాన్నే నొక్కి చెబుతోంది. రెండేళ్ల క్రితం ఉక్రెయిన్‌లో రష్యా మొదలెట్టిన దురాక్రమణ యుద్ధం ఇంకా చల్లారనే లేదు. ఇంతలో హమాస్ రాజేసిన యుద్ధ జ్వాలలు లెబనాన్ మొదలుకొని జోర్డాన్, సిరియా, ఇరాక్‌ల వరకూ మొత్తం పశ్చిమాసియాను చుట్టుముట్టాయి. ఇదే సమయంలో ఎర్రసముద్రంలో మాటుగాసిన హౌతీ మిలిటెంట్లు అటుగా వచ్చిపోయే భారీ వాణిజ్య నౌకలే లక్ష్యంగా క్షిపణి దాడులు చేయడం ప్రపంచ దేశాలను కలవరపరుస్తోంది.

గత నవంబర్‌లో అయిదువేల కార్లను మోసుకుపోగల 'గెలాక్సీ లీడర్' అనే నౌకపై హెలికాప్టర్‌తో దాడిచేసి, ఆ తర్వాత దాన్ని హైజాక్ చేశారు హౌతీలు. నౌకకు బహమాస్ జెండాయే ఉన్నా అది ఇజ్రాయెల్ కోటీశ్వరుడి షిప్పింగ్ కంపెనీదని హౌతీలు పసిగట్టారు. ఆ తర్వాత ఒక ఫ్రెంచ్ యుద్ధనౌక, ఒక గ్రీక్ నౌక, నార్వే జెండాతో పోతున్న కెమికల్ ట్యాంకర్లున్న నౌక వీరి దాడులకు లక్ష్యంగా మారాయి. మధ్యలో రెండు చైనా, రష్యాల నౌకలపైనా దాడులు జరిగాయి. కానీ పొరపాటైందని హౌతీలు ప్రకటించారు. జనవరి 15న వారు నేరుగా అమెరికా కార్గో నౌకపై దాడి చేశారు. ప్రపంచ నౌకా వాణిజ్యంలో ఇంచుమించు 17 శాతం ఎర్రసముద్రం మీదుగా జరుగుతుందని అంచనా. పర్షియా జలసంధి నుంచి యూరప్‌కు తరలిపోయే చమురు, సహజవాయు ట్యాంకులన్నీ ఎర్రసముద్రం గుండా పోవాల్సిందే. కానీ ఈ దాడుల తర్వాత అందులో చాలా భాగం తగ్గిపోయింది. అనేక సంస్థలు ఆఫ్రికా చుట్టూ తిరిగి నౌకల్ని నడపాలని నిర్ణయించాయి. ఇందువల్ల సరుకు రవాణా వ్యయం భారీగా పెరిగిపోయింది.

ఇరాన్ పెంచి పోషిస్తున్న హౌతీల ఆగడాలు అరికడతామని అమెరికా, బ్రిటన్‌లు రంగంలోకి దిగాయి. అందుకు ఆస్ట్రేలియా, నెదర్లాండ్స్ వంటివి సహకారం అందిస్తున్నాయి. హౌతీ మిలిటెంట్లు క్షిపణులతో, డ్రోన్‌లతో గత ఏడాది అక్టోబర్ 31న ఎర్రసముద్రంలోని ఇజ్రాయెల్ టూరిస్టు రిసార్ట్‌పై బాంబు దాడులు చేశారు. అయితే వాటిని ఇంటర్‌సెప్టర్ల సాయంతో ఇజ్రాయెల్ జయప్రదంగా అడ్డుకోగలిగింది. దాంతో రెండు ఈజిప్టు పట్టణాల్లో పేలుళ్లు సంభవించాయి. ఆ తర్వాత వారు అమెరికా ఎమ్‌క్యూ-9 రీపర్ డ్రోన్‌ను కూల్చారు. సమర్థవంతమైన ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థల సాయంతో హౌతీలు ఎడతెరిపి లేకుండా ప్రయోగిస్తున్న డ్రోన్‌లు, క్షిపణులను అమెరికా, ఇజ్రా



యెల్ అడ్డుకోగలుగుతున్నాయి. కానీ ఎక్కడో తేడా కొట్టి అడపాదడపా నౌకలు బుగ్గిపాలవుతున్నాయి. గత నెల 10న అసంఖ్యాకంగా ఒకేసారి వదిలిన డ్రోన్లలో కొన్ని రక్షణ వ్యవస్థల్ని తప్పించుకెళ్లి అమెరికా యుద్ధ నౌకలోని ముగ్గురు నౌకాదళ సభ్యుల ప్రాణాలు తీశాయి. అమెరికా కూటమి దేశాలు సాగిస్తున్న దాడులు వృథా ప్రయాసగా మిగలటమే కాదు... చివరకు ప్రపంచయుద్ధానికి కూడా దారితీసే ప్రమాదం వుంది.

గాజాపై ఇజ్రాయెల్ దాడులు ఆగేదాకా ఎర్రసముద్రం ప్రశాంతంగా ఉండబోదని హౌతీలు చేసిన ప్రకటనను ప్రపంచదేశాలు సకాలంలో పట్టించుకోవాలి. 2004 మొదలుకొని గత రెండు దశాబ్దాలుగా నిత్యమూ యుద్ధరంగంలో నిలిచిన హౌతీలను తక్కువ అంచనా వేస్తే చేజేతులా వారిని హీరోలను చేసినట్టే! యెమెన్‌లో ఇరాన్-సౌదీ అరేబియాలు సాగించిన ఆధిపత్య పోరు నుంచి పుట్టుకొచ్చిన సంస్థ 'హౌతీ'. మొదట్లో ఒక ముఠా నాయకుడి జేబుసంస్థగా మొదలైన ఈ సంస్థ షియాల్లోని 'జైదీ' తెగ పరిరక్షకురాలిగా అవతరించింది. దక్షిణ, తూర్పు యెమెన్ ప్రాంతాల్లో ప్రాబల్యం ఉన్న సున్నీలపై ఎడతెగని దాడులు చేసి రాజధాని సానాను చేజిక్కించుకున్నారు. ఈలోగా ఇజ్రాయెల్ దుందుడుకు చర్యలు, అందుకు అమెరికా వత్తాసుగా నిలిచిన వైనాలను హౌతీలు స్వీయ ఎదుగుదలకు వాడుకున్నారు. అమెరికా, ఇజ్రాయెల్ నాశనమే తమ ధ్యేయమనీ, వారివల్ల అన్యాయానికి గురవుతున్న ముస్లింలు ఏ వర్గం వారైనా అండగా ఉంటామని హౌతీలు తమ చర్యల ద్వారా ప్రకటిస్తున్నారు. పాలస్తీనాలో సున్నీలు, షియాలు, క్రిస్టియన్లతో సహా భిన్న వర్గాలున్నా అక్కడ సున్నీలదే మెజారిటీ. హౌతీల ఎత్తుగడలను అమెరికా సరిగానే గ్రహించింది. అందుకే జనవరి నెలనుంచి ఇజ్రాయెల్‌కు సామరస్యత, శాంతి ప్రబోధిస్తోంది. కానీ ఆ దేశం వింటే కదా!

హౌతీలు ప్రపంచంలో ఒంటరివారు కారు. వారికి ఇరాన్ అండదండలు పుష్కలంగా ఉన్నాయి. అలాగని వారు ఇరాన్ చెప్పుచేతల్లో ఉండే అవకాశం లేదు. ఎవరైనా తమ ఎదుగుదలకు తోడ్పడే వరకే వారికి మిత్రులు. నచ్చనిది చెప్పిన మరుక్షణం వారు శత్రువుతో సమానం. ఇరాన్‌పై ఎన్ని రకాల ఆంక్షలు విధించినా నానావిధ ఎత్తుగడలతో తనకంటూ మిత్రుల్ని పోగేసుకుంటోంది. హౌతీలకు అది అండదండలు అందివ్వటం వెనక రష్యా, చైనాలు లేకపోలేదు. అందుకే ఆ రెండు దేశాలూ చోద్యం చూస్తూ నిలబడ్డాయి. ఇప్పుడు హౌతీల దుందుడుకుతనాన్ని కట్టడి చేయాలన్నా, కనీసం వారి చర్యల తీవ్రతను తగ్గించాలన్నా ఇరాన్ సాయం అవసరం. రష్యా, చైనాల జోక్యం తప్పనిసరి. ఈ దశలో ప్రతిష్ఠకు పోతే ముున్ముందు మరిన్ని పరాభవాలు తప్పవనీ, ఇది మరో ప్రపంచయుద్ధానికి దారి తీస్తుందనీ అమెరికా, మిత్రదేశాలు గుర్తించాలి.

వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్

విజ్ఞాన ద్వారాలు పుస్తకాలు

పుస్తకాలు చదివే విద్యార్థుల ఆలోచనలూ, మానసిక ప్రవర్తనా పుస్తకాలు చదవని విద్యార్థులతో పోల్చుకుంటే మెరుగ్గా ఉంటాయి. మార్గ సర్వే 2022-23 ప్రకారం అత్యధికంగా పుస్తక పఠనం చేసే దేశాలలో భారతదేశం ముందు ఉన్నప్పటికీ జనాభాతో పోలిస్తే విద్యార్థులలో, యువకులలో ఇది పెరగవలసిన అవసరం ఉంది. దాని కనుగుణంగా ప్రభుత్వ పాఠశాలల్లో, గ్రామాలలో, కళాశాలల్లో విద్యార్థులకు గ్రంథాలయాలు అందుబాటులో ఉంచాలి. సబ్జెక్టుకు సంబంధించిన పుస్తకాలే కాకుండా సమాజ శాస్త్రాలకు సంబంధించిన, విలువలకు సంబంధించిన పుస్తకాలూ అందుబాటులో ఉంచాలి. వాటిని ఉపయోగించుకునే విధంగా విద్యార్థులను ప్రేరేపించాలి.

విద్యార్థులను పుస్తక ప్రదర్శనలకూ, నూతన పుస్తక పరిచయ కార్యక్రమాలకూ, పుస్తక రివ్యూ కార్యక్రమాలకూ, గ్రంథాలయాలకూ తల్లితండ్రులు కానీ, ఉపాధ్యాయులు కానీ తీసుకువెళ్లి పుస్తక పఠన రుచిని కలిగించాలి.


పౌర గ్రంథాలయాలను అన్ని రకాల చదువరులూ ఉపయోగించు కోవాలి. కానీ ప్రస్తుతం పౌర గ్రంథాలయాలను ఎక్కువ భాగం పోటీ పరీక్షలకు సంసిద్ధమయ్యే వారు మాత్రమే ఉపయోగించుకుంటున్నారు. మహిళలకూ, పిల్లలకూ అన్ని మండల, జిల్లా కేంద్రాలలో ఉన్న గ్రంథాలయాలలో ఆ యా విభాగాలు లేకపోవడం, ఒకవేళ ఉన్నా వారికి సంబంధించిన పుస్తక సంపద అందుబాటులో లేకపోవడం గమనార్హం.

ప్రస్తుతం హైదరాబాద్‌లో 36వ పుస్తక ప్రదర్శన జరుగుతుందన్న విషయం తెలిసిందే. ఫిబ్రవరి 19 వరకూ ఎన్టీఆర్ స్టేడియంలో సుమారు 350 స్టాళ్లలో లక్షలాది పుస్తకాలు కొలువుదీరి పాఠకుల మదిని దోస్తున్నాయి. అనేక రకాల పుస్తకాలను ఆ యా స్టాళ్లలో అందుబాటులో ఉంచడం గొప్ప విషయం. చిన్న పిల్లల కథల పుస్తకాలు, కార్టూన్ బొమ్మల పుస్తకాలు మొదలుకొని నవలలు, చరిత్ర, రాజనీతి శాస్త్రం, ఆంగ్లసాహిత్యం, వివిధ పోటీ పరీక్షల పుస్తకాలను అందుబాటులో ఉంచి పుస్తక ప్రియులకు జ్ఞానాన్ని పంచడం అరుదుగా దొరికే అవకాశం.

– డా॥ సుంకరి రాజారామ్, లైబ్రరీ సైన్స్ లెక్చరర్, నల్లగొండ

తమ్ముళ్లూ.. త్యాగాలు..

పొత్తుల్లో పోగా మిగిలిన 100 సీట్లతో సర్దుకుందాం ● చంద్రబాబు వ్యాఖ్యలతో టీడీపీలో హాహాకారాలు



సాక్షి, అమరావతి: ఎన్నికల్లో అందరికీ సీట్లు ఇవ్వలేనని, చాలామంది నాయకులు త్యాగాలకు సిద్ధం కావాలంటూ చంద్రబాబు చేసిన వ్యాఖ్యలతో టీడీపీలో హాహాకారాలు మిన్నంటుతున్నాయి. పోటీకి సిద్ధమైన నాయకులు ఇప్పుడు ఏం చేయాలో తోచక గగ్గోలు పెడుతున్నారు. పొత్తుల కోసం పాకులాడుతూ తమ గొంతు కోస్తున్నారని పలువురు నేతలు బహిరంగంగానే చంద్రబాబుపై ఆక్రోశాన్ని వెళ్లగక్కుతున్నారు. అధికారంలోకి వచ్చిన తర్వాత అందరికీ న్యాయం చేస్తామని చెప్పడంపై మండిపడుతున్నారు. అన్ని సీట్లు వదులుకున్నాక ఇక అధికారం ఎలా వస్తుందని నిర్వేదం వ్యక్తం చేస్తున్నారు. పొత్తులో భాగంగా జనసేనకు 50కిపైగా ఎమ్మెల్యే, మూడు ఎంపీ స్థానాలు, బీజేపీకి 25 ఎమ్మెల్యే, ఏడు ఎంపీ స్థానాలు ఇవ్వక తప్పదని టీడీపీలో పది రోజులుగా చర్చ జరుగుతోంది. మొత్తం 75 ఎమ్మెల్యే, పది ఎంపీ స్థానాలను టీడీపీ ఆ రెండు పార్టీలకు వదిలేయాల్సిన పరిస్థితి నెలకొంది. మిగిలిన వంద ఎమ్మెల్యే, 15 ఎంపీ స్థానాల్లో మాత్రమే టీడీపీ పోటీ చేయాల్సి ఉంటుంది. వాటిలోనే నేతలు సర్దుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇదే విషయాన్ని చంద్రబాబు శుక్రవారం రాత్రి టెలీకాన్ఫరెన్స్‌లో నాయకులందరికీ స్పష్టంగా చెప్పారు.

మానసికంగా సిద్ధం చేస్తున్న బాబు

సీట్ల సర్దుబాటుపై చంద్రబాబు బహిరంగంగా మాట్లాడకుండా గుంభనంగా వ్యవహరిస్తున్నారు. జనసేనతో పొత్తు గురించి పలు సందర్భాల్లో ప్రస్తావించినా... సీట్లపై మాత్రం నోరు మెదపలేదు. పొత్తు కోసం ఢిల్లీ వెళ్లి అమిత్ షా శరణు కోరిన తర్వాత బీజేపీ ఎన్ని సీట్లు అడిగితే అన్ని ఇచ్చేందుకు చంద్రబాబు సిద్ధమయ్యారు. టీడీపీ నేతలను మానసికంగా సిద్ధం చేసేందుకు టెలీకాన్ఫరెన్స్ నిర్వహించి తొలిసారి సీట్ల సర్దుబాటు గురించి చర్చించారు. పొత్తుల వల్ల అందరికీ సీట్లు ఇవ్వడం కుదరదని, సర్దుకుపోవాలని బాంబు పేల్చారు. చంద్రబాబు వ్యాఖ్యలతో టీడీపీ నేతలు ఒక్కసారిగా డీలా పడిపోయారు. జిల్లాల వారీగా ఎవరి సీట్లు ఎగిరిపోయే జాబితాలో ఉన్నాయో ఆరా తీస్తూ భగ్గుమంటున్నారు. బీజేపీ, జనసేనకు అన్ని సీట్లు ఇవ్వడానికి ఎలా ఒప్పుకున్నారని టీడీపీ నేతలు వాపోతున్నారు. చంద్రబాబు తాను, తన కుటుంబ ప్రయోజనాల కోసం పార్టీని పణంగా పెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. టీడీపీని బీజేపీ కాళ్ల కింద పెడుతున్నారని, ఎన్టీఆర్ పెట్టిన పార్టీకి, చంద్రబాబు నడుపుతున్న పార్టీకి సంబంధం లేదని కృష్ణా జిల్లాకు చెందిన ఓ సీనియర్ నేత వ్యాఖ్యానించారు.

సీనియర్లకు ఎసరు..

సిట్టింగ్ ఎమ్మెల్యేలందరికీ టికెట్లు ఇస్తానని గతంలో చంద్రబాబు హామీ ఇవ్వటాన్ని సీనియర్ నేత, రాజమండ్రి రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి పదేపదే మీడియా ఎదుట ప్రస్తావిస్తున్నారు. తన సీటుకు ఢోకా లేదని ఆయన చెప్పుకుంటున్నా... జనసేనకు కేటాయించి బుచ్చయ్యకు చంద్రబాబు ఝలక్ ఇవ్వడం ఖాయంగా కనిపిస్తోంది. పలువురు మాజీ మంత్రుల సీట్లు కూడా ఎగిరిపోయే జాబితాలో ఉన్నాయి. భూమా అఖిలప్రియ, గంటా శ్రీనివాసరావు, చింతకాయల అయ్యన్నపాత్రుడు, ఆలపాటి రాజా, బొండా ఉమా తదితర నేతల సీట్లు గల్లంతు కానున్నాయి. తమ అనుభవాన్ని, ఆర్థిక బలాన్ని పరిగణనలోకి తీసుకోవాలని, ఎన్నో ఏళ్లుగా తాము పోటీ చేస్తున్న స్థానాలను వేరే పార్టీకి ఇవ్వడం తగదని సీనియర్ నేతలు వాపోతున్నారు.

ఎన్నారై నేతల ఆందోళన

సీట్లు ఆశ చూపించి కొందరు ఎన్నారై, పారిశ్రామికవేత్తలను రంగంలోకి దించిన చంద్రబాబు వారితో నియోజకవర్గాల్లో భారీగా ఖర్చు చేయించారు. విజయవాడలో కేశినేని చిన్ని, గుంటూరులో ఉయ్యూరు శ్రీనివాస్, భాష్యం ప్రవీణ్, కాకినాడలో సానా సతీష్, నెల్లిమర్లలో బంగ్రాజు తదితరులను పార్టీ కోసం వాడుకున్నారు. వారంతా ఇప్పుడు తమ పరిస్థితి ఏమిటని నిలదీస్తున్నారు. ఇన్నాళ్లూ పార్టీ కోసం కష్టపడి డబ్బులు ఖర్చు చేశామని, ఇప్పుడు తమను నట్టేట ముంచవద్దని వేడుకుంటున్నారు.

ఒంటరి పోరుకు ససేమిరా..

పొత్తులు లేకపోతే పార్టీ ఉనికే ప్రశ్నార్థకమవుతుందంటూ నేతలను చంద్రబాబు బుజ్జగించే ప్రయత్నం చేస్తున్నారు. ఇప్పుడున్న పరిస్థితుల్లో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఒంటరిగా ఎదుర్కోవడం అసాధ్యమని, బీజేపీ, జనసేన పార్టీలను కూడగడితేగానీ తలపడలేమని స్పష్టం చేస్తున్నారు. టీడీపీ నేతలు మాత్రం అధినేత అభ్యర్థనను ఆలకించేందుకు నిరాకరిస్తున్నారు.

'పూర్వగిరి'ఆలయంలో తిరుమంజనం


స్వామి వారిని ఊరేగిస్తున్న ఆచార్యులు

యాదగిరిగుట్ట: యాదాద్రి ఆలయానికి అనుబంధంగా కొనసాగుతున్న శ్రీపూర్వగిరి(పాతగుట్ట) లక్ష్మీనరసింహస్వామి దేవాలయం అధ్యయనోత్సవాల్లో మూడో రోజు శనివారం తిరుమంజన మహోత్సవం, పురప్పాట్ సేవను ఆలయ అర్చక బృందం ఆధ్వర్యంలో జరిపించారు. సాయంత్రం శ్రీస్వామివారి నిత్యారాధనలు నిర్వహించి ప్రత్యేకంగా అలంకరించిన సేవపై శ్రీస్వామి అమ్మవార్లను అధిష్టించారు. ఈ అధ్యయనోత్సవాలు ఆదివారం ముగియనున్నట్లు అర్చకులు వెల్లడించారు.

రేపు మే నెల శ్రీవారి ఆర్జిత సేవా టికెట్లు విడుదల

తిరుమల(అలిపిరి): తిరుమల శ్రీవారి ఆర్జిత సేవా టికెట్లకు సంబంధించిన మే నెల కోటాను ఈ నెల 19న ఉదయం 10 గంటలకు టీటీడీ ఆన్‌లైన్‌లో విడుదల చేయనుందని ఈవో ఏవీ ధర్మారెడ్డి ప్రకటించారు. ఈ సేవా టికెట్ల ఎలక్ట్రానిక్ డిప్ కోసం 21వ తేదీ ఉదయం 10 గంటల వరకు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవచ్చు. అదేరోజు మధ్యాహ్నం 12 గంటలకు లక్కీడిప్‌లో టికెట్లు మంజూరవుతాయి. అలాగే కల్యాణోత్సవం, ఊంజల్ సేవ, ఆర్జిత బ్రహ్మోత్సవం, సహస్ర దీపాలంకార సేవా టికెట్ల కోటాను 22న ఉదయం 10 గంటలకు విడుదల చేస్తారు. వర్చువల్ సేవలు, వాటి దర్శన స్లాట్లకు సంబంధించిన మే నెల కోటాను మధ్యాహ్నం 3 గంటలకు విడుదల చేయనున్నారు. శ్రీవాణి ట్రస్టు టికెట్లకు సంబంధించిన మే నెల ఆన్‌లైన్ కోటాను ఈ నెల 23వ తేదీ ఉదయం 11 గంటలకు విడుదల చేస్తారు. అలాగే మే నెలకు సంబంధించిన అంగప్రదక్షిణం టోకెన్ల కోటాను ఉదయం 10 గంటలకు విడుదల చేయనుంది. వయోవృద్ధులు, దివ్యాంగులు, దీర్ఘకాలిక వ్యాధులున్నవారు తిరుమల శ్రీవారిని దర్శించుకునేందుకు వీలుగా మే నెల ఉచిత ప్రత్యేక దర్శనం టోకెన్ల కోటాను మధ్యాహ్నం 3 గంటలకు విడుదల చేస్తారు. మే నెలకు సంబంధించిన ప్రత్యేక ప్రవేశ దర్శన టికెట్ల కోటాను ఈ నెల 24న ఉదయం 10 గంటలకు, తిరుమల, తిరుపతిలో మే నెల గదుల కోటాను మధ్యాహ్నం 3 గంటలకు విడుదల చేస్తారు. ఈ నెల 27న ఉదయం 11 గంటలకు శ్రీవారి సేవ, మధ్యాహ్నం 12 గంటలకు నవనీత సేవ, మధ్యాహ్నం 2 గంటలకు పరకామణి సేవ కోటాను విడుదల చేయనున్నారు.

విజయసాయిరెడ్డికి సంసద్ మహారత్న అవార్డు

పురస్కారం అందించిన తెలంగాణ గవర్నర్ తమిళిసై


టీజీ వెంకటేశ్, విజయసాయిరెడ్డిలకు అవార్డు ప్రదానం చేస్తున్న గవర్నర్ తమిళిసై

సాక్షి, న్యూఢిల్లీ: వైఎస్సార్‌సీపీ పార్లమెంటరీ పార్టీ నేత వి.విజయసాయిరెడ్డి సంసద్ మహారత్న అవార్డును అందుకున్నారు. ఉత్తమ పనితీరు కనబరిచిన పార్లమెంటేరియన్లకు ఏటా ఇచ్చే సంసద్ రత్న అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమం శనివారం ఢిల్లీలోని మహారాష్ట్ర సదన్‌లో జరిగింది. రవాణా, పర్యాటక, సాంస్కృతిక శాఖల పార్లమెంటరీ స్థాయీ సంఘం చైర్మన్ హోదాలో ప్రతిష్టాత్మకమైన సంసద్ మహారత్న అవార్డును ఎంపీ విజయసాయిరెడ్డి, ఇదే స్థాయీ సంఘం మాజీ చైర్మన్ టీజీ వెంకటేశ్‌లకు తెలంగాణ గవర్నర్ తమిళిసై సౌందర్‌రాజన్, హోం శాఖ సహాయ మంత్రి అజయ్ కుమార్ మిశ్రా, జాతీయ బీసీ కమిషన్ చైర్మన్ హన్స్‌రాజ్ ఆహిర్, సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ సంజయ్ కిషన్ కౌల్ ప్రదానం చేశారు. 17వ లోక్‌సభ కాలంలో టూరిజం, రవాణా, సాంస్కృతిక శాఖల పార్లమెంట్ స్టాండింగ్ కమిటీ చైర్మన్‌గా అత్యుత్తమ పనితీరుకుగాను విజయసాయిరెడ్డి ఈ అవార్డును అందుకున్నారు. సంసద్ రత్న, సంసద్ మహారత్న, సంసద్ ఉత్కృష్ట మహారత్న అవార్డులను అధీర్ రంజన్ చౌదరి, భతృహరి మహతా, సుప్రియా సూలే, శ్రీకాంత్ ఏక్‌నాథ్ షిండే, హీనా గవిట్, జయంత్ సిన్హా, గద్ది గౌడ, సుధీర్ గుప్తా, అమోల్ రాంసింగ్ కొల్హే, రాజేశ్‌శర్మ తదితరులు అందుకున్నారు.

అప్పుడే దేశం అభివృద్ధి చెందుతుంది: తమిళిసై

ఈ సందర్భంగా తెలంగాణ గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ మాట్లాడుతూ.. మహిళలకు అన్ని రంగాల్లో సరైన అవకాశాలు కల్పించాలని అన్నారు. పురుషులతో పాటు మహిళలకు సమాన ప్రాతినిధ్యం కల్పించినప్పుడే దేశం మరింత అభివృద్ధి చెందుతుందని పేర్కొన్నారు. చట్టసభల్లో మహిళలకు రిజర్వేషన్లు కల్పించే చట్టం చేయడం చరిత్రాత్మకమని అన్నారు. పార్లమెంట్‌లో జరిగే చర్చల ఆధారంగా చట్టాల ఉద్దేశం తెలుస్తుందని ఆమె అభిప్రాయపడ్డారు.

నేరడలో ఆర్‌కేఆర్ అంత్యక్రియలు

నివాళులర్పించిన పలువురు ప్రముఖులు

చిట్యాల: ప్రగతి శీల మహిళా సంఘం(పీఓడబ్ల్యూ) జాతీయ కన్వీనర్ వి.సంధ్య భర్త రామకృష్ణారెడ్డి (ఆర్‌కేఆర్) అంత్యక్రియలు శనివారం నల్లగొండ జిల్లా చిట్యాల మండలం నేరడ గ్రామంలోని తన వ్యవసాయ క్షేత్రంలో నిర్వహించారు. నేరడ గ్రామంలో రామకృష్ణారెడ్డి భౌతికకాయం వద్ద శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి నివాళులర్పించారు. ఆర్‌కేఆర్ అంత్యక్రియలకు సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు పోతినేని సుదర్శన్, రాష్ట్ర కమిటీ సభ్యుడు బండి రమేశ్, జిల్లా కమిటీ సభ్యులు జిట్ట నగేష్, అవిశెట్టి శంకరయ్య, రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు దుబ్బాక నర్సింహారెడ్డి, పీఓడబ్ల్యూ రాష్ట్ర కార్యదర్శి సుభద్ర, ఏపీ రాష్ట్ర నాయకురాలు పద్మ, న్యూడెమోక్రసీ రాష్ట్ర నాయకులు సాధినేని వెంకటేశ్వర్లు వివిధ ప్రజాసంఘాల నాయకులు హాజరయ్యారు.


ఆర్‌కేఆర్ భౌతిక కాయం వద్ద నివాళులర్పిస్తున్న మండలి చైర్మన్ గుత్తా

అంగన్‌వాడీల వేతన వెతలు!

▶ మొదటి పేజీ తరువాయి

అందిస్తోంది. వీరికి ఏడాదికి రూ.850 కోట్లు బడ్జెట్‌లో కేటాయిస్తున్నారు.

బడ్జెట్ లేదంటూ...

ప్రస్తుతం మూడు నెలలుగా టీచర్లు, హెల్పర్లకు వేతనాలు నిలిచిపోయాయి. బడ్జెట్ సమస్యతో వేతనాలు నిలిచిపోయాయంటూ కమిషనరేట్ అధికారులు చెబుతున్నారు. ప్రస్తుతం ఫైలు ఆర్థిక శాఖ వద్ద పెండింగ్‌లో ఉందని, అది పరిష్కారమైతేనే వేతనాలు విడుదలవుతాయని అంటున్నారు. అయితే ఎన్నిరోజుల్లో సమస్యకు పరిష్కారం దక్కుతుందో యంత్రాంగం వద్ద కూడా స్పష్టత లేదు.

ప్రతినెలా ఒకటో తేదీనే చెల్లించాలి

అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లకు ప్రతి నెలా ఒకటో తేదీనే గౌరవవేతనం అందించాలి. ప్రభుత్వ ఉద్యోగులకు ఇస్తున్నట్లుగా అదేరోజు చెల్లించాలి. మూడు నెలలుగా జీతాలు ఇవ్వకపోవడంతో చాలామంది అప్పులు చేయాల్సిన పరిస్థితి వచ్చింది. గతంలో సమ్మె చేసిన కాలానికి సంబంధించిన బకాయిలను కూడా వెంటనే చెల్లించాలి.

– టీకుమల్ల సమ్మయ్య, తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు

వైఎస్సార్‌సీపీ ఎన్నారై విభాగాల నియామకం

సాక్షి, అమరావతి: వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పలు ఎన్నారై విభాగాలకు కమిటీలను ప్రకటించారు. ఈ మేరకు శనివారం పార్టీ కేంద్ర కార్యాలయం ఒక ప్రకటన విడుదల చేసింది. 10 మందితో బహ్రెయిన్ కమిటీని నియమించారు. కన్వీనర్‌గా చామంతి బలరామరాజు, కో– కన్వీనర్లుగా డి.సురేష్, వి.శివ రాజు, ఎం.ఇస్మాయిల్‌లకు బాధ్యతలు అప్పగించారు. వైఎస్సార్‌సీపీ కెనడా కమిటీని 47 మందితో, యూరోపియన్ కమిటీని 78 మందితో, గల్ఫ్ కౌన్సిల్ కంట్రీస్(జీసీసీ) కమిటీని పది మందితో, కువైట్ కమిటీని 17 మందితో, మలేషియా కమిటీని 33 మందితో, న్యూజిలాండ్ కమిటీని 27 మందితో, ఖతార్ కమిటీని 34 మందితో, సింగపూర్ కమిటీని 49 మందితో, యూఏఈ కమిటీని 47 మందితో, యూకే కమిటీని 34 మందితో, ఆస్ట్రేలియా కమిటీని 79 మందితో నియమించారు. ఆస్ట్రేలియా కమిటీ కన్వీనర్‌గా సి.సూర్యనారాయణ, కో కన్వీనర్‌గా ఎల్.రాజశేఖర్‌లకు బాధ్యతలు అప్పగించారు.

గరం మసాలా!

ఘాటెక్కిన రేటు

- వెల్లుల్లి కిలో రూ.480
- యాలకులు రూ.2,600
- లవంగాలు రూ.900
- జీలకర్ర రేట్లకు రెక్కలు
- భగ్గుమంటున్న బియ్యం
- కూరగాయలు కుతకుత
- సామాన్యులు విలవిల
- గాడితప్పిన నెలవారీ బడ్జెట్
- భారీగా తగ్గిన దిగుమతులు
- ధరలపై అందుకే ప్రభావం



సాక్షి, హైదరాబాద్: సగటుజీవి నెలవారీ ఆదాయం ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉండగా.. నిత్యావసరాల ధరలు మాత్రం నింగినంటుతున్నాయి. వంటింట్లోకెళదామంటే కాసింత ధైర్యం కూడగట్టుకోవాల్సిన పరిస్థితి. కుటుంబాన్ని నెట్టుకురావాలంటే బడ్జెట్ ఏ మూలకూ సరిపోవడంలేదు. ఈ రోజు ఉన్న రేటు రేపు ఉండడం లేదు. కిరాణా షాపులో వారం క్రితం కొన్న సామగ్రి రేటు మరో వారానికి మారిపోతోంది. ధరలు పెరగడమే తప్ప తగ్గే సూచనలు ఏమాత్రం కనిపించడం లేదు. పెరిగిన ధరలతో ఒక్కో కుటుంబంపై నెలకు రూ.1000 నుంచి రూ.1500 వరకు అదనపు భారం పడుతోంది. దీంతో సామాన్య, మధ్యతరగతి ప్రజలు ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు.

ఘాటెక్కి.. హీటెక్కి..

కొన్ని నెలలుగా గరం మసాలా ఘాటెక్కింది. కేరళలో వరదల ప్రభావంతో ఇలాచీతో పాటు విదేశాల నుంచి ఇతర మసాలాల దినుసుల దిగుమతులు తగ్గడంతో ధరలు విపరీతంగా పెరిగాయి. గత మూడు నెలల్లో దాదాపు అన్ని మసాలాల ధరలు విపరీతంగా పెరిగాయని హోల్‌సెల్ వ్యాపారులు అంటున్నారు. దీంతో యాలకుల ధర కేజీ రూ. 2,600కు చేరింది. మిరియాలు రూ. 800, లవంగాలు రూ.900, జీలకర్ర రూ.220కు చేరాయి.

వామ్మో.. వెల్లుల్లి..

- నగరంలో వెల్లుల్లి ధరలు విపరీతంగా పెరిగాయి. నగర మార్కెట్లకు సరఫరా తగ్గడంతో ప్రస్తుతం కిలో వెల్లుల్లి రూ.480కి చేరుకుంది. హోల్‌సేల్ మార్కెట్‌కు వెల్లుల్లిని రవాణా చేసే ట్రక్కులు, టెంపోల సంఖ్య గణనీయంగా తగ్గుతోంది, సుమారు 15 వాహనాలు మాత్రమే వస్తున్నాయని వ్యాపారులు చెబుతున్నారు. సాధారణంగా మార్కెట్‌కు 24 నుంచి 30 వాహనాలు వస్తాయని హోల్‌సేల్ వ్యాపారులు తెలిపారు. పర్యవసానంగా దాదాపు 40 శాతం వెల్లుల్లి సరఫరా తగ్గడమే ధరల పెరుగుదలకు ప్రాథమిక కారణమని మార్కెట్ అధికారులు చెబుతున్నారు.
- గతేడాది మే నెల తొలినాళ్లలో కిలో వెల్లుల్లి ధర రూ.30 నుంచి రూ.60 వరకు పలికింది. పోయిన నెల వరకు కూడా కేజీ రూ. 160 ఉందని వర్షాకాలంలో దిగుబడి తగ్గడంతో ధరలు పెరిగినట్లు సమాచారం. అక్టోబర్, నవంబర్‌లలో కురిసిన అకాల వర్షాలతో పంటలు దెబ్బతిన్నాయి. ముఖ్యంగా వెల్లుల్లి అధికంగా పండించే రాజస్థాన్‌లో వెల్లుల్లి ధర పెరిగింది. ఈ ప్రభావం దేశ వ్యాప్తంగా పడిందని తెలుస్తోంది. రానున్న రోజుల్లో వెల్లుల్లి ధర మరింత పెరిగే అవకాశం ఉంది.

రైస్.. రైజ్..

గతంలో ఎన్నడూ లేని విధంగా గ్రేటర్‌లో బియ్యం ధరలు రికార్డు స్థాయిలో పలుకుతున్నాయి. నాణ్యమైన సన్న బియ్యం కిలోకు రూ. 65 నుంచి రూ. 70కి పైగానే చెల్లించాల్సి వస్తోంది. డిమాండ్ కంటే ఎక్కువ బియ్యం మార్కెట్‌కు వచ్చినా ధరలు మాత్రం తగ్గడం లేదు.

కూర'గాయాలే'..

నగరంలో అన్ని కూరగాయలు (టమాటాలు మినహా) కిలోకు రూ.80– 120 వరకు రిటైల్ మార్కెట్‌లో ధరలు పలుకుతున్నాయి. ఆశించిన స్థాయిలో దిగుబడులు లేకపోవడంతో రాజధాని అవసరాలకు సరిపడా కాయగూరలు, ఆకు కూరలు రావడంలేదు. దీంతో కూరగాయల ధరలకు రెక్కలొచ్చాయి. ప్రధానంగా బోయిన్‌పల్లి, గుడిమల్కాపూర్, ఎల్‌బీ నగర్, మాదన్నపేట, సికింద్రాబాద్ మోండా మార్కెట్‌లకు కూరగాయల సరఫరా 60 శాతానికి పడిపోయింది. కొన్ని రకాల కూరగాయలు మండీల జాబితా నుంచి కనుమరుగయ్యాయంటే పరిస్థితి ఎంత దయనీయంగా ఉందో అర్థం చేసుకోవచ్చు.

ఎస్‌బీఐ చీఫ్ మేనేజర్ అరెస్ట్

నిబంధనలకు విరుద్ధంగా రుణాల మంజూరు


తిగుళ్ల ప్రవీణ్

హైదరాబాద్: సస్పెన్షన్‌లో ఉన్న స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా చీఫ్ మేనేజర్ తిగుళ్ల ప్రవీణ్‌ను నగర సీసీఎస్ పోలీసులు అరెస్ట్ చేశారు. గన్ ఫౌండ్రీలోని స్టేట్ బ్యాంక్ ఆఫీసర్స్ కో ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీకి చెందిన బై-లాస్‌ను ఉల్లంఘించి, నిబంధనలకు విరుద్ధంగా సొసైటీలో సభ్యులు కాని వారికి రూ.1.42 కోట్ల మేర రుణాలు మంజూరు చేశారు. దీంతో కోట్ల రూపాయలు రుణాలు సొసైటీ అనుమతి లేకుండా ఇవ్వడంపై ఉన్నతాధికారులు గతంలో సీసీఎస్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేసిన పోలీసులు తిగుళ్ల ప్రవీణ్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు నగర సహాయ కమిషనర్ రంగనాథ్ తెలిపారు.

अड्डొస్తే తొక్కుకుంటూ పోతా

'ఇంకొల్లు రా.. కదలి రా' సభలో రెచ్చిపోయిన చంద్రబాబు

సాక్షి ప్రతినిధి, బాపట్ల: తనను అడ్డుకునేందుకు ఎవరైనా వస్తే తొక్కుకుంటూ పోతా అంటూ టీడీపీ అధినేత చంద్రబాబు రెచ్చిపోయి ప్రసంగించారు. పోలీసులూ జాగ్రత్తగా ఉండాలంటూ హెచ్చరించారు. శనివారం బాపట్ల జిల్లా పర్చూరు నియోజకవర్గం ఇంకొల్లులో జరిగిన రా.. కదలి రా సభలో ఆయన మాట్లాడారు. చిల్లర రాజకీయాలు వద్దు... నా రాజకీయాల ముందు నువ్వొక బచ్చా, మీ నాన్నే నా దెబ్బకు భయపడ్డాడు అంటూ సీఎం వైఎస్ జగన్‌పై రెచ్చిపోయి మాట్లాడారు. తమను గెలిపిస్తే ప్రజలకు చేసే మేలేమిటో చెప్పకుండా, అధికార పార్టీపైన, సీఎం జగన్‌పైన అడ్డగోలు విమర్శలు చేయడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తాయి. చంద్రబాబు ప్రేలాపనలతో విసిగిపోయిన జనం.. బాబు ప్రసంగం మొదలైన కొద్దిసేపటికే ఇవేమి మాటలంటూ ఆయనపై విమర్శలు చేయడం మొదలెట్టారు. బహిరంగ వేదికపై బాబు మాటలు, విన్యాసాలకు విసిగిపోయి, ఈ వయస్సులో తిట్లదండకమేంటంటూ లేచి వెళ్లిపోయారు. చంద్రబాబు ప్రసంగం పూర్తయ్యే వరకు ఉండాలంటూ టీడీపీ నేతలు బ్రతిమాలినా, పట్టించుకోకుండా వెళ్లిపోయారు. దీంతో కొద్దిసేపటికే కుర్చీలు ఖాళీ అయ్యాయి.

పెద్దమ్మ తల్లికి వేడుకగా అవభృత స్నానం

హైదరాబాద్: జూబ్లీహిల్స్ పెద్దమ్మ తల్లి ఆలయ వార్షిక రథ మహోత్సవాలు ఈ నెల 14 నుంచి 17వ వరకు అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఆఖరు రోజున అమ్మవారికి పుష్కరిణిలో అవభృత స్నానం చేయించారు. ఈ ఘట్టాన్ని అత్యంత వైభవంగా జరిపారు. ఈ సందర్భంగా భక్తులు పెద్ద సంఖ్యలో విచ్చేసి ఈ ఘట్టాన్ని తిలకించి పులకించారు.


సునేత్ర

బారామతిలో ప'వార్'!

శరద్‌పవార్ కుమార్తె సుప్రియా సూలేపై భార్య సునేత్రను పోటీకి దింపే యోచనలో అజిత్ పవార్

సార్వత్రిక సమరంలో వదినా మరదళ్లలో గెలుపెవరిది?


సుప్రియా సూలే

ఎవరీ సునేత్రా?

అజిత్ భార్యగా తప్పితే రాజకీయ వర్గాల్లో ఎవరికీ తెలియని పేరు సునేత్ర. ఆమె చాలా సంవత్సరాలుగా సామాజిక కార్యక్రమాల్లో నిమగ్నమయ్యారు. శరద్‌పవార్‌కు ఒకప్పటి సన్నిహిత నేత, మాజీ మంత్రి పద్మసిన్హా పాటిల్ చెల్లెలే ఈమె. ప్రత్యక్ష రాజకీయాలు ఈమెకు కొత్త. ఎన్విరాన్‌మెంట్ ఫోరమ్ ఆఫ్ ఇండియా పేరిట ఒక ఎన్‌జీవోను సునేత్ర నడుపుతున్నారు. సేంద్రీయ వ్యవసాయం, సేంద్రీయ ఎరువుల వినియోగాన్ని ఈమె అమితంగా ప్రోత్సహిస్తున్నారు. పర్యావరణహిత గ్రామాల స్థాపనకు కృషిచేస్తున్నారు. ప్రముఖ విద్యాసంస్థ 'విద్యా ప్రతిష్ఠాన్'కు ట్రస్టీగా ఉన్నారు. ఫ్రాన్స్‌లోని మేథో సంస్థ వరల్డ్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ ఫోరమ్‌లో 2011 నుంచి భాగస్వామిగా కొనసాగుతున్నారు. అయితే ఈమె మెల్లిగా ప్రచారకార్యక్రమాలు మొదలెట్టినట్లు తెలుస్తోంది. 2019లో సుప్రియాపై పోటీచేసి ఓడిపోయిన బీజేపీ మహిళా అభ్యర్థి కంచన్ రాహుల్ కౌల్‌ను ఈవారమే కలిసి చర్చించారని వార్తలొచ్చాయి. అజిత్, సునేత్రలకు ఇద్దరు కుమారులు. జై పవార్, పార్థపవార్. 2019లో మావాల్ లోక్‌సభ స్థానం నుంచి పోటీచేసి పార్థపవార్ ఓటమిని చవిచూశారు.

ఎన్సీపీ పార్టీని చీల్చి బీజేపీ ప్రభుత్వంలో చేరి ఉపముఖ్యమంత్రి పదవి చేపట్టిన అజిత్ పవార్.. తన భార్యను రాజకీయ అరంగేట్రం చేయిస్తున్నారా? అందులోనూ దిగ్గజ నేత శరద్‌పవార్ కుమార్తె, సిట్టింగ్ ఎంపీ సుప్రియా సూలే ప్రాతినిధ్యం వహిస్తున్న 'బారామతి' నుంచే బరిలో దింపుతున్నారా? అంటే ఎన్సీపీ వర్గాలు అవుననే అంటున్నాయి. ఈ వార్తలను బలం చేకూరుస్తూ ఇప్పటికే కొన్ని చోట్ల 'బారామతి ఎంపీ సునేత్రా పవార్' అంటూ భారీ హోర్డింగ్‌లనూ పెట్టేశారు. ఇక అధికారికంగా ప్రకటించడమే తరువాయి అనే పుకార్లు బారామతి నియోజకవర్గంలో షికార్లుచేస్తున్నాయి. అసలు సునేత్రా పేరు తెరమీదకు ఎందుకొచ్చింది? అనే ప్రశ్నకు ఆమె భర్త అజిత్ వ్యాఖ్యల్లో సమాధానం దొరుకుతుంది. శుక్రవారం జరిగిన ఓ కార్యక్రమంలో డెప్యూటీ సీఎం అజిత్ పవార్ భావోద్వేగంతో చేసిన ప్రసంగం ఈ వార్తలకు బలం చేకూర్చింది. బారామతి లోక్‌సభ స్థానం నుంచి ఎవరిని నిలపబోతున్నారో ఆయన స్పష్టంగా చెప్పకపోయినా.. 'ఈసారి బారామతిలో కొత్త అభ్యర్థిని నిలుపుతాం. తొలిసారి పోటీచేస్తున్న అభ్యర్థి.. మన భవిష్యత్ తరాల సంక్షేమం కోసం అవిశ్రాంతంగా పనిచేయగలరు. కొందరు 'పాత' భావోద్వేగాలతో ఓటేయాలని మిమ్మల్ని అడుగుతారు. పట్టించుకోకండి. జరగబోయే నిరంతర అభివృద్ధిని మాత్రమే దృష్టిలో పెట్టుకోండి. మొదటిసారి పోటీచేస్తున్నా ఆశీర్వదించండి. అభివృద్ధిని గెలిపించండి' అని పిలుపునిచ్చారు. వెంటనే భార్య సునేత్రనే ఆయన రంగంలోకి దింపబోతున్నారని భావించిన ఎన్సీపీ పార్టీ వర్గాలు ఆ నియోజకవర్గం ప్రధాన కూడళ్లలో భారీ హోర్డింగ్‌లు పెట్టేశాయి. కాబోయే ఎంపీ సునేత్రా పవార్ అని రాసి ఉన్న ఫ్లెక్సీలతో బారామతిలో అప్పుడే ఎన్నికల కోలాహలం మొదలైంది. శరద్‌పవార్ కుటుంబానికి కంచుకోట ఈ నియోజకవర్గం. ఇక్కడ ఎన్సీపీ దిగ్గజ నేత శరదపవార్ కూతురు సుప్రియా సూలే సిట్టింగ్ ఎంపీగా కొనసాగుతున్నారు. 2009 ఏడాది నుంచి అప్రతిహతంగా ఆమె జైత్రయాత్ర కొనసాగుతోంది. ఆమెను ఢీకొట్టాలంటే తమ కుటుంబానికే చెందిన మహిళా అభ్యర్థి అయితేనే ఎన్నికల రణరంగంలో నెగ్గుకు రాగలరని అజిత్ పవార్ భావిస్తున్నారు. అందుకే భార్యను బరిలో నిలుపుతున్నట్లు తెలుస్తోంది. అయితే ఎన్సీపీ పార్టీని అజిత్ పవార్ చీల్చిన నేపథ్యంలో పార్టీ ఓటర్లు సైతం రెండు వర్గాలుగా చీలే అవకాశముంది. అప్పుడు సుప్రియా, సునేత్రలలో ఎవరు గెలుపు తలుపు తట్టగలరో వేచి చూడాల్సిందే.

\- సాక్షి, నేషనల్ డెస్క్

కంచుకోట బారామతి

పవార్‌ల కుటుంబానికి పుణె జిల్లాలోని బారామతి పెట్టనికోట. గత 55 సంవత్సరాలుగా ఇక్కడ వీరిదే హవా. తొలిసారిగా మహారాష్ట్ర శాసనసభ ఎన్నికల్లో 1967లో బారామతి ఎమ్మెల్యే నియోజకవర్గం నుంచి పోటీచేసి శరద్‌పవార్ గెలిచారు. తర్వాత 1972, 1978, 1980, 1985, 1990 అసెంబ్లీ ఎన్నికల్లోనూ ఇదే స్థానంలో ఘన విజయం సాధించారు. ఇదే బారామతి లోక్‌సభ స్థానం నుంచీ శరద్‌పవార్ 1984, 1996, 1999, 2004 ఎన్నికల్లో విజయఢంకా మోగించారు. అజిత్ పవార్ సైతం 1991లో ఇదే లోక్‌సభ స్థానం నుంచి ప్రాతినిధ్యం వహించారు. ఇక్కడి నుంచి అజిత్ ఏకంగా ఏడుసార్లు ఎమ్మెల్యేగా గెలిచారు. ప్రస్తుతం బారామతి ఎమ్మెల్యే అజితే. 2009 నుంచి సుప్రియా సూలే ఇక్కడ ఎంపీగా గెలుస్తూ వస్తున్నారు. ఇక్కడ ఈసారి సునేత్రను దింపితే స్పష్టంగా 'పవర్'ప్లే మొదలైనట్లే. పెదనాన్న కొడుకైన అజిత్.. సుప్రియాకు అన్నయ్య అవుతారు. ఆ లెక్కన వదినా, మరదళ్ల పోరులో గెలుపెవరిదో చూడాలి మరి!

'కమలం' చెంతకు కమల్‌నాథ్?

- కుమారుడు సైతం పార్టీ మారొచ్చంటూ పుకార్లు
- కొట్టిపారేసిన మధ్యప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి

న్యూఢిల్లీ/భోపాల్: మధ్యప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, కాంగ్రెస్ సీనియర్ నేత కమల్‌నాథ్ హస్తం పార్టీకి గుడ్‌బై చెప్పబోతున్నారంటూ వార్తలు గుప్పుమన్నాయి. అయితే అలాంటిదేమీ లేదని కమల్‌నాథ్ ఆ వార్తలను కొట్టిపారేశారు. అయితే శనివారం జరిగిన పరిణామాలు చూస్తుంటే ఆయన బీజేపీ కండువా కప్పుకోవడం ఖాయంగా కనిపిస్తోందని విశ్లేషణలు వినవచ్చాయి.

అసలేం జరిగింది?

కమల్‌నాథ్‌కు మాజీ మీడియా సలహాదారు, ప్రస్తుత బీజేపీ అధికార ప్రతినిధి అయిన నరేంద్ర సలూజా.. కమల్‌నాథ్, ఆయన కుమారుడు, ఛింద్వారా కాంగ్రెస్ ఎంపీ నకుల్‌నాథ్‌లతో దిగిన భోపాల్‌లో దిగిన ఒక ఫొటోను 'ఎక్స్'లో పోస్ట్‌చేసి దానికి 'జై శ్రీరామ్' అని ట్వీట్‌చేశారు. దీంతో తండ్రీకొడుకులు కమలం గూటికి చేరుకుంటున్నారని వార్తలు మొదలయ్యాయి. వీటికి బలం చేకూరుస్తూ నకుల్‌నాథ్ తన 'ఎక్స్(పాత ట్విట్టర్)' ఖాతా వివరాల్లో కాంగ్రెస్ పదాన్ని తొలగించారు. ముందస్తు షెడ్యూల్ లేకుండా హడావుడిగా ఇద్దరూ ఢిల్లీకి వచ్చారు. రాగానే మీడియా కమల్‌ను ప్రశ్నించింది. మీరు పార్టీ మారుతున్నారా? అన్న ప్రశ్నకు ''అలాంటిదేమైనా ఉంటే ముందు మీకే చెబుతా' అని అన్నారుగానీ పార్టీని వీడట్లేదనే సమాధానం చెప్పలేదు. దీంతో అనుమానాలు మరింత బలపడ్డాయి. రాజ్యసభ సీటు ఆశించి భంగపడినందుకే కమల్‌నాథ్ పార్టీని వీడుతున్నారని మరో విశ్లేషణ వినిపించింది. బీజేపీలోకి వస్తామంటే ఇప్పుడే మీకు స్వాగతం పలుకుతామని మధ్యప్రదేశ్ బీజేపీ చీఫ్ వీడీ శర్మ శుక్రవారం వ్యాఖ్యానించడం తెల్సిందే. గత ఏడాది మధ్యప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ పేలవ ప్రదర్శనకు కమల్‌నాథ్ బాధ్యుడని రాహుల్ భావిస్తున్నారని, అందుకే కమల్‌ను తప్పించి జీతూ పట్వారీకి కాంగ్రెస్ మధ్యప్రదేశ్ చీఫ్ పదవి కట్టబెట్టారని వార్తలొచ్చాయి.

అన్నీ అసత్యాలు : జీతూ పట్వారీ

ఇలాంటి వార్తలను కాంగ్రెస్ మధ్యప్రదేశ్ అధ్యక్షుడు జీతూ పట్వారీ తోసిపుచ్చారు. ''కాంగ్రెస్‌తో కమల్‌నాథ్ బంధం ఈనాటిది కాదు. ఇందిరాగాంధీ తనయుడు సంజయ్



గాంధీతో కలిసి డెహ్రాడూన్ డూన్ స్కూల్‌లో చదివారు. ఒకానొక సమయంలో కమల్ నా మూడో కుమారుడు అంటూ స్వయంగా ఇందిరాగాంధీనే వ్యాఖ్యానించారు. అలాంటి వ్యక్తి కాంగ్రెస్‌ను వీడుతారా?'' అని మీడియానే పట్వారీ నిలదీశారు. ''రాజ్యసభ సీటు ఇవ్వలేదన్నది అవాస్తం. నిజానికి ఆ స్థానం కోసం నామినేషన్ వేసిన పార్టీ కోశాధికారి అశోక్‌సింగ్ పేరును బలపరిచింది కమల్‌నాథే'' అని పట్వారీ వివరణ ఇచ్చారు. దశాబ్దాలుగా కాంగ్రెస్‌తో అనుబంధమున్న కమల్ ఛింద్వారా నుంచి తొమ్మిదిసార్లు ఎంపీగా గెలిచారు. 2019లో ఆ స్థానం నుంచి కమల్ కుమారుడు నకుల్ గెలిచారు. ఈ ఒక్క స్థానం తప్ప రాష్ట్రంలోని మిగతా 28 ఎంపీ స్థానాలను బీజేపీ కైవసం చేసుకుంది.

గుల్జార్, రామభద్రలకు జ్ఞానపీఠ్

న్యూఢిల్లీ: ప్రముఖ ఉర్దూ కవి గుల్జార్, సంస్కృత పండితుడు జగద్గురు రామభద్రాచార్య ప్రతిష్ఠాత్మక 58వ జ్ఞానపీఠ్ పురస్కారానికి ఎంపికయ్యారు. జ్ఞానపీఠ్ ఎంపిక కమిటీ శనివారం ఈ విషయం వెల్లడించింది. 2023వ సంవత్సరానికి గాను ఈ ఇద్దరు ప్రముఖులకు అవార్డు ఇవ్వాలని నిర్ణయించినట్లు తెలియజేసింది. 2022వ సంత్సరానికి గాను గోవా రచయిత దామోదర్ మౌజోకు జ్ఞానపీఠ్ లభించింది. ప్రసిద్ధ బాలీవుడ్ సినీ రచయిత, ఉర్దూ కవి సంపూరణ్ సింగ్ కాల్రా అలియాస్ గుల్జార్(89)ను ఇప్పటికే ఎన్నో పురస్కారాలు వరించాయి. 2002లో సాహిత్య అకాడమీ అవార్డు స్వీకరించారు. 2013లో దాదాసాహెబ్ ఫాల్కే, 2004లో పద్మ భూషణ్ పురస్కారం అందుకున్నారు. ఐదు సార్లు జాతీయ ఫిలిం అవార్డు పొందారు. స్లమ్‌డాగ్ మిలియనీర్, మాచీస్, ఓంకారా, దిల్ సే, గురు వంటి చిత్రాల్లో ఆయన రాసిన పాటలు విమర్శకుల ప్రశంసలు అందుకున్నాయి. స్లమ్‌డాగ్ మిలియనీర్‌లోని 'జై హో' పాటకు 2009లో ఆస్కార్ అవార్డు దక్కింది.


గుల్జార్


రామభద్రాచార్య


దామోదర్ మౌజో
(2022 గ్రహీత)

బహుముఖ ప్రజ్ఞాశాలి రామభద్రాచార్య

ఉత్తరప్రదేశ్‌లో జన్మించిన జగద్గురు రామభద్రాచార్య(74) మధ్యప్రదేశ్‌లోని చిత్రకూట్‌లో తులసీ పీఠాన్ని స్థాపించారు. రామానంద పరంపరలో ప్రస్తుతం ఉన్న నలుగురు జగద్గురువుల్లో ఆయన కూడా ఒకరు. రెండు నెలల వయసులో ఇన్ఫెక్షన్ వల్ల కంటి చూపు కోల్పోయారు. ఐదేళ్ల వయసులోనే భగవద్గీతను, ఎనిమిదేళ్ల వయసులో రామచరితమానస్‌ను కంఠస్తం చేశారు. రామభద్రాచార్య బహుముఖ ప్రజ్ఞాశాలిగా పేరుగాంచారు. 22 భాషల్లో మాట్లాడగలరు. సంస్కృతం, హిందీ, అవధీ, మైథిలీ తదితర భాషల్లో రచనలు చేశారు. 240కిపైగా పుస్తకాలు రాశారు.2015లో కేంద్ర ప్రభుత్వం ఆయనను పద్మవిభూషణ్ పురస్కారంతో సత్కరించింది.

100 రోజులు.. 370 స్థానాలు

ఢిల్లీలో బీజేపీ జాతీయ కార్యవర్గ సమావేశాలు ప్రారంభం

- సార్వత్రిక ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా పార్టీ శ్రేణులకు అగ్రనేతల దిశానిర్దేశం
- ప్రతి బూత్‌లో అదనంగా 370 ఓట్లు సాధించాలని ప్రధాని మోదీ పిలుపు
- ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచన

సాక్షి, న్యూఢిల్లీ: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ముచ్చటగా మూడోసారి 370 నియోజవర్గాల్లో గెలుపే లక్ష్యంగా ముందుకు సాగాలని బీజేపీ జాతీయ కార్యవర్గ సమావేశాల్లో అగ్రనేతలు దిశానిర్దేశం చేశారు. బీజేపీ సొంతంగానే 370 స్థానాలు, బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయే కనీసం 400 స్థానాలు దక్కించుకోవడానికి రాబోయే వంద రోజులు కష్టపడి పనిచేయాలని వెల్లడించారు. గడిచిన పదేళ్ల కాలంలో కేంద్రంలో నరేంద్ర మోదీ ప్రభుత్వం అమలు చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలతో ప్రపంచవ్యాప్తంగా భారత్‌కు లభిస్తున్నగౌరవాన్ని విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లడానికి కృషి చేయాలని పార్టీ నేతలకు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. బీజేపీ జాతీయ కార్యవర్గ సమావేశాలు శనివారం ఢిల్లీలోని భారత్ మండపంలో ప్రారంభమయ్యాయి. మరో మూడు నెలల్లోగా జరగనున్న లోక్‌సభ ఎన్నికల్లో ఘన విజయమే లక్ష్యంగా వ్యూహారచన చేస్తున్నారు. తొలిరోజు భేటీకి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్రం హోంశాఖ మంత్రి అమిత్ షా, బీజేపీ జాతీయ అధ్యక్షుడు జగత్ ప్రకాశ్ నడ్డా, పలువురు కేంద్ర మంత్రులు, బీజేపీ పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు, ఎంపీలు, కోర్ కమిటీ సభ్యులు, ఇతర సీనియర్ నేతలు సహా 11 వేల మందికి పైగా ప్రతినిధులు ఈ సమావేశానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వ విజయాలను తెలిలియజేసే ఎగ్జిబిషన్‌ను ప్రధాని మోదీ, నడ్డా తదితరులు తిలకించారు. అనంతరం పలువురు ముఖ్యనేతలు ప్రసంగించారు. ఎన్నికల్లో గెలుపు లక్ష్యాలు, ప్రచార వ్యూహాలపై మార్గనిర్దేశం చేశారు.

ముఖర్జీకి నిజమైన నివాళి: మోదీ

వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో సొంతంగా 370 సీట్లు గెలుచుకోవడమే బీజేపీ లక్ష్యమని ప్రధాని మోదీ పునరుద్ఘాటించారు. శనివారం బీజేపీ జాతీయ ఆఫీసు-బేరర్ల భేటీలో ఆయన ప్రసంగించారు. జమ్మూకాశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తి కల్పిస్తూ రాజ్యాంగంలో చేర్చిన ఆర్టికల్ 370ని జనసంఘ్ వ్యవస్థాపకుడు శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ తీవ్రంగా వ్యతిరేకించారని గుర్తుచేశారు. రాబోయే ఎన్నికల్లో 370 స్థానాలు సాధించడమే మనం ఆయనకు ఇచ్చే నిజమైన నివాళి అని పేర్కొన్నారు. ఈ లక్ష్యాన్ని సాధించడానికి 100 రోజుల ప్రణాళిక ప్రకారం కార్యకర్తలు బూత్ స్థాయిలో పనిచేయాలని సూచించారు. ప్రతి బూత్‌లో కొత్తగా 370 ఓట్లు అధికంగా బీజేపీకి లభించేలా చూడటంతోపాటు కొత్త ఓటర్లను ఆకర్షించాలని చెప్పారు.


సమావేశంలో ప్రధాని మోదీకి పూలమాల వేస్తున్న జేపీ నడ్డా

తెలంగాణలోనూ అధికారంలోకి వస్తాం: జేపీ నడ్డా

ప్రధాని మోదీ నాయకత్వంలో పదేళ్ల కాలంలో బీజేపీ అనేక విజయాలు సాధించిందని జేపీ నడ్డా అన్నారు. 2014లో 5 రాష్ట్రాల్లో బీజేపీ అధికారంలో ఉండగా, ప్రస్తుతం 12 రాష్ట్రాల్లో బీజేపీ, 17 రాష్ట్రాల్లో ఎన్డీయే అధికారంలో ఉందని గుర్తుచేశారు. పశ్చిమ బెంగాల్‌లో బీజేపీకి 10 శాతం ఓట్లు పెరిగాయని చెప్పారు. కొన్ని నెలల క్రితం జరిగిన ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీకి ఓట్ల శాతం గణనీయంగా పెరిగిందని, మూడు రాష్ట్రాల్లో విజయం సాధించామని తెలిపారు. తెలంగాణ ఎన్నికల్లో ఓడిపోయినా పార్టీ పరంగా గెలిచామని అన్నారు. రాష్ట్రంలో తమ ఎమ్మెల్యేల సంఖ్య ఒక్కటి నుంచి 8కి, ఓట్ల శాతం 7.1 నుంచి 14కు పెరిగిందని వెల్లడించారు. తెలంగాణను వదిలిపెట్టబోమని, అక్కడ అధికారంలోకి వస్తామని, అందుకు ప్రణాళికలు తయారవుతున్నాయని పేర్కొన్నారు. అయోధ్యలో రామమందిర ప్రాణప్రతిష్ఠ సందర్భంగా దేశ ప్రజలంతా దీపాలు వెలిగించినా, ప్రతిపక్ష నేతలు మాత్రం ఈ మహత్కార్యానికి దూరంగా ఉన్నారని విమర్శించారు.

తెలంగాణ, ఏపీ నుంచి భారీగా హాజరైన నేతలు

బీజేపీ జాతీయ కార్యవర్గ సమావేశాలకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుంచి బీజేపీ నేతలు భారీగా హాజరయ్యారు. తెలంగాణ నుంచి రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డితో పాటు జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ, ప్రధాన కార్యదర్శి బండి సంజయ్, ఎంపీ కె.లక్ష్మణ్‌లతో పాటు సీనియర్ నేతలు ఈటల రాజేందర్, పొంగులేటి సుధాకర్‌రెడ్డి, మర్రి శశిధర్‌రెడ్డి, బూర నర్సయ్యగౌడ్, కూన శ్రీశైలం గౌడ్, కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్యే కాటేపల్లి వెంకటరమణారెడ్డి హాజరయ్యారు. ఆంధ్రప్రదేశ్ నుంచి రాష్ట్ర బీజేపీ అధ్యక్షురాలు పురందేశ్వరి, సీనియర్ నేతలు సోము వీర్రాజు, కిరణ్‌కుమార్‌రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, సత్యకుమార్, కిలారు దిలీప్ హాజరయ్యారు.

జీఎస్ఎల్‌వీ-ఎఫ్14 సక్సెస్

సూళ్లూరుపేట(తిరుపతి జిల్లా): భారత అంతరిక్ష పరిశోధన సంస్థ(ఇస్రో) జియో సింక్రనస్ లాంచింగ్ శాటిలైట్ వెహికల్ (జీఎస్ఎల్‌వీ-ఎఫ్14) ప్రయోగాన్ని విజయవంతంగా నిర్వహించింది. శ్రీహరికోటలోని సతీశ్ ధావన్ స్పేస్ సెంటర్ 'షార్'లోని రెండో ప్రయోగ వేదిక నుంచి శనివారం సాయంత్రం 5.35 గంటలకు రాకెట్ నింగిలోకి దూసుకెళ్లింది. శుక్రవారం మధ్యాహ్నం 2.05 గంటలకు కౌంట్‌డౌన్ ప్రారంభమైంది. 27.30 గంటల అనంతరం నిర్దేశిత సమయానికి రాకెట్ ప్రయోగం చేపట్టారు. ఈ ప్రయోగంలోని మొత్తం మూడు దశలు విజయవంతమయ్యాయి. 2,275 కిలోల బరువు కలిగిన ఇన్‌శాట్-3డీఎస్ సమాచార ఉపగ్రహాన్ని భూమికి దగ్గరగా 170 కిలోమీటర్లు(పెరిజీ), భూమికి దూరంగా 36,647 కిలోమీటర్ల(అపోజీ) జియో ట్రాన్స్‌ఫర్ ఆర్బిట్ (భూబదిలీ కక్ష్య)లో ప్రవేశపెట్టారు. ఇన్‌శాట్-3డీఎస్‌లో నింపిన 1,250 కిలోల ఇంధనాన్ని దశల వారీగా మండించి, మరో రెండు మూడు రోజుల్లో భూమికి 36 వేల కిలోమీటర్ల ఎత్తులోని జియో ఆర్బిట్(భూ స్థిరకక్ష్య)లోకి ఉపగ్రహాన్ని ప్రవేశపెడతారు.

ఏమిటీ ఇన్‌శాట్-3డీఎస్?

దేశంలో సమాచార వ్యవస్థను మరింత బలోపేతం చేయడానికి ఇన్‌శాట్-3డీఎస్ ఉపగ్రహాన్ని ప్రయోగించారు. వాతావరణ పరిస్థితులపై పరిశోధనలు, విపత్తుల గురించి ముందస్తు సమాచారం అందించడానికి ఈ ఉపగ్రహం తోడ్పడనుంది. దీంతో వాతావరణంపై అంచనాల్లో మరింత స్పష్టత రానుంది. ఇన్‌శాట్-3, ఇన్‌శాట్-3ఆర్ ఉపగ్రహాలకు అనుసంధానంగా మూడో తరం ఇన్‌శాట్-3డీఎస్ ఉపగ్రహం పని చేస్తుంది. ఇప్పటిదాకా ఇన్‌శాట్ శ్రేణిలో 23 ఉపగ్రహాలను ప్రయోగించారు. ఇన్‌శాట్-3డీ, ఇన్‌శాట్-3డీఆర్ శాటిలైట్లకు కొనసాగింపుగా ఇన్‌శాట్-3డీఎస్‌ని అభివృద్ధి చేశారు. ఇందులో ఆరు చానెల్ ఇమేజర్స్, 19 చానెల్ సౌండర్స్‌తోపాటు మెట్రోలాజికల్ పేలోడ్స్, కమ్యూనికేషన్ పేలోడ్స్‌ను అమర్చారు. వాతావరణ పరిశీలనతోపాటు భూమి, సముద్ర ఉపరితలాల అధ్యయనం కోసం అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో ఈ ఉపగ్రహాన్ని రూపొందించారు. ఇది ఐదేళ్ల నుంచి పదేళ్ల దాకా సేవలు అందించనుంది.



త్వరలో నిస్సార్ ప్రయోగం: సోమనాథ్

నాసా-ఇస్రో సింథటిక్ అపార్చర్ రాడార్(నిస్సార్) మిషన్ అనే జాయింట్ ఆపరేషన్ ఉపగ్రహాన్ని ఈ ఏడాది జూన్‌లో జీఎస్ఎల్‌వీ-ఎఫ్15 రాకెట్ ద్వారా ప్రయోగించనున్నట్లు ఇస్రో చైర్మన్ సోమనాథ్ చెప్పారు. పీఎస్ఎల్‌వీ-సీ59, ఎస్ఎస్ఎల్‌వీ-డీ3, జీఎస్ఎల్‌వీ-ఎఫ్15 ప్రయోగాలతో పాటు కర్ణాటకలోని చిత్రదుర్గ నుంచి ఆర్ఎల్‌వీ-టీడీ-2 ప్రయోగం కూడా నిర్వహించబోతున్నట్లు ఎస్.సోమనాథ్ తెలిపారు.

ట్రంప్‌కు 3 వేల కోట్ల జరిమానా



న్యూయార్క్: అమెరికా మాజీ అధ్యక్షుడు, రిపబ్లికన్ పార్టీ నేత డొనాల్డ్ ట్రంప్‌కు వరుసగా ఎదురుదెబ్బలు తగులుతున్నాయి. రెండోసారి అధ్యక్ష పదవి దక్కించుకోవాలని ఆరాటపడుతున్న ఆయనకు కొత్త కష్టాలు వచ్చిపడుతున్నాయి. తప్పుడు ఆర్థిక పత్రాలతో బ్యాంకులను, బీమా సంస్థలను మోసం చేసిన కేసులో న్యూయార్క్ కోర్టు ట్రంప్‌కు శుక్రవారం 364 మిలియన్ డాలర్ల (రూ.3,020 కోట్లు) జరిమానా విధించింది. తన ఆదాయం, ఆస్తుల విలువను వాస్తవ విలువ కంటే కాగితాలపై అధికంగా చూపించి, బ్యాంకులు, బీమా సంస్థల నుంచి చౌకగా రుణాలు, బీమా పొందడంతోపాటు ఇతరత్రా ఆర్థికంగా లాభపడినట్లు ట్రంప్‌పై ఆరోపణలు వచ్చాయి. బ్యాంకులు, బీమా సంస్థలను మోసగించినట్లు కేసు నమోదైంది. న్యూయార్క్ అటార్నీ, జనరల్ డెమొక్రటిక్ పార్టీ నేత జేమ్స్ కోర్టులో దావా వేశారు. దీనిపై న్యాయస్థానం రెండున్నర నెలలపాటు విచారణ జరిపింది. ట్రంప్‌పై వచ్చిన అభియోగాలు నిజమేనని తేల్చింది. ట్రంప్ నిర్వాకం వల్ల బ్యాంకులు, ఇన్సూరెన్స్ కంపెనీలు నష్టపోయినట్లు గుర్తించింది. ఈ కేసులో ట్రంప్‌నకు 355 మిలియన్ డాలర్లు, ఆయన ఇద్దరు కుమారులు ఎరిక్ ట్రంప్, డొనాల్డ్ ట్రంప్ జూనియర్‌కు 4 మిలియన్ డాలర్ల చొప్పున, ట్రంప్ మాజీ చీఫ్ ఫైనాన్షియల్ ఆఫీసర్‌కు ఒక మిలియన్ డాలర్ల జరిమానా విధిస్తూ న్యూయార్క్ కోర్టు న్యాయమూర్తి తీర్పు వెలువరించారు. అంటే ట్రంప్ మొత్తం 364 మిలియన్ డాలర్ల జరిమానా చెల్లించాల్సి ఉంటుంది. అలాగే న్యూయార్క్‌కు చెందిన ఏ సంస్థలోనూ ఆయన డైరెక్టర్ లేదా ఆఫీసర్‌గా ఉండకూడదని న్యాయమూర్తి ఆదేశించారు. ఇది సివిల్ కేసు కావడంతో ట్రంప్‌కు జైలు శిక్ష విధించడం లేదని స్పష్టం చేశారు. న్యూయార్క్ కోర్టు తీర్పుపై ఉన్నత న్యాయస్థానంలో అప్పీల్ చేస్తామని ట్రంప్ తరఫు న్యాయవాదులు చెప్పారు.

కోర్టులో వర్చువల్‌గా హాజరైన కేజ్రీవాల్

సాక్షి, న్యూఢిల్లీ: ఎన్నిసార్లు సమన్లు జారీచేసినా గైర్హాజరవుతున్న ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ వైఖరిపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ కోర్టుకెక్కిన నేపథ్యంలో కేజ్రీవాల్ చివరకు కోర్టు ఎదుట వర్చువల్‌గా హాజరయ్యారు. ఢిల్లీ అసెంబ్లీలో రాష్ట్ర బడ్జెట్ సమావేశాలు ఉన్నందున కోర్టుకు స్వయంగా రాలేనని ఆయన అంతకుముందు పెట్టుకున్న అభ్యర్థనను కోర్టు మన్నించింది. దీంతో ఆయన శనివారం ఢిల్లీ సిటీ కోర్టులో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వర్చువల్ విధానంలో కోర్టు విచారణకు హాజరయ్యారు. కేసు తదుపరి విచారణను జడ్జి మార్చి 16వ తేదీకి వాయిదావేశారు.

సుప్రీంకు వెళతాం: శరద్ పవార్

బారామతి(మహారాష్ట్ర): నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ(ఎన్సీపీ) విషయంలో కేంద్ర ఎన్నికల సంఘం, మహారాష్ట్ర అసెంబ్లీ స్పీకర్ తీసుకున్న నిర్ణయం అన్యాయపూరితమని ఆ పార్టీ వ్యవస్థాపకుడు శరద్ పవార్ శనివారం పేర్కొన్నారు. దీనిపై తాము సుప్రీంకోర్టును ఆశ్రయిస్తామన్నారు. డిప్యూటీ సీఎం అజిత్ పవార్ సారథ్యంలోని చీలికవర్గమే అసలైన ఎన్సీపీ అని, పార్టీ పేరు, ఎన్నికల గుర్తును కూడా అజిత్ పవార్ వర్గానికే కేటాయిస్తూ ఈసీతోపాటు స్పీకర్ నర్వేకర్ ఇటీవల నిర్ణయం తీసుకున్న విషయం తెలిసిందే.

బాణసంచా ఫ్యాక్టరీలో పేలుడు..10 మంది మృతి

సాక్షి, చెన్నై: తమిళనాడు రాష్ట్రం విరుధునగర్‌లో బాణసంచా ఫ్యాక్టరీలో సంభవించిన పేలుడులో నలుగురు మహిళలు సహా 10 మంది ప్రాణాలు కోల్పోయారు. వెంబకొట్టై ప్రాంతంలోని కుండయిరుప్పులో నిర్వహిస్తున్న బాణసంచా తయారీ యూనిట్ కెమికల్ మిక్సింగ్ రూంలో శనివారం మధ్యాహ్నం పేలుడు చోటుచేసుకుంది. ఘటనలో నలుగురు మహిళలు, ఆరుగురు పురుషులు చనిపోగా మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. మానవతప్పిదం వల్లే ప్రమాదం జరిగి ఉండొచ్చని కలెక్టర్ జయశీలన్ చెప్పారు.

తండ్రి సహా 12 మందిని చంపేశాడు!

టెహ్రాన్: ఇరాన్‌లో ఓ వ్యక్తి దారుణానికి ఒడిగట్టాడు. తండ్రి, సోదరుడు సహా మొత్తం 12 మంది కుటుంబసభ్యులను పొట్టనబెట్టుకున్నాడు. కెర్మాన్ ప్రావిన్స్‌లో ఈ ఘటన చోటుచేసుకున్నట్లు ఇరాన్ మీడియా శనివారం తెలిపింది. 30 ఏళ్ల వ్యక్తి తన తండ్రి, సోదరుడితోపాటు మొత్తం 12 మందిని ఏకే రైఫిల్‌తో కాల్చి చంపాడని, అనంతరం పోలీసులు అతడిని కాల్చి చంపారని తెలిపింది. మారుమూల గ్రామంలో చోటుచేసుకున్న ఈ దారుణానికి కుటుంబకలహాలే కారణమని పేర్కొంది. మృతుల్లో చిన్నారులు ఎక్కువ మంది ఉన్నట్లు సమాచారం. అయితే, మృతుల వివరాలు, ఘటనకు కారణాలను మాత్రం మీడియా వెల్లడించలేదు.

మోదీకి మరోసారి అధికారం ఇవ్వొద్దు: ఖర్గే

మంగళూరు: దేశాన్ని నియంతృత్వం దిశగా నడిపిస్తున్న నరేంద్ర మోదీ ప్రభుత్వానికి మరోసారి అధికారం ఇవ్వరాదని కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున ఖర్గే వ్యాఖ్యానించారు. నిరుద్యోగుల కోసం మరిన్ని ఉద్యోగావకాశాలు సృష్టిస్తామని, ప్రతి ఒక్కరి బ్యాంకు అకౌంట్‌లో రూ.15 లక్షలు జమ చేస్తామంటూ ఇచ్చిన వాగ్దానాలను ప్రధాని మోదీ తుంగలో తొక్కారన్నారు. కర్ణాటకలో లోక్‌సభ ఎన్నికల ప్రచార కార్యక్రమాన్ని శనివారం ఆయన ప్రారంభించారు. రాష్ట్ర ప్రజలకిచ్చిన హామీలన్నిటినీ కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేర్చిందని, కనీసం 20 లోక్‌సభ స్థానాలను సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు.

సింహానికి 'సీత'పేరు.. హైకోర్టులో పిటిషన్

సిలిగురి: త్రిపుర నుంచి బెంగాల్ సఫారీ పార్కుకు తీసుకువచ్చిన ఆడ సింహానికి సీత అంటూ పేరు పెట్టడంపై విశ్వహిందూ పరిషత్(వీహెచ్‌పీ) అభ్యంతరం వ్యక్తం చేసింది. ఈ చర్య మత విశ్వాసాలను దెబ్బతీసేలా ఉందని పేర్కొంది. పేరును మార్చేలా అధికారులను ఆదేశించాలంటూ కలకత్తా హైకోర్టు జల్పాయిగురి సర్క్యూట్ బెంచ్‌లో పిటిషన్ వేసింది. భవిష్యత్తులో సైతం దేవుళ్ల, దేవతల పేర్లను జంతువులకు పెట్టకుండా అడ్డుకోవాలని కోరింది. త్రిపురలోని సెపాహిజల జూలాజికల్ పార్కు నుంచి ఈ నెల 12వ తేదీన రెండు సింహాలను తీసుకువచ్చారు. అందులో ఒక సింహానికి అక్బర్ అనీ, మరో సింహానికి సీత అని పేరు పెట్టారని ఈ నెల 16న వేసిన పిటిషన్‌లో వివరించింది. దీనిపై ఈ నెల 20న విచారణ చేపడతామని బెంచ్ తెలిపినట్లు లాయర్ సుభాకర్ తెలిపారు. అయితే, తాము ఎలాంటి పేరూ పెట్టలేదని పార్కు అధికారులు అంటున్నారు.

కనీసం చివరిచూపు చూసుకోనివ్వండి

నవాల్నీ మృతదేహం అప్పగింత కోసం తల్లి ఆవేదన

మాస్కో: రష్యా మారుమూల జైలులో అనుమానాస్పద స్థితిలో మృతిచెందిన విపక్ష నేత, హక్కుల ఉద్యమకారుడు అలెక్సీ నవాల్నీ పార్థివదేహాన్ని వెంటనే అప్పగించాలని ఆయన తల్లి ఆవేదనతో ప్రభుత్వాన్ని అభ్యర్థించారు. చనిపోయాక మృతదేహాన్ని వేరే చోటుకు తరలించామంటూ తల్లి, నవాల్నీ న్యాయవాదులను అటూ ఇటూ తిప్పుతూ అధికారులు తిప్పలు పెడుతున్నారు. మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని ల్యాబ్ పరీక్షలు చేయిస్తేగానీ విషప్రయోగం జరిగిందా లేదా అనేది తెలియని పరిస్థితి. అందుకే కుటుంబసభ్యులకు మృతదేహాన్ని అప్పగించట్లేరనే వాదన వినిపిస్తోంది. మాస్కోకు 1,900 కిలోమీటర్ల దూరంలోని ఆర్కిటిక్ ధృవ సమీపంలో మంచుమయ మారుమూల కారాగారంలో శుక్రవారం నవాల్నీ మరణించిన విషయం తెల్సిందే. విషయం తెల్సి నవాల్నీ తల్లితో కలిసి న్యాయవాది కిరా యామిష్క ఆ జైలుకెళ్లారు. అక్కడ మృతదేహం లేదు. దర్యాప్తులో భాగంగా సలేఖర్డ్ సిటీకి తరలించామని అధికారులు చెప్పారు. తీరా అక్కడి సిటీ మార్చురీకి వెళ్తే మూసేసి ఉంది. ఇక్కడికి తీసుకురాలేదని అక్కడి అధికారులు చెప్పారు. 'మరణానికి కారణాన్ని రష్యా ప్రభుత్వం ఇంతవరకు వెల్లడించలేదు. మృతదేహాన్ని అయినా అప్పగించాలి' అని లాయర్ డిమాండ్‌చేశారు.

'మద్దతు'పై ఆర్డినెన్స్ తెండి: పంధేర్

ఛండీగఢ్: ఓవైపు పంజాబ్, హరియాణా సరిహద్దుల వద్ద పోలీసులతో ఘర్షణ పడుతూనే రైతు సంఘాల నేతలు మరోవైపు కేంద్రప్రభుత్వం వద్ద మరో డిమాండ్ వినిపించారు. పంటలకు కనీస మద్దతు ధర(ఎంఎస్‌పీ)కి చట్టబద్ధత కోరుతూ రైతులు 'ఢిల్లీ చలో' పేరిట ఉద్యమిస్తున్న విషయం తెల్సిందే. ఆదివారం కేంద్ర మంత్రులు, రైతు సంఘాల నేతల మధ్య నాలుగో విడత చర్చలు మొదలు కానున్న తరుణంలో రైతు సంఘాలు తమ డిమాండ్లను వినిపించాయి. సంయుక్త కిసాన్ మోర్చా(రాజకీయేతర), కిసాన్ మజ్దూర్ మోర్చాల పిలుపుమేరకు వేలాదిగా పంజాబ్, హరియాణా సరిహద్దుల్లోని శంభు, ఖనౌరీ బోర్డర్ పాయింట్‌లకు చేరుకున్న రైతులు శనివారం సైతం ప్రభుత్వంపై తమ నిరసనను ట్రాక్టర్ ర్యాలీలు, ధర్నాల ద్వారా వ్యక్తంచేశారు. ఎంఎస్‌పీకి చట్టబద్ధత కల్పిస్తూ వెంటనే ప్రభుత్వం ఆర్డినెన్స్ జారీచేయాలని రైతు నేత శర్వాణ్ పంధేర్ డిమాండ్‌చేశారు.

దేశాన్ని ఐక్యంగా ఉంచడమే దేశభక్తి: రాహుల్

వారణాసి: సమాజంలో ధనిక, పేద వర్గాల మధ్య అంతరాలు పెరిగిపోతున్న ఈ తరుణంలో దేశాన్ని ఐక్యంగా ఉంచడమే అసలైన దేశభక్తి అని కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీ పేర్కొన్నారు. ఉత్తరప్రదేశ్‌లో శనివారం రెండో రోజు భారత్ జోడో న్యాయ్ యాత్ర కొనసాగింది. వారణాసిలోని గడౌలియా జంక్షన్‌లో జరిగిన ర్యాలీలో రాహుల్ మాట్లాడారు. 'మన దేశంలో రెండు భారత్‌లున్నాయి. అందులో ఒకటి ధనిక, మరొకటి పేద భారత్. అన్నదమ్ముల మధ్య విభేదాలతో దేశం బలహీనమైపోతోంది. దేశాన్ని ఐక్యంగా ఉంచడమే నిజమైన దేశభక్తి. ప్రేమను పంచే మన దేశంలో ద్వేషాన్ని చోటులేదు'అని ఆయన అన్నారు.

బీజేపీకి పెద్ద సవాల్‌గా ఎదిగాం: కేజ్రీవాల్

న్యూఢిల్లీ: బీజేపీకి రాజకీయాల్లో అతిపెద్ద సవాల్‌గా, కొరకరాని కొయ్యలా తయారయ్యాం కాబట్టే ఆప్‌పై బీజేపీ అన్ని వైపుల నుంచి దాడులు చేస్తోందని ఆప్ కన్వీనర్, ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ ఆరోపించారు. బడ్జెట్ సమావేశాల్లో తన ప్రభుత్వంపై పెట్టుకున్న విశ్వాస తీర్మానంపై చర్చ సందర్భంగా శనివారం కేజ్రీవాల్ ప్రసంగిస్తూ బీజేపీపై విమర్శలు గుప్పించారు. ''ఈసారి సార్వత్రిక ఎన్నికల్లో బీజేపీదే గెలుపు కావచ్చు. కానీ 2029 సార్వత్రిక ఎన్నికల్లో మాత్రం దేశానికి బీజేపీ నుంచి విముక్తి కల్పిస్తాం. ఆ బాధ్యత ఆప్ తన భుజస్కంధాలపై వేసుకుంది. సభలో ఆప్‌కే మెజారిటీ ఉందనేది స్పష్టం. అయితే ఆప్ ఎమ్మెల్యేలకు ఎరవేసి తమ వైపు లాక్కుని, ఆప్ సర్కార్‌ను కూల్చేద్దామని బీజేపీ కుట్ర పన్నింది. అందుకే ఈ విశ్వాస తీర్మానాన్ని ప్రవేశపెట్టాల్సి వచ్చింది'' అని కేజ్రీవాల్ స్పష్టంచేశారు. తర్వాత విశ్వాస తీర్మానం మూజువాణి ఓటుతో నెగ్గింది.

ఉన్నది పాయె.. కొత్తవి రాకపాయె



కరీంనగర్ రైల్వే నెట్‌వర్క్ తీవ్ర ఒడిదుడుకులు ఎదుర్కొంటోంది. అడుగుముందుకు పడితే.. రెండు అడుగులు వెనక్కి వేయాల్సిన పరిస్థితి. నిజామాబాద్–కరీంనగర్–పెద్దపల్లి రైల్వేలైన్ మార్గంలో కొత్తరైళ్ల మాట దేవుడెరుగు, నడిచే రైలును ఆపేయడంతో ఉమ్మడి కరీంనగర్ జిల్లా వాసులు ఇబ్బందులు పడుతున్నారు. – సాక్షి ప్రతినిధి,కరీంనగర్

– వివరాలు 10లో...

న్యూస్‌రీల్

కేసుల విచారణలో అజాగ్రత్త వద్దు



కరీంనగర్‌క్రైం: తెలంగాణ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ ఆదేశాల మేరకు డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్, పబ్లిక్ ప్రాసిక్యూటర్ వింజమూరి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లా వ్యాప్త పబ్లిక్ ప్రాసిక్యూటర్ల సమావేశం శనివారం జిల్లాకోర్టు ఆవరణలో నిర్వహించారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. ప్రాసిక్యూటర్లు కేసుల విచారణలో అజాగ్రత్త వహించకూడదని సూచించారు. పలువురు ప్రాసిక్యూటర్లు ఎదుర్కొంటున్న సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లగా వాటి పరిష్కారానికి సూచనలు అందించారు. అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ జ్యోతిరెడ్డి కొత్తచట్టాల గురించి వివరించారు. పీపీలు జంగిలి మల్లికార్జున్, బాలత్రిపుర సుందరి, రాములు, శ్రీరాములు, రాజిరెడ్డి, గడ్డం లక్ష్మణ్, శరత్, కాసారం మల్లేశం, మురళీధర్‌రావు, వసంత పాల్గొన్నారు.

డీటీసీగా పురుషోత్తం


చంద్రశేఖర్


పురుషోత్తం

తిమ్మాపూర్: ఉమ్మడి జిల్లా డీటీసీ చంద్రశేఖర్‌గౌడ్ బదిలీ అయ్యారు. రాష్ట్రవ్యాప్త బదిలీల్లో భాగంగా చంద్రశేఖర్ గౌడ్‌ను రంగారెడ్డి జిల్లా డీటీసీగా నియమించారు. కరీంనగర్ ఎంవీఐలు నాగలక్ష్మి, శ్రీనివాస్, ఏఎంవీఐ రజినీదేవీ సైతం బదిలీ అయ్యారు. కాగా కరీంనగ్ డీటీసీగా హనుమకొండలో పనిచేస్తున్న పురుషో త్తంను నియమించారు. ఈయన సోమవారం బాధ్యతలు స్వీకరించనున్నట్లు సమాచారం.

డిగ్రీ ఫలితాలు విడుదల

కరీంనగర్‌సిటీ: శాతవాహన విశ్వవిద్యాలయం జనవరి–2024లో నిర్వహించిన డిగ్రీ మొదటి, మూడో సెమిస్టర్స్ రెగ్యులర్, బ్యాక్‌లాగ్ పరీక్షా ఫలితాలు శనివారం విడుదల చేసినట్లు వర్సిటీ పరీక్షల నియంత్రణ అధికారి రంగు ప్రసాద్ తెలిపారు. ఫలితాలను యూనివర్సిటీ వెబ్‌సైట్‌లో పొందుపరిచినట్లు వివరించారు. మొదటి సెమిస్టర్ బీఏలో 1,115మందికి 318మంది, బీఏ(ఎల్)లో 14మందికి నలుగురు, బీకాంలో 7,180 మందికి 1,916, బీఎస్సీలో 5,102 మందికి 1,407, బీబీఏలో 705 మందికి 2,22, మూడో సెమిస్టర్ బీఏలో 798 మందికి 342 మంది, బీఏ(ఎల్)లో 11మందికి నలుగురు, బీకాంలో 5,853మందికి 2,153, బీఎస్సీలో 5,392మందికి 2,200, బీబీఏలో 476 మందికి 273మంది ఉత్తీర్ణులు అయినట్లు పేర్కొన్నారు.

ఇన్‌చార్జి ఏసీగా జనార్దన్

కరీంనగర్ కార్పొరేషన్: నగరపాలకసంస్థ అసిస్టెంట్ కమిషనర్‌గా కార్యాలయ సూపరింటెండెంట్ జనార్దన్‌కు అదనపు బాధ్యతలు అప్పగించారు. ఇప్పటివరకు అసిస్టెంట్‌కమిషనర్‌గా ఉన్న నరేశ్‌బాబు బదిలీపై వెళ్లడంతో ఆయన స్థానంలో జనార్దన్‌కు ఇన్‌చార్జి అప్పగించారు. ఇన్‌చార్జి అసిస్టెంట్ కమిషనర్ హోదాలో శానిటేషన్, మెప్మా బాధ్యతలు సైతం జనార్దన్ నిర్వహిస్తారు.

నేడు బాక్సింగ్ జట్ల ఎంపిక

కరీంనగర్‌స్పోర్ట్స్: ఉమ్మడి జిల్లా బా క్సింగ్ సంఘం ఆధ్వర్యంలో నేడు నగరంలోని అంబేద్కర్ స్టేడియంలో ఉమ్మడి జిల్లాస్థా యి సబ్ జూనియర్ జట్ల ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు సంఘం అధ్యక్ష కార్యదర్శులు జి.సత్యనారాయణ, కొత్తకొండ సంపత్ కుమార్ తెలిపారు. జిల్లాస్థాయి పోటీల్లో రాణించిన క్రీడాకారులను ఈనెల 21, 22 తేదీల్లో సికింద్రాబాద్‌లో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేయనున్నట్లు తెలిపారు.

తప్పిపోయిన పిల్లలు సురక్షితం



కరీంనగర్‌రూరల్: ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖపట్నం రైల్వేస్టేషన్‌లో గతేడాది అనుమానాస్పద స్థితిలో రైల్వేసిబ్బందికి కనిపించిన ఇద్దరు పిల్లలను శనివారం బాలల సంక్షేమ సమితి చొరవ చూపించి కరీంనగర్‌కు తీసుకొచ్చింది. కరీంనగర్ మండలం దుర్శేడ్‌కు చెందిన పస్తం రాజు కుమారులిద్దరు ఇంటినుంచి పారిపోగా విశాఖపట్నంలో గుర్తించారు. అక్కడే బాలల సంక్షేమ వసతిగృహంలో చేర్పించారు. వారిని విచారించిన అధికారులు తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చారు. విశాఖపట్నం వెళ్లడానికి ఆర్థిక స్తోమత లేకపోవడంతో బాలల సంక్షేమ సమితి కరీంనగర్‌కు పంపించాలని అక్కడి అధికారులకు విజ్ఞప్తి చేశారు. శనివారం ఇద్దరు పిల్లలు కరీంనగర్‌కు రాగా తల్లిదండ్రులు అందుబాటులో లేకపోవడంతో వసతిగృహానికి తరలించారు. జిల్లా బాలల సంక్షేమ సమితి చైర్‌పర్సన్ ధనలక్ష్మి, సభ్యులు రేండ్ల కళింగ శేఖర్, అర్చన, రాధ, విజయ్, చైల్డ్‌హెల్ప్‌లైన్ 1098 సాయికిరణ్, ప్రియాంక, అనూష పాల్గొన్నారు.



పోదాం పద.. సమ్మక్క జాతర



వనదేవతల జాతరకు అంతా సిద్ధమైంది. రెండేళ్లకోసారి వచ్చే సమ్మక్క– సారలమ్మ ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తవుతున్నాయి. ఈనెల 21న సారలమ్మ ఆగమనంతో ప్రారంభమయ్యే జాతర 24న అమ్మవార్ల వన ప్రవేశంతో ముగుస్తుంది. జాతరకు మరో రెండు రోజులు మాత్రమే సమయం ఉండగా.. ఉమ్మడి కరీంనగర్ జిల్లావ్యాప్తంగా ఉన్న సమ్మక్క గద్దెలను సిద్ధం చేస్తున్నారు. గద్దెలకు రంగులు, చలువు పందిళ్లు, తాగునీరు, ఇతర ఏర్పాట్లు చేస్తున్నారు. ఉమ్మడి జిల్లాలోని గోదావరిఖని, నీరుకుల్ల, రేకుర్తి, శంకరపట్నం తదితర ప్రాంతాలు మినీ మేడారాన్ని తలపించగా... మరో 100కు పైగా ప్రాంతాల్లో సమ్మక్క– సారలమ్మ జాతర ఘనంగా నిర్వహించనున్నారు. దూరప్రాంతంలో ఉన్న మేడారానికి వెళ్లేందుకు వీలుకాని భక్తులు సమీప జాతరల వద్ద తల్లులకు మొక్కులు చెల్లించుకుంటారు. జాతర సమీపిస్తున్న క్రమంలో ఉమ్మడి జిల్లాలోని సమ్మక్క జాతర ప్రాంతాలు.. జరుగుతున్న ఏర్పాట్లు.. ఆయా ప్రాంతాల ప్రత్యేకతపై సండే స్పెషల్..!! -8లో▸

పార్లమెంట్‌కు సన్నద్ధం

- లోక్‌సభ ఎన్నికల సన్నాహాల్లో యంత్రాంగం
- పూర్తయిన బదిలీల పర్వం
- ప్రతీ కిలోమీటర్ దూరానికి ఒక పోలింగ్ కేంద్రం
- ఓటర్ల చైతన్యానికి స్వీప్ కార్యక్రమాలు
- ఇకపై కుటుంబమంతటికీ ఒకేచోట ఓటు


ఇటీవలే పూర్తయిన ఎఫ్ఎల్‌సీ

కరీంనగర్ అర్బన్: లోక్‌సభ ఎన్నికల క్రమంలో అధికార యంత్రాంగం సన్నాహాలు ముమ్మరం చేసింది. కొద్ది రోజుల్లోనే ఎన్నికల ప్రకటన వెలువడనుండగా యుద్ధప్రతిపాదికన చర్యలు చేపట్టారు. జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పమేలా సత్పతి ప్రతీ అంశాన్ని స్వయంగా పరిశీలిస్తూ పారదర్శక ఎన్నికలకు పదును పెడుతున్నారు. ఇప్పటికే ఈవీఎంల మొదటిస్థాయి తనిఖీ పూర్తవగా పోలింగ్ కేంద్రాల్లో వసతుల కల్పన, స్ట్రాంగ్‌రూంల వద్ద కట్టుదిట్టమైన చర్యలను పర్యవేక్షించారు. ఇక మూడేళ్లు పూర్తి చేసుకున్న అధికారులతో పాటు గత ఎన్నికల్లో భాగస్వాములైన అధికారులను బదిలీ చేశారు. నాయబ్ తహసీల్దార్ల నుంచి జిల్లా అధికారుల వరకు బదిలీ అనివార్యమైంది.

కుటుంబం మొత్తం ఒకేచోట ఓటు

ఒక కుటుంబంలోని ఓటర్లు ఒకే పోలింగ్ కేంద్రంలో ఓటుహక్కు వినియోగించుకునేలా చర్యలు తీసుకుంటున్నారు. లోక్‌సభ ఎన్నికలకు ఓటర్ల సంఖ్య పెరగనుండడంతో అధికారులు పోలింగ్ కేంద్రాల సంఖ్యను స్వల్పంగా పెంచే అవకాశాలను పరిశీలిస్తున్నారు. కరీంనగర్ పార్లమెంట్ పరిధిలో కరీంనగర్, హుజూరాబాద్, హుస్నాబాద్, చొప్పదండి, మానకొండూరు, వేములవాడ, రాజన్న సిరిసిల్ల నియోజకవర్గాలున్నాయి. ఒక కుటుంబానికి చెందిన వారంతా ఒకే పోలింగ్ కేంద్రంలో ఓటు వేసేలా అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇలా ఉంటే పోలింగ్‌శాతం పెరుగుతుందని ఎన్నికల సంఘం భావించి ఈ నిర్ణయం తీసుకుంది.

పోలింగ్‌శాతం పెంపునకు చర్యలు

ఇటీవల జరిగిన శాసనసభ ఎన్నికల్లో తక్కువగా పోలైన కేంద్రాలపై ప్రత్యేక దృష్టిసారించారు. పార్లమెంట్ ఎన్నికల్లో పోలింగ్‌శాతం పెంచేలా చర్యలు ప్రారంభించారు. తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారులతో ఆట, పాట ద్వారా ఓటు గురించి వివరించనున్నారు.

నియోజకవర్గాల వారీగా ఓటర్ల వివరాలు

నియోజకవర్గం	పురుషులు	స్త్రీలు	థర్డ్‌జెండర్	మొత్తం
కరీంనగర్	1,81,093	1,81,388	43	3,62,524
హుజూరాబాద్	1,21,294	1,27,967	7	2,49,268
మానకొండూరు	1,09,947	1,14,902	1	2,24,850
చొప్పదండి	1,13,620	1,21,524	6	2,35,150
మొత్తం	5,25,954	5,45,781	57	10,71,792

సూపర్ వైజర్లు, బీఎల్‌వోలు యువ, క్రియాశీల ఓటర్లతో వాక్ టు పోలింగ్ బూత్ కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఎలక్టోరల్ లిట్రసీ క్లబ్‌ల ద్వారా అవగాహన కార్యక్రమాలను నిర్వహించనుండగా కళాశాలల్లోని యువ ఓటర్లను ఓటరుగా నమోదు చేసేలా వాట్సాప్, సోషల్ మీడియా ద్వారా సందేశాలను పంపించనున్నారు.

కిలోమీటరుకు ఒక పోలింగ్ కేంద్రం

కిలోమీటరు దూరానికి ఒక పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని ఎన్నికల సంఘం నిర్ణయించడంతో క్షేత్రస్థాయిలో అధికారులు పరిశీలిస్తున్నారు. అవసరమైతే అదనపు పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నారు. ఎక్కువ దూరం వెళ్లి ఓటుహక్కు వినియోగించుకోవడానికి ఓటర్లు ఆసక్తి చూపకపోవడంతో ఓటరు ఇంటి నుంచి పోలింగ్ కేంద్రం కిలోమీటర్ దూరాన్ని మించి ఉండకుండా ప్రణాళికలు రూపొందిస్తున్నారు. ఒక పోలింగ్ కేంద్రం పరిధిలో గరిష్ఠంగా 1500ల మంది ఓటర్లు ఓటుహక్కును వినియోగించుకునేలా చర్యలు తీసుకుంటున్నారు.

వసతుల ఏర్పాటుకు చర్యలు

అసెంబ్లీ ఎన్నికల సమయంలో కొన్ని పోలింగ్ కేంద్రాల్లో సరైన వసతులు లేక ఓటర్లు ఇబ్బంది పడ్డారు. ఈ విషయాన్ని పరిశీలకులు గుర్తించి ఎన్నికల సంఘానికి నివేదించారు. లోక్‌సభ ఎన్నికల సమయంలో ఇలాంటి పొరపాట్లు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు. కలెక్టర్ల ఆధ్వర్యంలో అసెంబ్లీ సెగ్మెంట్ల వారీగా వసతులు లేని పోలింగ్ కేంద్రాలను గుర్తించి తగిన ఏర్పాట్లు చేసేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నారు. ఇప్పటికే బీఎల్‌వోలు, మండల స్థాయి అధికారులతో సర్వే చేయించి నివేదికలు తీసుకున్నారు. ప్రధానంగా మరుగుదొడ్లు, మూత్రశాలలు, తాగునీరు, విద్యుత్తు సౌకర్యం, ఫ్యాన్లు, దివ్యాంగుల కోసం ర్యాంపులు తదితర వసతులపై సమాచారాన్ని తీసుకున్నారు.


కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి ప్రభాకర్, కలెక్టర్ పమేలా సత్పతి

నేత్రపర్వంగా ఎదుర్కోలు

కరీంనగర్‌కల్చరల్: మార్కెట్ రోడ్డులో ఉన్న వేంకటేశ్వరాలయం సప్తమ వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. పద్మశాలీ కులస్తులు అమ్మవార్లకు సారె సమర్పించారు. సాయంత్రం అశ్వ, గజవాహన సేవలతో ప్రకాశంగంజ్ వరసిద్ధి వినాయక ఆలయం నుంచి ఎదుర్కోళ్ల ఉత్సవం నేత్రపర్వంగా జరిగింది. పండితులు పురాణం మహేశ్వరశర్మ, కల్వకుంట్ల వేదాంతాచార్యులు స్వామివారు, అమ్మవార్ల తరఫున ప్రతినిధులుగా గుణగణాలను చర్చించారు. వైదిక కార్యక్రమాల పర్యవేక్షకుడు రాజారాంమోహన్ లగ్నపత్రిక చదివి వినిపించారు. ఎదుర్కోలు ఉత్సవంలో మంత్రి పొన్నం ప్రభాకర్, కలెక్టర్ పమేతా సత్పతి పాల్గొన్నారు. నేడు ఆలయ ఆవరణలో వెంకన్న కల్యాణం వైభవంగా జరగనుంది. సాయంత్రం ఏర్పాటుచేసిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.


సాంస్కృతిక కార్యక్రమాలు తిలకిస్తున్న ప్రజలు


చిన్నారి నృత్యం



హ్యాపీ బర్త్‌డే కేసీఆర్ సర్

కేక్‌కట్ చేస్తున్న మేయర్ సునీల్‌రావు, జీవీఆర్, చల్లా హరిశంకర్, బీఆర్ఎస్ నాయకులు

నగరంలో మాజీ సీఎం కేసీఆర్ 70వ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. తెలంగాణ చౌక్‌లో బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు చల్లా హరిశంకర్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో మేయర్ వై.సునీల్‌రావు, పార్టీ జిల్లా అధ్యక్షుడు జీవీ.రామకృష్ణరావు పాల్గొని 70కిలోల భారీకేక్‌ను కట్ చేశారు. కళాభారతి, జిల్లా లైబ్రరీ, సివిల్ హాస్పిటల్ వద్ద అందించే రూ.5 భోజన ఖర్చులను మేయర్ సునీల్‌రావు భరించారు. ఈ సందర్భంగా 1200మంది పేద ప్రజలకు అన్నదానం చేశారు. రాష్ట్రాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి చేసి దేశంలోనే మొదటిస్థానంలో నిలిపిన ఘనత కేసీఆర్‌కి దక్కిందన్నారు. కార్పొరేటర్లు వాల రమణారావు, ఎదుల్ల రాజశేఖర్, తోట రాములు, గందె మాధవి, గుగ్గిళ్ల జయశ్రీ, సరిల్ల ప్రసాద్, వంగల పవన్, చంద్రమౌళి, గ్రంథాలయ మాజీ చైర్మన్ పొన్నం అనిల్, మాజీ మేయర్ రవీందర్ సింగ్ తదితరులు పాల్గొన్నారు. – కరీంనగర్

ఔట్‌సోర్సింగ్ ఉద్యోగాలకు టెండర్ల ఆహ్వానం



కరీంనగర్‌సిటీ: శాతవాహన యూనివర్సిటీలో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగాలకు టెండర్లను ఆహ్వానించారు. కొద్దిరోజులుగా ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులపై వచ్చిన పలు ఆరోపణల నేపథ్యంలో ఈ ప్రక్రియ ప్రాధాన్యం సంతరించుకుంది. శాతవాహన యూనివర్సిటీలో ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల కోసం ఏజెన్సీని నియమించడానికి టెండర్లు ఆహ్వానిస్తున్నట్లు ప్రకటన జారీచేసింది. రిజిస్ట్రార్ శాతవాహన యూనివర్సిటీ పేరిట రూ.5వేలతో టెండర్ దాఖలు చేయాలని సూచించారు. టెండర్ దక్కించుకున్న సంస్థ 149 ఉద్యోగాలను భర్తీ చేసుకునే అవకాశం ఉంటుంది. కాగా వర్సిటీలో డాటాఎంట్రీ ఆపరేటర్ 13, అటెండర్లు 24, స్వీపర్ 12, సెక్యూరిటీగార్డులతో పాటు 51విభాగాల్లో ఖాళీలు ఉన్నట్టు సమాచారం. ఈ 149 ఉద్యోగాలకుగాను ప్రతీనెల రూ.21.68 లక్షల వేతనం ఏజెన్సీకి చెల్లిస్తారు. టెండర్లు వచ్చేనెల 1న మధ్యాహ్నం 3గంటలలోపు దాఖలు చేసే అవకాశం ఉంది. కాగా.. వర్సిటీలో కొంతకాలంగా పనిచేస్తున్న తాత్కాలిక ఉద్యోగులను టెండర్ ద్వారా ఔట్‌సోర్సింగ్ విధానంలోకి మార్చడంపై వర్సిటీ ఈసీ సభ్యులకు ఎలాంటి అభ్యంతరం లేదని సోషల్ మీడియాలో వస్తున్న కథనాలు అవాస్తవమని, ఔట్‌సోర్సింగ్ నమోదుపై తమనుంచి ఎలాంటి అభ్యంతరం లేదని ఈసీ సభ్యులు దీపిక, ఉమాదేవి, రామకృష్ణ, వేణు, శ్రీనివాస్, మొగిలయ్య పేర్కొన్నారు.

ఆపరేటింగ్ మైక్రోస్కోప్ ప్రారంభం


యంత్రం పరిశీలిస్తున్న కలెక్టర్

కొత్తపల్లి(కరీంనగర్): రేకుర్తిలోని లయన్స్ క్లబ్‌ఆఫ్ కరీంనగర్ డాక్టర్ భాస్కర్ మాడేకర్ ఉదార కంటి ఆసుపత్రిలో శనివారం ఆపరేటింగ్ మైక్రోస్కోప్‌ను కలెక్టర్ పమేలా సత్పతి ప్రారంభించారు. ఆస్పత్రిలోని పలు విభాగాలను పరిశీలించి, ట్రస్టును అభినందిచారు. పేదలకు నాణ్యతో కూడిన వైద్యాన్ని అందించడంపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఆస్పత్రి చైర్మన్ కొండ వేణుమూర్తి, కార్యదర్శి ప్రకాశ్ హొల్ల, కార్యవర్గ సభ్యులు టి.మురళీధర్‌రావు, కోల అన్నారెడ్డి, రాగి శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఆర్థిక సంస్కరణల ఆద్యుడు పీవీ


మాట్లాడుతున్న డాక్టర్ పి.భాస్కర యోగి

కరీంనగర్‌కల్చరల్: మాజీ ప్రధాని పీవీ నరసింహారావు దేశ ఆర్థిక ప్రగతిలో కీలకపాత్ర పోషించారని ప్రముఖ రాజకీయ, సామాజిక విశ్లేషకుడు డాక్టర్ పి.భాస్కరయోగి అన్నారు. శనివారం ప్రజ్ఞాభారతి, పీవీ సాహిత్య పీఠం సంయుక్త ఆధ్వర్యంలో భారత్ కిరీటంలో మెరిసిన ‘భారతరత్నం మన పీవీ’ అనే అంశంపై నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ.. దేశం ఆర్థిక సంక్షోభంలో ఉన్నప్పుడు నూతన సంస్కరణలు తీసుకొచ్చి, ప్రగతివైపు నడిపించిన వ్యక్తి పీవీ అన్నారు. పీవీ గురించి తెలియాలంటే ఆయన జీవితాన్ని రెండు విధాలుగా దర్శించాలని, ఒకటి రాజకీయరంగ పరిపాలన దక్షత గురించి, రెండోది ఆయన చేసిన సాహిత్య సేవలు గురించి అని తెలిపారు.

మతం ముసుగులో దాడులు సరికాదు

- డాక్టర్ ఆర్ఎస్.ప్రవీణ్ కుమార్


మాట్లాడుతున్న ఆర్ఎస్.ప్రవీణ్‌కుమార్

విద్యానగర్(కరీంనగర్): మతంపేరుతో కొందరు మూకలు ఒకవర్గానికి చెందిన మతవర్గాలపై దాడులు చేయడాన్ని ఖండిస్తున్నట్లు బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ఆర్ఎస్.ప్రవీణ్‌కుమార్ పేర్కొన్నారు. కరీంనగర్‌లో శనివారం శాంతిర్యాలీ నిర్వహించారు. అనంతరం క్రైస్తవ సంఘాల ఆధ్వర్యంలో ప్రెస్‌భవన్‌లో మాట్లాడుతూ.. జన్వాడలో దళితులపై దాడి చుండూరు, కారంచేడులో జరిగిన దాడి లాంటిదే అన్నారు. మైనారిటీల ప్రాణాలకు ప్రభుత్వ గ్యారంటీ కావాలని అన్నారు. మతంపేరుతో మైనారిటీలపై జరిగే దాడులు రాజ్యాంగ వ్యతిరేకం అన్నారు. గుడి, చర్చి, మసీద్‌ల మత ప్రచారకులపై జరిగే దాడులు చట్ట వ్యతిరేకం అని పేర్కొన్నారు. జన్వాడలో క్రైస్తవులు, దళితులపై జరిగిన దాడిలో నిందితులను ప్రభుత్వం శిక్షించాలని డిమాండ్ చేశారు. బీఎస్పీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నల్లాల శ్రీనివాస్, రంగు సంపత్ గౌడ్, మేకల రవీందర్, పాస్టర్లు పాల్గొన్నారు.

పోదాం పద.. సమ్మక్క జాతర

- ఈ నెల 21 నుంచి వన దేవతల జాతర
- ముస్తాబవుతున్న అమ్మవార్ల గద్దెలు
- భక్తుల కోసం ఏర్పాట్లు చేస్తున్న నిర్వాహకులు
- ఉమ్మడి జిల్లాలో ఎత్తు బెల్లం మొక్కులతో మొదలైన సందడి

గిరిజన తల్లులు సమ్మక్క–సారలమ్మ జాతర సమీపిస్తోంది.. ఈ నెల 21 నుంచి 24 వరకు జరగనుంది. ఇప్పటికే పల్లె, పట్టణం అనే తేడా లేకుండా భక్తులు ఎత్తు బెల్లం మొక్కు చెల్లించేందుకు సమ్మక్క మేడారం వెళ్తుండటంతో ఉమ్మడి జిల్లాలో సందడి వాతావరణం నెలకొంది. జాతర నిర్వహించే ప్రాంతాల్లో ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. బస్సులు, విద్యుత్, తాగునీరు, స్నానఘట్టాలు, దుస్తులు మార్చుకునేందుకు తాత్కాలిక గదులు, టాయిలెట్లు, పార్కింగ్, విడిది, చలువ పందిళ్లు తదితర ఏర్పాట్లపై జాతర కమిటీల నిర్వాహకులు అధికారులు సమన్వయంతో ముందుకుసాగుతున్నారు. ఎక్కడా అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు విధులకు సిద్ధమయ్యారు. ఈ నేపథ్యంలో ఉమ్మడి జిల్లాలోని పలు ప్రాంతాల్లో జాతర జరిగే తీరు, చేస్తున్న ఏర్పాట్లపై ప్రత్యేక కథనం.

హన్మంతునిపేటలో 42 ఏళ్లుగా..


హన్మంతునిపేట సమ్మక్క–సారలమ్మ ఆలయం

పెద్దపల్లిరూరల్: గిరిజన తల్లులు సమ్మక్క–సారలమ్మ జాతరకు అమ్మవార్ల ఆలయాలు ముస్తాబవుతున్నాయి. పెద్దపల్లి మండలంలోని హన్మంతునిపేట, తుర్కలమద్దికుంట, పెద్దకల్వల గ్రామాల్లో ఏటా జరుపుతున్నారు. హన్మంతునిపేట శివారులో 42 ఏళ్లుగా, తుర్కలమద్దికుంట పెద్దగుట్ట వద్ద 16 ఏళ్లుగా నిర్వహిస్తున్న జాతరకు భక్తులు పోటెత్తుతారు. హన్మంతునిపేటకు చెందిన కంకటి గోపాల్ కిషన్‌రావు, ఆయన సోదరులు ప్రభాకర్‌రావు, శంకర్‌రావు, సుగుణాకర్ రావు, రాంచందర్‌రావు, ప్రసాదరావులు తమ తండ్రి మధుసూదన్‌రావు, తల్లి అంబాబాయి జ్ఞాపకార్థం 10 గుంటల భూమిని విరాళంగా ఇచ్చారు. ఈ స్థలంలో గ్రామ పెద్దలు సమ్మక్క–సారలమ్మ ఆలయం నిర్మించారు. ఈసారి జాతరకు అన్ని వసతులు కల్పిస్తున్నారు.

ఏర్పాట్లు చేశాం..



సమ్మక్క జాతరకు వచ్చే భక్తుల కోసం అన్ని ఏర్పాట్లు చేశాం. ఆలయ పరిసరాల్లో విద్యుత్ దీపాలు బిగించాం. అన్ని వసతులు కల్పిస్తున్నాం.

– పొల్సాని సుధాకర్‌రావు, హన్మంతునిపేట ఆలయ కమిటీ చైర్మన్

రాజన్న సిరిసిల్ల జిల్లాలో ఐదుచోట్ల


శాంతినగర్ తండా సమ్మక్క–సారలమ్మ గుడి

సిరిసిల్ల: సమ్మక్క జాతర నేపథ్యంలో రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్లపల్లి మండలంలోని ఒబులాపూర్ మూడు రోజులపాటు జనసంద్రమవుతుంది. సిరిసిల్ల, సిద్దిపేట, కామారెడ్డి జిల్లాల నుంచే కాకుండా మహారాష్ట్రలోని ముంబయి, భీవండి, షోలాపూర్, హైదరాబాద్ వంటి పట్టణాల నుంచి వేలాదిగా భక్తులు తరలివచ్చి, మొక్కులు చెల్లించుకుంటారు. 40 ఏళ్లుగా ఇక్కడ జాతర జరుగుతోంది. సిరిసిల్ల నుంచి మండెపల్లి, రాళ్లపేట మీదుగా 13 కిలోమీటర్లు ప్రయాణిస్తే సమ్మక్క–సారలమ్మ గద్దెలు దర్శనమిస్తాయి. ఆటోల సౌకర్యం ఉంది. వీర్నపల్లి మండలంలోని వన్‌పల్లి శివారు శాంతినగర్ భానోత్ గిరిజన తండాలో 52 ఏళ్లుగా సమ్మక్క–సారలమ్మ జాతర సాగుతోంది. సమీప గ్రామాల నుంచే కాకుండా పొరుగున ఉన్న నిజామాబాద్ జిల్లా నుంచి గిరిజనులు ఎక్కువగా వచ్చి, అమ్మవార్లను దర్శించుకుంటారు. ఎల్లారెడ్డిపేట మండలంలోని రాచర్ల బొప్పాపూర్‌లో ఎనిమిదేళ్లుగా జాతర జరుగుతోంది. కోనరావుపేట మండలంలోని శివంగళపల్లె, ముస్తాబాద్ మండల కేంద్రంలో గిరిజన తల్లుల గద్దెలు సిద్ధమయ్యాయి.

గన్నేరువరం, మైలారం గ్రామాల్లో..


మైలారంలో అమ్మవార్ల గద్దెలు

గన్నేరువరం: మండలంలోని గన్నేరువరం, మైలారం గ్రామాల్లో సమ్మక్క–సారలమ్మ జాతరకు జాతర కమిటీ సభ్యులు ఏర్పాటు పూర్తి చేశారు. గన్నేరువరంలో చిలుకలగుట్ట సమీపంలో ప్రధాన రహదారి పక్కన, మైలారంలో శ్రీ మల్లికార్జునస్వామి పెద్దగుట్ట పక్కన లోయర్ మానేరు డ్యాంకు 100 మీటర్ల దూరంలో జాతర జరగనుంది. చుట్టుపక్కల గ్రామాల నుంచి దాదాపు 10 వేల మందికి పైగా భక్తులు వస్తారని కమిటీ సభ్యులు తెలిపారు. అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు పేర్కొన్నారు.


మీర్జంపేట జాతర స్వాగత తోరణం

మీర్జంపేట మానేరు తీరాన..

కాల్వశ్రీరాంపూర్(పెద్దపల్లి): మండలంలోని మీర్జంపేటలో మానేరు నదీతీరాన సమ్మక్క జాతర 52 ఏళ్లుగా సాగుతోంది. ఉమ్మడి కరీంనగర్, వరంగల్, జయశంకర్ భూపాలపల్లి జిల్లాల నుంచి భక్తులు వేలాదిగా తరలివస్తారు. ఎత్తు బెల్లం, తలనీలాలు సమర్పించి, మొక్కు చెల్లించుకుంటారు. పెద్దరాతుపల్లి మానేరు తీరంలో, పెగడపల్లి హుస్సేన్‌మియా వాగు తీరంలోనూ జాతర జరుగుతుంది.

భక్తులకు సౌకర్యాలు కల్పించాం



మీర్జంపేట జాతరకు వచ్చే భక్తులకు ఇబ్బందులు సకల సౌకర్యాలు కలిపించాం. మానేరు వెంట మోటార్లు 24 గంటలు నడిపించేందుకు రైతులు సహకరిస్తారు. ట్రాన్స్‌కో అధికారులు జాతర సమయంలో విద్యుత్ అంతరాయం లేకుండా చర్యలు తీసుకుంటారు. గ్రామ యువకులు, మహిళలు వలంటీర్లుగా సేవలందిస్తారు.

– అశోక్, జాతర కమిటీ చైర్మన్, మీర్జంపేట

'ఖని'లో మినీ మేడారం


గోదావరి తీరంలో జాతర ప్రాంగణం

గోదావరిఖని(రామగుండం): మినీ మేడారంగా విలసిల్లుతున్న గోదావరిఖని గోదావరి నదీతీరం అడవి తల్లుల జాతరకు ముస్తాబవుతోంది. సింగరేణి యాజమాన్యం 1992లో గోదావరి తీరంలోని సంస్థ స్థలంలో సమ్మక్క–సారలమ్మ జాతర ప్రారంభించింది. ఏటా సమ్మక్క మేడారం ప్రాంతానికి చెందిన కోయ పూజారులను తీసుకువచ్చి, ఇక్కడ పూజలు నిర్వహించడం ఆనవాయితీ. పెద్దపల్లి, మంచిర్యాల జిల్లాలతోపాటు మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, చత్తీస్‌గఢ్ రాష్ట్రాల నుంచి 5 లక్షల మంది వరకు భక్తులు వస్తారని అంచనా వేస్తున్నారు. జాతర సమయంలోనే కాకుండా గోదావరి తీరాన్ని పర్యాటక క్షేత్రంగా తీర్చిదిద్దేందుకు రామగుండం ఎమ్మెల్యే ఎంఎస్ రాజ్‌ఠాకూర్ ప్రత్యేక దృష్టిసారించారు. ప్రధానంగా సింగరేణి యాజమాన్యం ద్వారా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. గోదావరి నదిలో బోటింగ్ సౌకర్యం కల్పించాలని నిర్ణయించామని తెలిపారు.

పకడ్బందీ ఏర్పాట్లు



భక్తులకు అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా జరుగుతున్నాయి. మంచినీటి సౌకర్యం కల్పిస్తున్నాం. నదీ తీరంలో స్నానాలు చేసేందుకు షవర్స్ ఏర్పాటు చేశాం. మహిళలు దుస్తులు మార్చుకోవడానికి తాత్కాలిక గదులు సిద్ధం చేస్తున్నాం. వంద టాయిలెట్స్ నిర్మిస్తున్నాం.

పిన్నింటి శ్రీనివాస్‌రెడ్డి, జాతర కమిటీ చైర్మన్

తెలుకుంట, అబ్బాపూర్‌లలో..


తెలుకుంటలో భక్తుల మొక్కులు (ఫైల్)

జూలపల్లి(పెద్దపల్లి): మండలంలోని అబ్బాపూర్, తెలుకుంట గ్రామాల్లో ఏటా సమ్మక్క జాతర ఘనంగా నిర్వహిస్తున్నారు. మేడారం కోయ పూజారులతో జరిపించే ఈ జాతరకు ఉమ్మడి కరీంనగర్‌లో జిల్లాలోని భక్తులు వచ్చి, మొక్కులు చెల్లించుకుంటారు. అబ్బాపూర్‌లో 2002లో పోచమ్మ గుట్టపై, తెలుకుంటలో 1994లో రామప్ప గుట్టపై వెలసిన సమ్మక్క–సారలమ్మ తల్లులను కోయ పూజారులు తీసుకువచ్చి, గద్దెలపై ప్రతిష్ఠించడంతో జాతర ప్రారంభమైంది. జాతర కమిటీలు భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా రవాణా, విద్యుత్, తాగునీరు, చలువ పందిళ్లు ఏర్పాటు చేస్తున్నాయి. స్నానాలకు తెలుకుంటలో రామప్ప చెరువు ఉండగా, అబ్బాపూర్‌కు డీ–83 కెనాల్ నీటితోపాటు హుస్సేన్‌మియా వాగు అందుబాటులో ఉన్నాయి.

శంకరపట్నంలో 1978 నుంచి..


శంకరపట్నంలో సమ్మక్క గద్దె

శంకరపట్నం(మానకొండూర్): మండల కేంద్రంలో సమ్మక్క–సారలమ్మ జాతర ప్రారంభమై 46 ఏళ్లవుతోంది. కేశవపట్నం గ్రామానికి చెందిన గుర్రం వీరయ్య, మరో 13 మంది కలిసి 1978 ఫిబ్రవరి 22న వెంకయ్య గుట్ట నుంచి అమ్మవార్లను తీసుకువచ్చి, గద్దెలపై ప్రతిష్ఠించారు. చుట్టుపక్కల గ్రామాలతోపాటు తిమ్మాపూర్, బెజ్జంకి, చిగురుమామిడి, మానకొండూర్ మండలాలు, రాజన్న సిరిసిల్ల, కామారెడ్డి జిల్లాల నుంచి భక్తులు వచ్చి, మొక్కులు చెల్లించుకుంటున్నారు. కరీంనగర్ బస్టాండ్ నుంచి 10 నిమిషాలకో ఆర్టీసీ బస్సు సౌకర్యం ఉంది. జాతర కమిటీవారు ఏర్పాట్లు చేశారు. దేవాదాయ శాఖ పర్యవేక్షణలో జాతర నిర్వహించనున్నారు.

గోలివాడ ఇసుకలో కుంకుమ భరిణె


గోలివాడలో సమ్మక్క–సారలమ్మ గద్దెలు

రామగుండం: అంతర్గాం మండలంలోని గోలివాడ గోదావరి నది ఒడ్డున సమ్మక్క–సారలమ్మ జాతరకు 42 ఏళ్లు. 1982లో గ్రామానికి చెందిన జాలిగామ కిషన్‌రావు అలియాస్ బయ్యాజీ అనే ప్రభుత్వ ఉపాధ్యాయుడు గోదావరి నదిలో స్నానం చేసేందుకు వెళ్లారు. అక్కడ ఇసుకలో కుంకుమ భరిణె కనిపించడంతో ఇంటికి తీసుకువచ్చారు. అదేరోజు రాత్రి నిద్రలో వనదేవతలు కలలోకి వచ్చి, నీకు కుంకుమ భరిణె దొరికిన స్థానంలో సమ్మక్క–సారలమ్మ, పగిడిద్దెరాజుల గద్దెలు నిర్మించి, జాతర నిర్వహించాలని ఆదేశించారని తెలిపారు. ఈ విషయాన్ని గ్రామ ప్రముఖులు ఆవుల చంద్రయ్య, పెంద్రు హన్మాన్‌రెడ్డిలకు చెప్పారు. అందరూ కలిసి గోదావరి నది ఒడ్డుకు వెళ్లి, పరిశీలించగా కుంకుమ భరిణె, పూజా సామగ్రి కనిపించాయి. దీంతో అదే ఏడాది వనదేవతల గద్దెలు నిర్మించి, జాతర ప్రారంభించారు. గ్రామానికి చెందిన 41 మందితో వ్యవస్థాపక కమిటీ ఏర్పాటు చేసుకొని, జాతర కొనసాగిస్తున్నారు.

కొలనూర్‌లో కోయ పూజారులతో..


ముస్తాబైన సమ్మక్క–సారలమ్మ గద్దెలు

ఓదెల(పెద్దపల్లి): మండలంలోని కొలనూర్‌లో 1974 నుంచి జరుగుతున్న సమ్మక్క–సారలమ్మ జాతరకు ఈసారి ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. మేడారం కోయ పూజారులతో పూజలు నిర్వహించనున్నారు. ఇక్కడ అల్లీమాసాని చెరువు(జంపన్నవాగు) ఉంది. సికింద్రాబాద్, కాజీపేట్, భద్రాచలం, సిర్పూర్‌కాగజ్‌నగర్, నాగపూర్ నుంచి కొలనూర్ జాతర వరకు రైళ్ల సౌకర్యం ఉంది. దీనికితోడు భక్తులకు గోదావరిఖని, కరీంనగర్, వరంగల్ నుంచి ఆర్టీసీ బస్సులు, ప్రైవేటు వాహనాలు అందుబాటులో ఉన్నాయి. ఉత్తర తెలంగాణ జిల్లాలతోపాటు మహారాష్ట్ర నుంచి 2 లక్షల మందికి పైగా భక్తులు వస్తారని అంచనా.

భక్తులకు సౌకర్యాలు కల్పిస్తున్నాం



కొలనూర్ జాతరకు ఏర్పాట్లు చేస్తున్నాం. భక్తులకు నీడ, విద్యుత్, మంచినీటి సౌకర్యం కల్పిస్తున్నాం. స్నానాల కోసం సమీపంలోని జంపన్నవాగు వద్ద స్నానవాటికలు ఏర్పాటు చేశాం. అమ్మవార్ల దర్శనం కోసం క్యూలైన్లు సిద్ధమయ్యాయి.

– దేవిడి శ్యాంరెడ్డి, జాతర కమిటీ చైర్మన్

చిల్వాకోడూర్ ఎక్కల్‌దేవి గుట్ట కింద


చిల్వాకోడూర్‌లో అమ్మవార్ల గద్దెలు

గొల్లపల్లి(ధర్మపురి): మండలంలోని చిల్వాకోడూర్, వెల్గటూర్ మండల కేంద్రంతోపాటు, రాజారాంపల్లి, ధర్మపురి మండలంలోని రామయ్యపల్లి గ్రామాల్లో సమ్మక్క–సారలమ్మ జాతర జరుగుతుంది. నిర్వాహకులు భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నారు. చిల్వాకోడూర్ ఎక్కల్‌దేవి గుట్ట కింద నిర్వహించే జాతరకు జగిత్యాల జిల్లాలోనే అత్యధిక మంది భక్తులు తరలివస్తారు. అమ్మవార్లకు బుక్క, పూసవేర్ల, మేడారం పూజారులు పూజలు చేస్తారు. 1994లో గ్రామానికి చెందిన గంటె రామయ్య, కరెంట్ రాజయ్య కలలో దేవతలు కనిపించడంతో కంకవనం తీసుకువచ్చి, ఎక్కల్‌దేవి గుట్ట సమీపంలో పాతి, పూజలు చేశారు. ఆ తర్వాత జాతర ప్రారంభమైంది. 2001 నుంచి మేడారం పూజారులచే పూజలు చేయిస్తున్నారు. రాజారాంపెల్లిలో ఏలేటి వంశీయులు 2011లో ఏర్పాటు చేసిన గద్దెల వద్ద ఏటా జాత జరుగుతోంది. ఈసారి కూడా ఏర్పాట్లు చేసినట్లు జాతర కమిటీ చైర్మన్ శైలేందర్ రెడ్డి తెలిపారు.

ఏటా జాతరకు వస్తా..

మాది సమక్క–సారలమ్మ వెలసిన మేడారం గ్రామం. చిల్వాకోడూర్‌లో మా బావ కోరం హన్మంతు ఏటా జాతరకు వచ్చి, పూజలు చేసేవాడు. ఆయన నాలుగేళ్ల క్రితం చనిపోవడంతో నేను వస్తున్నాను. ఏటా లక్షన్నరకు పైనే భక్తులు వస్తున్నారు. ప్రభుత్వం నిధులు మంజూరు చేసి, జాతరకు సహకరించాలి.

– కోరం లక్ష్మణ్, పూజారి, సమ్మక్క మేడారం

నీరుకుల్ల–వేగురుపల్లి మధ్య..


2022లో జాతర ప్రదేశంలో భక్తుల విడిది

సుల్తానాబాద్ రూరల్: మండలంలోని నీరుకుల్ల–వేగురుపల్లి గ్రామాల మధ్య రంగనాయకస్వామి ఆలయ సమీపంలో 45 ఏళ్లుగా సమ్మక్క–సారలమ్మ జాతర అత్యంత వైభవంగా జరుగుతోంది. పెద్దపల్లి జిల్లాతోపాటు ఉత్తర తెలంగాణలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి, అమ్మవార్లకు మొక్కులు చెల్లించుకుంటారు. మేడారం కోయ పూజారులు వచ్చి, ఇక్కడ పూజలు చేస్తారు. జారత ప్రదేశంలో మానేరు నది ఉంది. దేవాదాయశాఖ, జాతర కమిటీవారు భక్తులకు ఇబ్బంది కలగకుండా ఏర్పాట్లు చేస్తున్నారు. కరీంనగర్, గోదావరిఖని నుంచి సుల్తానాబాద్ మీదుగా, కరీంనగర్ నుంచి వేగురుపల్లి మీదుగా జాతరకు బస్సులు, ఆటోలున్నాయి. కరీంనగర్, పెద్దపల్లి నుంచి రైల్వే సౌకర్యం కూడా ఉంది.

అధికారుల సమన్వయంతో ఏర్పాట్లు



జాతరకు వచ్చే భక్తులకు ఏలాంటి ఇబ్బందులు కలగకుండా కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేస్తున్నాం. అన్ని శాఖల అధికారుల సమన్వయంతో రోడ్లు, విద్యుత్, ట్రాఫిక్, వైద్యం, శానిటేషన్, అత్యవసర సేవలందించేందుకు సిద్ధంగా ఉన్నాం.

– నర్సయ్యగౌడ్, జాతర కమిటీ చైర్మన్

1990 నుంచి రేకుర్తిలో..


రేకుర్తిలో అమ్మవార్ల గద్దెలు

కరీంనగర్‌కల్చరల్: కరీంనగర్ నగరపాలక సంస్థ పరిధిలోని రేకుర్తిలో సమ్మక్క–సారలమ్మ జాతరకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. కరీంనగర్ కార్పొరేషన్, దేవాదాయశాఖ ఆధ్వర్యంలో భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నట్లు చెబుతున్నారు. 1990లో పిట్టల రాజమల్లయ్య కలలో సమ్మక్క–సారలమ్మ కనిపించి, గద్దెలు ఏర్పాటు చేయాలన్నారు. దీంతో ఆయన అదే ఏడాది ఫిబ్రవరి 6న అమ్మవార్లకు గద్దెలు నిర్మించారు. అప్పటినుంచి రెండేళ్లకోసారి జాతర జరుగుతోంది. ఇక్కడికి కరీంనగర్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, పెద్దపల్లి జిల్లాల నుంచి భక్తులు తరలివస్తారు. కరీంనగర్ బస్టాండ్ నుంచి జగిత్యాల ప్రధాన రహదారిలో 4 కిలోమీటర్ల దూరంలో అమ్మవార్ల గద్దెలున్నాయి. బస్టాండ్ నుంచి ఆటోలు, బస్సులు నడుస్తాయి. జాతరకు కార్పొరేషన్ నిధుల నుంచి రూ.66 లక్షలు కేటాయించినట్లు అధికారులు తెలిపారు. వివిధ వస్తువుల అమ్మకాల టెండర్ ద్వారా రూ.9 లక్షలు సమకూరినట్లు దేవాదాయ శాఖ అధికారులు పేర్కొన్నారు. కోయ పూజారులచే పూజలు జరిపించనున్నారు.

న్యాయం చేయాలని మహిళల బైఠాయింపు

- అన్నదమ్ములు మోసం చేశారని ఆరోపణ
- గంగిపల్లిలో ఘటన


బైఠాయించిన చంద్రకళ, రాధిక

మానకొండూర్: మండలంలోని గంగిపల్లికి చెందిన ఇద్దరు అన్నదమ్ములు తమను మోసం చేశారని ఇద్దరు మహిళలు ఆరోపించారు. తమకు న్యాయం చేయాలంటూ శనివారం వారి ఇంటి ఎండుట బైఠాయించారు. బాధితుల వివరాల ప్రకారం.. గంగిపల్లికి చెందిన గొడిశాల వెంకటేశ్ ఉపాధి నిమిత్తం కొన్నేళ్ల క్రితం హైదరాబాద్ వెళ్లాడు. అక్కడ ఓ కంపెనీలో ఉద్యోగం చేస్తున్న కర్ణాటకకు చెందిన ఇటుక రాధికతో పరిచయం ఏర్పడింది. ఆమెకు గతంలోనే వివాహం కాగా, ఒక కుమారుడు ఉన్నాడు. భర్త అనారోగ్యంతో చనిపోయాడు. ఈ విషయాలు వెంకటేశ్‌కు చెప్పినా సరేనని, ఆమెను పెళ్లి చేసుకుంటానని చెప్పాడు. రాధిక ద్వారా వెంకటేశ్ ఆ కంపెనీలో ఉద్యోగం పొందాడు. కానీ, తర్వాత ఆ ఉద్యోగం పోయింది. దీంతో అతను ఆమె వద్ద నుంచి సుమారు రూ.10 లక్షల వరకు తన అవసరాల కోసం తీసుకున్నాడు. 4 నెలలుగా వివిధ ప్రాంతాలకు వెళ్తూ ముఖం చాటేస్తున్నాడు. ఫోన్ కూడా ఎత్తకపోవడంతో ఆమె హైదరాబాద్‌లోని మియాపూర్ పోలీసులను సంప్రదించింది. తర్వాత వెంకటేశ్ కోసం ఆరా తీసి, గంగిపల్లికి వస్తే పోలీసులు సఖీ సెంటర్‌కు తరలించారు. కౌన్సెలింగ్‌కు వెంకటేశ్ కుటుంబసభ్యులు రాలేదు.

తర్వాత మాట్లాడి, బాండ్ పేపర్ రాశారు..

కొన్ని రోజులకు వెంకటేశ్ తోపాటు అతని కుటుంబసభ్యులు రాధికతో మాట్లాడారు. ఆమెతో సంబంధం లేదని, సహజీవనం చేసినందుకు రూ.10 లక్షలకు బదులు రూ.5 లక్షలు ఇస్తున్నామని బాండ్ పేపర్ రాసిచ్చారు. ఆమెకు తెలుగు రాకపోవడంతో రూ.10 లక్షలు ఇస్తున్నట్లు నిమ్మింది. ఆ బాండ్‌ను తెలిసినవారితో చదివించుకోగా విషయం తెలిసింది. దీంతో శనివారం గంగిపల్లి చేరుకున్న రాధిక వెంకటేశ్ ఇంటి ఎదుట బైఠాయించింది. ఆమెను వెంకటేశ్, అతని కుటుంబసభ్యులు తీవ్రంగా కొట్టారు.

మరో మహిళ..

ఇదిలా ఉండగా.. వెంకటేశ్ అన్న రమేశ్ గతంలో గంగిపల్లికే చెందిన తనను ప్రేమించి, పెళ్లి చేసుకున్నాడని చంద్రకళ ఆరోపించింది. మోసం చేసి, మరో అమ్మాయిని పెళ్లి చేసుకున్నాడంటూ శనివారం రాధికతో కలిసి అతని ఇంటి ఎదుట బైఠాయించింది. తమకు న్యాయం జరిగే వరకూ ఇక్కడి నుంచి కదలమని తేల్చిచెప్పారు. విషయం తెలుసుకున్న ఎస్సై శ్రీకాంత్ గ్రామానికి చేరుకొని, వారితో మాట్లాడారు. నచ్చజెప్పడంతో శాంతించారు. చంద్రకళ అక్కడి నుంచి వెళ్లిపోగా, రాధికను పోలీసులు ఠాణాకు తీసుకెళ్లారు.

కేసీఆర్ తోడల్లుడిపై కేసు నమోదు


రవీందర్‌రావు

కరీంనగర్‌క్రైం: మాజీ సీఎం కేసీఆర్ తోడల్లుడు, రాజ్యసభ్యుడు జోగినపల్లి సంతోష్ రావు తండ్రి రవీందర్‌రావుపై శనివారం కేసు నమోదు చేసినట్లు కరీంనగర్ టూటౌన్ సీఐ వెంకటేశ్ తెలిపారు. మంత్రి పొన్నం ప్రభాకర్ ముఖ్య అనుచరుడు కరీంనగర్‌లోని రాంనగర్‌కు చెందిన కూస రవీందర్ భూదందాలకు పాల్పడుతున్నాడని ఓ యూట్యూబ్ చానల్‌లో వార్త ప్రసారం చేశారు. మిడ్‌మానేరు భూ నిర్వాసితులకు కేటాయించిన ప్లాట్లలో భూకబ్జాకు పాల్పడ్డాడని, అక్రమ పట్టా ఇవ్వమని సిరిసిల్ల ఆర్డీవోను బెదిరింపులకు గురిచేశాడని పేర్కొన్నారు. అయితే ఈ వార్తలో ఏమాత్రం నిజం లేదని, తప్పుడు విషయాన్ని కొందరు సోషల్ మీడియాలో వైరల్ చేశారని.. దీని వెనుక కేసీఆర్ తోడల్లుడు జోగినపల్లి రవీందర్ రావు, గూడ బాలకృష్ణ, ఎ.నాగరాజు, సంపత్ ఉన్నారని కూస రవీందర్ ఆరోపించారు. మంత్రి పొన్నం ప్రభాకర్‌తో పాటు తనపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని పేర్కొన్నారు. కరీంనగర్ టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు జోగినపల్లి రవీందర్ రావు, గూడ బాలకృష్ణ, ఎ.నాగరాజు, సంపత్, యూట్యూబ్ చానెల్ నిర్వాహకుడు చిలుక ప్రవీణ్‌పై కూడా కేసు నమోదు చేసినట్లు సీఐ వివరించారు.

జేఎల్ ఫలితాల్లో 13వ ర్యాంక్


అంజలిని సన్మానిస్తున్న సత్యప్రసన్న

రామడుగు(చొప్పదండి): గోపాల్‌రావుపేటకు చెందిన ఉత్తమ రైతు ఎడవెల్లి కిషన్‌రెడ్డి–అరుణ దంపతుల కూతురు అంజలి జూనియర్ లెక్చరర్ పోస్టుల ఫలితాల్లో 13వ ర్యాంక్ సాధించింది. ఆమె ఎంఏ ఇంగ్లిష్ కాకతీయ, బీఈడీ ఉస్మానియా యూనివర్సిటీల్లో చదివింది. ప్రస్తుతం పీహెచ్‌డీ చేస్తోంది. అంజలిని మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు కర్ర సత్యప్రసన్న శనివారం సన్మానించారు.

క్లుప్తంగా

పంచాయతీ ఆధ్వర్యంలో జాతర నిర్వహించాలి



ఎంపీవోకు వినతిపత్రం ఇస్తున్న శ్రీనివాస్, శంకర్

కరీంనగర్‌రూరల్: కరీంనగర్ మండలం బొమ్మకల్ ప్రభుత్వ భూమిలోని సర్వేనం.728లో నిర్వహిస్తున్న సమ్మక్క జాతరను పంచాయతీ ఆధ్వర్యంలో నిర్వహించేందుకు తగిన చర్యలు చేపట్టాలని కోరుతూ శనివారం ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు గాలిపల్లి శ్రీనివాస్, గోష్కి శంకర్, జకినపల్లి శంకర్, ఏడెల్లి సతీశ్‌లు ఎంపీవో జగన్మోహన్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. కొంతమంది వ్యక్తులు కొన్నేళ్ల నుంచి జాతరను నిర్వహిస్తూ సొమ్ము చేసుకుంటున్నారని తెలిపారు. భక్తులకు ఎలాంటి సౌకర్యాలు కల్పించడం లేదని వివరించారు. గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో జాతరను నిర్వహించి పంచాయతీకి ఆదాయం వచ్చేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

ఆకట్టుకున్న ఆర్ట్ అండ్ క్రాఫ్ట్ ఎగ్జిబిషన్



ప్రదర్శనలు తిలకిస్తున్న తల్లిదండ్రులు

సప్తగిరికాలనీ: నగరంలోని కోతిరాంపూర్‌లో గల అచీవర్స్ పాఠశాలలో శనివారం ఆర్ట్ అండ్ క్రాఫ్ట్ ఎగ్జిబిషన్ నిర్వహించారు. విద్యార్థులు పనికిరాని వస్తువులతో గృహ అలంకరణ వస్తువులు, ప్లాస్టిక్ సంచులకు బదులు చేనేత సంచుల తయారీ, పర్యావరణాన్ని వ్యర్థపదార్థాల నుంచి ఎలా రక్షించాలో తమ కళాఖండాల ద్వారా ప్రదర్శించి ఆకట్టుకున్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ సీహెచ్.వెంకటేశ్వర్లు, ప్రిన్సిపాల్ సీహెచ్.పల్లవి, విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

22న మందకృష్ణ మాదిగ రాక

విద్యానగర్: ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ ఈనెల 22న కరీంనగర్‌కు వస్తున్నట్లు ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు బెజ్జంకి అనిల్ తెలిపారు. శనివారం కరీంనగర్‌లోని కృషిభవన్‌లో నిర్వహించిన ఎమ్మార్పీఎస్ జిల్లా కమిటీ సమావేశంలో మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణ స్వప్నం నెరవేరే ఈ సమయంలో వర్గీకరణ ఉద్యమాన్ని మూడు దశాబ్దాలుగా కాపాడిన మాదిగ జాతికి ధన్యవాదాలు తెలిపారు. 22న మందకృష్ణ కరీంనగర్ పర్యటనను విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో ఎమ్మార్పీఎస్ నాయకులు తుంగ ఆంజనేయులు, రుద్రారం రాంచందర్, ఆవునూరి ప్రభాకర్, తునికి సంపత్, ఎలగందుల బిక్షపతి, రాజేశ్వరి, అంజయ్య, శంకర్, ఆదిత్య, అంజిబాబు, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

గుల్జార్‌కి జ్ఞానపీఠ్ రావడం అభినందనీయం

కరీంనగర్‌కల్చరల్: గుల్జార్ లాంటి గొప్ప కవికి జ్ఞానపీఠ పురస్కారం రావడం అభినందనీయమని కేంద్ర సాహిత్య అవార్డు గ్రహీత వారాల ఆనంద్ ఒక ప్రకటనలో తెలిపారు. గుల్జార్ గొప్ప కవి, సినీ గేయ రచయిత, రచయిత, సినీ దర్శకుడు అన్నారు. గుల్జార్ రచించిన 'గ్రీన్ పోయెమ్స్' కవిత్వ సంకలనాన్ని తాను తెలుగులోకి 'ఆకుపచ్చ కవితలు' పేర అనువదించినందుకు గతేడాది కేంద్ర సాహిత్య అవార్డు లభించిందని పేర్కొన్నారు.

పూలే విగ్రహానికి క్షీరాభిషేకం

విద్యానగర్(కరీంనగర్): అసెంబ్లీలో బీసీ గణన బిల్లు ప్రవేశపెట్టినందుకు శనివారం కరీంనగర్‌లోని మహాత్మా జ్యోతిబాపూలే విగ్రహానికి రజక సంఘం నాయకులు క్షీరాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో రజక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మావురపు రాజుకుమార్, బీసీ జనసేన వ్యవస్థాపకులు తిప్పారపు ఆంజనేయులు.రజక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మునిగంటి అజయ్, యాదవ సంఘం రాష్ట్ర నాయకుడు మునిగంటి బాలయ్య పాల్గొన్నారు.

హోంగార్డుపై కేసు

కరీంనగర్‌క్రైం: జిల్లా పోలీసు విభాగంలో హోంగార్డుగా పనిచేస్తూ భూమి విక్రయిస్తానని డబ్బులు అవసరం ఉందని నాలుగు లక్షల తీసుకొని మోసం చేయడంతో పాటు అడిగితే బెదిరింపులకు గురిచేసిన విషయంలో ఓ హోంగార్డుపై కేసు నమోదైన విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాలు ఇలా ఉన్నాయి. కరీంనగర్‌లో హోంగార్డుగా పనిచేస్తున్న పల్లెర్ల చక్రపాణి గతంలో రిటైర్డ్ ఏఎస్‌ఐ గంధం లక్ష్మీనారాయణ దగ్గరికి వచ్చి తనకు అత్యవసరంగా నాలుగు లక్షల అవసరం ఉందని, దీనికి బదులుగా కాల్వ శ్రీరాంపూర్ మండలం కిష్టంపేటలోని భూమిని రిజిస్ట్రేషన్ చేస్తానని చెప్పి డబ్బులు తీసుకున్నారు. ఎన్నిసార్లు అడిగినా భూమి రిజిస్ట్రేషన్ చేయకపోవడంతో పాటు తనకు రావాల్సిన డబ్బులు అడిగితే బెదిరింపులకు గురి చేశాడని బాధితుడు లక్ష్మీనారాయణ ఇటీవల సీపీకి ఫిర్యాదు చేయడంతో పోలీసులు హోంగార్డు చక్రపాణిపై కేసు నమోదు చేసినట్లు సమాచారం.

- ఇంటి ఆవరణలో మొక్కల పెంపకంపై ఆసక్తి చూపుతున్న నగరవాసులు

ఇల్లే నందనవనం



కరీంనగర్‌లో ఇంటి ఆవరణలో పూల మొక్కలు

విద్యానగర్(కరీంనగర్): ఓ మంచి ఇల్లు కట్టుకోవాలనే కోరిక అందరిలో ఉంటుంది. అన్నీ అనుకూలించి ఇంటి నిర్మాణం పూర్తవ్వగానే నివాసం లోపల బయట సుందరంగా తీర్చిదిద్దాలని ఆకాంక్ష మొదలవుతుంది. కొందరు డబ్బులు పెట్టి ఖరీదైన అలంకరణ వస్తువులు తీసుకొస్తారు. మరికొందరు పచ్చని మొక్కలతో చక్కని వాతావరణం ఏర్పాటు చేసుకోవాలనుకుంటారు. ఈ విధంగా నగరంలో పలువురు తమ ఇంటి ఆవరణలో పూల మొక్కలు పెంచుతూ ఆకట్టుకుంటున్నారు. కాసింత సమయం వెచ్చించి ఇంటినే సుందరవనంలా మార్చుకొని అందంగా తీర్చిదిద్ది ఆనందాన్ని పొందుతున్నామంటున్నారు చాలా మంది నగరవాసులు.

ఆకట్టుకునేలా..

భగ్యనగర్‌లోని కొడ్లడీ రజనీ శివరాం శెట్టి నివాసం, భగత్‌నగర్‌లోని మాడిశెట్టి గోపాల్, జ్యోతినగర్‌లోని తొడుపునూరి సంతోష్‌కుమార్, కాసనగొట్టు శ్రీధర్, రాంనగర్‌లోని మాలతిల ఇళ్లు నందనవనంలా పూల చెట్లతో ఆకట్టుకుంటున్నాయి. వారి ఇంటి ఆవరణలోకి అడుగు పెట్టగానే అందమైన మొక్కలు వివిధ పూలతో అతిథులను ఆహ్లాదపరుస్తూ ఆహ్వానిస్తాయి.

మొక్కలు ఆహ్లాదాన్నిస్తాయి



పచ్చని వాతావరణం అంటే ప్రాణం. అందమైన మొక్కలు ఆహ్లాదాన్ని, ప్రశాంతతను కలిగిస్తాయి. 20 ఏళ్లుగా ఇంట్లో ఖాళీ స్థలం లేకున్న బాలకనీ, వరండాల్లో కుండీలు పెట్టి గులాబీ, మందారాలు, ఇతర పూల మొక్కలు పెంచుతున్నాం. ఆకర్షనీయమైన మొక్కల ఖరీదు ఎంత ఉన్నప్పటికీ తీసుకొస్తా. వీటి సంరక్షణకు ప్రతిరోజూ రెండు గంటల సమయాన్ని వెచ్చిస్తాను.

– కొడ్లడీ రజనీ శెట్టి, భాగ్యనగర్, కరీంనగర్

పిల్లల కంటే జాగ్రత్తగా..



మా ఇద్దరికి మొక్కలంటే ప్రాణం. మాకు ఇద్దరు పిల్లలు వారు జీవితాల్లో స్థిరపడ్డారు. వారికి పెళ్లిళ్లు అయ్యాయి. ఇప్పుడు మొక్కలనే పిల్లాల్ల జాగ్రత్తగా చూసుకుంటున్నాం. ప్రతీరోజు ఉదయం రెండు గంటలు వాటి సంరక్షణ కోసం వెచ్చిస్తాం. నీళ్ల పట్టడం, ఎరువులు వేయడం, పాత మట్టి తీసి కొత్త మట్టి వేయడం, అందంగా తీర్చిదిద్దడం తదితర పనులు చేస్తాం.

–కొడ్లడీ శివరాం శెట్టి, భాగ్యనగర్, కరీంనగర్

పూల మొక్కలు అంటే ఇష్టం



నాకు పూల మొక్కలంటే చాలా ఇష్టం. వివిధ రకాల, రంగుల్లో ఉండే గులాబీలు, మందారా, క్రోటాన్స్ మొక్కలను ఎక్కువగా ఇష్టపడుతా. వాటిని ఎక్కువగా పెంచుతా. గులాబీలు కాలంతో సంబంధం లేకుండా రోజు పూస్తాయి. వివిధ రంగుల్లో ఉండే గులాబీలు చూడడంతోనే మనసు ఆహ్లాదం అవుతుంది.

– మాడిశెట్టి గోపాల్, రాంచంద్రాపూర్ కాలనీ, కరీంనగర్

సంతోషంగా ఉంటుంది



పూల మొక్కలను, వాటికి పూసిన పూలను చూడడంతోనే సంతోషంగా ఉంటుంది. ఆఫీస్‌లో ఎంత పని ఒత్తిడితో మనసు చికాకుగా ఉండి ఇంటికి వచ్చిన తర్వాత మొక్కలను చూడగానే మనసు ప్రశాంతం అవుతుంది. మా ఇంటిల్లిపాదికి మొక్కలంటే ప్రాణం. ఎక్కడ కొత్తరకం మొక్క కనిపించిన తీసుకొచ్చి ఇంట్లో నాటుతాం. – ఎ. మాలతి, రాంనగర్, కరీంనగర్

కూరగాయల మొక్కలు పెంచుతాం



ఇంట్లో ఎక్కువగా కూరగాయల చెట్లు పెంచుతాం. నెల రోజుల్లో కాపుకొచ్చే రకాలు పెంచడం వల్ల కూరగాయలు తెచ్చుకునే బాధలేకుండా పోయింది. కూరగాయల ఖర్చు కూడా లేదు. రోజుకో రకం కూరగాయలు తెంపుకొని ఏరోజుకారోజు ఫ్రెష్‌గా కూర వండుకుంటాం.

– తొడుపునూరి సంతోష్‌కుమార్, జ్యోతినగర్, కరీంనగర్

ప్రశాంతతను కలిగిస్తాయి



ఇంట్లో ఉండే అందమైన మొక్కలు ఆహ్లాదాన్ని, ప్రశాంతతను కలిగిస్తాయి. ఇంట్లో ఖాళీ స్థలం లేకున్న, బాల్కనీ, వరండాల్లో కుండీలు పెట్టి గులాబీ, మందారాలు, ఇతర పూల మొక్కలు పెంచితే అందంగా కనిపించడమే కాకుండా ఆహ్లాదాన్నిస్తాయి.

– కాసనగొట్టు శ్రీధర్, జ్యోతినగర్, కరీంనగర్

సమ్మక్క జాతరకు రెడీ



కరీంనగర్ మండలం నగునూరు, ఇరుకుల్ల గ్రామాల్లో ఈనెల 21నుంచి సమ్మక్క జాతరను ఘనంగా నిర్వహించేందుకు నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఇరుకుల్లలోని పాతరోడ్డులో జాతర వ్యవస్థాపకుడు బుర్ర చంద్రయ్యగౌడ్, నగునూరులో వాగు సమీపంలో జాతర కమిటీ చైర్మన్ దిలీప్‌గౌడ్‌ల ఆధ్వర్యంలో జాతరకు వచ్చే భక్తులకు అవసరమైన తాగునీరు, స్నానాలు చేసేందుకు నల్లాలు, విద్యుత్ సౌకర్యం కల్పిస్తున్నారు. జాతర జరిగే ప్రాంతాన్ని చదును చేశారు. సమ్మక్క, సారలమ్మ గద్దెలకు రంగులు వేసి అలంకరించారు. ఆయా గ్రామాల్లో జాతర కమిటీ సభ్యులతో పాటు అధికారులు భక్తులకు ఇబ్బంది కలగకుండా అన్ని రకాల సౌకర్యాలు కల్పిస్తున్నారు. – కరీంనగర్‌రూరల్

సమష్టి కృషితోనే ఉత్తమ ఫలితాలు



మాట్లాడుతున్న డీఈవో జనార్దన్‌రావు

కరీంనగర్‌రూరల్:తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమష్టి కృషితోనే ఎస్సెస్సీలో విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధిస్తారని జిల్లా విద్యాధికారి జనార్దన్ రావు అన్నారు. శనివారం కరీంనగర్ మండలం చామనపల్లి ఉన్నత పాఠశాలలో నిర్వహించిన తల్లిదండ్రులు–ఉపాధ్యాయుల సమావేశానికి డీఈవో ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. తల్లిదండ్రులు తమ పిల్లలపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. ఉపాధ్యాయులతో తల్లిదండ్రులు సత్సంబంధాలు పెంపొందించుకోవాలని సూచించారు. ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకుని ఎస్సెస్సీలో వందశాతం ఉత్తీర్ణత సాధించాలని కోరారు. ప్రతినెలా నిర్వహించే సమావేశానికి తల్లిదండ్రులు హాజరై తమ పిల్లల చదువుపై వివరాలు తెలుసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో మధుసూదనచారి, ప్రధానోపాధ్యాయుడు కోట లక్ష్మారెడ్డితో పాటు ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పూలే ఆశయాల వారసుడు పొన్నం



సంబరాలు నిర్వహిస్తున్న కాంగ్రెస్ కార్యకర్తలు

కరీంనగర్ కార్పొరేషన్: మహాత్మా జ్యోతి బాపూలే ఆశయాల వారసుడు రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అని కాంగ్రెస్ నాయకులు కొనియాడారు. సమగ్ర కుల గణనకు అసెంబ్లీలో ఏకగ్రీవంగా తీర్మాణం చేయడంపై మంత్రి పొన్నం ప్రభాకర్‌కు ధన్యవాదాలు తెలియచేస్తూ శనివారం నగరంలోని శాతవాహనయూనివర్సిటీ చౌరస్తాలో ఉన్న జ్యోతి బాపూలే విగ్రహం వద్ద సంబరాలు నిర్వహించారు. పూలే విగ్రహానికి క్షీరాభిషేకం చేసి, స్వీట్లు పంచి, టపాసులు కాల్చారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ నాడు స్వరాష్ట్ర ఆకాంక్ష కోసం పార్లమెంట్‌లో కొట్లాడిన పొన్నం ప్రభాకర్ నేడు బీసీ కుల జన గణన బిల్లు తీర్మాణించేట్లు చేశారన్నారు. కాంగ్రెస్ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు పులి ఆంజనేయులు, నగర అధ్యక్షుడు బోనాల శ్రీనివాస్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో డీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ కోమటిరెడ్డి పద్మాకర్‌రెడ్డి, నియోజకవర్గ ఇన్‌చార్జి పురుమల్ల శ్రీనివాస్, నాయకులు మల్యాల సుజిత్‌కుమార్, శ్రావణ్ నాయక్, రామిడి రాజిరెడ్డి, బాల బద్రి శంకర్, వంగల విద్యాసాగర్, నాగుల సతీష్, హస్తపురం రమేష్, గంగుల దిలీప్, నెల్లి నరేశ్, వెన్నమ రజితరెడ్డి, జ్యోతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కేసీఆర్ జన్మదిన వేడుకలు



షూ పంపిణీ చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు



పూజలు చేస్తున్న పొన్నం అనిల్‌కుమార్ గౌడ్



చామనపల్లిలో కేక్ కట్ చేస్తున్న ఎంపీపీ లక్ష్మయ్య



కొత్తపల్లిలో కేక్ కట్ చేస్తున్న మున్సిపల్ చైర్మన్ రుద్ర రాజు



చింతకుంటలో కేక్ కట్ చేస్తున్న ఎంపీపీ పిల్లి శ్రీలతమహేష్

సప్తగిరికాలనీ: మాజీ సీఎం చంద్రశేఖర్‌రావు జన్మదిన వేడుకలను శనివారం నగరంలో ఘనంగా నిర్వహించారు. 3వ డివిజన్ కార్పొరేటర్ కంసాల శ్రీనివాస్ ఆధ్వర్యంలో అన్నదానం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో నాయకులు చిలుముల మహేందర్, షౌకత్, నవాజ్ తదితరులు పాల్గొన్నారు. మార్కెట్ వద్ద గల అనాథ వృద్ధుల ఆశ్రమంలో బీఆర్‌ఎస్ జిల్లా నాయకుడు పెండ్యాల మహేశ్ ఆధ్వర్యంలో పండ్లు, బ్రెడ్ పంపిణీ చేసి కేక్ కట్ చేశారు. మాజీ మేయర్ రవీందర్‌సింగ్ హరిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. బాలికల పాఠశాల పక్కన ఉన్న అనాథ పిల్లల స్కూల్‌లో మాజీ మేయర్ రవీందర్‌సింగ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు బూట్లు, సాక్సులు పంపిణీ చేశారు. నాయకులు మైకేల్ శ్రీనివాస్, యూసుఫ్, శ్రవణ్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీవేంకటేశ్వరాలయంలో ప్రత్యేక పూజలు

కరీంనగర్‌కల్చరల్: మార్కెట్‌రోడ్ వేంకటేశ్వరాలయంలో జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ పొన్నం అనిల్‌కుమార్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. బీఆర్‌ఎస్వీ శాతవాహన విశ్వవిద్యాలయ ఇన్‌చార్జి చుక్కా శ్రీనివాస్, నగర అధ్యక్షుడు మోహన్, నాయకులు రవిగౌడ్, వసంత్, పర్శురాం, రమేశ్, శ్రీనివాస్‌రెడ్డి, వరప్రసాద్, కిరణ్‌గౌడ్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

కరీంనగర్ మండలంలో..

కరీంనగర్‌రూరల్: కరీంనగర్ మండలం చెర్లభూత్కూర్, చామనపల్లి, మొగ్దుంపూర్, ఎలబోతారం గ్రామాల్లో శనివారం మాజీ సీఎం కేసీఆర్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమాల్లో ఎంపీపీ టి.లక్ష్మయ్య, ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడు బి.తిరుపతిగౌడ్, నాయకులు పి.శ్యాంసుందర్‌రెడ్డి, ఎస్.సంపత్‌రావు, డి.రమణారెడ్డి, కె.శ్యాంసుందర్‌రెడ్డి, జి.శ్రీనివాస్‌గౌడ్, పి.తిరుపతియాదవ్, ఎం.రమేశ్‌గౌడ్, అజయ్‌గౌడ్, లక్ష్మణ్, సుదర్శన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కొత్తపల్లిలో..

కొత్తపల్లి: కేసీఆర్ జన్మదినం సందర్భంగా కొత్తపల్లిలో ఏర్పాటు చేసిన కేక్‌ను మున్సిపల్ చైర్మన్ రుద్రరాజు కట్ చేసి పంచిపెట్టారు. కౌన్సిలర్లు ఎం.వేణుగోపాల్, గండు రాంబాబు, సత్యనారాయణరెడ్డి, కోఆప్షన్ సభ్యులు ఫక్రుద్దీన్, ప్రభాకర్, బీఆర్‌ఎస్ నాయకులు ఎండి జమీలొద్దీన్, ఎస్కేబాబా, కట్ల సుధాకర్, శ్రీకాంత్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

చింతకుంటలో..

చింతకుంటలో ఎంపీపీ పిల్లి శ్రీలతమహేష్ కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్, జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు సాబీర్‌పాషా, ఎంపీటీసీ తిరుపతినాయక్, మాజీ ఏఎంసీ చైర్మన్ రెడ్డవేణి మధు, మాజీ వైస్ చైర్మన్ రాజశేఖర్, మాజీ సర్పంచులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

శ్రీనివాస్‌రెడ్డి సేవలు మరువలేనివి



శ్రీనివాస్‌రెడ్డిని సన్మానిస్తున్న ఎంపీటీసీలు, మాజీ సర్పంచులు, సిబ్బంది

కొత్తపల్లి: కొత్తపల్లి మండల అభివృద్ధికి ఎంపీడీవో శ్రీనివాస్‌రెడ్డి (శీనన్న) చేసిన సేవలు మరువలేనివని పలువురు కొనియాడారు. కొత్తపల్లి ఎంపీడీవోగా పనిచేసి ఇటీవల బదిలీపై వెళ్లిన శ్రీనివాస్‌రెడ్డికి ఆత్మీయ వీడ్కోలు పలుకుతూ నూతనంగా నియామకైన కటుకం ప్రభుకు స్వాగతం పలుకుతూ శనివారం మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో పలువురు ప్రసంగించారు. కొత్తపల్లి మండలానికి రెండు సార్లు ఉత్తమ మండల అవార్డు రావడానికి విశేషంగా కృషి చేసారని, ప్రజాప్రతినిధులు, సబార్డినేట్లతో సఖ్యతగా ఉంటూ మండల అభివృద్ధికి శ్రీనివాస్‌రెడ్డి కృషి చేశారని ఎంపీపీ పిల్లి శ్రీలతమహేష్ కొనియాడారు. నూతనంగా వచ్చిన ఎంపీడీవో ప్రభు సైతం అందరిని సమన్వయం చేస్తూ మండలాన్ని అగ్రగామిగా నిలుపుతారని ఆకాంక్షించారు. ఎంపీవో శ్రీనివాస్, ఎంపీటీసీలు తిరుపతినాయక్, రమేశ్‌గౌడ్, శారదల క్ష్మీనారాయణ, హేమలత రవికిరణ్, మాజీ సర్పంచులు, సిబ్బంది పాల్గొన్నారు. అనంతరం శ్రీనివాస్‌రెడ్డిని గజమాలతో సత్కరించి జ్ఞాపిక అందజేశారు.

ఇన్‌స్పైర్ అవార్డుకు ఎంపిక



విద్యార్థులతో ప్రిన్సిపాల్ బబిత

కరీంనగర్‌రూరల్: బొమ్మకల్ బైపాస్‌లోని బిర్లా ఓపెన్‌మైండ్స్ స్కూల్ విద్యార్థులు జిల్లాస్థాయి ఇన్‌స్పైర్ అవార్డుకు ఎంపికయ్యారు. లావర్తి సన నీటిపై తేలియాడే చెత్తను సేకరించే యంత్రం, రయాన్ అబ్దుల్లా బహుళ ఉపయోగ వాహనం, సదుర్ల వైనవి రైలు ప్రమాదాల నివారణ వ్యవస్థపై చేసిన పరిశోధనలు ఎంపికయ్యాయి. ఇన్‌స్పైర్ అవార్డుకు ఎంపికైన విద్యార్థులను శనివారం స్కూల్ ప్రిన్సిపాల్ బబిత విశ్వనాథన్ అభినందించారు.

అట్టహాసంగా 'సిద్ధార్థ సంస్కృతి 2024'





నృత్యం చేస్తున్న చిన్నారులు

సప్తగిరికాలనీ(కరీంనగర్): నగరంలోని బీఆర్ అంబేడ్కర్ స్టేడియంలో శనివారం రాత్రి సిద్ధార్థ సంస్కృతి 2024 పేరిట నిర్వహించిన సిద్ధార్థ విద్యాసంస్థల వార్షికోత్సవ వేడుకలు అలరించాయి. వేడుకలను క్రిసాలీస్ ఫౌండర్ అండ్ సీఈవో చిత్రా రవి, సిద్ధార్థ విద్యాసంస్థల చైర్మన్ దాసరి శ్రీపాల్‌రెడ్డిలు జ్యోతి ప్రజ్వల చేసి ప్రారంభించారు. విద్యార్థులు విద్యార్థి దశలోనే విద్యతో పాటు సంస్కారం నేర్చుకోవాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు చేసిన మిలేసురా, మేరా తుమారా, రామాయణం, ఫ్లాష్‌మాబ్, నవ దుర్గల నృత్యాలు అలరించాయి. ప్రిన్సిపాల్స్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

20న ఉద్యోగ మేళా

విద్యానగర్(కరీంనగర్): అపోలో హోమ్ హెల్త్ కేర్ హైదరాబాద్‌లో నర్సు ఉద్యోగాలు కలిపించేందుకు ఈనెల 20న కరీంనగర్ జిల్లా ఉపాధి కల్పనా కార్యాలయంలో ఉద్యోగ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారి దేవేందర్ తెలిపారు. ఎంపీడబ్ల్యు, ఏఎన్‌ఎం. జీఎన్‌ఎం. బీఎస్సీ నర్సింగ్ పూర్తి చేసిన 18–35 ఏళ్ల లోపు ఆసక్తిగల అభ్యర్థులు విద్యార్హత సర్టిఫికెట్లతో హాజరు కావాలని ఆయన కోరారు.

రాష్ట్రస్థాయి చిత్రలేఖనం పోటీలకు 'పారమిత' విద్యార్థులు



ఎంపికైన విద్యార్థులు

సప్తగిరికాలనీ: నగరంలో భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన జిల్లాస్థాయి కథా రచన, చిత్రలేఖనం పోటీల్లో పారమిత పాఠశాల విద్యార్థులు విశ్వశ్రీ, రిత్విక్‌యాదవ్‌లు ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రిన్సిపాల్ ప్రశాంత్ తెలిపారు. ఎంపికైన విద్యార్థులను విద్యాసంస్థల అధినేత ఇనుగంటి ప్రసాదరావు, డైరెక్టర్లు ప్రసూన, రష్మిత, రాకేశ్, వినోద్‌రావు, హనుమంతరావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందించారు.

రిటైర్డ్ ఉద్యోగి అదృశ్యం



ముజఫర్ హుస్సేన్

కరీంనగర్ క్రైం: నగరంలోని సుభాష్‌నగర్‌లో నివాసం ఉంటున్న రిటైర్డ్ ఉద్యోగి ఎండీ.ముజఫర్ హుస్సేన్ అదృశ్యమైనట్లు త్రీటౌన్ పోలీసులు తెలిపారు. వారి వివరాల ప్రకారం.. ముజఫర్ హుస్సేన్ మానసిక పరిస్థితి సరిగా లేదు. శుక్రవారం ఉదయం 11 గంటలకు ఎవరికీ చెప్పకుండా ఇంట్లో నుంచి వెళ్లిపోయాడు. కుటుంబసభ్యులు చుట్టుపక్కల, బంధువుల ఇళ్లలో వెతికినా ఫలితం లేకపోయింది. దీంతో ఆయన భార్య రిజ్వానాబేగం శనివారం త్రీటౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ

కరీంనగర్‌క్రైం: నగరంలోని హౌజింగ్‌బోర్డుకాలనీలో రిటైర్డ్ ఉద్యోగి పృథ్వీధర్‌రావు ఇంట్లో చోరీ జరిగినట్లు త్రీటౌన్ పోలీసులు తెలిపారు. పృథ్వీధర్‌రావు శుక్రవారం తన ఇంటికి తాళం వేసి టుంబసభ్యులతో సహా జగిత్యాలకు వెళ్లారు. శనివారం ఉదయం ఇంటి పని మనిషి వెళ్లి చూసేసరికి తాళం పగులగొట్టి ఉండటంతో అనుమానం వచ్చి యజమానికి ఫోన్ ద్వారా సమాచారం అందజేసింది. జగిత్యాల నుంచి వచ్చి చూసే సరికి ఇంట్లోని బీరువాలో గల 26 గ్రాముల బంగారం కనిపించలేదు. ఈమేరకు త్రీటౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మార్కండేయ నిత్యాన్నసత్రం ధర్మకర్త మండలి సభ్యుడిగా మల్లేశం



మల్లేశం

సప్తగిరికాలనీ: బాసరలోని ప్రముఖ పుణ్యక్షేత్రం సరస్వతీదేవి ఆలయం వద్ద నిర్మిస్తున్న అఖిల భారత భక్త మార్కండేయ నిత్యాన్నసత్రం ధర్మకర్త మండలి సభ్యుడిగా పద్మశాలి సంక్షేమ ట్రస్ట్ జిల్లా అధ్యక్షుడు స్వర్గం మల్లేశం నియామకమయ్యారు. మల్లేశం జిల్లాలో పద్మశాలి సంఘం బలోపేతం కోసం, పోపా, సంక్షేమ ట్రస్ట్ కోసం నిరంతరం కృషి చేస్తున్నారు మల్లేశం నియామకం పట్ల పద్మశాలి సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు వాసాల రమేశ్, అధ్యక్షుడు మెతుకు సత్యం, ప్రధాన కార్యదర్శి వొల్లాల కృష్ణహరి, సంక్షేమ ట్రస్ట్ ప్రధాన కార్యదర్శి అల్స భద్రయ్య, కోశాధికారి దూడం శ్రీనివాస్, జిల్లా ప్రచార కార్యదర్శి మార్త ప్రకాశ్, పట్టణ అధ్యక్షుడు గడ్డం శ్రీరాములు, పోపా అధ్యక్షుడు పోలు సత్యనారాయణ తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

ఆహ్లాదం అందేదెప్పుడో?



ఇది అడవిలోని అందాలను తిలకించేందుకు ఏర్పాటు చేసిన కట్టె వంతెన. ప్రత్యేకంగా కొలనను ఏర్పాటు చేసి, పర్యాటకులకు ఆహ్లాదం పంచాలనే ఉద్దేశంతో దీన్ని ఏర్పాటు చేశారు. ఇలా అర్బన్‌పార్క్‌లో పట్టణాలకు దీటుగా అనేక రకాల సుందరీకరణ పనులు చేశారు. అర్బన్‌పార్క్‌లో చేసిన అనేక ఆహ్లాదకర పనులు అర్ధంతరంగా నిలిచిపోయాయి. గత మూడేళ్లుగా జిల్లా ప్రజలకు దరి చేరడం లేదు.



ఇది ఎల్లారెడ్డిపేట మండలం హరిదాస్‌నగర్‌లోని అర్బన్‌పార్క్‌లో ఏర్పాటు చేసిన యోగా షెడ్డు కుటీరాలు. కర్రలతో ఏర్పాటు చేసిన ఈ షెడ్లు అర్బన్ పార్క్‌కు అదనపు ఆకర్షణను తెచ్చాయి. 200 ఎకరాల విస్తీర్ణంలో ఇలాంటి ఏర్పాట్లు అనేకం ఉన్నాయి. ఇన్ని పనులు చేసినా సకాలంలో ప్రజలకు అందుబాటులోకి రాక ప్రకృతి ప్రేమికులు, ఇతర ప్రాంతాల నుంచి రాజన్న దర్శనానికి వచ్చే భక్తులు నిరుత్సాహ పడుతున్నారు .వెంటనే పార్క్‌ను అందుబాటులోకి తేవాలని కోరుతున్నారు.



అర్బన్‌పార్క్ ముఖద్వారం

- అర్బన్‌పార్క్ ప్రారంభానికి ఎదురుచూపులు
- మూడున్నరేళ్లుగా సాగుతున్న పనులు
- రూ.3కోట్లతో 200 ఎకరాల్లో పార్కు అభివృద్ధి
- రూ.1.40కోట్లతో ఆక్సిజన్ పార్క్
- నిలిచిన పనులు.. దరి చేరని పర్యాటకాభివృద్ధి

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): జిల్లా ప్రజలకు, వివిధ ప్రాంతాల నుంచి వేములవాడ రాజన్న దర్శనానికి వచ్చే భక్తులకు సిరిసిల్ల పట్టణ ప్రజలకు ఆహ్లాదం అందించాలనే లక్ష్యంతో ఏర్పాటు చేసిన అర్బన్ పార్క్ పనులు అర్ధంతరంగా నిలిచిపోయాయి. ఏళ్లుగా పనులు కొనసాగుతుండడంపై ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి త్వరగా అందుబాటులోకి తేవాలని కోరుతున్నారు.

200 ఎకరాల్లో విస్తీర్ణం

ఎల్లారెడ్డిపేట మండలం హరిదాస్‌నగర్ శివారులో సిరిసిల్ల–కామారెడ్డి ప్రధాన రహదారి సమీపంలో దట్టమైన అటవీ ప్రాంతంలో నిర్మిస్తున్న అర్బన్ పార్క్ పనులు మూడేళ్లుగా కొనసాగుతున్నాయి. గత ప్రభుత్వం మూడేళ్ల క్రితం రూ.3కోట్లతో 200 ఎకరాల విస్తీర్ణంలో అర్బన్‌పార్క్ ఏర్పాటుకు శ్రీకారం చుట్టింది. పార్క్‌లో రూ.1.40కోట్లతో ఆక్సిజన్ పార్క్ సైతం సిద్ధమైంది. పనులు పూర్తికావచ్చినా ప్రారంభానికి నోచుకోవడం లేదు. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం మారడంతో ఇప్పట్లో అర్బన్‌పార్క్ ప్రారంభానికి నోచుకుంటుందా.. అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

మూడేళ్లుగా సాగుతున్న పనులు

పోతిరెడ్డిపల్లి రిజర్వ్ ఫారెస్ట్ పరిధిలోని హరిదాస్‌నగర్ శివారులో అర్బన్‌పార్క్ ఏర్పాటుకు రూ.3 కోట్లతో 2020 జూన్ 26న అప్పటి స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డితో కలిసి మాజీ మంత్రి కేటీఆర్ పనులు ప్రారంభించారు. వీటికి తోడు రూ.1.40కోట్లతో అదనంగా ఆక్సిజన్ పార్క్, చిల్డ్రన్‌పార్క్‌కు రూపకల్పన చేస్తూ నిధులు మంజూరు చేశారు. పనులు చివరిదశలో నిలిచిపోయాయి.

ఆకర్షణీయంగా పార్క్ అందాలు

ఎల్లారెడ్డిపేట మండలం హరిదాస్‌నగర్‌లో 581 హెక్టార్ల విస్తీర్ణంలో అటవీ ప్రాంతం ఉంది. 200 హెక్టార్లలో దట్టమైన చిట్టడవిని పెంచుతూ.. 10 హెక్టార్లలో ప్రజలకు అవసరమైన ఏర్పాట్లను చేశారు. పిల్లలు, పెద్దలు ఉత్సాహంగా ఆడుకోవడంతో పాటు ఆహ్లాదాన్ని అనుభవించేందుకు చిల్డ్రన్ ప్లే ఏరియా, గజిబో, యోగా కేంద్రం, కార్తీకవనం, పిక్నిక్ ఏరియా, కల్చర్ పార్క్, అర్బన్‌గార్డెన్, వాచ్ టవర్, ట్రెక్కింగ్ పార్క్, యోగాషెడ్ల నిర్మాణాలు చేపట్టారు. ఎంట్రన్స్ ప్లాజా, లోటస్‌పాండ్, రక్షణకంచెలు, చెక్‌డ్యామ్ పనులు పూర్తయ్యాయి. మిగిలిన పనులు సకాలంలో పూర్తి చేసి ఇప్పటికైనా అర్బన్‌పార్క్‌ను అందుబాటులోకి తేవాలని జిల్లా ప్రజలు కోరుతున్నారు.

అందుబాటులోకి తేవాలి



జిల్లా ప్రజలకు ఆహ్లాదం పంచడానికి అప్పటి ప్రభుత్వం రూ.3కోట్లు మంజూరు చేసింది. పనులు నత్తనడకనా సాగడంతో సకాలంలో అందుబాటులోకి రాలేదు. అర్బన్‌పార్క్‌లో ప్రజలు సేదదీరేందుకు అన్ని వసతులు కల్పించారు. అధికారులు మిగిలిన పనులు పూర్తి చేసి వెంటనే అందుబాటులోకి తేవాలి.

– చీటీ లక్ష్మణ్‌రావు, జెడ్పీటీసీ, ఎల్లారెడ్డిపేట

పనులు పూర్తికావచ్చాయి



అర్బన్‌పార్క్ పనులు పూర్తి కావచ్చాయి. 15 రోజుల్లో పార్క్ అందుబాటులోకి తెస్తాం. మొదట వారం రోజులు సందర్శకుల రాక ఎలా ఉంటుందో చూస్తాం. పార్క్ పరిసరాల్లో నీటి సమస్య ఉంది. ఎన్ని బోర్లు వేసిన నీళ్లు పడడం లేదు. పర్యాటకులకు ప్రధానంగా నీటి వసతి కల్పించాల్సిన అవసరం ఉంది. అన్ని సౌకర్యాలతో త్వరలోనే పార్క్‌ను అందుబాటులో ఉంచుతాం.

– బాపిరాజు, ఎఫ్ఎస్‌వో, ఎల్లారెడ్డిపేట

ఉన్నది పాయె.. కొత్తవి రాకపాయె

- రద్దయిన కాజీపేట–ముంబయి దాదర్ స్పెషల్ ట్రైన్
- ఊసేలేని సికింద్రాబాద్–కరీంనగర్ మెమూ రైలు
- అమలుకాని తిరుపతి ఎక్స్‌ప్రెస్ అదనపు ట్రిప్పులు
- ఉమ్మడి కరీంనగర్ జిల్లా వాసులకు తప్పని తిప్పలు



కరీంనగర్ రైల్వేస్టేషన్

సాక్షి ప్రతినిధి,కరీంనగర్: కరీంనగర్ రైల్వే నెట్‌వర్క్ తీవ్ర ఒడిదుడుకులు ఎదుర్కొంటోంది. ఒక అడుగు ముందుకు పడితే.. రెండు అడుగులు వెనకకు వేయాల్సిన పరిస్థితి. 1993లో ప్రధాని పీవీ శంకుస్థాపన చేసిన నిజామాబాద్–కరీంనగర్–పెద్దపల్లి రైల్వేలైన్ ఉత్తర తెలంగాణ రవాణా వ్యవస్థలో విప్లవాత్మక మార్పులు తీసుకొస్తుందనుకున్నారు. కానీ.. తగినన్ని నిధులు, ప్రాధాన్యం కల్పించకపోవడంతో ఈ రైల్వే నెట్‌వర్క్ అభివృద్ధిలో వేగం లోపించింది. అందుబాటులోకి వచ్చినా ఈ మార్గంలో కొత్తరైళ్ల మాట దేవుడెరుగు, నడిచే రైలును ఆపేయడంతో ఉమ్మడి కరీంనగర్ జిల్లావాసులు ఇబ్బందులు పడుతున్నారు. కరీంనగర్ రాష్ట్రంలోనే మూడో అతిపెద్ద నగరం. జనాభా పరంగా నాలుగోస్థానం. ఇక్కడి నుంచి హైదరాబాద్, తిరుపతి వెంకన్న దర్శనానికి తగినన్ని రైళ్లు అందుబాటులో లేకపోవడం దురదృష్టకరం. దీంతో 'ఉన్న రైలు పాయె.. కొత్త రైళ్లు రాక పాయె' అన్న చందంగా మారింది పరిస్థితి.

మూడు నెలలైంది..

కాజీపేట–ముంబయి దాదర్ వీక్లీ స్పెషల్ ఎక్స్‌ప్రెస్ రైలు(పెద్దపల్లి–నిజామాబాద్ మీదుగా వెళ్లే) గతేడాది నవంబర్ నుంచి రద్దయింది. ఉమ్మడి జిల్లా ప్రజలు ముఖ్యంగా ముంబయికి విద్య, ఉపాధి తదితర అవసరాల కోసం వెళ్లి, అక్కడే స్థిరపడ్డారు. వారి కోసం పెద్దపల్లి–నిజామాబాద్ మార్గంలో కాజీపేట నుంచి ముంబయి దాదర్ వీక్లీ ప్రత్యేక రైలును దక్షిణ మధ్య రైల్వే జోన్ సికింద్రాబాద్ డివిజన్ అధికారులు రెండేళ్లు విజయవంతంగా నడిపించారు. ఈ రైలును రెగ్యులర్ వీక్లీగా నడపాలన్న డిమాండ్ ఉండేది. ప్రతీరోజు ముంబయికి నడిపిస్తామని కోరుట్ల బహిరంగ సభలో ఎంపీ అర్వింద్ హామీ కూడా ఇచ్చారు. కానీ, అవేవీ అమలు కాలేదు. దీంతో ప్రస్తుతం ఉమ్మడి జిల్లా నుంచి ముంబయికి వెళ్లాలంటే నిజామాబాద్, కామారెడ్డి రైల్వేస్టేషన్లకు వెళ్లి, అక్కడి నుంచి దేవగిరి ఎక్స్‌ప్రెస్ ఎక్కాల్సి వస్తోంది.

తిరుపతి రైలు అదనపు ట్రిప్పులేవి?

రెండు నెలల క్రితం ఎంపీ బండి సంజయ్ కేంద్ర రైల్వేశాఖ మంత్రి అశ్విని వైష్ణవ్‌ను కలిశారు. కరీంనగర్–తిరుపతి సూపర్ ఫాస్ట్ రైలు సేవలను వారంలో రెండు రోజుల నుంచి నాలుగు రోజులకు పెంచాలని కోరుతూ వినతి పత్రం అందించారు. మంత్రి కూడా తక్షణమే నాలుగు రోజులు పెంచుతామన్నారు. కానీ, ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ప్రకటన రైల్వేశాఖ నుంచి విడుదల కాకపోవడం ఉమ్మడి జిల్లా రైల్వే ప్రయాణికులను నిరాశకు గురిచేస్తోంది. రైలు ప్రతీ గురువారం, ఆదివారం మాత్రమే నడుస్తుండటంతో సరిపడా సీట్లు దొరక్క భక్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గత్యంతరం లేక కొందరు అదనంగా డబ్బులు ఖర్చు చేస్తూ ఖాజీపేట, సికింద్రాబాద్, కాచిగూడ నుంచి దూర ప్రయాణం చేస్తున్నారు.

మెమూ ఎక్స్‌ప్రెస్ వచ్చేనా?

కరీంనగర్ నుంచి సికింద్రాబాద్ మెమూ ఎక్స్‌ప్రెస్ రైలును పెద్దపల్లి–కాజీపేట మీదుగా నడపాలని కోరుతూ మూడేళ్ల క్రితం ఎంపీ బండి సంజయ్ అప్పటి రైల్వే మంత్రి పీయూష్ గోయల్‌కు వినతి పత్రం ఇచ్చారు. ఈ రైలును ప్రారంభిస్తే ఉమ్మడి కరీంనగర్ జిల్లా ప్రజలకు హైదరాబాద్ వెళ్లడం సులభమవుతుంది. ప్రస్తుతం కరీంనగర్ నుంచి కాచిగూడ హైదరాబాద్ వరకు రైలు నడుస్తున్నప్పటికీ అది నిజామాబాద్ మీదుగా చుట్టూ తిరిగి వెళ్తుంది. పైగా కరీంనగర్ నుంచి మేడ్చల్ వరకు ఈ రైలు సింగిల్ రైల్వే మార్గంలో నడుస్తుంది. ఒకవేళ కరీంనగర్ నుంచి సికింద్రాబాద్ పెద్దపల్లి–కాజీపేట మీదుగా మెమూ ఎక్స్‌ప్రెస్‌ను ప్రారంభిస్తే పెద్దపల్లి నుంచి కాజీపేట వరకు మూడో మార్గం అందుబాటులోకి వస్తుంది. కాజీపేట నుంచి ఘట్‌కేసర్ డబుల్ మార్గం, ఘట్‌కేసర్ నుంచి సికింద్రాబాద్ నాలుగో మార్గం అందుబాటులో ఉంది. ఈ మార్గంలో ప్రయాణ సమయం, చార్జీ రెండూ తగ్గుతాయి.



శరణు..శరణు.. రాజన్నా





వేములవాడ: వేములవాడ రాజన్నను శనివారం 20వేల మంది భక్తులు దర్శించుకున్నారు. రాజన్నకు అభిషేకాలు, అన్నపూజలు, కోడెమొక్కులు, అమ్మవారికి కుంకుమ పూజలు చెల్లించుకున్నారు. అనంతరం బద్దిపోచమ్మకు బోనం మొక్కులు చెల్లించుకున్నారు. రాష్ట్ర టీఎన్జీవో అధ్యక్షుడు మారం జగదీశ్వర్ కుటుంబ సభ్యులతో కలసి రాజన్నను దర్శించుకున్నారు. టీఎన్జీవో రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షుడు ప్రవీణ్, ఆలయ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు ఎస్.హరికిషన్, కార్యదర్శి కూరగాయల శ్రీనివాస్, ఆలయ పర్యవేక్షకులు గోలి శ్రీనివాస్, గుండి హరిహరనాథ్, రాజశేఖర్, అల్లి శంకర్ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలు ప్రారంభం



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న శ్యాంసుందర్

కరీంనగర్‌స్పోర్ట్స్: 52వ రాష్ట్రస్థాయి సీనియర్స్ పురుషులు, మహిళల హ్యాండ్‌బాల్ పోటీలను శనివారం రేకుర్తిలోని లయోల కళాశాలలో హ్యాండ్‌బాల్ సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు గోనె శ్యాంసుందర్, శ్యామల పవన్‌కుమార్, ఉమ్మడి కరీంనగర్ జిల్లా అధ్యక్షులు వీర్ల వెంకటేశ్వర్‌రావు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. పోటీలకు 10 జిల్లాల నుంచి 360 మంది క్రీడాకారులు హాజరయ్యారు. లీగ్ కమ్ నాకౌట్ పద్ధతిలో మూడు రోజులపాటు పోటీలు జరుగనున్నాయి. కార్యక్రమంలో అబ్జర్వర్ దీపక్‌ప్రసాద్, ఢిల్లీ డిఫెన్స్ అకాడమీ నిర్వాహకులు సతీష్‌రెడ్డి, ఎస్వీజేసీ విద్యాసంస్థల చైర్మన్ మహిపాల్‌రెడ్డి, లయోల విద్యాసంస్థల ప్రిన్సిపాల్ ఫాదర్ జోసెఫ్ తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణాన్ని కాపాడాలి

- సోలార్ విద్యుత్ ఉత్పత్తి పెంచాలి
- కేంద్ర బొగ్గు శాఖ కార్యదర్శి అమ్రిత్ లాల్ మీనా



శ్రీరాంపూర్ ఓసీపీ వద్ద మొక్క నాటుతున్న అమ్రిత్‌లాల్ మీనా

శ్రీరాంపూర్: పర్యావరణాన్ని కాపాడడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కేంద్ర బొగ్గు శాఖ కార్యదర్శి అమ్రిత్ లాల్ మీనా తెలిపారు. శనివారం మంచిర్యాల జిల్లా శ్రీరాంపూర్ ఓపెన్ కాస్ట్ గనిని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా సింగరేణి సీఎండీ యన్.బలరాంతో కలిసి ఎకో పార్క్‌కు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం ఓపెన్ కాస్ట్ వ్యూ పాయింట్ నుంచి క్వారీ ఆపరేషన్స్ పనులు పరిశీలించారు. అధికారులు ఆయనకు ఓసీపీ ఉత్పత్తి వివరాలు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలుష్య నియంత్రణకు పచ్చదనం పెంచాలని అన్నారు. సింగరేణి సంస్థ బొగ్గు ఉత్పత్తితోపాటు విద్యుత్ డిమాండ్ మేరకు సోలార్ విద్యుత్, జల విద్యుత్తు ఉత్పత్తికి మరింత కృషి చేయాలని తెలిపారు. సింగరేణి సంస్థ ద్వారా ఎంతోమంది ప్రత్యక్షంగా, పరోక్షంగా జీవనం సాగిస్తున్నారని అన్నారు. కంపెనీ ఇక్కడ ఏర్పాటు చేస్తున్న ఎకోపార్క్ పూర్తయితే మంచి ఆహ్లాదం పంచుతుందని పేర్కొన్నారు. బొగ్గు శాఖ కార్యదర్శి, కంపెనీ సీఎండీలు మొక్కలు నాటారు. సింగరేణి డైరెక్టర్లు డీ.సత్యనారాయణరావు(ఈఅండ్ఎం), ఎన్వీకే శ్రీనివాస్(పా, ఆపరేషన్స్), జీ.వెంకటేశ్వర్‌రెడ్డి(ప్రాజెక్ట్ అండ్ ప్లానింగ్), గుర్తింపు సంఘం ఏఐటీయూసీ అధ్యక్షుడు సీతారామయ్య, శ్రీరాంపూర్ జనరల్ మేనేజర్ సంజీవరెడ్డి, జీఎం(కోఆర్డినేషన్) సురేష్, శ్రీరాంపూర్ ఏరియా ఎస్ఓటు జీఎం రవికుమార్, ఓసీపీ పీవో పురుషోత్తంరెడ్డి, అధికారుల సంఘం కేంద్ర కమిటీ ప్రధాన కార్యదర్శి పీ.నర్సింహులు, ఏరియా అధ్యక్షుడు వెంకటేశ్వర్‌రెడ్డి, ఏఐటీయూసీ నాయకులు బాజీసైదా పాల్గొన్నారు.

20న భైంసాకు అసోం సీఎం

- విజయసంకల్పయాత్రలో హిమంత బిశ్వశర్మ
- బాసర నుంచి యాత్ర ప్రారంభం
- విజయవంతం చేయాలన్న ఎమ్మెల్యే రామారావుపటేల్



మాట్లాడుతున్న రామారావుపటేల్

భైంసా: ఈనెల 20న బాసర నుంచి బీజేపీ ఆధ్వర్యంలో చేపట్టే విజయసంకల్ప యాత్రను విజయవంతం చేయాలని ముధోల్ ఎమ్మెల్యే పవార్ రామారావుపటేల్ కోరారు. భైంసాలోని ఎస్ఎస్ జిన్నింగ్ ఫ్యాక్టరీలో శనివారం పార్టీ జిల్లా అధ్యక్షుడు అంజుకుమార్‌రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి పల్లె గంగారెడ్డితో కలిసి సమావేశం నిర్వహించారు. కేంద్రంలో మూడోసారి బీజేపీ గెలువాలని, మళ్లీ మోదీ ప్రధాని కావాలన్న ఉద్దేశంతో విజయ సంకల్పయాత్ర చేపడుతున్నామన్నారు. మొదటి రోజే ముధోల్ నియోజకవర్గంలో యాత్ర ప్రారంభమవుతుందన్నారు. ఈనెల 20న భైంసాలో జరిగే బహిరంగసభకు అసోం సీఎం హిమంత బిశ్వశర్మ హాజరవుతారన్నారు. పార్లమెంటు ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా మూడు పార్లమెంటు నియోజకవర్గాల పరిధిలోని 21 అసెంబ్లీ నియోజకవర్గాల్లో పది రోజులపాటు యాత్ర సాగుతుందని వివరించారు. అదిలాబాద్ పార్లమెంట్ పరిధిలో నలుగురు ఎమ్మెల్యేలు విజయం సాధించడం జరిగిందని వచ్చే ఎన్నికల్లో మరోసారి భారీ మెజార్టీతో పార్లమెంటు స్థానాన్ని కైవసం చేసుకుంటామని ధీమా వ్యక్తం చేశారు. ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత భైంసాలో నిర్వహించే మొట్టమొదటి బహిరంగ సభను విజయవంతం చేయాలన్నారు. కార్యకర్తలు, నాయకులు, ప్రజలు పెద్ద మొత్తంలో తరలిరావాలని కోరారు. మోదీ ప్రభుత్వ హయంలో చేపట్టిన విజయాలు చెప్పేందుకే సంకల్పయాత్ర జరుగుతుందన్నారు. సమావేశంలో పార్టీ పార్లమెంటరీ కన్వీనర్ అయ్యన్నగారి భూమయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శిలు పడిపెల్లి గంగాధర్, రాజేశ్వర్‌రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, నారాయణరెడ్డి, అసెంబ్లీ కన్వీనర్ తాడేవారి సాయినాథ్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ రాజేశ్‌బాబు, మాజీ మున్సిపల్ చైర్మన్ బి.గంగాధర్, ఎంపీపీ అబ్దుల్ రజాక్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్‌సిటీ రైల్లో భారీ చోరీ

- 10తులాలకు పైగా బంగారు ఆభరణాల అపహరణ
- మంచిర్యాల రైల్వేస్టేషన్‌లో ఫిర్యాదు

బెల్లంపల్లి: ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్ రైలులో భారీ చోరీ జరిగింది. ఈ సంఘటన ఆలస్యంగా శనివారం వెలుగులోకి వచ్చింది. బాధితుడి కథనం ప్రకారం.. మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి మండలం బుధాకుర్దు గ్రామానికి చెందిన వెంబడి సురేష్ కుటుంబ సభ్యులతో కలిసి హైదరాబాద్ షేక్‌పేటలోని బంధువుల ఇంట్లో శుభకార్యానికి మంగళవారం వెళ్లాడు. గురువారం ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్ రైలులో బెల్లంపల్లికి ప్రయాణమయ్యారు. ఓ బోగీలో సురేష్ కుటుంబ సభ్యుల కింది సీట్లో కూర్చుని బ్యాగులను పైన ఉంచారు.

ఓ బ్యాగులో పది తులాలకు పైగా బంగారు ఆభరణాలు ఎవరికీ అనుమానం రాకుండా భద్రపరిచి మిగతా బ్యాగులతో పైననే ఉంచారు. ప్రయాణికుల రద్దీ ఎక్కువగా ఉండడంతో ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు పైన ఎక్కి కూర్చున్నారు. కింది సీట్లో కూర్చున్న సురేష్ కుటుంబ సభ్యులు గమనిస్తూ ఉన్నారు. మాటల్లో పడి గమనించడం మర్చిపోవడంతో ఆ ఇద్దరు యువకులు బ్యాగును కత్తిరించి బంగారు ఆభరణాలు తస్కరించారు. నగలతో ఏదో ఒక స్టేషన్‌లో దిగి ఉడాయించారు. సురేష్ కుటుంబ సభ్యులు రైలు దిగిన తర్వాత ఇంటికి వెళ్లి చూసేసరికి నగలు కనిపించలేదు. శుక్రవారం మంచిర్యాల రైల్వే పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని రైల్వే ఎస్సై సుధాకర్ తెలిపారు.

భక్తుల ఇంటికే 'బంగారం'

- ఆర్టీసీ కార్గో ద్వారా మేడారం ప్రసాదం
- ఆన్‌లైన్‌లో బుక్ చేసుకుంటే ఇంటి వద్దకు చేరవేత
- ఈ నెల 25వ వరకు అవకాశం

నిర్మల్‌ఖిల్లా/గేట్: మేడారం జాతరకు వెళ్లలేని భక్తులకు ఇంటి వద్దే ప్రసాదం(బంగారం) అందజేయాలని టీఎస్ ఆర్టీసీ అధికారులు నిర్ణయించారు. గతంలో భద్రాచలం సీతారామచంద్ర స్వామి వారి కల్యాణ తలంబ్రాలు, బంగినపల్లి మామిడి పండ్లు విజయవంతంగా చేరవేయగా.. భక్తులకు మరింత దగ్గరయ్యేందుకు ఈ నిర్ణయం తీసుకున్నారు. మేడారం సమ్మక్క–సారలమ్మ జాతర సందర్భంగా బంగారం(బెల్లం)తోపాటు పసుపు, కుంకుమను భక్తులకు అందించనున్నారు. గత జాతర సందర్భంగా భక్తుల నుంచి అమ్మవారికి సమర్పించే బంగారం, చీర తీసుకెళ్లి మేడారం గద్దెల వద్ద ఉంచి తిరిగి తీసుకొచ్చే విధానం అమలుచేశారు. రద్దీ కారణంగా ఇది సత్ఫలితాలు ఇవ్వకపోవడంతో ఈసారి జాతరలో గద్దెల వద్ద భక్తులు సమర్పించే బంగారాన్ని దేవాదాయ శాఖ ద్వారా సేకరించి భక్తులకు అందించేందుకు ఆ శాఖతో ఒప్పందం కుదుర్చుకుంది.

ఆదిలాబాద్ రీజియన్‌లోని డిపోల ఎగ్జిక్యూటీవ్‌ల నంబర్లు
1. ఆదిలాబాద్, ఉట్నూర్. 9154298531
2. నిర్మల్, భైంసా 9154298547
3. ఆసిఫాబాద్ 9154298547
4. మంచిర్యాల 9154298541, 9154298552, 9154298553

రూ.299కే ప్రసాదం..

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఆర్టీసీకి చెందిన అన్ని కార్గో(లాజిస్టిక్స్) కౌంటర్లలో ప్రసాదం కోసం శుక్రవారం బుకింగ్ మొదలుకాగా, ఈ నెల 25 వరకు స్వీకరిస్తారు. సమ్మక్క–సారలమ్మ అమ్మవార్ల బంగారం, పసుపు, కుంకుమ కావాలనుకునే భక్తులు ఆర్టీసీ కార్గో(లాజిస్టిక్స్) కౌంటర్లలతోపాటు బస్ డిపోల పరిధిలో విధులు నిర్వర్తించే మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్‌లను నేరుగా సంప్రదించవచ్చు. ఒకవేళ కౌంటర్లకు వెళ్లలేని వారైతే పేటీఎం ఇన్‌సైడర్ పోర్టల్ లేదా ఆర్టీసీ యాప్‌లోనూ బుక్ చేసుకోవచ్చు. ఇందుకోసం రూ.299 చెల్లించాల్సి ఉంటుంది. ఈ నెల 25వరకు భక్తులు ప్రసాదం కోసం బుక్ చేసుకునే వీలుండగా... దేవాదాయ శాఖ ద్వారా బంగారం(200 గ్రాముల నుంచి 250 గ్రాములు), పసుపు, కుంకుమ సేకరించి భక్తులకు చేరవేస్తారు.

సద్వినియోగం చేసుకోవాలి



మేడారం అమ్మవార్ల బంగారం ఆర్టీసీ కార్గో సేవల ద్వారా ఇంటికే వచ్చే అవకాశాన్ని కల్పించాం. భక్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. మేడారం అమ్మవార్ల బంగారం(ప్రసాదం) కోసం భక్తులు ఆన్‌లైన్‌లో బుక్ చేసుకోవచ్చు. ఈ నెల 25 వరకు ప్రసాదం కోసం బుకింగ్‌కు అవకాశం ఉండగా.. 26 నుంచి పంపిణీ ప్రారంభిస్తాం.

– ప్రతిమారెడ్డి, నిర్మల్ ఆర్టీసీ డిపో మేనేజర్

రాష్ట్రవ్యాప్తంగా ఏర్పాట్లు..



లాజిస్టిక్ ఆదిలాబాద్ రీజియన్ రాష్ట్ర వ్యాప్తంగా మేడారం ప్రసాదం అందించేందుకు ఏర్పాట్లు చేశాం. ప్రసాదం కావాలనుకునే వారు మా మార్కెటింగ్ ఎగ్జిక్యూటీవ్‌ల ద్వారా వివరాలు తెలుసుకోవాలి.

– బి.శ్రీనివాస్, అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్

కాసిపేట గనిని సందర్శించిన డైరెక్టర్



నాగేశ్వరరావును సన్మానిస్తున్న అధికారులు

కాసిపేట: మందమర్రి ఏరియా కాసిపేట గనిని శనివారం కొత్తగూడెం హెడ్ ఆఫీస్ ఎస్‌వోటూ డైరెక్టర్ ప్రాజెక్టు అండ్ ప్లానింగ్ నాగేశ్వరరావు సందర్శించారు. గని టన్నల్ మెయిన్ పనులు, మ్యాన్‌రైడింగ్ ఏర్పాట్లను పర్యవేక్షించి అధికారులకు సలహాలు, సూచనలు చేశారు. అన్నిరంగాల్లో ఉద్యోగులు, సూపర్‌వైజర్లు సమన్వయంతో పనిచేసి సంస్థను ముందుకు తీసుకెళ్లాలన్నారు. ఇక్కడ మేనేజర్‌గా, ఏజెంట్‌గా, ఏరియా రక్షణాధికారిగా పనిచేసి పదోన్నతిపై వెళ్లిన నాగేశ్వరరావును అధికారులు శాలువాతో సత్కరించారు. అనంతరం గని అవరణలో మొక్కలు నాటారు. గ్రూప్ ఏజెంట్ రాందాసు, గని మేనేజర్ అల్లావుద్దీన్, ఏఐటీయూసీ బెల్లంపల్లి బ్రాంచి కార్యదర్శి దాగం మల్లేశ్, రక్షణాధికారి సునీల్ కుమార్, సంక్షేమాధికారి మీర్జాగౌస్ జీశాన్, ఇంజనీర్లు బాబు, మధుకర్, డెప్యూటీ మేనేజర్ వెంకటేష్ పాల్గొన్నారు.

ముగిసిన నాగోబా జాతర



ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

ఇంద్రవెల్లి: మెస్రం వంశీయుల మహాపూజతో ఈనెల 9న ప్రారంభమైన నాగోబా జాతర శనివారంతో ముగిసింది. చివరి రోజు కూడా భక్తులు తరలివచ్చారు. నాగోబాను దర్శించుకొని పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు.

నేడు హుండీ లెక్కింపు

జాతర సందర్భంగా భక్తులు వేసిన కానుకుల హుండీ లెక్కింపు ఆదివారం నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో రాజమౌళి తెలిపారు. మెస్రం వంశీయులు, రెవెన్యూ అధికారుల సమక్షంలో ఉదయం 10 గంటల నుంచి లెక్కింపు ప్రక్రియ ప్రారంభించనున్నట్లు పేర్కొన్నారు. మెస్రం వంశీయులు, సంబంధిత అధికారులు సకాలంలో హాజరుకావలని కోరారు.

ఎన్‌వైకే ఆధ్వర్యంలో ఉపన్యాస పోటీలు

కైలాస్‌నగర్: జాతీయ యువజన పార్లమెంట్ ఉత్సవాల్లో భాగంగా ఎన్‌వైకే ఆధ్వర్యంలో ఈనెల 20న ఉదయం 11గంటలకు ఆన్‌లైన్‌లో జాతీయస్థాయి ఉపన్యాస పోటీలు నిర్వహిస్తున్నట్లు నెహ్రూ యువ కేంద్రం జిల్లా కోఆర్డినేటర్ సుశీల్‌బడ్ ప్రకటనలో తెలిపారు. ఆదిలాబాద్, మంచిర్యాల, నిర్మల్, కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాల వారికి నల్గొండ నెహ్రూ యువ కేంద్రం ఈ పోటీలను నిర్వహిస్తుందని పేర్కొన్నారు. ఇందులో విజేతలను జాతీయ స్థాయికి ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. అక్కడ గెలుపొందిన వారికి ప్రథమ బహుమతిగా రూ.2లక్షలు, ద్వితీయ బహుమతిగా రూ.1.50లక్షలు, తృతీయ బహుమతిగా రూ.లక్ష, అలాగే ఇద్దరికి ప్రోత్సాహక బహుమతిగా రూ.50వేల చొప్పున అందించనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు www.mybharat.gov.in లింక్ ద్వారా ఈ నెల 19 సాయంత్రం ఐదు గంటల వరకు తమ పేర్లు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని కోరారు. వివరాలకు 9618174338, 93817 31381 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.



ఆలియా భట్ గొంతును అనుకరిస్తూ బోలెడు పాపులారిటీ సంపాదించింది 24 సంవత్సరాల కంటెంట్ క్రియేటర్ చాందిని భాబ్డా. ఈ పాపులారిటీనే ఆమెను ముంబైలో ఒక ఫ్లాట్‌కు ఓనర్‌ను చేసింది. సంప్రదాయ రీతిలో గృహప్రవేశంతో తన విజయాన్ని సెలబ్రేట్ చేసుకుంది చాందిని.



మిమిక్రీ శాయవలే... ముంబైలో ఫ్లాట్ కొనవలే!


ఇన్‌స్టాలో షేర్ చేసిన ఈ ఫోటోలు వైరల్ అయ్యాయి. 2022లో ఆన్-పాయింట్ మిమిక్రీ క్లిప్స్‌తో సోషల్ మీడియా సెన్సేషన్‌గా మారింది చాందిని.

సొంత ఇంటి కలతో మిమిక్రీ కళను నమ్ముకొని డబ్బులను పొదుపు చేసేది. ఎట్టకేలకు ఆమె కల ఫలించింది. ఈ ఫ్లాట్ కొనడానికి ఎన్నో ఇష్టాలను వదులుకొని, ఎలా డబ్బు పొదుపు చేసిందీ ఇన్‌స్టాగ్రామ్ స్టోరీలో వివరించింది చాందిని. 'ఫ్రెండ్స్ విదేశాలకు వెళుతున్నప్పుడు నాకు కూడా వెళ్లాలనిపించేది. బర్త్‌డే ఫంక్షన్‌ను ఘనంగా జరుపుకోవాలనుకునేదాన్ని... ఇలాంటి ఎన్నో సందర్భాలలో ఇంటికల గుర్తుచ్చేది. పొదుపు చేయడం ఎప్పుడూ మానలేదు' అని రాసింది చాందిని.

వైరల్

బయట మంచు కురుస్తుంటే లోపల టీ తాగితే బాగుంటుంది.
కాని మంచు సెలయేటిలో కూచుని మంచుని కరిగించి టీ కాచుకుంటే?
అదీ బాగుంటుందని 78 మిలియన్ల వ్యూస్ చెబుతున్నాయి. కశ్మీర్‌కు షికారుకు వెళ్లిన ముగ్గురు మిత్రులు మంచి పాట వింటూ గుప్పెడు మంచుతో టీ కాచారు. వైరల్ అయ్యారు.

వాహ్! ఐస్ టీ వాహ్!





చల్లటి ప్రాంతంలో అందరూ తాగే ద్రవం టీ. చలి ముఖాన చరుస్తూ ఉంటే పొగలు గక్కే టీ పెదాలకు అందుతూ ఉంటే ఆ మజాయే వేరు. రాహుల్ యాదవ్ అనే ట్రావెలర్ ఇన్‌స్టాలో 'ట్రాహులర్' అనే అకౌంట్‌లో తన ట్రావెల్ వీడియోలు పోస్ట్ చేస్తుంటాడు. జనవరి 29న అతను తన ఇద్దరు మిత్రులతో ఒక వీడియో పెట్టాడు. అది విపరీతంగా జనానికి నచ్చేసింది. కారణం... కశ్మీర్‌లో నిర్మానుష్యమైన లోయలో, గడ్డ కట్టిన సెలయేటి మధ్యలో కూచుని ఆ మిత్రులు 'టీ తయారు చేశారు'. మామూలుగా కాదు. టీ గిన్నెలో అక్కడున్న మంచును వేసి మరీ! క్యాంప్ స్టవ్ మీద ఆ మంచు నిండిన టీ గిన్నె కాసేపటికి వేడి నీరుగా మారింది. అందులో కొంత టెట్రా మిల్క్ వేశారు. ఆ పై టీయాకును, చక్కరను వేస్తే చిక్కటి రంగులో ఘుమఘుమలాడే టీ తయారైంది. ఇటీవల విడుదలైన 'డంకీ'లోని పాట బ్యాక్‌గ్రౌండ్‌లో వినిపిస్తూ ఉండగా ఆ ముగ్గురూ మనకు ఈర్ష్య కలిగేలా టీ తాగారు. ఈ వీడియో రెండు వారాల్లో 7 కోట్ల 8 లక్షల మంది చూశారు. 'మేం కూడా ఎప్పుడో ఒకసారి ఇలా తాగకపోతామా?' అని కొందరంటే 'సేఫేనా?' అని కొందరన్నారు. బ్యాక్టీరియా ఉంటుందేమో అని మరికొందరు సందేహం వెలిబుచ్చారు. బాగా వేడి చేశారు కనుక బ్యాక్టీరియా ఉండకపోవచ్చు. అయినా స్వచ్ఛమైన మంచు టీ తయారు చేసుకుని తాగే ముందు ఈ సందేహాల గోల ఏల?

సెల్యూట్ టు కల్నల్ స్వప్న రాణా



'ఉమెన్ ఆఫ్ ఇంపాక్ట్' సిరీస్‌లో భాగంగా కల్నల్ స్వప్న రాణా అసాధారణ ప్రయాణానికి సంబంధించిన ఇన్‌స్టాగ్రామ్ పోస్ట్‌పై ఆన్‌లైన్ కమ్యూనిటీలో ప్రశంసల జల్లు కురుస్తోంది. కంగనా రనౌత్‌లాంటి బాలీవుడ్ నటీమణులు రాణా జీవిత కథను తమ ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో షేర్ చేస్తున్నారు. హిమాచల్ ప్రదేశ్‌లోని చిన్న గ్రామంలో పుట్టిన స్వప్న వ్యవసాయ పనులు చేసింది. బస్సు ఎక్కడానికి డబ్బులు లేక నడుచుకుంటూనే కాలేజీకి వెళ్లేది. కష్టపడుతూనే చదువుకుంది. 'హిమాచల్‌ప్రదేశ్ యూనివర్శిటీ'లో ఎంబీఏలో చేరిన స్వప్న ఆ తరువాత సివిల్ సర్వీసెస్‌కు ప్రిపేరవుతూనే కంబైన్డ్ డిఫెన్స్ సర్వీసెస్ ఎగ్జామ్ రాసి సెలెక్టైంది. ఆ తరువాత చెన్నైలోని ట్రెనింగ్ అకాడమీలో శిక్షణ తీసుకుంది. 2004లో లెఫ్టినెంట్‌గా నియమితురాలైంది. ప్రస్తుతం ఈశాన్య రాష్ట్రాల్లో ఆర్మీ సర్వీస్ కార్ప్స్ బెటాలియన్‌కు కమాండింగ్ ఆఫీసర్‌గా విధులు నిర్వహిస్తున్న స్వప్న రాణా ప్రతిష్ఠాత్మకమైన అవార్డ్‌లు ఎన్నో అందుకుంది.

డ్రైఫ్రూట్స్ నగల ధగధగలు

ఫంక్షన్‌లో పదిమంది దృష్టి పడేలా ప్రత్యేకంగా కనిపించాలనుకోవడం సహజం. మేకప్ ఆర్టిస్ట్ వసుంధర మరింత ప్రత్యేకంగా కనిపించాలని డిసైడై 'డ్రై ఫ్రూట్స్ జ్యూలరీ' ధరించింది. యూనిక్ లుక్‌తో ఇన్‌స్టాగ్రామ్‌లో బజ్ క్రియేట్ చేసింది. మాంగ్ టిక్క, గాజులు, జూకాలు, వడ్డాణం... ఇలా అన్నీ డ్రైఫ్రూట్స్‌తో తయారు చేసినవే. ఫంక్షన్ తరువాత డ్రైఫ్రూట్స్‌ను రీయూజ్ చేస్తారా, పారేస్తారా అనేది మాత్రం తెలియదు. 'ఎక్స్'లో పోస్ట్ చేసిన ఈ వీడియో వేలాది లైక్‌లతో వైరల్ అయింది.



'భలే ఉన్నారు' అనే ప్రశంసలతో పాటు 'వేస్టేజ్ ఆఫ్ ఫుడ్'లాంటి కామెంట్స్ కనిపించాయి.

ఎంత ఎమర్జెన్సీ అయితే మాత్రం ఇదేమిటి తమ్ముడూ!

అమీర్‌ఖాన్, మాధవన్, శర్మన్ జోషిల 'త్రీ ఇడియెట్స్' సినిమాలోని సన్నివేశాలను ఇప్పటికీ గుర్తు తెచ్చుకుంటాం.

అందులో ఒకటి హాస్పిటల్ సీన్. అనారోగ్యంతో బాధపడుతున్న శర్మన్ తండ్రిని అమీర్‌ఖాన్ స్కూటర్‌పై కూర్చోబెట్టుకొని, భుజాలకు కట్టేసుకొని ఆస్పత్రి ఎమర్జెన్సీ వార్డులోకి దూసుకువెళ్లే సీన్ ఉంది. మధ్యప్రదేశ్‌లోని ఒక హాస్పిటల్‌లో అచ్చం ఇలాంటి సీనే కనిపించింది.



అపస్మారకస్థితిలో ఉన్న తన తాతను బైక్‌పై కూర్చోపెట్టుకొని ఆస్పత్రి ఎమర్జెన్సీ వార్డులోకి దూసుకువెళ్లాడు ఒక వ్యక్తి. సదరు ఈ వ్యక్తి ఇదే ఆస్పత్రిలో పనిచేస్తాడట. 'ఎక్స్'లో ఒక యూజర్ షేర్ చేసిన ఈ వీడియో వైరల్ అయింది. 'త్రీఇడియెట్స్' సినిమా సీన్‌ను గుర్తు తెస్తుంది.

మచ్చా... మైండ్‌బ్లోయింగ్!

* ఇంగ్లీష్ మస్తు మాట్లాడుతడు



ఇంగ్లీష్‌లో తట్టుకుంటూ మాట్లాడటం వేరు, భయంగా మాట్లాడటం వేరు. ఫ్లుయెంట్‌గా, ధైర్యంగా మాట్లాడటం వేరు. దిల్లీలోని జామా మసీద్ ప్రాంతంలో తన రిక్షాలో కూర్చున్న విదేశీ దంపతులతో ఒక రిక్షావాలా ఇంగ్లీష్‌లో ఫ్లూయెంట్‌గా మాట్లాడడం చూస్తుంటే 'మైండ్‌బ్లోయింగ్ మచ్చా' అనిపిస్తుంది. 'ఎక్స్'లో పోస్ట్ చేసిన ఈ వీడియో వైరల్ అయింది. ఇంగ్లీష్ నేర్చుకోవాలనే తపన ఉన్న వారిలో ధైర్యం నింపుతోంది. ఈ వీడియోలాగే ఇటీవల మరో వీడియో వైరల్ అయింది. గోవా బీచ్‌లో గాజులు అమ్మే మహిళ ఆ ప్రాంతం గురించి విదేశీ టూరిస్టులతో గడ గడా ఇంగ్లీష్‌లో మాట్లాడుతున్న వీడియో నెట్‌లోకంలో చక్కర్లు కొట్టింది. ఎనిమిదేళ్ల వయసు నుంచి గోవా బీచ్‌లో తల్లిదండ్రులతో కలిసి తిరిగిన ఆమెకు ఆ పరిసర ప్రాంతాల్లో వినిపించే మాటలే ఇంగ్లీష్ నేర్చుకునే పాఠాలు అయ్యాయి.

ఈ వైరల్ వీడియోను చూసిన వాళ్లు 'చెట్లకు డబ్బులు కాస్తాయా!' అనే సామెతకు 'భేషుగ్గా' అని జవాబు చెప్పవచ్చు. 2.8 లక్షల వ్యూస్‌ను సొంతం చేసుకున్న ఈ వీడియోలో రాయితో కొట్టి చెట్టు నుంచి ప్రజలు కాయిన్స్ తీసుకోవడం కనిపిస్తుంది. 'సీయింగ్ ఈజ్ బిలీవింగ్' అనే మాట నిజమేగానీ 'ఇదెలా సాధ్యం?' అనే ఒక ప్రశ్న మన ముందు నిటారుగా నిలబడుతుంది.

ఇక అసలు విషయానికి వస్తే బిహార్‌లోని రాజ్‌గిర్ ప్రాంతంలో ఎన్నో సంవత్సరాల చరిత్ర ఉన్న చెట్టు ఇది.

ఇచట చెట్లకు డబ్బులు కాయబడును!



ఈ చెట్టు బెరడు తీసి అందులో నాణెం పెడితే శుభం జరుగుతుందనే సెంటిమెంట్ ఉంది. ఈ సెంటిమెంట్ పుణ్యమా అని చెట్టులో ఎటు చూసినా డబ్బులే డబ్బులు!

అదృష్టం కోసం ఇంట్లో 'మనీ ప్లాంట్' పెట్టుకోవడం మనకు తెలిసిందే. ఈ వీడియోను చూసిన తరువాత మాత్రం 'ఇదే అసలు సిసలు మనీప్లాంట్' అంటున్నారు నెటిజనులు.

హెల్త్

ఈ ప్రపంచంలోని ప్రతి ముగ్గురిలో ఒకరు తమ జీవితకాలంలో మెదడుకు సంబంధించిన వ్యాధి బారిన పడితీరతారు. 1990లో బ్రెయిన్ స్కాన్ తీసే ఎమ్మారైను కనుగొన్న నాటి నుంచి ఇప్పటివరకు ... ఈ సమస్యల మీద 50,000 హెల్త్ ఆర్టికల్స్ ప్రచురితమయ్యాయి. వాటి ద్వారా తెలిసిన విషయం ఏమిటంటే... 0.5 శాతం ఆర్టికల్స్‌లో మాత్రమే కేవలం మహిళలకు సంబంధించిన మెదడు సమస్యలపై విశ్లేషణలు జరిగాయి. దీన్ని బట్టే ఇప్పటివరకూ మహిళ మెదడు ఆరోగ్యంపై ప్రపంచం అంతగా దృష్టి కేంద్రీకరించలేదని అర్థమవుతోంది. మెదడు సంబంధిత సమస్యలు స్త్రీ, పురుషులిరువురిలోనూ కనిపించినా... మహిళల్లో కాస్త భిన్నంగా, సంక్లిష్టంగా ఉండే కొన్ని ఆరోగ్య సమస్యలపై అవగాహన కోసం ఈ కథనం.

కొన్ని మెదడు సంబంధిత సమస్యలు...
మహిళల్లోనే ఎందుకు సంక్లిష్టం?



మహిళల జీవితంలో పీరియడ్స్ మొదలు కావడం, గర్భం దాల్చడం, బిడ్డకు పాలివ్వాల్సి రావడం, ప్రత్యుత్పత్తి సైకిల్‌లో చివరన పీరియడ్స్ ఆగిపోవడంలాంటి అనేక సంక్లిష్టమైన జీవక్రియల హార్మోన్ల ప్రభావంతో మెదడు తాలూకు సమస్యలకు ఆస్కారం ఎక్కువ.

మైగ్రేన్: పురుషులతో పోలిస్తే మహిళల్లో ఈ సమస్య మూడు రెట్లు ఎక్కువ. లక్షణాల తీవ్రతా మూడు రెట్లు అధికం. మెనోపాజ్‌కు కాస్త ముందు... కాస్త తర్వాత మైగ్రేన్ తలనొప్పుల తీవ్రత మరింత పెరుగుతుంది.

మెనోపాజ్‌తో పీరియడ్స్ ఆగిపోయిన కొంతకాలానికి దేహంలోని హార్మోన్ల స్రావాల్లోని హెచ్చుతగ్గులన్నీ ఒక సమస్థాయికి చేరాక మైగ్రేన్ బాధలు క్రమంగా ఓ కొలిక్కి వస్తాయి. పీరియడ్స్ సమయాల్లో ఒక్కసారిగా ఈస్ట్రోజెన్ మోతాదులు తగ్గడం వల్ల మైగ్రేన్ బాధలు చాలా తీవ్రంగా ఉండి, సుదీర్ఘంగానూ బాధపెడతాయి. అంతేకాకుండా మందులకూ వాళ్లు తక్కువగానే స్పందిస్తారు.

▲ నోటిద్వారా తీసుకునే కుటుంబ నియంత్రణ మాత్రలు వాడుతున్న కొందరిలో మైగ్రేన్‌లో తగ్గుదల కనిపించినప్పటికీ, మరికొందరిలో ఆ బాధలు తీవ్రతరమవుతాయి. మైగ్రేన్ నివారణకు వాడే టోపిరామేట్ వంటి మందులతో కుటుంబ నియంత్రణ మాత్రల ప్రభావమూ తగ్గుతుంది. కాబట్టి మైగ్రేన్‌తో బాధపడుతూ కుటుంబ నియంత్రణ మందులు వాడుతున్నవారు లేదా వాడాలనుకుంటున్న వారు తమ డాక్టర్‌తో ఆ విషయాల్ని స్పష్టంగా చర్చించాలి.

▲ మైగ్రేన్ ఉన్న కొందరిలో గర్భం ధరించి ఉన్న సమయంలో కొంతమందిలో కాస్త ఉపశమనం దొరికే అవకాశముంది. అయితే మైగ్రేన్ మందుల వల్ల కడుపులోని చిన్నారిపై దుష్ప్రభావం పడే అవకాశం ఉంది కాబట్టి, గర్భధారణ టైమ్‌లో వాడే పెయిన్ కిల్లర్స్, సోడియమ్ వాల్‌ప్రోయేట్, టోపిరమేట్, ప్రాపనాల్, ఎర్గోటమైన్ వంటి మందుల్ని పూర్తిగా ఆపేయాలి. ఆ టైమ్‌లో సురక్షితమైన పారాసిటమాల్, సుమట్రిప్టాన్స్ వంటివే వాడాలి.

▲ ఇక గర్భధారణ తర్వాత బిడ్డకు పాలిచ్చే సమయంలోనూ కొన్ని మందులు వాడకూడదు. ఎందుకంటే ఆ ఔషధాలు పాలలోకి ఊరి, బిడ్డ మీదా ప్రభావం చూపే అవకాశమున్నందున ఈ జాగ్రత్త పాటించాలి.

పక్షవాతం: మహిళల్లో, పురుషుల్లో ఈ సమస్య తాలూకు రిస్క్‌ఫ్యాక్టర్స్ సమానమే అయినా... కుటుంబ నియంత్రణ మందుల వాడకం, గర్భధారణ, పీరియడ్స్ ఆగడం (మెనోపాజ్) వంటి అంశాల వల్ల మహిళల్లో మరికాస్త ఎక్కువ ముప్పు ఉంటుంది.

▲ మహిళల్లోని ఈస్ట్రోజెన్ హార్మోన్ గుండెపోటు, పక్షవాతం నుంచి వారికి రక్షణ కల్పిస్తుంది. అయితే మెనోపాజ్ వచ్చే నాటికి ఈస్ట్రోజెన్ తగ్గుతూ పోతుండటంతో పక్షవాతం ముప్పు పెరుగుతూ పోతుంది. ఇక 40 ఏళ్లకు ముందే పీరియడ్స్ ఆగిపోయేవారిలో ఈ ముప్పు మరింత ఎక్కువ. ఈ అంశం వల్ల కొందరిలో హైబీపీ, కొలెస్ట్రాల్ పెరగడం, ఊబకాయం, పొట్ట పెరగడం, ఏట్రియల్ ఫిబ్రిలేషన్ వంటి గుండె లయలో వచ్చే మార్పులు, డిప్రెషన్ వంటి సమస్యల వల్ల పక్షవాతం అవకాశాలూ పెరుగుతాయి. ఈ మార్పులు రక్తనాళాల్లో అడ్డంకులూ లేదా రక్తనాళాలు చిట్లడానికి ఆస్కారమిచ్చి, పక్షవాతానికి దారితీస్తాయి.

మెనోపాజ్ సమస్యలను చక్కదిద్దే హార్మోన్ రీప్లేస్‌మెంట్ చికిత్సను 10 ఏళ్లకు మించి తీసుకుంటున్నవారిలో హైబీపీ, డయాబెటిస్ ఉంటే.. వాళ్లలో పక్షవాతం ముప్పు మరింత ఎక్కువ.

▲ మిగతా సాధారణ మహిళలతో పోలిస్తే... గర్భధారణ సమయంలోని చివరి మూడు నెలలూ, అలాగే బిడ్డ పుట్టాక మరో నెలన్నర పాటు రక్తం గడ్డకట్టే గుణం ఎక్కువగా ఉండటం వల్ల పక్షవాతం ముప్పు మూడు రెట్లు ఎక్కువ. అందుకే ఆ రిస్క్ ఫ్యాక్టర్స్ ఉన్నవారు తమ సమస్యలను తప్పనిసరిగా డాక్టర్లతో చర్చించాలి.

ఎపిలెప్సీ (మూర్ఛ): ఈస్ట్రోజెన్ మూర్ఛ అవకాశాలను పెంచుతుంది. ప్రోజెస్టెరాన్ మూర్ఛ అవకాశాలు తగ్గిస్తుంది.

అందువల్లనే పీరియడ్స్, అండం విడుదలయ్యే (ఓవ్యూలేషన్) సమయాల్లో మూర్ఛ అవకాశాలు కాస్త ఎక్కువ. దీన్ని 'కెటమేనియల్ ఎపిలెప్సీ' అంటారు. అలాగే యువతుల్లో పీరియడ్స్ మొదలుకావడం, గర్భధారణ, మెనోపాజ్ వంటివి సైతం వారిలో ఎపిలెప్సీ సమస్యను మరింత సంక్లిష్టం చేస్తాయి.

▲ నోటి ద్వారా తీసుకునే కొన్ని రకాల కుటుంబ నియంత్రణ మందులు మూర్ఛ వచ్చే ముప్పును మరింత పెంచుతాయి. వీటివల్ల మూర్ఛమందుల ప్రభావం తగ్గడం, అలాగే కొన్నిసార్లు మూర్ఛ మందుల వల్ల... ఓరల్ కాంట్రసెప్టివ్ ప్రభావం తగ్గడంతో అవాంఛిత గర్భం వచ్చే ముప్పు పెరుగుతుంది. కార్బమజెపెన్ వంటి ఎపిలెప్సీ మందుల వాడకం విషయంలో ఈ ముప్పు మరింత ఎక్కువ. కాబట్టి మహిళలు తాము వాడుతున్న మందుల గురించి డాక్టర్‌కు విపులంగా చెప్పాలి.


▲ ఎపిలెప్సీకి సాధారణంగా వాడే సోడియమ్ వాల్‌ప్రోయేట్ వంటి మందు పుట్టబోయే బిడ్డకు అంగవైకల్యాలు కల్పించే అవకాశం ఉన్నందున కొన్ని దేశాల్లో వాటిపై నిషేధం కూడా ఉంది. ▲ ఎపిలెప్సీకి వాడే మరికొన్ని మందులు కూడా కొన్ని దుష్ప్రభావాలను కలగజేసే అవకాశం ఉంది. అయితే ఫోలిక్ యాసిడ్ వల్ల ఆ ముప్పును గణనీయంగా తగ్గించడం సాధ్యం. అందుకే ప్రెగ్నెన్సీ ప్లాన్ చేసుకున్న నాటి నుంచి స్త్రీలు ఫోలిక్ యాసిడ్ మాత్రలు వాడటం మంచిది.

▲ **అంతేకాదు...** గర్భధారణ తర్వాత మహిళలు బరువు పెరుగుతారు. ఆ తర్వాత మళ్లీ బరువు తగ్గి, మునపటి స్థాయికి వచ్చే అవకాశమూ ఉంటుంది. వాళ్ల బరువును బట్టి ఎపిలెప్సీ మందుల మోతాదులను మార్చాల్సి ఉంటుంది కాబట్టి ఆ సమయాల్లో డాక్టర్ల పర్యవేక్షణ అవసరం.

మహిళల మెదడు సమస్యల విషయంలో ఇన్ని ప్రత్యేకతలు, సంక్లిష్టతలు ఉన్నందువల్ల ఇటీవల కొన్ని దేశాల్లో 'మహిళల న్యూరాలజీ' అనే ప్రత్యేక విభాగాలకు ప్రాధాన్యం పెరుగుతోంది.

అందుకే ఓ ప్రత్యేక ప్రాజెక్ట్...

పురుషులతో పోలిస్తే మహిళల్లో మెదడుకు సంబంధించిన కేసుల భిన్నత్వాన్నీ, సంక్లిష్టతలనూ అధ్యయనం చేయడం కోసమే ఓ ప్రత్యేకమైన ప్రాజెక్టు కూడా నిర్వహితమవుతోంది. అదే 'ఉమెన్స్ బ్రెయిన్ ప్రాజెక్టు'. గతేదాదే ఇది ప్రారంభమైంది. ఇందులో పురుషులకంటే మహిళలు ఎక్కువగా ఎదుర్కొనే ఐదు ముఖ్యమైన ఆరోగ్య సమస్యలపై ప్రత్యేకంగా పరిశోధనలు జరుగుతున్నాయి. అవి... అల్జైమర్స్ డిసీజ్, పక్షవాతం (స్ట్రోక్), మల్టిపుల్ స్క్లిరోసిస్, పార్కిన్‌సన్స్ డిసీజ్, ఎపిలెప్సీ ముఖ్యమైనవి. వీటిల్లో మనదేశంలో అత్యంత ఎక్కువగా ఇబ్బంది కలిగిస్తున్న ప్రధానమైన మూడు జబ్బులైన మైగ్రేన్, పక్షవాతం, మూర్ఛ గురించి తెలుసుకుందాం.



డాక్టర్ బి. చంద్రశేఖర్ రెడ్డి,
సీనియర్ న్యూరో ఫిజీషియన్

మూత్రవిసర్జన సమయంలో తీవ్రమైన నొప్పి లేదా ఇబ్బంది కలిగే సమస్యను వైద్య పరిభాషలో 'డిస్‌యూరియా' అంటారు. గతంలో ఇది కొంత వయసు పైబడ్డవారిలోనే కనిపించేది. కానీ ఇటీవల సాధారణ యువతులు, మహిళలు, మధ్య వయసు వారిలోనూ ఎక్కువగానే కనిపిస్తోంది. ఈ సమస్యకు కారణాలూ, నివారణ, పరిష్కారాల వంటి అవగాహన కోసం ఉపయోగపడేదే ఈ కథనం.

డిస్‌యూరియా
మూత్ర విసర్జనలో నొప్పి ఎందుకు?



మూత్రవిసర్జనలో నొప్పి, ఇబ్బందులు పురుషులూ, మహిళలు... ఇద్దరిలోనూ కనిపించినప్పటికీ... శరీర నిర్మాణపరమైన అంశాల కారణంగా మహిళల్లో ఈ సమస్య కాస్త ఎక్కువగా కనిపిస్తుంది.

మరికొన్ని కారణాలు...

◆ కిడ్నీల నుంచి మూత్రాశయంలోకి మూత్రాన్ని తీసుకెళ్లే నాళాలైన యురేటర్స్‌లో గానీ, మూత్రాశయం (బ్లాడర్)లో గానీ, లేదా బ్లాడర్ నుంచి మూత్రాన్ని శరీరం బయటకు తెచ్చే యూరినరీ ట్రాక్ట్ నాళాల్లో గానీ ఇన్ఫెక్షన్స్ కారణంగా ఈ నొప్పి రావచ్చు.

◆ పురుషుల్లో ప్రోస్టేట్ గ్రంథి పెద్దది కావడం వల్ల ఈ సమస్య రావచ్చు. ◆ ఇక మహిళల్లోనైనా లేదా పురుషుల్లోనైనా కిడ్నీల్లో రాళ్లు ఏర్పడటం, మూత్రంతో ముందుకు జారే క్రమంలో అవి యురేటర్ లేదా యూరినరీ ట్రాక్ట్ నాళాల్లో గీసుకుపోతూ పయనించడం వల్ల నొప్పి వచ్చే అవకాశాలెక్కువ.

◆ ఇలా రాళ్లు గీసుకుపోయినప్పుడు నాళాల్లో వాపు, గాయాల్లో బ్యాక్టీరియా చేరడంతో మూత్రవిసర్జన వ్యవస్థకు నష్టం జరిగే ఆస్కారముంది. అప్పుడూ నొప్పి తీవ్రంగానే వస్తుంది. ◆ డయాబెటిస్ ఉన్నప్పుడు ఈ సమస్య మరింత తీవ్రమయ్యే అవకాశాలెక్కువ. ◆ ఒక్కోసారి మహిళల్లో గర్భధారణ వంటి అంశాలూ సమస్యకు కారణం కావచ్చు. ◆ హాస్పిటల్‌లో చికిత్స తీసుకుంటున్న వారికి క్యాథెటర్ వంటివి వేయడమూ డిస్ యూరియాకు దారితీయవచ్చు. ◆ మెనోపాజ్ తర్వాత మహిళల్లో హార్మోన్ల మార్పుల కారణంగా వెజైనా పొడిబారిపోవడం, యూరినరీ ట్యూబ్ సన్నబడటం (ష్రింక్ కావడం) వల్ల మంట రావడం చాలా సాధారణం. దీన్ని 'మెనోపాజల్ బర్నింగ్'గా చెబుతారు.

లక్షణాలు...

◆ మూత్ర విసర్జన సమయంలో నొప్పితో పాటు ఒక్కోసారి నొప్పి మరీ ఎక్కువగా ఉండి... నిప్పు కాల్చినంత తీవ్రంగానూ ఉండవచ్చు. అప్పటికే సెక్సువల్లీ ట్రాన్స్‌మిటింగ్ డిసీజెస్‌తో బాధపడుతున్నవారిలో ఈ నొప్పి మరింత తీవ్రతరమవుతుంది. నొప్పితోపాటు కొందరిలో మంట, దురద రావచ్చు.

◆ మూత్రం రంగు డార్క్ కలర్‌లో ఉండవచ్చు. కిడ్నీలో రాళ్లు యురేటర్ లేదా యూరినరీ ట్రాక్ట్ నాళాల్లో గీసుకుపోతూ పయనించడం వల్ల అయ్యే గాయాల్లోంచి రక్తం స్రవించడంతో మూత్రం రంగు ఇలా డార్క్‌గా మారుతుంది. రక్తస్రావం మరీ ఎక్కువ అయితే మూత్రంలో ఎరుపు చారిక లేదా ఎరుపు కనిపించవచ్చు. కొందరిలో చీము వచ్చే అవకాశాలూ ఉంటాయి.

◆ రాళ్లు గీసుకుపోవడం వల్ల అయిన గాయాల్లో ఇన్ఫెక్షన్ కారణంగా జ్వరం రావచ్చు.

◆ మూత్రంలో దుర్వాసన ఎక్కువగా ఉండవచ్చు.

చికిత్స...

◆ ఇన్ఫెక్షన్ కారణంగా ఈ సమస్య వస్తే డాక్టర్ల పర్యవేక్షణలో తగిన యాంటీబయాటిక్స్ వాడాల్సి ఉంటుంది. ◆ అదే కిడ్నీలో రాళ్ల కారణంగా యురేటర్ లేదా యూరినరీ ట్రాక్ట్ నాళాలు ఒరుసుకుపోయి వస్తే ముందుగా ఇన్ఫెక్షన్ తగ్గడానికి మందులు వాడుతూ, సమాంతరంగా కిడ్నీలో రాయిని తొలగించడానికి అవసరమైన చికిత్స తీసుకోవాలి.



డాక్టర్ సారికా పాండ్య,
సీనియర్ ఫిమేల్ యూరాలజిస్ట్

మెడి టిప్
వేరికోస్ వెయిన్స్ వల్ల బాధలు తగ్గాలంటే...

మోకాలి నుంచి పాదాల వరకు రక్తం కిందికి జారిపోకుండా నిలువరించే కవాటాలు (వాల్వ్‌లు) బలహీనమైనప్పుడు రక్తనాళాలు (సిరల్ – వీన్స్) అవి ఉబ్బినట్లుగా కనిపించే సమస్యనే 'వేరికోస్ వెయిన్స్'గా చెబుతారు. కొన్నిసార్లు ఇది తీవ్రంగా బాధిస్తుంది. ఆ బాధలు తగ్గాలంటే...

● పడుకునే సమయంలో కాలిని మిగతా శరీరం కంటే (నిర్దిష్టంగా చెప్పాలంటే గుండె కంటే) కాస్త ఎత్తుగా ఉండేలా చూసుకోవాలి. ఇందుకోసం కాలి కింద ఒకటి లేదా రెండు దిండ్లు పెట్టుకుంటే సరిపోతుంది. ● కూర్చున్నప్పుడు కూడా కాళ్లను కాస్త పైకి ఉంచేలా కాలికింద సపోర్ట్ ఉంచుకోవడం మంచిది. ● మార్కెట్‌లో కొన్ని రకాల స్టాకింగ్స్ వంటి సాక్స్‌లు దొరుకుతాయి. డాక్టర్‌తో చర్చించి, ఆ కంప్రెషన్ సాక్స్‌లు ధరించాలి. ● జాగ్రత్తలు పాటించాక కూడా పరిస్థితి తీవ్రమై, నొప్పి ఎక్కువగా వస్తుంటే డాక్టర్లు 'వీన్ లైగేషన్ అండ్ స్ట్రిప్పింగ్' అనే చికిత్సతో పరిస్థితిని చక్కదిద్దుతారు.

జ్యోతి యర్రాజీకి స్వర్ణం



టెహ్రాన్ (ఇరాన్): ఆసియా ఇండోర్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో భారత అథ్లెట్ జ్యోతి యర్రాజీ స్వర్ణ పతకం గెలుచుకుంది. మహిళల 60 మీటర్ల హర్డిల్స్‌ను 8.12 సెకన్లలో పూర్తి చేసి జ్యోతి మొదటి స్థానంలో నిలిచింది. ఈ క్రమంలో గత ఏడాది తానే నెలకొల్పిన 8.13 సెకన్ల జాతీయ రికార్డును జ్యోతి బద్దలు కొట్టడం విశేషం. ఈ ఈవెంట్ హీట్స్‌ను 8.22 సెకన్లతో అగ్రస్థానంతో ముగించిన జ్యోతి ఫైనల్లో మరింత మెరుగైన ప్రదర్శన కనబర్చింది. అసుకా టెరెడా (జపాన్ - 8.21సె.), లుయి లై యు (హాంకాంగ్ - 8.21 సె.) రజత, కాంస్యాలు గెలుచుకున్నారు. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన జ్యోతి భువనేశ్వర్‌లోని రిలయన్స్ ఫౌండేషన్ హై పెర్ఫార్మెన్స్ సెంటర్‌లో శిక్షణ పొందుతోంది. ఈ చాంపియన్‌షిప్‌లో శనివారం మరో రెండు స్వర్ణాలు భారత్ ఖాతాలో చేరాయి. పురుషుల షాట్‌పుట్‌లో తజీందర్‌పాల్ సింగ్ తూర్ పసిడి గెలుచుకున్నాడు. తన రెండో ప్రయత్నంలో అతను గుండును 19.71 మీటర్లు విసిరి అగ్రస్థానం సాధించాడు. మహిళల 1500 మీటర్ల పరుగులో హార్మిలన్ బైన్స్ కనకం మోగించింది. రేస్‌ను హార్మిలన్ 4 నిమిషాల 29.55 సెకన్లలో పూర్తి చేసి స్వర్ణం గెలుచుకుంది.

భారత్ 1-0 ఆస్ట్రేలియా

మహిళల హాకీ సంచలన విజయం



రూర్కెలా: ఎఫ్‌ఐహెచ్ ప్రొ లీగ్ (మహిళలు)లో భారత జట్టు పటిష్ట ఆస్ట్రేలియాపై ప్రతీకార విజయం సాధించింది. పది రోజుల క్రితం గత లీగ్ మ్యాచ్‌లో ఆసీస్ చేతిలో ఓడిన భారత మహిళలు శనివారం సంచలన విజయాన్ని అందుకున్నారు. హోరాహోరీగా సాగిన ఈ పోరులో భారత్ 1-0 గోల్ తేడాతో ఆసీస్‌ను ఓడించింది. భారత్ తరఫున ఏకైక గోల్‌ను 34వ నిమిషంలో వందన కటారియా సాధించింది. పెనాల్టీ కార్నర్ ద్వారా వచ్చిన ఈ అవకాశాన్ని భారత్ సమర్థంగా వాడుకోగలిగింది. భారత సీనియర్లు, జూనియర్లు సమష్టి ప్రదర్శనతో చెలరేగగా...ఆసీస్ బృందం పూర్తి తడబాటుతో వెనుకంజ వేసింది. 1996 తర్వాత భారత గడ్డపై ఆస్ట్రేలియాను భారత మహిళల జట్టు ఓడించడం ఇదే తొలిసారి కావడం విశేషం.

సాకేత్ జోడీకి టైటిల్

- సెమీస్‌లో ఓడిన సుమిత్ నగాల్
- బెంగళూరు ఓపెన్ ఏటీపీ టోర్నీ



బెంగళూరు: భారత డేవిస్ కప్ ప్లేయర్ సాకేత్ మైనేని మరో డబుల్స్ టైటిల్ సాధించాడు. బెంగళూరు ఓపెన్ ఏటీపీ చాలెంజర్ టెన్నిస్ టోర్నీలో రామ్‌కుమార్ రామనాథన్‌తో జోడీ కట్టిన ఆంధ్రప్రదేశ్ టెన్నిస్ స్టార్ సాకేత్ శనివారం జరిగిన ఫైనల్లో ఫ్రెంచ్ జంటపై విజయం సాధించాడు. భారత ద్వయం 6-3, 6-4తో మ్యాక్సిమ్ జాన్‌వియెర్-బిటన్ కౌజ్మినె జంటపై వరుస సెట్లలో గెలుపొందింది. సింగిల్స్‌లో భారత టాప్‌ర్యాంక్ ప్లేయర్ సుమిత్ నగాల్‌కు మాత్రం సెమీస్‌లో చుక్కెదురైంది. రెండో సీడ్ నగాల్ 6-7 (2/7), 4-6తో ఇటలీకి చెందిన ఏడో సీడ్ స్టెఫానో నెపొలిటనో చేతిలో పరాజయం చవిచూశాడు. ఆట ఆరంభంలో సుమీత్ 4-1తో ఆధిపత్యాన్ని చాటుకున్నాడు. అయితే ఇటలీ ప్లేయర్ వరుసగా గేమ్‌లను గెలవడంతో తొలి సెట్ టైబ్రేక్‌కు దారి తీసింది. భారత ఆటగాడు రెండో సెట్ ఆరంభంలో పట్టుదల కనబరిచినప్పటికీ తర్వాత స్టెఫానో జోరు ముందు నిలువలేకపోయాడు.

‘జై’స్వాల్ కమాల్

- యశస్వి మరో సెంచరీ
- రెండో ఇన్నింగ్స్‌లో భారత్ 196/2
- ఓవరాల్ ఆధిక్యం 322 పరుగులు
- తొలి ఇన్నింగ్స్‌లో ఇంగ్లండ్ 319 ఆలౌట్

రాజ్‌కోట్ టెస్టులో రెండో రోజు వెనుకబడినట్లు కనిపించిన భారత్ ఒక్కసారిగా మళ్లీ ఆధిపత్యం ప్రదర్శించింది... బజ్‌బాల్ మాయలో చేజేతులా వికెట్లు కోల్పోయి స్వీయాపరాధంతో ఇంగ్లండ్ తమ పతనానికి అవకాశం కల్పించగా... టీమిండియా చక్కటి బౌలింగ్‌తో పాటు దానిని అందిపుచ్చుకుంది. అశ్విన్ లేని లోటు కనిపించకుండా మన బౌలర్లు ప్రత్యర్థిని పడగొట్టారు. ఆపై యువ యశస్వి మరో దూకుడైన ఇన్నింగ్స్‌తో వరుసగా రెండో సెంచరీ సాధించగా, గిల్ అండగా నిలిచాడు. ఇప్పటికే భారీ ఆధిక్యం సాధించిన భారత్ మ్యాచ్‌ను శాసించే స్థితిలో నిలిచింది. దీంతో ఆదివారం మరిన్ని పరుగులతో అసాధ్యమైన లక్ష్యాన్ని ఇంగ్లండ్ ముందు ఉంచడం ఖాయం.



యశస్వి



సిరాజ్ (4/84)

రాజ్‌కోట్: ఇంగ్లండ్‌తో మూడో టెస్టును గెలిచి సిరీస్‌లో ఆధిక్యంపై భారత్ కన్నేసింది. మ్యాచ్ మూడో రోజు ఆట ముగిసే సమయానికి భారత్ తమ రెండో ఇన్నింగ్స్‌లో 2 వికెట్ల నష్టానికి 196 పరుగులు చేసింది. యశస్వి జైస్వాల్ (133 బంతుల్లో 104 రిటైర్డ్‌హర్ట్; 9 ఫోర్లు, 5 సిక్స్‌లు) సెంచరీ సాధించగా, శుబ్‌మన్ గిల్ (120 బంతుల్లో 65 నాటౌట్; 6 ఫోర్లు, 2 సిక్స్‌లు) రాణించాడు. వీరిద్దరు రెండో వికెట్‌కు 155 పరుగులు జోడించారు. వెన్ను నొప్పితో బాధపడుతూ మైదానం వీడిన యశస్వి మళ్లీ ఆదివారం బ్యాటింగ్ కొనసాగించే అవకాశం ఉంది. అంతకు ముందు ఓవర్‌నైట్ స్కోరు 207/2తో ఆట కొనసాగించిన ఇంగ్లండ్ తమ తొలి ఇన్నింగ్స్‌లో 319 పరుగులకు ఆలౌటైంది. బెన్ స్టోక్స్ (41) ఫర్వాలేదనిపించగా... మొహమ్మద్ సిరాజ్ 4 వికెట్లు పడగొట్టాడు. ప్రస్తుతం భారత్ ఓవరాల్‌గా 322 పరుగుల ఆధిక్యంలో ఉంది. ఇటీవల కన్నుమూసిన మాజీ క్రికెటర్ దత్తాజీరావు గైక్వాడ్‌కు నివాళిగా భారత క్రికెటర్లు భుజాలకు నల్ల బ్యాండ్‌లు ధరించి బరిలోకి దిగారు.

టపటపా...

పటిష్ట స్థితిలో మూడో రోజు ఆటను మొదలు పెట్టిన ఇంగ్లండ్ శనివారం స్వయంకృతంతో మంచి అవకాశం చేజార్చుకుంది. ప్రధాన బ్యాటర్ జో రూట్ (18) చేసిన తప్పుతో జట్టు పతనం మొదలైంది. మూడో రోజు ఐదో ఓవర్లోనే బుమ్రా బౌలింగ్‌లో అత్యుత్సాహంతో ‘రివర్స్ స్కూప్’ ఆడిన రూట్ స్లిప్‌లో యశస్వి సూపర్ క్యాచ్‌కు వెనుదిరిగాడు. తర్వాతి ఓవర్లోనే చక్కటి బంతితో బెయిర్‌స్టో (0)ను కుల్దీప్ వికెట్ల ముందు దొరకబుచ్చుకున్నాడు. ఆ తర్వాత 150 పరుగుల మార్క్‌ను అందుకున్న తర్వాత బెన్ డకెట్ (151 బంతుల్లో 153; 23 ఫోర్లు, 2 సిక్స్‌లు) ఎక్కువ సేపు నిలవలేకపోయాడు. ఈ దశలో స్టోక్స్, బెన్ ఫోక్స్ (13) కలిసి క్రీజ్‌లో పట్టుదలగా నిలిచే ప్రయత్నం చేశారు. అయితే లంచ్ తర్వాత భారత బౌలర్లు మళ్లీ చెలరేగారు. వరుస బంతుల్లో స్టోక్స్, ఫోక్స్‌లను పెవిలియన్ పంపించారు. రేహన్ (6), హార్ట్‌లీ (9) కూడా ఒకే స్కోరు వద్ద అవుట్ కాగా...యార్కర్‌తో అండర్సన్ (1) పని పట్టి ఇంగ్లండ్ ఇన్నింగ్స్‌ను సిరాజ్ ముగించాడు. 20 పరుగుల వ్యవధిలో ఇంగ్లండ్ చివరి 5 వికెట్లు పడ్డాయి.

భారీ భాగస్వామ్యం...

అండర్సన్ తొలి ఓవర్లో రోహిత్ శర్మ (19) కొట్టిన రెండు ఫోర్లతో భారత్ ఇన్నింగ్స్ మొదలైంది. అయితే కొద్ది సేపటికే రోహిత్‌ను ఎల్బీగా అవుట్ చేసి రూట్ ఇంగ్లండ్‌లో కాస్త ఆనందం నింపాడు. కానీ అది ఆ కొద్ది సేపటికే పరిమితమైంది. గత టెస్టు సెంచరీ హీరోలు యశస్వి, గిల్ మరో భారీ భాగస్వామ్యంతో జట్టును ఆధిక్యంలో నిలిపారు. ఆరంభంలో వీరిద్దరు నిలదొక్కుకునేందుకు ప్రయత్నించినా...ఆ తర్వాత దూకుడు పెంచారు. ముఖ్యంగా ఒక దశలో 73 బంతుల్లో 35 పరుగులతో ఉన్న యశస్వి ఆ తర్వాత మెరుపు షాట్లతో దూసుకుపోయాడు. అండర్సన్ ఓవర్లో వరుస బంతుల్లో 6, 4, 4 బాదడంతో ఇది షురూ అయింది. హార్ట్‌లీ వేసిన తర్వాతి ఓవర్లో వరుసగా 6, 6 కొట్టిన అతను తొలి సిక్స్‌తో 80 బంతుల్లో అర్ధ సెంచరీని అందుకున్నాడు. ఆ తర్వాత సెంచరీని చేరేందుకు యశస్వికి మరో 42 బంతులే సరిపోయాయి. ఈ క్రమంలో అతను ఏ బౌలర్‌నూ వదలకుండా మరో 4 ఫోర్లు, 3 సిక్స్‌లు బాదాడు. అప్పటి వరకు ప్రేక్షకుడిగా ఉన్న గిల్ కూడా చెలరేగి వుడ్ ఓవర్లో సిక్స్, ఫోర్‌తో అర్ధసెంచరీ పూర్తి చేసుకున్నాడు.

స్కోరు వివరాలు

భారత్ తొలి ఇన్నింగ్స్ 445; ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్: క్రాలీ (సి) పటిదార్ (బి) అశ్విన్ 15; డకెట్ (సి) గిల్ (బి) కుల్దీప్ 153; పోప్ (ఎల్బీ) (బి) సిరాజ్ 39; రూట్ (సి) యశస్వి (బి) బుమ్రా 18; బెయిర్‌స్టో (ఎల్బీ) (బి) కుల్దీప్ 0; స్టోక్స్ (సి) బుమ్రా (బి) జడేజా 41; ఫోక్స్ (సి) రోహిత్ (బి) సిరాజ్ 13; రేహన్ (బి) సిరాజ్ 6; హార్ట్‌లీ (స్టంప్డ్) జురేల్ (బి) జడేజా 9; వుడ్ (నాటౌట్) 4; అండర్సన్ (బి) సిరాజ్ 1; ఎక్స్‌ట్రాలు 20; **మొత్తం (71.1 ఓవర్లలో ఆలౌట్) 319. వికెట్ల పతనం:** 1-89, 2-182, 3-224, 4-225, 5-260, 6-299, 7-299, 8-314, 9-314, 10-319. **బౌలింగ్:** బుమ్రా 15-1-54-1, సిరాజ్ 21.1-2-84-4, కుల్దీప్ 18-2-77-2, అశ్విన్ 7-0-37-1, జడేజా 10-0-51-2. **భారత్ రెండో ఇన్నింగ్స్:** యశస్వి (రిటైర్డ్‌హర్ట్) 104; రోహిత్ (ఎల్బీ) (బి) రూట్ 19; గిల్ (నాటౌట్) 65; పటిదార్ (సి) రేహన్ (బి) హార్ట్‌లీ 0; కుల్దీప్ (నాటౌట్) 3; ఎక్స్‌ట్రాలు 5; **మొత్తం (51 ఓవర్లలో 2 వికెట్లకు) 196. వికెట్ల పతనం:** 1-30, 2-191. **బౌలింగ్:** అండర్సన్ 6-1-32-0, రూట్ 14-2-48-1, హార్ట్‌లీ 15-2-42-1, వుడ్ 8-0-38-0, రేహన్ 8-0-31-0.

మన మహిళలు ఫైనల్‌కు...

- జపాన్‌పై గెలిచిన భారత బృందం
- నేడు థాయ్‌లాండ్‌తో అమీతుమీ
- ఆసియా టీమ్ బ్యాడ్మింటన్



అష్మిత

షా ఆలమ్ (మలేసియా): భారత మహిళల బ్యాడ్మింటన్ జట్టు చరిత్ర సృష్టించింది. ఆసియా బ్యాడ్మింటన్ టీమ్ చాంపియన్‌షిప్‌లో రెండు సార్లు చాంపియన్ అయిన జపాన్‌ను కంగు తినిపించి తొలి సారి ఫైనల్లోకి ప్రవేశించింది. శనివారం జరిగిన సెమీ ఫైనల్లో భారత్ 3-2 స్కోరుతో మాజీ చాంపియన్ జపాన్‌పై ఆఖరి మ్యాచ్ దాకా పోరాడి గెలిచింది. రెండు ఒలింపిక్స్ పతకాల విజేత సింధు సింగిల్స్, డబుల్స్ రెండు మ్యాచ్‌ల్లో ఓడినా... మిగతా సహచరులెవరూ కుంగిపోకుండా జపాన్ ప్రత్యర్థులపై అసాధారణ విజయాలు సాధించారు. నేడు జరిగే టైటిల్ పోరులో భారత్... థాయ్‌లాండ్‌తో తలపడుతుంది. జోరు మీదున్న సింధుకు తొలి సింగిల్స్‌లో నిరాశ ఎదురైంది. ఆమె 13-21, 20-22తో అయ ఒహోరి చేతిలో పరాజయం చవిచూసింది. డబుల్స్‌లో గాయత్రి-ట్రెసా జాలీ జోడీ 21-17, 16-21, 22-20తో ప్రపంచ ఆరో ర్యాంకు నమి మత్సుయమ-చిహరు షిద జంటను ఊహించని రీతిలో కంగు తినిపించింది. దీంతో ఇరు జట్ల స్కోరు 1-1తో సమం కాగా.. రెండో సింగిల్స్‌లో ప్రపంచ 53వ ర్యాంకర్ అష్మిత 21-17, 21-14తో 20వ ర్యాంకర్ ఒకుహారపై సంచలన విజయం సాధించింది. దీంతో భారత్ ఆధిక్యం 2-1కు చేరింది. తనీషా క్రాస్టో గాయం వల్ల సింధు తప్పనిసరి పరిస్థితుల్లో అశ్విని పొన్నప్పతో కలిసి డబుల్స్ మ్యాచ్ ఆడాల్సి వచ్చింది. కానీ ఈ ద్వయం 14-21, 11-21తో ప్రపంచ 11వ ర్యాంకు జంట రెనా మియవుర-అయాకొ సకురమొతో చేతిలో ఓడిపోయింది. మరో సారి ఇరుజట్లు 2-2తో సమవుజ్జీగా నిలువగా... నిర్ణాయక ఆఖరి సింగిల్స్ ఉత్కంఠ పెంచింది. ఇందులో అన్‌మోల్ ఖర్బ్ 21-14, 21-18తో నత్సుకి నిదయిరపై గెలుపొందడంతో భారత్ ఫైనల్ చేరింది.

కేరళ 258/3

సాక్షి, విజయనగరం: రంజీ ట్రోఫీ ఎలైట్ గ్రూప్ ‘బి’లో ఆంధ్రతో జరుగుతున్న మ్యాచ్‌లో కేరళ రెండో రోజు ఆట ముగిసే సమయానికి తమ తొలి ఇన్నింగ్స్‌లో 3 వికెట్లు కోల్పోయి 258 పరుగులు చేసింది. ఓపెనర్ రోహన్ (61; 10 ఫోర్లు), కెప్టెన్ సచిన్ బేబి (87 నాటౌట్; 12 ఫోర్లు), అక్షయ్ (57 నాటౌట్; 5 ఫోర్లు) రాణించారు. సచిన్, అక్షయ్ నాలుగో వికెట్‌కు అభేద్యంగా 134 పరుగులు జోడించారు. అంతకు ముందు 260/7 ఓవర్‌నైట్ స్కోరుతో శనివారం ఆట కొనసాగించిన ఆంధ్ర తొలి ఇన్నింగ్స్‌లో 272 పరుగులకు ఆలౌటైంది. రికీ భుయ్ (87 నాటౌట్; 13 ఫోర్లు) సెంచరీ చేజార్చుకున్నాడు. ప్రస్తుతం కేరళ మరో 14 పరుగులే వెనుకబడి ఉంది.

తనయ్ త్యాగరాజన్‌కు 5 వికెట్లు


మేఘాలయ 304 ఆలౌట్



త్యాగరాజన్

సాక్షి, హైదరాబాద్: రంజీ ట్రోఫీ ప్లేట్ డివిజన్ ఫైనల్లో హైదరాబాద్ స్పిన్నర్ తనయ్ త్యాగరాజన్ (5/103) మేఘాలయను కట్టడి చేశాడు. దీంతో తొలి రోజు ముందుగా బ్యాటింగ్‌కు దిగిన మేఘాలయ 83 ఓవర్లలో 304 పరుగుల వద్ద ఆలౌటైంది. రాజ్ బిస్వ (64; 9 ఫోర్లు, 3 సిక్స్‌లు), ఆకాశ్ చౌదరి (50 నాటౌట్; 4 ఫోర్లు, 4 సిక్స్‌లు) రాణించారు. హైదరాబాద్ బౌలర్లలో రోహిత్ రాయుడు 3 వికెట్లు తీశాడు. అనంతరం తొలి ఇన్నింగ్స్ మొదలుపెట్టిన హైదరాబాద్ ఆట నిలిచే సమయానికి 5 ఓవర్లలో 2 వికెట్ల నష్టానికి 25 పరుగులు చేసింది. ఓపెనర్ తన్మయ్ (1), వన్‌డౌన్ బ్యాటర్ రోహిత్ (0)లను డిప్పు సంగ్మా అవుట్ చేయగా, రాహుల్ (9 బ్యాటింగ్), తిలక్ వర్మ (10 బ్యాటింగ్) క్రీజులో ఉన్నారు.

సినిమా



‘ఇండియన్ 2’లో కమల్‌హాసన్



‘సలార్ 2’లో ప్రభాస్



‘దేవర’లో ఎన్టీఆర్



‘గేమ్ ఛేంజర్’లో రామ్‌చరణ్

డబుల్ ట్రీట్

అభిమాన హీరో ఒక పాత్రలో కనిపించి సింగిల్ ట్రీట్ ఇస్తేనే అభిమానులు ఖుషీ అయిపోతారు. ఇక రెండు పాత్రల్లో కనిపిస్తే పట్టరాని ఆనందం వారి సొంతం. అలా డబుల్ రోల్‌లో కనిపించి, డబుల్ ట్రీట్ ఇవ్వడానికి కొందరు హీరోలు రెడీ అయ్యారు. ఆ స్టార్స్ చేస్తున్న ద్విపాత్రాభినయం గురించి తెలుసుకుందాం.

● రెండు, మూడు, నాలుగు, పది... ఇలా ఒకే సినిమాలో ఎన్ని పాత్రల్లో అయినా మెప్పించగలరు కమల్‌హాసన్. అలా సేనాపతి, అతని తనయుడు చంద్రబోస్ సేనాపతిగా ‘ఇండియన్’ (భారతీయుడు) లో కమల్ రెండు పాత్రల్లో మెప్పించిన విషయం తెలిసిందే. శంకర్ దర్శకత్వంలో 1996లో విడుదలైన ఈ చిత్రం ఘనవిజయం సాధించింది. ఇప్పుడు ఇదే కాంబినేషన్‌లో ఈ చిత్రానికి సీక్వెల్‌గా రూపొందుతున్న ‘ఇండియన్ 2’ సేనాపతి, అతని తండ్రి పాత్ర నేపథ్యంలో ఉంటుంది. అంటే.. సేనాపతికి అంత దేశభక్తి రావడానికి అతని తండ్రి ఎలా కారణం అయ్యాడు? అనేది ఈ చిత్రంలో ఉంటుందట. 1920లలో కథ సాగడంతో పాటు ఇప్పటి కాలం టచ్ అయ్యేలా స్క్రీన్‌ప్లే రెడీ చేశారట శంకర్. ఇక తాజా చిత్రంలో కాజల్ అగర్వాల్ హీరోయిన్‌గా, కీలక పాత్రల్లో రకుల్ ప్రీత్ సింగ్, సిద్ధార్థ్, బాబీ సింహా నటిస్తున్నారు.


● ‘సలార్’ సినిమా తొలి భాగం ‘సలార్ పార్ట్ 1: సీజ్ ఫైర్’తో ప్రభాస్ మరో భారీ హిట్‌ని తన ఖాతాలో వేసుకున్నారు. ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో విజయ్ కిరగందూర్ నిర్మించిన ఈ చిత్రంలో ప్రభాస్ ఒక పాత్రలో కనిపిస్తేనే ఫ్యాన్స్ ఫుల్ ఖుష్ అయ్యారు. ఇక రెండు పాత్రల్లో కనిపిస్తే డబుల్ ధమాకానే. ఈ సినిమాకి సీక్వెల్‌గా రూపొందుతున్న ‘సలార్ పార్ట్ 2: శౌర్యాంగ పర్వం’లో ప్రభాస్ రెండు పాత్రల్లో కనిపించనున్నారట. తండ్రీ కొడుకుగా ప్రభాస్ కనిపించే సీన్స్ సరికొత్త అనుభూతిని పంచుతాయని టాక్. ప్రత్యేకించి 1000 మందితో ఫైట్ చేసే ఒక యాక్షన్ సీన్‌లో ప్రభాస్ రెండో పాత్ర (తండ్రి) ఎంట్రీ ఉంటుందని సమాచారం. ‘సలార్’ తొలి భాగంలో శ్రుతీహాసన్ హీరోయిన్‌గా నటించగా పృథ్వీరాజ్ సుకుమారన్ కీలక పాత్ర చేశారు. రెండో భాగంలో పృథ్వీరాజ్ కూడా రెండు పాత్రల్లో కనిపిస్తారట. తొలి భాగంలో ఉన్న బాబీ సింహా, శ్రియా రెడ్డి తదితరులు మలి భాగంలోనూ కనిపిస్తారు.

● ‘ఈ సముద్రం సేపల్ని కంటే కత్తుల్ని, నెత్తుర్ని ఎక్కువ సూసుండాది.. అందుకేనేమో దీన్ని ఎర్ర సముద్రం అంటారు’ అంటూ ఎన్టీఆర్ చెప్పిన డైలాగ్ ‘దేవర’ సినిమా గ్లింప్స్‌లో ఉన్నాయి. ‘జనతా గ్యారేజ్’ (2016) వంటి హిట్ మూవీ తర్వాత హీరో ఎన్టీఆర్-డైరెక్టర్ కొరటాల శివ కాంబినేషన్‌లో తెరకెక్కుతోన్న చిత్రం ‘దేవర’. జాన్వీ కపూర్ హీరోయిన్‌గా నటిస్తున్న ఈ చిత్రంలో సైఫ్ అలీఖాన్ కీలక పాత్ర చేస్తున్నారు. కల్యాణ్ రామ్ సమర్పణలో మిక్కిలినేని సుధాకర్, హరికృష్ణ .కె నిర్మిస్తున్నారు. రెండు భాగాలుగా రూపొందుతోన్న ఈ మూవీ తొలి భాగం ‘దేవర పార్ట్ 1’ అక్టోబర్ 10న విడుదల కానుంది. కాగా ఈ చిత్రానికి సంబంధించి ఓ ఆసక్తికరమైన వార్త ఇండస్ట్రీ వర్గాల్లో, నెట్టింట్లో హల్‌చల్ చేస్తోంది. ఈ సినిమాలో ఎన్టీఆర్ ద్విపాత్రాభినయం చేస్తున్నారన్నది ఆ వార్త సారాంశం. ఎన్టీఆర్ తండ్రీకొడుకుగా సందడి చేస్తారని భోగట్టా. యాక్షన్, ఎమోషన్స్‌తో రూపొందుతోన్న ఈ చిత్రం షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. ఇదిలా ఉంటే గతంలో ‘ఆంధ్రావాలా, శక్తి, అదుర్స్’ సినిమాల్లో ద్విపాత్రాభినయం చేసిన ఎన్టీఆర్ ‘జై లవ కుశ’లో త్రిపాత్రాభినయంతో మెప్పించిన విషయం తెలిసిందే.

● ఒక్క సినిమాలో కాదు.. వరుసగా రెండు చిత్రాల్లో రామ్‌చరణ్ రెండు పాత్రల్లో కనిపించనున్నారని సమాచారం. ఒకటి శంకర్ దర్శకత్వంలో రామ్‌చరణ్ హీరోగా నటిస్తున్న ‘గేమ్ ఛేంజర్’ సినిమా. మరొకటి బుచ్చిబాబు సనా డైరెక్షన్‌లో రామ్‌చరణ్ హీరోగా రూపొందనున్న చిత్రం. ఇక రామ్‌చరణ్ హీరోగా శంకర్ దర్శకత్వంలో తెరకెక్కుతోన్న పాన్ ఇండియా చిత్రం ‘గేమ్ ఛేంజర్’ విషయానికొస్తే... సమకాలీన రాజకీయాల నేపథ్యంలో రూపొందుతున్న ఈ చిత్రంలో రామ్‌చరణ్ తండ్రీ కొడుకుగా కనిపిస్తారని భోగట్టా. తనయుడి పాత్రలో ఎన్నికల అధికారిగా, తండ్రి పాత్రలో రాజకీయ నేతగా కనిపించనున్నారట. రెండో పాత్రకు సంబంధించిన ఫొటోలు కొన్ని బయటికొచ్చాయి. అందులో చరణ్ 70ల్లో వ్యక్తిగా ఖద్దరు వస్త్రాలు ధరించి సైకిల్‌పై వెళుతూ కనిపించారు. కియారా అద్వానీ హీరోయిన్‌గా నటిస్తున్న ఈ సినిమాలో అంజలి, శ్రీకాంత్, ఎస్‌జే సూర్య, సునీల్ ప్రత్యేక పాత్రధారులు. ‘దిల్’ రాజు, శిరీష్ నిర్మిస్తున్న ఈ సినిమా షూటింగ్ దాదాపు 80 శాతం పూర్తయింది. ఇక బుచ్చిబాబు సనా దర్శకత్వంలో రామ్‌చరణ్ చేస్తున్న సినిమా స్పోర్ట్స్ బ్యాక్‌డ్రాప్‌లో ఉంటుంది. పాన్ ఇండియా స్థాయిలో రూపొందనున్న ఈ చిత్రంలో రామ్‌చరణ్ అన్న, తమ్ముడు పాత్రల్లో కనిపించనున్నారట. వెంకట సతీష్ కిలారు నిర్మించనున్న ఈ సినిమా త్వరలోనే సెట్స్‌కి వెళ్లనుంది. కాగా ‘మగధీర, నాయక్’ చిత్రాల్లో రామ్‌చరణ్ ద్విపాత్రాభినయంతో ఆకట్టుకున్న విషయం తెలిసిందే.

ఈ హీరోలే కాదు.. మరికొందరు కూడా ద్విపాత్రాభినయంతో ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమవుతున్నారు.

సెల్ఫ్ మేడ్



● అమితాబ్ బచ్చన్ ఏఐ పిక్చర్

ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ)పై అమితాబ్ బచ్చన్ ఆసక్తి కనబరుస్తున్నట్లుగా తెలుస్తోంది. ఈ బాలీవుడ్ బిగ్ బి నటుడిగా ఫిల్మ్ ఇండస్ట్రీలోకి వచ్చి 55 ఏళ్లయింది. ఈ నేపథ్యంలో ఏఐతో చేసిన తన ఫొటోలను ‘ఎక్స్’లో షేర్ చేశారు అమితాబ్ బచ్చన్. ‘‘సినిమా అనే అద్భుత ప్రపంచంలో 55 ఏళ్లు పూర్తి చేసుకున్నాను. ‘సెల్ఫ్ మేడ్’’ అంటూ అమితాబ్ బచ్చన్ ఈ ఫొటోలను ఉద్దేశించి పేర్కొన్నారు. నిజంగానే అమితాబ్ ‘సెల్ఫ్ మేడ్’. ఎలాంటి సినిమా నేపథ్యం లేకుండా ఇండస్ట్రీలోకి అడుగు పెట్టారు. ఎన్నో కష్టాలు పడి అమితాబ్ బచ్చన్ స్టార్ యాక్టర్‌గా ఎదిగారు. కెరీర్ తొలి నాళ్లలో ఆయన అవమానాలు ఎదుర్కొన్నారు కూడా. తిరస్కరణలకు గురయ్యారు. ఆర్థిక ఇబ్బందుల కారణంగా కొన్నాళ్లు ముంబై మెరీనా బీచ్‌లో గడిపారు. ఎన్నో సవాళ్లను దాటుకుని 1969లో అమితాబ్ ‘సాత్ హిందుస్థానీ’ చిత్రంతో యాక్టర్‌గా ఎంట్రీ ఇచ్చారు. తొలి సినిమాకే న్యూ కమర్‌గా నేషనల్ అవార్డు అందుకున్నారు అమితాబ్. అదే ఏడాది ఉత్పల్ దత్ హీరోగా చేసిన ‘భువన్ షోమ్’ సినిమాకు నరేటర్‌గా చేశారు అమితాబ్. ఆ తర్వాతే మధు, ఉత్పల్‌లతో కలిసి అదే ఏడాది ‘సాత్ హిందుస్థానీ’ సినిమాతో అమితాబ్ ఎంట్రీ జరిగింది. అలా ముందు తన గొంతు వినిపించి, ఆ తర్వాత నటుడిగా సిల్వర్ స్క్రీన్‌పై కనిపించారు. ‘భువన్ షోమ్’ చిత్రం మేలో విడుదల కాగా, ‘సాత్ హిందుస్థానీ’ చిత్రం నవంబరులో విడుదలైంది. ఇక ప్రస్తుతం ప్రభాస్ ‘కల్కి 2898 ఏడీ’, రజనీకాంత్ ‘వేట్టయాన్’తో పాటు హిందీలో రెండు సినిమాల్లో నటిస్తూ బిజీగా ఉన్నారు అమితాబ్ బచ్చన్.

నేటి భారతం



● శ్రీధర్

ఒకే ఒక్క పాత్రతో సామాజిక సందేశంతో రూపొందిన చిత్రం ‘నేటి భారతం’. యర్రా శ్రీధర్ రాజు నటించి, నిర్మించిన ఈ సినిమాకు భరత్ పారేపల్లి దర్శకత్వం వహించారు. త్వరలోనే ఈ చిత్రం విడుదల కానుంది. ఈ సందర్భంగా ఈ సినిమా ట్రైలర్‌ను విడుదల చేశారు. ‘‘కరోనా తర్వాత ఏర్పడ్డ ఆర్థిక, సామాజిక, రాజకీయ అంశాల నేపథ్యంలో ఈ సినిమా కథనం ఉంటుంది. ఇందులో నేను జర్నలిస్టు పాత్ర చేశాను. సింగిల్ క్యారెక్టర్‌తో వస్తోన్న మా సినిమాను ప్రేక్షకులు ఆదరించాలి’’ అన్నారు శ్రీధర్.

దంగల్ ఫేమ్ సుహానీ కన్నుమూత





● ‘దంగల్’లో... సుహాని

ఆమిర్ ఖాన్ ‘దంగల్’లో బాలనటిగా (చిన్ననాటి బబితా ఫోగట్ పాత్రధారి) నటించిన సుహానీ భట్నాగర్ (19) కన్నుమూశారు. అరుదైన డెర్మటో మయోసైటిస్ రుగ్మతతో బాధపడుతున్న సుహానీని నెల 7న ఆమె కుటుంబ సభ్యులు ఢిల్లీలోని ఎయిమ్స్‌లో ఆస్పత్రిలో చేర్చగా, చికిత్స పొందుతూ 16న సుహానీ కన్నుమూశారు. సుహానీ మరణాన్ని ఆమిర్ ఖాన్ ప్రొడక్షన్స్, దర్శకుడు నితీష్ తివారి ధ్రువీకరించారు. ‘దంగల్’ సినిమా తర్వాత కొన్ని వ్యాపార ప్రకటనలు చేసిన సుహానీ ఆ తర్వాత స్టడీస్‌పై ఫోకస్ పెట్టారు. జర్నలిజం అండ్ మాస్ కమ్యూనికేషన్ డిగ్రీలో రెండో సంవత్సరం చదువుతున్న సమయంలో సుహానీకి ఇలా జరిగింది. చదువు పూర్తయ్యాక సుహానీ యాక్టింగ్‌ను కెరీర్‌గా ఎంచుకోవాలని ఆశపడిందని ఆమె కుటుంబ సభ్యులు చెబుతూ కన్నీరు మున్నీ రవుతున్నారు. సుహానీ మరణం పట్ల పలువురు చిత్రరంగ ప్రముఖులు సంతాపం వ్యక్తం చేశారు.

ప్రేమకు అర్థం చెప్పేలా...



● వినాయక్, అపర్ణా దేవి

గ్రామీణ ప్రేమకథతో రూపొందిన చిత్రం ‘రాధా మాధవం’. వినాయక్ దేశాయ్, అపర్ణా దేవి జంటగా నటించిన ఈ సినిమాకు దాసరి ఇస్సాకు దర్శకత్వం వహించారు. గోనాల్ వెంకటేశ్ నిర్మించిన ఈ చిత్రం సెన్సార్ కార్యక్రమాలు పూర్తయ్యాయి. మార్చి 1న ఈ చిత్రం విడుదల కానుంది. ‘‘ప్రేమకు అర్థం చెప్పేలా మా ‘రాధా మాధవం’ సినిమా ఉంటుంది. ఈ చిత్రం సందేశాత్మకంగా కూడా ఉంటుంది’’ అని యూనిట్ పేర్కొంది.

గమనిక

సాక్షి పెళ్ళిచూపులు ఒక వివాహ వేదిక మాత్రమే. ప్రకటనదారులకు సంబంధించి ఎట్టి హామీలకు పత్రిక సాక్ష్యం కాదు. ఈ వేదికలో వచ్చే ప్రకటనల సాధ్యాసాధ్యాలు, వధూవరుల వివరాలను పెండ్లి పెద్దలు స్వయముగా వెళ్ళి పరిశీలించిన తరువాత నిర్ణయాలు తీసుకోవాలి. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. కావున పాఠకులు ఈ విషయాన్ని గమనించి మీకు తగిన సంబంధాన్ని నిర్ణయించుకోండి.

ఇద్దరు చిన్నారులను బలిగొన్న నీటిసంపు

- తల్లిదండ్రులు నిద్రిస్తున్న సమయంలో ఆడుకుంటూ సంపులో పడి మృత్యువాత



ఇద్దరు పిల్లల మృతికి కారణమైన నీటి సంపు ఇదే..



శౌరితేజ(ఫైల్)



తేజస్విని(ఫైల్)

వరంగల్: ప్రయాణ బడలికతో తల్లిదండ్రులు నిద్రలోకి జారుకోగా, ఆడుకుంటూ వెళ్లి నీటిసంపులో పడి ఇద్దరు చిన్నారులు మృతిచెందారు. ఈ విషాద ఘటన వరంగల్ నగరం ఏనుమాముల బాలాజీనగర్‌లో శుక్రవారం రాత్రి చోటుచేసుకుంది. వికారాబాద్ జిల్లా తాండూరుకు చెందిన కరణం బాలేశ్వరి, రవికుమార్ దంపతులు మేడారం జాతరకు వెళ్లడానికి పిల్లలు శౌరితేజ (4), తేజస్విని (2)తో కలిసి వరంగల్ బాలాజీనగర్‌లోని బాలేశ్వరి తల్లిగారింటికి శుక్రవారం రాత్రి వచ్చారు. చాలా దూరంనుంచి రావడంతో అలిసిపోయిన బాలేశ్వరి, రవికుమార్ పడుకునేముందు పిల్లలకు సెల్‌ఫోన్ ఇచ్చారు. పిల్లలు ఆడుకుని పడుకుంటారని తల్లిదండ్రులు భావించారు. అయితే రాత్రి 11గంటల సమయంలో లేచి చూడగా పిల్లలిద్దరూ కనిపించలేదు. ఇల్లంతా వెతకడంతోపాటు పక్కనున్న బంధువుల ఇంటికి వెళ్లి కూడా ఆరా తీశారు. అక్కడ కూడా లేకపోవడంతో అందరూ కలిసి ఇంట్లోని సంపులో వెతకగా ఒక చిన్నారి మృతదేహం నీటిపై తేలియాడుతూ కనిపించింది. దీంతో సంపులో వెతకగా మరో మృతదేహం కూడా లభించింది. ఇద్దరిని బయటకు తీయగా అప్పటికే వారు మరణించారు. చిన్నారులిద్దరూ ఆడుకుంటూ సంపులో పడి ఉంటారని అనుమానిస్తున్నారు. అమ్మవార్లను దర్శించుకునేందుకు వస్తే ఇద్దరు పిల్లలను కోల్పోయామంటూ తల్లిదండ్రులు తీవ్రంగా రోదించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

దుబాయ్ బందీలకు విముక్తి

- 18 ఏళ్లకు విడుదలకానున్న ముగ్గురు వలసజీవులు
- 21న దుబాయ్ నుంచి ఇంటికి చేరనున్న రాష్ట్రవాసులు
- ఫలించిన ఎమ్మెల్యే కేటీఆర్ దౌత్యం



పెద్దూరులోని బాధిత కుటుంబ సభ్యులు(ఫైల్)

సిరిసిల్ల: దుబాయ్‌లోని అవీర్ జైల్లో 18 ఏళ్లగా ఓ హత్య కేసులో శిక్ష అనుభవిస్తున్న తెలంగాణ వలస జీవులు ఎట్టకేలకు విడుదల కానున్నారు. ఈనెల 21న జైలు నుంచి విడుదలై భారత్‌కు రానున్నారు. దుబాయ్ జైలు నుంచి నేరుగా భారత్‌కు వచ్చేందుకు విమాన టికెట్లు సిద్ధమయ్యాయి. రాజన్నసిరిసిల్ల జిల్లా పెద్దూరుకు చెందిన శివరాత్రి మల్లేశం (48), శివరాత్రి రవి(45) అన్నదమ్ములు. కోనరావుపేటకు చెందిన దుండుగుల లక్ష్మణ్(48), చందుర్తికి చెందిన నాంపల్లి (గొల్లెం) వెంకటి(43), జగిత్యాల జిల్లా మల్యాల మండలం మానాలకు చెందిన శివరాత్రి హన్మంతు(51), కరీంనగర్ జిల్లాకు చెందిన సయ్యద్ కరీం బతుకుదెరువు కోసం దుబాయ్‌కి వెళ్లారు. వీరిలో కరీం మినహా ఐదుగురు ఓ సెక్యూరిటీగార్డు హత్య కేసులో 18 ఏళ్లగా దుబాయ్ జైలులో శిక్ష అనుభవిస్తున్నారు. వీరి విడుదల కోసం బీఆర్‌ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్ దుబాయ్ వెళ్లి ప్రయత్నం చేశారు. ఐదుగురు ఎన్నారై ఖైదీల విడుదల అంశాన్ని దుబాయ్ ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. అలాగే, దుబాయ్ కాన్సుల్ జనరల్ రామ్‌కుమార్, ఈ కేసు వాదిస్తున్న అరబ్ న్యాయవాదితో మాట్లాడారు. దుబాయ్ రాజు షేక్ మహమ్మద్ క్షమాభిక్ష ప్రసాదించేలా ప్రయత్నించాలని కోరారు. ఆ దౌత్యం ఫలించి ఎట్టకేలకు మల్లేశం, రవి, హన్మంతు విడుదలవుతున్నారు. నాలుగు నెలల కిందట దుండుగుల లక్ష్మణ్ విడుదలయ్యారు. వెంకటి విడుదలకు కొంత సమయం పడుతుందని తెలిసింది.

ఇదీ కేసు నేపథ్యం

2006లో దుబాయ్‌లోని జబల్ అలీ పారిశ్రామిక ప్రాంతంలోని ఓ సంస్థ ఆవరణలో నేపాల్‌కు చెందిన దిల్ ప్రసాద్‌రాయ్ అనే సెక్యూరిటీగార్డు హత్యకు గురయ్యాడు. అక్కడ టన్నుల కొద్దీ ఉన్న ఇత్తడి విద్యుత్ తీగలను పది మంది కలిసి దొంగిలించేందుకు యత్నించారని, అడ్డుకున్న ప్రసాద్‌రాయ్‌ని హత్య చేశారని ఆరోపణలున్నాయి. ఈ కేసు నిందితుల్లో ఆరుగురు తెలంగాణ వారుకాగా, నలుగురు పాకిస్తానీయులు. ఈ పది మందిని అక్కడి కోర్టు దోషులుగా నిర్ధారిస్తూ.. పాకిస్తానీయులకు తొమ్మిదేళ్ల చొప్పున, తెలంగాణ వారికి పదేళ్ల చొప్పున జైలు శిక్ష విధించింది. శిక్ష పూర్తి చేసుకున్న నలుగురు పాకిస్తానీయులు, సయ్యద్ కరీం విడుదలయ్యారు. మిగిలిన వారికి హత్యకేసులో క్షమాభిక్ష లభించినా.. దొంగతనం, దేశం విడిచివెళ్లే ప్రయత్నం చేసిన కేసుల్లో జైల్లో ఉన్నారు.

అప్పీలుకు వెళ్తే.. పెరిగిన శిక్ష

జైల్లో ఉన్న ఐదుగురి విడుదల కోసం హైకోర్టుకు అప్పీలుకు వెళ్లారు. ఆ నిర్ణయమే వారి పాలిట శాపంగా మారింది. హైకోర్టులో ఈ కేసులు విచారించిన ధర్మాసనం ఈ హత్యను క్రూరమైనదిగా పరిగణించింది. మల్లేశం, రవి, వెంకటి, హన్మంతు, లక్ష్మణ్‌లకు కింది కోర్టు విధించిన పదేళ్ల శిక్షను 2015లో యావజ్జీవ కారాగార శిక్షకు పెంచింది. మృతుడి శరీరంపై దోషుల వేలిముద్రలు లభించాయని, నేరం నుంచి తప్పించుకునేందుకు కత్తిని పూడ్చిపెట్టడంతోపాటు, అక్రమంగా దేశం దాటేందుకు ప్రయత్నించారని.. ఇవన్నీ తీవ్రమైన నేరాలని ధర్మాసనం పేర్కొంది. దీంతో దోషుల విడుదల ఆలస్యమైంది. అయితే, నాడు మంత్రిగా ఉన్నప్పుడు కేటీఆర్ చేసిన ప్రయత్నాలు ఫలించాయి.

పోరాటాలకు స్ఫూర్తి చెన్నమనేని: గుత్తా

'మూడు దశాబ్దాల ప్రజావాణి చెన్నమనేని' పుస్తకావిష్కరణ



పుస్తకావిష్కరణలో పాల్గొన్న వినోద్‌కుమార్, సురేష్‌రెడ్డి, విద్యాసాగర్‌రావు, గుత్తా, రమణ, కొప్పుల ఈశ్వర్ తదితరులు

ఖైరతాబాద్: సుదీర్ఘ రాజకీయ ప్రస్థానంలో వివిధ పదవులు అలంకరించి భావితరాలకు స్ఫూర్తినిచ్చిన అలుపెరగని యోధుడు చెన్నమనేని రాజేశ్వరరావు అని శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి పేర్కొన్నారు. చెన్నమనేని రాజేశ్వరరావు శత జయంతి సందర్భంగా చెన్న మనేని రాజేశ్వరరావు, లలితాదేవి ఫౌండేషన్ ఆధ్వర్యంలో జలవిహార్‌లో శనివారం రాత్రి జరిగిన ఓ కార్యక్రమంలో 'శాసనసభలో మూడు దశాబ్దాల ప్రజావాణి చెన్నమనేని' అనే పుస్తకాన్ని ఆవిష్కరించారు. భారత పోస్టల్ విభాగం ద్వారా ఆయన జ్ఞాపకార్థం పోస్టల్ కవర్, ఫొటో ప్రదర్శనను ప్రారంభించారు. ఈ సందర్భంగా గుత్తా సుఖేందర్‌రెడ్డి మాట్లాడుతూ చెన్నమనేని రాజకీయ జీవితాశయాలను, పేద, బడుగు బలహీన వర్గాల ప్రజల అభ్యున్నతి కోసం ఆయన చేసిన నిరంతర కృషిని ఈ పుస్తకం ప్రతిబింబిస్తుందని అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో మాజీ గవర్నర్ విద్యాసాగర్ రావు, మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, ఎమ్మెల్సీలు ఎల్.రమణ, రవీందర్‌రావు, శ్రీనివాస్, ఎంపీ కె.ఆర్.సురేష్‌రెడ్డి, మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే సతీశ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అప్పు తీరుస్తారా? చస్తారా?

'రుణ' వేధింపులు భరించలేక దంపతుల ఆత్మహత్య



సురేశ్‌కుమార్, భాగ్య దంపతుల (ఫైల్‌ఫొటో)

కీసర: క్రెడిట్ కార్డుపై తీసుకున్న రుణం ఇద్దరి ప్రాణాలను బలితీసుకుంది. ఈ ఘటన శనివారం కీసర పోలీస్ స్టేషన్ పరిధిలోని ఆర్‌ఎల్‌నగర్‌లో చోటుచేసుకుంది. కీసర సీఐ వెంకటయ్య తెలిపిన వివరాల ప్రకారం.. నగరంలోని లాలాపేట్‌కు చెందిన రాగుల సురేశ్‌కుమార్ (45), సికింద్రాబాద్ వెస్ట్ మారేడ్‌పల్లికి చెందిన దివ్యాంగురాలైన భాగ్య (41)ని ప్రేమించి పెళ్లిచేసుకున్నాడు. వీరికి సాషిక్ (17), భవన్ (15) ఇద్దరు కుమారులు. బతుకుదెరువు నిమిత్తం వీరు ఎనిమిదేళ్ల క్రితం కీసరకు వచ్చి స్థిరపడ్డారు. కీసరలో ఓ ఇంటిని కొనుగోలు చేశారు. సురేశ్ కరోనాకు ముందు కీసరలో మొబైల్‌షాప్ నడిపారు. వ్యాపారం సరిగ్గా నడవకపోవడంతో మొబైల్ షాప్ తీసేసి తిమ్మాయిపల్లి గ్రామంలో ఫాస్ట్‌ఫుడ్ సెంటర్ నడిపారు. అయితే వ్యాపారంలో నష్టాలు రావడంతో చర్లపల్లిలోని కంపెనీలో ప్రైవేటు ఉద్యోగం చేస్తూ కాలం వెళ్లదీస్తున్నారు. వ్యాపారంకోసం, ఇంటికోసం క్రెడిట్ కార్డు, ఆన్‌లైన్ ద్వారా తీసుకున్న అప్పులు రూ.8 లక్షలు అయ్యాయి. ఆ బకాయి చెల్లించకపోవడంతో బ్యాంకు వారు ఇంటికి వచ్చి డబ్బులు చెల్లించాలని ఒత్తిడి తీసుకువచ్చారు. చుట్టుపక్కల వాళ్లముందు బ్యాంకు వాళ్లు అవమానించే విధంగా మాట్లాడటంతో వారు తట్టుకోలేకపోయారు. మూడు రోజుల క్రితం జవహర్‌నగర్‌లోని మల్కారంలో బంధువుల పెళ్లికి వెళ్లి వచ్చారు. శుక్రవారం డిన్నర్‌కు వెళ్లాల్సి ఉండగా సురేశ్‌కుమార్, తన భార్యతో పాటు ఇద్దరు కొడుకులను తీసుకొని రాంపల్లి ఆర్‌ఎల్‌నగర్‌లో నివసించే తన అత్తింటికి వెళ్లాడు. అత్తతోపాటు ఇద్దరు కొడుకులను ముందుగానే రాత్రి భోజనానికి పంపించారు. వారు వెళ్లిపోయాక భార్యాభర్తలిద్దరూ బలవన్మరణానికి పాల్పడ్డారు. సురేశ్‌కుమార్ ఫ్యాన్‌కు ఉరివేసుకోగా భార్య పురుగు మందు తాగింది. శనివారం ఉదయం 9 గంటల సమయంలో అత్త, ఇద్దరు కుమారులు ఇంటికి వచ్చారు. ఎంతసేపు తలుపు తట్టినా స్పందన లేకపోవడంతో ఇరుగుపొరుగు సాయంతో ఇంటి తలుపులు తెరవగా, సురేశ్‌కుమార్, భాగ్యలు ఆత్మహత్యకు పాల్పడినట్లు గుర్తించారు. పోలీసులు గదిలో సూసైడ్ నోట్‌ను స్వాధీనం చేసుకున్నారు. క్రెడిట్‌కార్డుకు సంబంధించి వ్యక్తుల వేధింపుల కారణంగానే తాము ఆత్మహత్యకు పాల్పడుతున్నట్లు సూసైడ్ నోట్‌లో రాసి ఉందని పోలీసులు తెలిపారు.

మార్కులు తక్కువొచ్చాయని విద్యార్థిని ఆత్మహత్య

చిక్కడపల్లి: గ్రూప్-4పరీక్ష ఫలితాల్లో తక్కువ మార్కులు వచ్చాయనే వేదనతో ఓ యువతి ఆత్మహత్యకు పాల్పడింది. చిక్కడపల్లి పోలీసు స్టేషన్ పరిధిలో జరిగిన ఈ సంఘటనపై ఇన్‌స్పెక్టర్ ఎ.సీతయ్య కథనం మేరకు.. మహబూబ్‌నగర్ జిల్లా ముప్పారం గ్రామానికి చెందిన గడరిబోయిన శిరీష(24) జవహర్‌నగర్‌లోని ఎస్సార్ హాస్టల్‌లో ఉంటూ గ్రూప్-4 పరీక్షలకు సిద్ధమైంది. ఇటీవల తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ నిర్వహించిన గ్రూప్-4 పరీక్షల ఫలితాల్లో మార్కులు తక్కువ వచ్చాయని మనస్తాపానికి గురైంది. ఈ క్రమంలో శుక్రవారం రాత్రి తాను ఉంటున్న హాస్టల్‌లో ఎవరూ లేని సమయంలో ఉరివేసుకుని బలవన్మరణానికి పాల్పడింది. సమాచారం అందుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు. మృతురాలి సోదరుడు అనిల్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సమస్యల పరిష్కారానికే వచ్చా

హిమాయత్‌నగర్: జీహెచ్‌ఎంసీలో శానిటేషన్ కార్మికుల కోసం చేపడుతున్న పథకాల అమలును జాతీయ కర్మచారి చైర్మన్ వెంకటేషన్ శనివారం సమీక్షించారు. ఈ సందర్భంగా శానిటేషన్ వర్కర్స్, సఫాయి కర్మచారి అసోసియేషన్ ప్రతినిధులు చైర్మన్‌కు వినతి పత్రాలు సమర్పించారు. ముఖ్యంగా శానిటేషన్ వర్కర్స్‌కు ప్రభుత్వం అందిస్తున్న సేవలు గురించి ఆయన అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా చైర్మన్ వెంకటేషన్ మాట్లాడుతూ కార్మికుల కోసం, వారి సమస్యల పరిష్కారానికి జీహెచ్‌ఎంసీకి వచ్చినట్లు ఆయన తెలిపారు. లైంగిక వేధింపులు ఏమైనా జరుగుతున్నాయని అని పలు విషయాలను కార్మికులను అడిగి తెలుసుకున్నారు. ప్రధాన కార్యాలయంలో మహిళా అధికారులతో కమిటీ ఏర్పాటు చేసి నోటీసు బోర్డుపై వివరాలు పేర్కొనాలని అధికారులను ఆదేశించారు. కమిషనర్ రొనాల్డ్ రాస్ సఫాయి కార్మికుల కోసం తీసుకుంటున్న సంక్షేమ వివరాలను వివరించారు.

క్లుప్తంగా...

యూఎస్‌ఎఫ్‌డీఏ తనిఖీల్లో తెలంగాణ డ్రగ్ ఇన్‌స్పెక్టర్లు

- ఈ బాధ్యత నిర్వర్తిస్తున్న 4వ రాష్ట్రంగా తెలంగాణ

సాక్షి, హైదరాబాద్: యూఎస్ ఫుడ్ అండ్ డ్రగ్స్ అడ్మినిస్ట్రేషన్ (యూఎస్‌ఎఫ్‌డీఏ) రాష్ట్ర పరిధిలో నిర్వహించే సోదాలను ఇకపై తెలంగాణ రాష్ట్ర డగ్స్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ (డీసీఏ)కు చెందిన డ్రగ్ ఇన్‌స్పెక్టర్లు కూడా పరిశీలించనున్నారు. ఈ మేరకు యూఎస్‌ఎఫ్‌డీఏ ఇటీవలే తన గ్లోబల్ అప్‌డేట్ న్యూస్‌లెటర్‌లో పేర్కొన్నట్టు డీసీఏ డీజీ వీబీ కమలాసన్‌రెడ్డి శనివారం మీడియాకు తెలిపారు. దేశవ్యాప్తంగా ఇప్పటివరకు యూఎస్‌ఎఫ్‌డీఏతో కలిసి పనిచేస్తున్న గుజరాత్, కర్ణాటక, గోవా జాబితాలో 4వ రాష్ట్రంగా తెలంగాణ చేరినట్లు తెలిపారు. బల్క్ డ్రగ్ క్యాపిటల్ ఆఫ్ ఇండియాగా ఉన్న తెలంగాణ నుంచే 35 శాతం మేర ఫార్మా ఉత్పత్తులు తయారవుతున్నాయి. ఇక్కడ 214 యూఎస్‌ఎఫ్‌డీఏ రిజిస్టర్డ్ మాన్యూఫ్యాక్చరింగ్ కంపెనీలున్నాయి. ఈ కంపెనీల్లో తయారయ్యే మందులు అమెరికాకు ఎగుమతి అవుతుంటాయి. అంతర్జాతీయస్థాయిలో ఎగుమతి అయ్యే మందులు నాణ్యత పరీక్షలు పరిశీలించడం ద్వారా తెలంగాణ అధికారులకు అవగాహన పెరుగుతుందని, నాణ్యమైన మందులు అందుబాటులోకి తేవచ్చని పేర్కొన్నారు.

12 మంది నాన్‌కేడర్ అడిషనల్ ఎస్పీల బదిలీ

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రవ్యాప్తంగా 12 మంది నాన్‌కేడర్ అడిషనల్ ఎస్పీలను బదిలీ చేస్తూ హోంశాఖ ముఖ్యకార్యదర్శి డాక్టర్ జితేందర్ శనివారం ఉత్తర్వులు జారీచేశారు. బదిలీ అయిన అధికారులు నూతన స్థానాల్లో వెంటనే చేరాలని, ఇందుకు సంబంధించిన చర్యలు తీసుకోవాలని డీజీపీ రవిగుప్తాకు సూచించారు.

ఆ పోస్టులకు వయోపరిమితిని 65 ఏళ్లకు పెంచాలి

విద్యుత్ సంస్థల డైరెక్టర్ల పోస్టుల గరిష్ట వయో పరిమితిపై ఆర్.కృష్ణయ్య



కాచిగూడ (హైదరాబాద్): తెలంగాణ విద్యుత్ సంస్థలైన ట్రాన్స్‌కో, జెన్‌కో, ఎస్పీడీసీఎల్, ఎన్పీడీసీఎల్ సంస్థల్లో డైరెక్టర్ పోస్టులకు గరిష్ట వయో పరిమితిని 62 ఏళ్లుగా నిర్ధారిస్తూ ప్రకటనలు జారీ చేశారని, దానిని 65 ఏళ్లకు పెంచాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తెలంగాణ విద్యుత్ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కోడెపాక కుమారస్వామి అధ్యక్షతన శనివారం కాచిగూడలో జరిగిన సమావేశంలో ఆర్.కృష్ణయ్య పాల్గొని మాట్లాడారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో జారీ చేసిన జీవోలో విద్యుత్‌సంస్థ డైరెక్టర్ పోస్టులకు గరిష్ట వయోపరిమితి 62 ఏళ్లుగా నిర్ధారించారని, 2012లో జీవో 18 ప్రకారం గరిష్ట వయోపరిమితి 65గా ఉండేదని, 2013లో జీవో 18ని సవరిస్తూ 62 ఏళ్లకు కుదించారని ఈ సందర్భంగా గుర్తు చేశారు. 50 శాతం డైరెక్టర్ పోస్టులను బీసీలకు ఇవ్వాలని కోరారు. ఈ విషయంలో సీఎం రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క జోక్యం చేసుకోవాలన్నారు.

ఆర్మీ రిక్రూట్‌మెంట్ ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ గడువు మార్చి 22

సాక్షి, హైదరాబాద్: భారత సైన్యంలో వివిధ పోస్టులకు సంబంధించి 2024–25 సంవత్సరానికిగాను రిక్రూట్‌మెంట్‌కు అర్హులైన అభ్యర్థులు ఆన్‌లైన్‌లో రిజిస్టర్ చేసుకోవాలని మిలిటరీ ఉన్నతాధికారులు సూచించారు. ఈ నెల 13న ప్రారంభమైన ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్‌కు మార్చి 22 వరకు గడువు ఉన్నట్టు తెలిపారు. www.joinindianarmy.nic.in వెబ్‌సైట్‌లో పూర్తి వివరాలు అందుబాటులో ఉన్నాయని, ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. మిలిటరీలో చేరాలనుకునే యువత దళారులు, ఏజెంట్లను నమ్మి మోసపోవద్దని సూచించారు. ఆర్మీ ఉద్యోగ నియామకం పూర్తిగా అభ్యర్థుల అర్హత, సామర్థ్యం ఆధారంగానే జరుగుతుందని స్పష్టం చేశారు.

రవాణా శాఖలో మూకుమ్మడి బదిలీలు

175 మందిని మారుస్తూ ఉత్తర్వులు

సాక్షి, హైదరాబాద్: రవాణాశాఖలో ఏళ్లుగా ఒకే చోట పాతుకుపోయిన అధికారులందరినీ ఒకేసారి బదిలీ చేస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఏడేళ్లుగా రవాణాశాఖలో బదిలీలు లేవు. ఈ నేపథ్యంలో దాదాపు 175 మందిని బదిలీ చేస్తూ ఆ శాఖ ముఖ్యకార్యదర్శి ఉత్తర్వులు జారీ చేశారు. డీటీసీ, ఆర్‌టీఓ, ఎంవీఐ, ఏఎంవీఐ స్థాయిల్లో సిబ్బంది అందరినీ మార్చేశారు. వంద మంది ఎంవీఐలు, 55 మంది ఏఎంవీఐలు, 16 మంది ఆర్టీఓలు, ఏడుగురు డీటీసీలను మార్చారు. కొద్ది రోజుల క్రితం జాయింట్ ట్రాన్స్‌పోర్టు కమిషనర్లను సైతం మార్చినందున.. ఇప్పుడు యావత్ రవాణా శాఖ సిబ్బంది మొత్తాన్ని బదిలీ చేసినట్టయింది. లోక్‌సభ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని ఒకే చోట మూడేళ్ల సర్వీసు పూర్తయిన వారిని మార్చాలంటూ ఎన్నికల సంఘం పేర్కొనటాన్ని కూడా ప్రభుత్వం పరిగణనలోకి తీసుకుంది.

ఉన్నత విద్యకు 'స్కిల్' జత

డిగ్రీ, బీటెక్‌ల్లో నైపుణ్యాభివృద్ధి కోర్సులు

- పారిశ్రామిక భాగస్వామ్యంతో ముందుకెళ్లే యోచనలో రాష్ట్ర సర్కార్
- కాలేజీలు, వర్సిటీలకు ఇప్పటికే యూజీసీ గ్రీన్‌సిగ్నల్
- విద్యార్థుల్లో నైపుణ్య లోపంపై దృష్టి
- ఏఐ అండ్ ఎంఎల్, రోబోటిక్స్, ఐవోటీ తదితర 27 కొత్త కోర్సులకు అవకాశం



సాక్షి, హైదరాబాద్: ఉన్నత విద్యలో నైపుణ్యం దిశగా అడుగులు పడుతున్నాయి. ఇప్పటికే స్వల్పకాలిక నైపుణ్యాభివృద్ధి కోర్సులను కాలేజీలు, యూనివర్సిటీలు అందుబాటులోకి తెచ్చేందుకు యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ అంగీకారం తెలిపింది. తాజా బడ్జెట్‌లో రాష్ట్ర ప్రభుత్వం ఈ విషయాన్ని ప్రస్తావించింది. విధాన పరమైన నిర్ణయాన్ని ప్రకటించినప్పటికీ పెద్దగా నిధులు కేటాయించక పోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. డిగ్రీ, ఇంజనీరింగ్ పూర్తి చేసిన విద్యార్థుల్లో నైపుణ్యం ఉండటం లేదన్నది భారత పారిశ్రామిక వేత్తల అభిప్రాయం. సీఐఐ, ఎఫ్ఐఐ, నాస్కామ్ వంటి సంస్థల అధ్యయనంలోనూ ఇదే వెల్లడైంది. ఈ నేపథ్యంలో పారిశ్రామిక భాగస్వామ్యంతో ఈ కోర్సులను ముందుకు తీసుకెళ్లాలన్నది ప్రభుత్వ లక్ష్యంగా కన్పిస్తోంది.

తక్షణ అవసరం ఇదే..: దేశంలో ఇంజనీరింగ్ పూర్తి చేసే విద్యార్థుల్లో కేవలం 8 శాతం మంది మాత్రమే నైపుణ్యం (స్కిల్)తో బయటకు వస్తున్నారు. మిగతా వాళ్లలో కొంతమంది స్కిల్ కోసం ప్రత్యేక కోర్సులు నేర్చుకుంటున్నారు. అయితే వాళ్లలో కోర్సు నేర్చుకునే నాటికే కొత్త నైపుణ్యాలు మార్కెట్లోకి వస్తున్నాయి. దీంతో మళ్ళీ కొత్త టెక్నాలజీ నేర్చుకుంటే తప్ప మంచి వేతనంతో ఉద్యోగం లభించే అవకాశం కన్పించడం లేదు. దీన్ని దృష్టిలో ఉంచుకునే విశ్వవిద్యాలయాలకు యూజీసీ తక్షణ మార్పులను సూచించింది. నైపుణ్యాభివృద్ధి మండళ్ల స్వల్ప వ్యవధి కోర్సులను ప్రారంభించేందుకు అనుమతి అక్కర్లేదని కూడా తెలిపింది. కాకపోతే పారిశ్రామిక భాగస్వామ్యం తప్పనిసరి. అప్పుడే విద్యార్థి అనుభవ పూర్వకంగా నైపుణ్యం సంపాదించేందుకు అవకాశం ఉంటుంది. ఇంటర్ ఉత్తీర్ణత సాధించి డిగ్రీ, బీటెక్ కోర్సుల్లో చేరే విద్యార్థులకు 3–6 నెలల వ్యవధిలో 27 రకాల నైపుణ్య కోర్సులను యూజీసీ సూచిస్తోంది. వీటికి 12 నుంచి 30 క్రెడిట్స్ ఇవ్వాలని కూడా నిర్ణయించింది. దీనిపై రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల సమీక్ష జరిపింది. ఏయే కోర్సులు అందుబాటులోకి తేవచ్చు అనే విషయాన్ని ప్రభుత్వానికి ఉన్నతాధికారులు వివరించారు.

స్కిల్‌తో ఉద్యోగం సులభం

డిగ్రీతో పాటు నైపుణ్యం ఉంటే ఉద్యోగం లభించడమే కాదు.. అందులో రాణించడం కూడా సులభం. కంపెనీలు ఇలాంటి అర్హతలే కోరుకుంటున్నాయి. అండర్ గ్రాడ్యుయేషన్ పూర్తయ్యే నాటికి ఏదైనా ఒక రంగంలో నైపుణ్యం అవసరం. ఈ దిశగా ప్రభుత్వం, వర్సిటీలు అడుగులు వేయడం అభినందనీయం.
– శ్రీరాం వెంకటేష్ (ఉన్నత విద్య మండలి కార్యదర్శి)

ఇవీ స్కిల్ కోర్సులు

అండర్ గ్రాడ్యుయేషన్ పూర్తి చేసే కాలంలో మొత్తం 27 స్కిల్ కోర్సులను నేర్చుకోవడానికి అవకాశం కల్పించాలని ప్రభుత్వం భావిస్తోంది. మార్కెట్లో డిమాండ్ ఉన్న కోర్సులకే అత్యధిక ప్రాధాన్యతనిస్తోంది. ఇందులో ఏఐ అండ్ ఎంఎల్, రోబోటిక్స్, ఐవోటీ, ఇండస్ట్రియల్ ఐవోటీ, స్మార్ట్ సిటీస్, డేటా సైన్స్ అండ్ అనలిటిక్స్, క్లౌడ్ కంప్యూటింగ్, వీఆర్ టెక్నాలజీ, సైబర్ సెక్యూరిటీ, డిజిటల్ ఫోరెన్సిక్, 5 జీ కనెక్టివిటీ, ఇండస్ట్రియల్ ఆటోమేషన్, ఎలక్ట్రానిక్స్ సిస్టమ్ డిజైన్, వీఎస్ఎస్ఐ డిజైన్స్, కంప్యూటర్ భాషలో ప్రాథమిక అవగాహన, మెకానికల్ టూలింగ్, మొబైల్ కమ్యూనికేషన్ లాంటి ప్రధానమైన కోర్సులున్నాయి. తెలంగాణలో కొన్ని సాఫ్ట్‌వేర్ కంపెనీల భాగస్వామ్యంతో ఐవోటీ, ఏఐఎంఎల్ సహా ఇతర కంప్యూటర్ కోర్సుల్లో స్వల్పకాలిక కోర్సులు నిర్వహించవచ్చని అధికారులు అంటున్నారు. సైబర్ సెక్యూరిటీ, డేటా అనాలసిస్ వంటి వాటికి విస్తృత అవకాశాలున్నాయని భావిస్తున్నారు. తొలి దశలో ప్రైవేటు యూనివర్సిటీలు మాత్రమే ఈ దిశగా ముందుకు వెళ్ళే వీలుందని అధికారులు అభిప్రాయపడుతున్నారు. ఇప్పటికే కొన్ని డీమ్డ్ వర్సిటీలు ఈ దిశగా కొన్ని కార్యక్రమాలు కూడా నిర్వహిస్తున్నాయి.

గ్రీన్ ఎనర్జీలో రిలయన్స్ భారీ పెట్టుబడులు

- రూ.1,920 కోట్లతో ఏపీలో 15 సీబీజీ యూనిట్ల ఏర్పాటు.. 2 వేల మందికి ఉపాధి

సాక్షి, అమరావతి: ఏపీలో పర్యావరణహిత ఇంధనం (గ్రీన్ ఎనర్జీ) ఉత్పత్తికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ పెద్దఎత్తున ప్రోత్సాహం అందిస్తుండటంతో దిగ్గజ సంస్థలు ఈ రంగంలో పెట్టుబడులు పెట్టడానికి ముందుకొస్తున్నాయి. తాజాగా రిలయన్స్ గ్రూప్ సుమారు రూ.1,920 కోట్ల పెట్టుబడితో 15 చోట్ల కంప్రెస్డ్ బయోగ్యాస్ (సీబీజీ) యూనిట్లను ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించింది. ఇందులో భాగంగా తొలి దశలో 8 యూనిట్ల ఏర్పాటుకు నిర్మాణ పనులు జరుగుతున్నాయి. వ్యవసాయ వ్యర్థాలు.. వరిగడ్డి, వేరుశెనగ పొట్టు, జొన్న కంకులు, ఖాళీ కొబ్బరి బొండాలు, చెరకు పిప్పి, మునిసిపాలిటీల నుంచి రోజూ వచ్చే వ్యర్థాల నుంచి కంప్రెస్డ్ బయోగ్యాస్‌ను ఉత్పత్తి చేస్తారు. ఈ 15 యూనిట్ల ద్వారా పూర్తిగా పర్యావరణహితమైన గ్యాస్‌ను ఉత్పత్తి చేయడమే కాకుండా సేంద్రియ ఎరువులను కూడా తయారుచేయొచ్చు. ఇప్పటివరకు ఈ వ్యర్థాలను తరలించే అవకాశం లేకపోవడంతో రైతులు పొలాల్లోనే వాటిని తగులబెడుతున్నారు. దీంతో భారీగా వాతావరణ కాలుష్యం వెలువడుతోంది.. నేలసారం కూడా తగ్గిపోతోంది. ఇప్పుడు ఇలా కాకుండా నేరుగా రైతుల నుంచే రిలయన్స్ ఈ వ్యర్థాలను కొనుగోలు చేస్తుంది. ఇందుకోసం ప్రతి యూనిట్‌కు కనీసం ఐదు కలెక్షన్ సెంటర్లను ఏర్పాటు చేయనుంది. వ్యర్థాల కొనుగోలు చేయడం ద్వారా కనీసం 70 వేల మంది రైతులకు లబ్ధి కలుగుతుందని అంచనా. ప్రతి రైతుకు అదనంగా రూ.6,250 చొప్పున ఏటా రైతులకు రూ.45 కోట్ల వరకు అదనపు ఆదాయం లభించనుంది. అంతేకాకుండా ఈ సీబీజీ యూనిట్లకు అనుబంధంగా మరో రూ.1,000 కోట్ల విలువైన పెట్టుబడులు వస్తాయని రిలయన్స్ అధికారులు వెల్లడించారు. కాగా, మొత్తం ఈ 15 యూనిట్ల ద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా 2,000 మందికి ఉపాధి లభించనుంది.

వాస్తవాలను దాచిన పిటిషనర్‌కు జరిమానా

రూ.15 లక్షల జరిమానా విధించిన హైకోర్టు

సాక్షి, హైదరాబాద్: వాస్తవాలను దాచి పిటిషన్‌ను దాఖలు చేసిన ఒక పిటిషనర్‌కు హైకోర్టు రూ.15 లక్షల జరిమానా విధించింది. ఈ మొత్తాన్ని 4 వారాల్లో హైకోర్టు లీగల్ సర్వీసెస్ కమిటీకి చెల్లించాలని ఆదేశించింది. కోర్టు సమయాన్ని వృథా చేశారంటూ పిటిషనర్ తరపు న్యాయవాదిపై అసంతృప్తి వ్యక్తం చేస్తూ పిటిషన్‌ను కొట్టివేసింది. రంగారెడ్డి జిల్లా ఫారుక్‌నగర్ మండలం షాద్‌నగర్‌కు చెందిన శ్రీనివాస్.. బట్టల దుకాణం ఏర్పాటు చేసేందుకు విశ్వభారతి మ్యూచువల్లీ ఎయిడెడ్ కో–ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీలో రుణం తీసుకున్నారు. కరోనాతోవాయిదా చెల్లింపులో విఫలమయ్యారు. దీంతో షాద్‌నగర్‌లోని అతని ఇంటిని జప్తు చేసేందుకు సొసైటీ అసిస్టెంట్ రిజిస్ట్రార్ నోటీసులు జారీ చేశారు. దీంతో కోర్టును ఆశ్రయించిన శ్రీనివాస్ వాయిదాల్లో చెల్లింపులు జరిపేలా ఉపశమనం పొందారు. ఆ తర్వాత కూడా మరోసారి పిటిషన్ దాఖలు చేయగా, ఇంటిని ఖాళీ చేయాల్సిందేనని కోర్టు స్పష్టం చేసింది. ఇంటికి వేలం నిర్వహించడాన్ని సవాల్ చేస్తూ పిటిషనర్ మరోసారి పిటిషన్ వేశారు. దీనిపై జస్టిస్ భీమపాక నగేశ్ విచారణ చేపట్టి తీర్పు ఇచ్చారు.

ఐటీ విప్లవాత్మక మార్పుల్లో సీఐఓది కీలక పాత్ర

సీఐఓ నేషనల్ టెక్నాలజీ సదస్సులో సియెంట్ సీఎండీ మోహన్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్: ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (ఐటీ)రంగంలో వస్తోన్న విప్లవాత్మక మార్పుల్లో చీఫ్ ఇన్ఫర్మేషన్ ఆఫీసర్స్ (సీఐఓ) క్లబ్‌ది కీలకపాత్ర పోషించిందని సియెంట్ వ్యవస్థాపక సభ్యుడు, సీఎండీ మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. హైదరాబాద్‌లో వెస్టిన్ హోటల్‌లో సీఐఓ అసోసియేషన్ హైదరాబాద్ చాప్టర్ ఆధ్వర్యంలో శనివారం జరిగిన నేషనల్ టెక్నాలజీ సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...ఐటీ రంగంలో వేగంగా వస్తున్న సాంకేతికత మార్పుల్లో, ప్రభుత్వ పరిపాలనలోనూ ఐటీ రంగం ప్రాముఖ్యత పెరిగిందన్నారు. అదేవిధంగా టీ హబ్ కార్యకలాపాలకు, నూతన ఆవిష్కరణలకు సీఐఓ ఎంతగానో దోహదం చేస్తుందని తెలిపారు. అనంతరం సీఐఓ క్లబ్ అసోసియేషన్ హైదరాబాద్ అధ్యక్షుడు రామిరెడ్డి మాట్లాడుతూ...రాష్ట్రంలో ఐటీ రంగం వేగంగా విస్తరించడంలో సీఐఓ క్లబ్ పాత్ర చిరస్మరణీయమన్నారు. సైబర్ సెక్యూరిటీ, ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్, క్లౌడ్ టెక్నాలజీ వంటి సాంకేతికతలను గురించి పలువురు పవర్ పాయింట్ ప్రెజెంట్ చేశారు.

గిరిజన జాతరకు హెలికాప్టర్

నేడు సేవలు షురూ.. హనుమకొండ నుంచి అందుబాటులోకి..

ఏటూరునాగారం/ఎస్ఎస్ తాడ్వాయి: మేడారం మహాజాతరకు వచ్చే భక్తుల కోసం పర్యాటక శాఖ హెలికాప్టర్ సేవలను అందుబాటులోకి తీసుకువచ్చింది. బెంగళూరుకు చెందిన తుంబి ఏవియేషన్ సంస్థ ట్యాక్సీ హెలికాప్టర్‌ను నడుపుతోంది. ఈ సేవలు నేటి(ఆదివారం) నుంచి ప్రారంభం కానున్నాయి. హనుమకొండలోని సెయింట్ గ్యాబ్రియల్ స్కూల్ మైదానం నుంచి మేడారం వరకు సేవలందిస్తుంది.

చార్జీలు ఇలా...
ఒక్కో ప్యాసింజర్ (అప్ అండ్ డౌన్)కు వీఐపీ దర్శనం రూ. 28,999, జాతరలో ఏరియల్ వ్యూరైడ్ ఒక్కొక్కరికి రూ.4,800.

బుకింగ్ ఇలా..:
హెలికాప్టర్ టికెట్ బుకింగ్, ఇతర వివరాల కోసం 74834 33752, 94003 99999 సెల్ నంబర్లలో సంప్రదించవచ్చు. ఆన్‌లైన్‌లో info@helitaxi. com ద్వారా బుకింగ్ చేసుకోవచ్చు. ఈ సేవలు జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి, పర్యాటక శాఖ పర్యవేక్షణలో కొనసాగుతాయి.

మేడారం భక్తులకు మెరుగైన వైద్యం

మంత్రి సీతక్క ఆదేశం

ఎస్ఎస్‌తాడ్వాయి/ఏటూరునాగారం: మేడారం జాతరలో భక్తులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క ఆదేశించారు. ఆమె శనివారం ములుగు జిల్లా ఎస్ఎస్ తాడ్వాయి మండలం మేడారంలో వైద్య, ఆరోగ్యశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ క్రిస్టినా, హెల్త్ డైరెక్టర్ ఆర్‌వీ కర్ణన్‌తో కలిసి మంత్రి ప్రత్యేక సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా 108 బైక్ అంబులెన్సులను జెండా ఊపి ప్రారంభించారు. ఆర్టీసీ బేస్ క్యాంప్‌ను ప్రారంభించారు. అనంతరం మంత్రి సీతక్క మాట్లాడుతూ భక్తులకు అత్యవసర వైద్యసేవలు అందించేందుకు 40 జీవీకే బైక్ అంబులెన్స్‌లు సిద్ధంగా ఉంటాయని తెలిపారు. భక్తులను క్షేమంగా గమ్యస్థానాలకు చేర్చేందుకు ఆర్టీసీ 6 వేల ప్రత్యేక బస్సులను నడుపుతోందని వివరించారు. భక్తుల రద్దీ దృష్ట్యా ఈనెల 19 నుంచి 25 వరకు 8 రోజుల పాటు ప్రత్యేక బస్సులను ఆర్టీసీ తిప్పనున్నట్లు తెలిపారు. మేడారం జాతరలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం అమల్లో ఉందని మంత్రి స్పష్టం చేశారు. సమావేశంలో ములుగు కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఎస్పీ శబరీష్ తదితరులు పాల్గొన్నారు.



108 అంబులెన్సులను ప్రారంభిస్తున్న మంత్రి సీతక్క

మేడారం జాతరకు 30 జన్‌సాధారణ్ ప్రత్యేక రైళ్లు

ఈనెల 21 నుంచి 24 వరకు నడపనున్నట్టు రైల్వే ప్రకటన


సాక్షి, హైదరాబాద్, కాజీపేట రూరల్: తెలంగాణ కుంభమేళాగా పేరొందిన మేడారం సమ్మక్క, సారక్క జాతరకు వెళ్లే భక్తుల కోసం దక్షిణ మధ్య రైల్వే 30 జన్ సాధారణ్ ప్రత్యేక రైళ్ల సర్వీస్‌లను నడిపిస్తున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు. ఈ ప్రత్యేక రైళ్లు కాజీపేట, వరంగల్ మీదుగా సికింద్రాబాద్, ఆదిలాబాద్, నిజామాబాద్, ఖమ్మం, సిర్పూర్ కాగజ్‌నగర్ నుంచి ప్రారంభం కానున్నట్లు తెలిపారు. మేడారం జాతర చేరుకోవడానికి, తిరుగు ప్రయాణానికి అత్యంత సురక్షితమైన వేగవంతమైన తక్కువ ఖర్చుతో కూడిన జనసాధారణ్ ప్రత్యేక రైళ్లు ఈ నెల 21వ తేదీ నుంచి 24 వరకు ఆయా రూట్ల నుంచి నడుస్తాయని దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్‌కుమార్ జైన్ వెల్లడించినట్లు అధికారులు వివరించారు.




ప్రత్యేక రైళ్ల వివరాలు

- సికింద్రాబాద్–వరంగల్, వరంగల్–సికింద్రాబాద్ మధ్య 10 రైళ్లు, సిర్పూర్ కాగజ్‌నగర్–వరంగల్, వరంగల్–సిర్పూర్‌కాగజ్‌నగర్ మధ్య 8 రైళ్లు, నిజామాబాద్–వరంగల్, వరంగల్–నిజామాబాద్ మధ్య 8 రైళ్లు, ఆదిలాబాద్–వరంగల్, వరంగల్–ఆదిలాబాద్ మధ్య 2 రైళ్లు, ఖమ్మం–వరంగల్, వరంగల్–ఖమ్మం మధ్య 2 రైళ్లు నడుపుతారు.
- 21 నుంచి 25వ తేదీ వరకు సికింద్రాబాద్–వరంగల్ (07014), ఈ నెల 21 నుంచి 25వ తేదీ వరకు వరంగల్–సికింద్రాబాద్ (07015) ప్రత్యేక రైలు వరంగల్‌లో మధ్యాహ్నం 1:55 గంటలకు బయలుదేరి సికింద్రాబాద్‌కు సాయంత్రం 6:20 గంటలకు చేరుతుంది.
- 21వ తేదీన వరంగల్–ఆదిలాబాద్ (07023) వెళ్లే ఎక్స్‌ప్రెస్ వరంగల్‌లో సాయంత్రం 4 గంటలకు బయలుదేరి మరుసటి రోజు ఉదయం 4:30 గంటలకు ఆదిలాబాద్ చేరుతుంది.
- 22వ తేదీన ఆదిలాబాద్–వరంగల్ (07024) వెళ్లే ప్రత్యేక రైలు ఆదిలాబాద్‌లో రాత్రి 11:30 గంటలకు బయలుదేరి మరుసటి రోజు 12:45 గంటలకు వరంగల్ చేరుతుంది.
- 23 తేదీన ఖమ్మం–వరంగల్ (07021) వెళ్లే రైలు ఖమ్మంలో ఉదయం 10 గంటలకు బయలుదేరి వరంగల్‌కు 12:20 గంటలకు చేరుతుంది.
- 24న వరంగల్–ఖమ్మం (07022) వెళ్లే ప్రత్యేక రైలు వరంగల్‌లో మధ్యాహ్నం 1:55కు బయలుదేరి ఖమ్మంకి సాయంత్రం 4:30 గంటలకు చేరుతుంది.

భక్తుల సౌకర్యార్థం రైళ్లు: కిషన్‌రెడ్డి



మేడారం సమ్మక్క, సారక్క జాతరకు కేంద్రప్రభుత్వం ప్రత్యేక రైళ్లను వేయడంతో పాటుగా జాతర ఏర్పాట్లకోసం రూ.3 కోట్లను కేటాయించింది'అని కేంద్ర పర్యాటక, సాంస్కృతికశాఖల మంత్రి జి.కిషన్ రెడ్డి వెల్లడించారు. 'నరేంద్రమోదీ ప్రభుత్వం, గిరిజన సంస్కృతి, సంప్రదాయాల విషయంలో, గిరిజన సమాజం సంక్షేమం విషయంలో చిత్తశుద్ధితో పనిచేస్తోంది. అందులో భాగంగానే.. తెలంగాణ కుంభమేళాగా పేరొందిన మేడారం సమ్మక్క, సారక్క జాతర నేపథ్యంలో ఫిబ్రవరి 21 నుంచి 24 వరకు భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక రైళ్లను నడుపుతోంది''అని ఆయన తెలిపారు.



పిల్లల ప్రపంచం తగ్గిపోతోంది!

దాదాపు వందేళ్లుగా భూమ్మీద జనాభా విపరీతంగా పెరిగిపోతూ వచ్చింది. ఇదిలాగే పెరిగితే ఏమవుతుందోనన్న ఆందోళనా పెరుగుతూ వచ్చింది. కానీ ఆ టెన్షన్‌ను తగ్గిస్తూ.. కొన్నేళ్లుగా జననాల రేటు తగ్గుతూ పోతోంది. దీనివల్ల జనాభాలో వృద్ధుల శాతం పెరుగుతూ.. పిల్లల శాతం తరుగుతూ వస్తోంది. భూమ్మీద ఒకే సమయంలో అత్యంత ఎక్కువ మంది చిన్న పిల్లలు (ఐదేళ్ల వయసు లోపు) ఉన్న సమయాన్ని కూడా దాటేశామని నిపుణులు తాజాగా తేల్చారు. ప్రపంచవ్యాప్తంగా చూస్తే.. 2017వ సంవత్సరమే అత్యంత ఎక్కువ సంఖ్యలో పిల్లలు ఉన్న ఏడాది (పీక్ చైల్డ్ ఇయర్) అని.. తర్వాతి నుంచి పిల్లల సంఖ్య తగ్గుతూ వస్తోందని గుర్తించారు. 'ఐక్యరాజ్యసమితి (యూఎన్) జనాభా అంచనాలు–2022 నివేదిక' ఆధారంగా ఈ గణాంకాలను రూపొందించారు.



- ప్రపంచవ్యాప్తంగా వివిధ దేశాల్లో వేర్వేరు సమయాల్లో చేపట్టిన జనాభా నియంత్రణ చర్యలు, ఆ దేశాల్లో పిల్లలను కనగలిగే వయసులో ఉన్నవారి శాతంలో తేడాల కారణంగా.. ప్రపంచ వ్యాప్తంగా పిల్లల సంఖ్య హెచ్చుతగ్గులకు లోనవుతూ వస్తోందని యూఎన్ నివేదిక వెల్లడించింది.
- మన దేశానికి వస్తే.. జనాభా నియంత్రణ, ప్రజల్లో అవగాహన కల్పించే చర్యలతో 2004వ సంవత్సరం నుంచే చిన్న పిల్లల సంఖ్య తగ్గుతూ వస్తోందని పేర్కొంది. 2021 నాటికి దేశంలో 11.53 కోట్ల మంది చిన్నారులు ఉన్నారని.. 2100 నాటికి ఇది 6.86 కోట్లకు తగ్గుతుందని అంచనా వేసింది.
- ఇటీవలిదాకా ప్రపంచంలోనే అత్యధిక జనాభా ఉన్న దేశంగా కొనసాగిన చైనాలో అత్యధికంగా 13.82 కోట్ల మంది పిల్లలు ఉన్నది 1972లోనే. నాటి నుంచి పిల్లల సంఖ్య తగ్గుతూనే ఉంది. ఈ సంఖ్య 2000వ సంవత్సరం నాటికి 8.41 కోట్లకు, 2021 నాటికి 7.47 కోట్లకు తగ్గింది. 2100 ఏడాది నాటికి అక్కడ ఐదేళ్లలోపు పిల్లల సంఖ్య 2.38 కోట్లలోపే ఉంటుందని యూఎస్ అంచనా వేసింది.


– సాక్షి సెంట్రల్ డెస్క్



రాయిని మడతపెట్టి..

20 టన్నుల బరువున్న బండరాయిని మడతపెట్టడం సాధ్యమా.. మరి ఇక్కడ కుర్చీ మడత పెట్టినంత ఈజీగా మడత పెట్టేశారు చూశారా.. ఫోల్డ్ (మడత) సిరీస్‌లో భాగంగా గ్రానైట్ రాయితో ప్రముఖ శిల్పి, జాతీయ అవార్డు గ్రహీత దురుగడ్డ హరిప్రసాద్ ఆచారి ఈ ఆధునిక శిల్పాన్ని మలిచారు. హైదరాబాద్‌లోని స్టేట్ ఆర్ట్ గ్యాలరీ వేదికగా 'న్యూస్ ఆర్ట్ ఫెస్ట్'లో ఈ మడత శిల్పాన్ని ప్రదర్శనకు ఉంచారు. అసలు రాయిని ఎలా మడతపెట్టారు అనేదేగా మీ డౌటు. పెద్ద శిలను చెక్కి.. ఇలా అబ్బురపరిచే శిల్పంగా తీర్చిదిద్దారు. ''సాధారణంగా మనం ఏదైనా కఠినమైన దాన్ని బండరాయితో పోలుస్తాం. అందులోనూ గ్రానైట్ అత్యంత కఠిన శిల. దీనికి పూర్తి భిన్నంగా మనిషి సున్నిత మనస్కుడు. అయితే, మనుషులు తలచుకుంటే ఎంత కఠినమైన రాయిలాంటి దాన్నయినా తమకు నచ్చినట్లుగా మార్చేయగలరనేది ఈ శిల్పాల ఉద్దేశం'' అని హరి ప్రసాద్ చెప్పారు. మార్చి 7 వరకు మాదాపూర్‌లోని స్టేట్ ఆర్ట్ గ్యాలరీలో జరిగే న్యూస్ ఆర్ట్ ఫెస్ట్ ఎగ్జిబిషన్‌లో ఇలాంటి అనేక శిల్పాలు సందర్శకులను ఆకర్షించడానికి సంసిద్ధంగా ఉన్నాయి. మరెందుకు ఆలస్యం.. చలో మరి..





400 ఏళ్ల నాటి జాఫర్ బావికి కొత్త హంగులు

ఖమ్మంలో మరో పర్యాటక కేంద్రంగా జాఫర్ బావి

ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మం జిల్లా కేంద్రంలోని ఖిల్లా ప్రాంతంలో 400 ఏళ్ల కాకతీయుల కాలం నాటి జాఫర్ బావి కొత్త అందం సంతరించుకుంది. కాకతీయుల కాలంలో ఇక్కడ మెట్లతో కూడిన బావిని నిర్మించగా..ఆ తర్వాత కుతుబ్‌షాహీలు ఎత్తు పెంచుతూ మరింత సుందరీకరించారు. అయితే, కాలక్రమేణా ఈ బావి శిథిలావస్థకు చేరగా ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యాన రూ.61.80 లక్షలు వెచ్చించి పునరుద్ధరించారు. బావిని శుభ్రం చేయించి గోడలకు రంగులు వేయడంతోపాటు లైట్లు ఏర్పాటు చేయగా..జిల్లా కలెక్టర్ గౌతమ్, ఎమ్మెల్సీ తాత మధుసూదన్, మేయర్ పునుకొల్లు నీరజ, కేఎంసీ కమిషనర్ ఆదర్శ్ సురభి శనివారం ప్రారంభించారు. దీంతో ఖమ్మంలో ఈ బావి మరో పర్యాటక కేంద్రంగా మారనుంది.

Published and Printed by V. Murali, on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited, Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527, T.G., and Printed at Jagati Publications Limited Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527 T.G.,
Editor: V. Murali(Responsible for selection of News under the PRB Act), Phone No. 0878 - 2223017, Fax No. 0878 – 2223019. RNI Regn No. TELTEL/2008/23800.